సోమవారం 30-10-2023

సత్యమేవ జయతే
సాక్షి
WWW.SAKSHI.COM
పేజీలు: 14 వెల: ₹ 6.50
సంపుటి: 16 సంచిక: 45


'రాష్ట్రంలో నిరుపేదలెవరూ డబ్బులేని కారణంగా ఉన్నత విద్యకు దూరం కాకూడదు. అందుకే ఫీజుల చెల్లింపు పథకాన్ని చేపట్టాం'



ఆరు.. భారత్ జోరు

వన్డే వరల్డ్‌కప్‌లో భారత జట్టు అసాధారణ ప్రదర్శన కొనసాగుతోంది. ఆదివారం జరిగిన మ్యాచ్‌లో రోహిత్‌శర్మ(87 పరుగులు), షమీ(4 వికెట్లు), బుమ్రా(3 వికెట్లు) చెలరేగి ఆడటంతో టీమిండియా 100 పరుగుల తేడాతో ఇంగ్లండ్‌ను చిత్తు చేసింది. వరుసగా ఆరో మ్యాచ్‌లోనూ విజయం సాధించింది.

- వివరాలు 12లో

SIMULTANEOUSLY PRINTED AT BANGALORE | CHENNAI | DELHI | VIJAYAWADA | HYDERABAD | MUMBAI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VISAKHAPATNAM | WARANGAL



రెండు రైళ్లు ఢీ

విజయనగరంలో పెను ప్రమాదం



8 మంది దుర్మరణం **32 మందికి గాయాలు**

- కొత్తవలస నుంచి బయల్దేరిన కొద్దిసేపటికే భీమాళి- అలమండ రైల్వేస్టేషన్ల మధ్య దుర్ఘటన
- ముందు వెళ్తున్న పలాస ప్యాసింజర్‌ను ఢీకొన్న రాయగడ ప్యాసింజర్
- ఒక ఇంజిన్‌తో పాటు ఐదు బోగీలు నుజ్జునుజ్జు
- అరుపులు, కేకలు, హాహాకారాలతో ప్రమాద స్థలి భీతావహం
- మృతుల్లో లోకో పైలట్!
- 20 అంబులెన్సుల్లో క్షతగాత్రులను విజయనగరం, విశాఖ ఆస్పత్రులకు తరలింపు
- ఏపీ మృతులకు రూ.10 లక్షలు.. గాయపడ్డ వారికి రూ.రెండు లక్షల ఎక్స్‌గ్రేషియా ప్రకటించిన రాష్ట్ర ప్రభుత్వం
- ఇతర రాష్ట్రాల మృతులకు రూ.2 లక్షలు, గాయపడ్డ వారికి రూ.50వేల పరిహారం
- సీఎం జగన్‌కు రైల్వే మంత్రి ఫోన్.. ఘటనా స్థలికి మంత్రి బొత్స, ఎమ్మెల్యే కడుబండి

2లో


క్షతగాత్రుడిని ఆస్పత్రికి తరలిస్తున్న ఏపీ విపత్తు నిర్వహణ సిబ్బంది

వెనుక నుంచి ఢీకొట్టడంవల్లే..

ప్రమాద ఘటనపై రైల్వేశాఖ ప్రాథమిక నివేదిక

2లో

ఎక్కడి రైళ్లు అక్కడే

వివిధ స్టేషన్లలో నిలిచిపోయిన రైళ్లు.. పలు రైళ్లు రద్దు.. మరికొన్ని దారి మళ్లింపు

2లో

విశాఖ నుంచి విజయవాడ వైపు వెళ్లే రైళ్లు యథాతథం

ప్రమాద స్థలానికి చేరుకున్న అధికారులు, యంత్ర సామగ్రి



సీఎం వైఎస్ జగన్ దిగ్భ్రాంతి

రైలు ప్రమాదంపై సీఎం వైఎస్ జగన్ తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తంచేశారు. హుటాహుటిన సహాయక చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. క్షతగాత్రులకు సత్వర వైద్యసేవలు అందేలా చూడాలని.. వీలైనన్ని అంబులెన్సులు పంపించి, మంచి వైద్యం అందించడానికి సమీప ఆస్పత్రుల్లో ఏర్పాట్లు చేయాలని ఆదేశించారు.

2లో

రైలు ప్రమాదంపై ప్రధాని మోదీ విచారం

తక్షణమే పరిస్థితిని సమీక్షించాలని రైల్వే మంత్రి అశ్విని వైష్ణవ్‌కు ఆదేశం

న్యూస్‌రీల్

పటేల్ జయంతి నాడు.. మేరా యువ భారత్



జాతి నిర్మాణ కార్యకలాపాల్లో యువత మరింత చురుగ్గా పాల్గొనేందుకు వీలుగా 'మేరా యువ భారత్' పేరుతో జాతీయ స్థాయి వేదికను అందుబాటులోకి తేనున్నట్టు ప్రధాని మోదీ ప్రకటించారు. సర్దార్ వల్లభ్ బాయి పటేల్ జయంతి సందర్భంగా అక్టోబర్ 31న దీన్ని ప్రారంభిస్తామని పేర్కొన్నారు.

వివరాలు 6లో ▸

హమాస్ స్థావరాలే లక్ష్యం



గత 24 గంటల్లో 450 హమాస్ స్థావరాలపై దాడుల చేసినట్లు ఇజ్రాయెల్ సైన్యం ప్రకటించింది. గాజాలోకి మరిన్ని పదాతి దళాలు అడుగుపెట్టబోతున్నాయని పేర్కొంది. హమాస్‌పై రెండో దశ యుద్ధం కొనసాగుతోందని ఇజ్రాయెల్ ప్రధానమంత్రి బెంజమిన్ నెతన్యాహూ ఉద్ఘాటించారు.

వివరాలు 6లో ▸

ముగిసిన గ్రహణం.. తెరుచుకున్న 'ఆలయం'



పాక్షిక చంద్రగ్రహణం కారణంగా శనివారం సాయంత్రం నుంచి మూతపడిన ప్రధాన ఆలయాలన్నీ ఆదివారం తెరుచుకున్నాయి. తిరుమల శ్రీవారి ఆలయం, విజయవాడ కనక దుర్గమ్మ ఆలయం, ఉపాలయాలు, శ్రీశైల క్షేత్రాల్లో గ్రహణ కాలం ముగిసిన తర్వాత ఆలయ శుద్ధి చేసి.. ప్రత్యేక పూజలు నిర్వహించి దర్శనాలకు అనుమతించారు.

వివరాలు 5లో ▸



ఇదండీ సంగతి



మళ్లీ పార్టీ టికెటివ్వలేదా!!

రౌడీమూకపై ఉక్కుపాదం..

ఆర్టీసీ డ్రైవర్‌పై దాడిని తీవ్రంగా పరిగణించిన ప్రభుత్వం

24 గంటల్లోనే ఏడుగురు నిందితుల అరెస్ట్

- మిగిలినవారి కోసం విస్తృతంగా గాలింపు
- రాష్ట్ర ప్రభుత్వ సత్వర చర్యలపై ఆర్టీసీ యూనియన్ల హర్షం
- బెడిసికొట్టిన విపక్షాల రాజకీయ పన్నాగం
- నిందితులకు అధికార పార్టీతో ఎలాంటి సంబంధం లేదు
- వారిపై గతంలోనే పలు కేసులు నమోదు
- బాధితులు ముందుకొచ్చి ఫిర్యాదు చేయాలని కోరిన పోలీస్‌శాఖ

14లో


పోలీసులు అరెస్టు చేసిన ఏడుగురు నిందితులు

దాడి చేసింది టీడీపీ రౌడీలే..

- నిందితుల్లో జనసేన, బీజేపీ నేతలు
- అదే గ్యాంగ్ గతంలో నా కారుపైనా దాడి చేసింది
- ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డి

14లో

న్యాయ వ్యవస్థను కించపరుస్తున్న లోకేశ్

- పరిశ్రమల శాఖ మంత్రి గుడివాడ అమర్‌నాథ్ మండిపాటు
- ఆధారాలతో సహా దొరికిన 'స్కిల్' దొంగ చంద్రబాబు.. 13 చోట్ల సంతకాలతో సహా అడ్డంగా పట్టుబడ్డారు
- తిరుగులేని సాక్ష్యాలున్నందుకే రిమాండ్ విధించిన న్యాయస్థానం
- టీడీపీ ఎన్ని కోర్టుల చుట్టూ తిరిగినా ఫలితం లేదు.. వ్యవస్థలను మేనేజ్ చేయాల్సిన అవసరం మాకు లేదు
- అలాంటి మేనేజ్‌మెంట్‌లో చంద్రబాబే మాస్టర్

3లో





తెలంగాణలో చేతులెత్తేసిన టీడీపీ

ఎన్నికల్లో పోటీకి సైకిల్ దూరం.. కాంగ్రెస్‌కు లాభం చేకూర్చేందుకే

టీ టీడీపీ నేతల భేటీకి లోకేశ్ గైర్హాజరు

భగ్గుమన్న నేతలు.. ఇండిపెండెంట్లుగా బరిలోకి

- వివరాలు 3లో



కేరళలో వరుస పేలుళ్లు

'జెహోవా' క్రైస్తవుల మత ప్రార్థనల్లో ఘటన

ఇద్దరు మహిళలు మృతి... 51 మందికి గాయాలు

దేశవ్యాప్తంగా చర్చిల వద్ద భద్రత కట్టుదిట్టం

పేలుళ్లకు తానే కారణం అంటూ ఓ వ్యక్తి లొంగుబాటు

- వివరాలు 6లో

వచ్చే నెల నుంచి కందిపప్పు పంపిణీ

కార్డుదారులకు కిలో చొప్పున అందించడానికి సన్నాహాలు



సాక్షి, అమరావతి: రాష్ట్రంలో ప్రజా పంపిణీ వ్యవస్థ ద్వారా కార్డుదారులకు కందిపప్పు పంపిణీకి ప్రభుత్వం సన్నాహాలు చేస్తోంది. వచ్చే నెల (నవంబర్) నుంచి క్రమం తప్పకుండా లబ్ధిదారులకు కిలో చొప్పున అందించనుంది. తాజాగా రాష్ట్ర పౌరసరఫరాల శాఖ 10 వేల టన్నుల కందిపప్పు కొనుగోలుకు హైదరాబాద్ అగ్రికల్చరల్ కో-ఆపరేటివ్ అసోసియేషన్ లిమిటెడ్ (హాకా)కు ఆర్డర్ ఇచ్చింది. అయితే హాకా వద్ద కూడా తగినంత నిల్వలు లేకపోవడంతో 7,200 టన్నుల సరఫరాకు అంగీకరించింది. ఇందులో భాగంగా తొలి దశలో 3,660 టన్నులు, రెండో దశలో 3,540 టన్నులు అందించనుంది. ఇప్పటికిప్పుడు అంటే వచ్చే నెల అవసరాలకు గాను 2,300 టన్నుల సరఫరాకు సన్నాహాలు చేస్తున్నట్టు తెలుస్తోంది. అంతర్జాతీయంగా పప్పుధాన్యాల కొరతతో రేట్లు ఆకాశాన్నంటాయి. దేశవ్యాప్తంగా పంట ఉత్పత్తులు బహిరంగ మార్కెట్‌కు వెళ్లిపోవడంతో భారత ఆహార సంస్థ (ఎఫ్‌సీఐ)వద్ద కూడా నిల్వలు కరువయ్యాయి. ఫలితంగా కందిపప్పు పంపిణీకి అవాంతరాలు ఏర్పడ్డాయి.

ఈ నెలాఖరుకు సరుకు తరలింపు

ప్రస్తుతం మార్కెట్‌లో కిలో కందిపప్పు రకాన్ని బట్టి రూ.150 నుంచి రూ.180 వరకు ఉంది. కేంద్ర ప్రభుత్వ సంస్థ అయిన హాకా నుంచి మద్దతు ధర ప్రాతిపదికనే కందులు సేకరించినప్పటికీ.. వాటికి అదనంగా ప్రాసెసింగ్, ప్యాకేజింగ్, రవాణా ఖర్చులు అవ్వనున్నాయి. ఈ మొత్తంలో రూ.67కు మాత్రమే కిలో కందిపప్పును ప్రభుత్వం లబ్ధిదారులకు ఇవ్వనుంది. అంటే దాదాపు సబ్సిడీ రూపేణా ప్రభుత్వం రూ.70పైగానే భరిస్తున్నట్టు సమాచారం. ఈ నెలాఖరు నాటికి చౌక ధరల దుకాణాల వద్దకు అందుబాటులో ఉన్న నిల్వల ప్రకారం సరుకును తరలించనుంది. డిసెంబర్, జనవరిల్లో పూర్తి స్థాయిలో కార్డుదారులకు సబ్సిడీ కందిపప్పును ఇచ్చేందుకు కసరత్తు చేస్తోంది.

మార్కెట్ రేటుకే కందుల కనుగోలు

రాష్ట్ర ప్రభుత్వం లబ్ధిదారులకు పంపిణీ చేసేందుకు వీలుగా 50 వేల టన్నుల కందిపప్పును కేటాయించాలని కేంద్రానికి పదేపదే విజ్ఞప్తి చేసింది. తొలుత కర్ణాటకలోని బఫర్ స్టాక్ నుంచి 9,764 టన్నులు కందులు కేటాయించగా వాటిలో నాణ్యత లోపించింది. ఆ తర్వాత రెండుసార్లు జూన్, సెప్టెంబర్‌ల్లో కేటాయింపుల కోసం రాష్ట్ర ప్రభుత్వం ప్రతిపాదనలు పంపింది. కానీ, కేంద్రం నుంచి స్పందన రాలేదు. మండల స్టాక్ సెంటర్ (ఎంఎల్ఎస్)ల్లోని స్టాక్ మొత్తాన్ని పంపిణీకి విడుదల చేయడంతో నిల్వలు నిండుకున్నాయి. ఈ నేపథ్యంలో ఇటీవల కేంద్ర ప్రభుత్వం హాకా నుంచి కందిపప్పును తీసుకోవాలని సూచించింది. ఈ నేపథ్యంలో వచ్చే మూడు నెలలకు హాకా సరఫరా చేసే కందిపప్పును రాష్ట్ర ప్రభుత్వం వినియోగించనుంది. భవిష్యత్తులో అంతరాయం లేకుండా సరఫరా చేసేందుకు జనవరి నుంచి పౌరసరఫరాల సంస్థ ద్వారా నేరుగా రైతుల నుంచి మార్కెట్ ధరకు ప్రభుత్వం కందులు సేకరించనుంది. తొలుత ఈ ఖరీఫ్‌లో 30 వేల టన్నులు సేకరించాలనే యోచనలో ఉన్నారు. వాటిని స్వయంగా మరాడించి ప్యాకింగ్ చేయించి సబ్సిడీపై కార్డుదారులకు అందించేలా ప్రణాళిక రూపొందించారు.

పునాదులు కూలి పెడబొబ్బలు

టీడీపీపై మంత్రుల మండిపాటు..

- లోకేశ్ ఒకవైపు బీజేపీకి మరోవైపు కాంగ్రెస్‌కు కన్నుకొడుతున్నాడు
- పురందేశ్వరికి తండ్రి కంటే మరిదిపై మమకారం ఎక్కువైంది
- రాష్ట్ర బీజేపీని టీడీపీ అనుబంధ విభాగంగా మార్చేశారు
- న్యాయ వ్యవస్థలో బాబు నిర్వాకాలపై విచారణ జరపాలి


రాజన్నదొర


అంజాద్ బాషా


మేరుగు నాగార్జున



సీదిరి అప్పలరాజు

సాక్షి, అమరావతి: టీడీపీ అధ్యక్షుడు చంద్రబాబు మేనేజ్‌మెంట్ పునాదులు కదిలి పోవడం వల్లే లోకేశ్ సహా ఆ పార్టీ నేతలంతా ఏడుపు లంకించుకున్నారని పలువురు మంత్రులు వ్యాఖ్యానించారు. 46 ఏళ్ల రాజకీయ జీవితంలో తప్పించుకుని తిరిగిన చంద్రబాబు అవినీతికి పాల్పడకుండా ఏ ఒక్క రోజూ గడపలేదని ధ్వజమెత్తారు. ఈ మేరకు డిప్యూటీ సీఎం (గిరిజన సంక్షేమ శాఖ మంత్రి) పీడిక రాజన్నదొర, డిప్యూటీ సీఎం (మైనార్టీ సంక్షేమ శాఖ మంత్రి) అంజాద్ బాషా, సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి మేరుగు నాగార్జున, పశు సంవర్థక, మత్స్యశాఖల మంత్రి సీదిరి అప్పలరాజు ఆదివారం ఓ ప్రకటన విడుదల చేశారు.

పార్టీ పరువు తీస్తున్న పురందేశ్వరి

చంద్రబాబు పునాదులన్నీ వెన్నుపోటు, మేనేజ్‌మెంట్, అబద్ధాలు, అవినీతి అనే నాలుగు స్తంభాలపైనే ఉన్నాయి. 30, 40 ఏళ్లుగా ఆయన్ను గమనిస్తున్న ప్రతి ఒక్క రాజకీయ విశ్లేషకుడికి, ప్రజలకు, మరీ ముఖ్యంగా టీడీపీలో ఆయనతో కలిసి

మిగతా 3వ పేజీలో ▶





ప్రమాదంలో నుజ్జునుజ్జయిన బోగీలు



ఘటనాస్థలం వద్ద మృతదేహాలు

విజయనగరం జిల్లాలో పెను ప్రమాదం..

రెండు రైళ్లు ఢీ..

ఎనిమిది మంది దుర్మరణం.. 32 మందికి గాయాలు

సాక్షి ప్రతినిధి విజయనగరం/జామి/లక్కవరపుకోట/శృంగవరపు కోట/పెందుర్తి/సాక్షి, అమరావతి/కొవ్వూరు : విజయనగరం జిల్లాలో ఆదివారం రాత్రి ఘోర రైలు ప్రమాదం సంభవించింది. రెండు రైళ్లు బయల్దేరిన కొద్ది నిమిషాల వ్యవధిలో ఢీకొనడంతో ఈ ఘోరం జరిగింది. ఈ పెను ప్రమాదంలో ఎనిమిది మంది మరణించగా.. 32 మంది గాయపడ్డారు. వీరిని విశాఖపట్నం, విజయనగరం ప్రభుత్వాసుపత్రులకు తరలించారు. ఏం జరిగిందో అర్థమయ్యేలోపే కొన్ని బోగీలు నుజ్జునుజ్జయ్యాయి. దీంతో ఒక్కసారిగా అరుపులు, కేకలు, హాహాకారాలతో ఆ ప్రాంతం భయానకంగా మారింది. ఈ హృదయ విదారక ఘటన ఆదివారం సాయంత్రం జామి మండల పరిధిలో జరిగింది. ఈ దుర్ఘటనపై ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తంచేశారు. హుటాహుటిన సహాయక చర్యలు చేపట్టాలని ఆయన అధికారులను ఆదేశించారు. వివరాలివీ..

విశాఖ నుంచి–పలాస వెళ్లే పాసింజర్ రైలు ఆదివారం సా.6.25 గంటలకు కొత్తవలస రైల్వేస్టేషన్ నుంచి బయల్దేరింది. భీమాళి రైల్వేస్టేషన్ దాటిన తర్వాత అలమండ రైల్వేస్టేషన్ నుంచి సిగ్నల్ రాకపోవడంతో డ్రైవర్ రైలును నెమ్మదిగా నడుపుతున్నారు. అదే సమయంలో సా.6.40 గంటల ప్రాంతంలో రాయఘడ పాసింజర్ కొత్తవలస నుంచి బయల్దేరింది. వేగంగా వస్తున్న రాయగడ పాసింజర్ అదే ట్రాక్‌పై ముందు వెళ్తున్న పలాస పాసింజర్ రైలును రాత్రి 7.10 గంటల సమయంలో వెనుక నుంచి భీమాళి–అలమండ రైల్వేస్టేషన్ల మధ్య ఢీకొట్టింది. దీంతో పలాస పాసింజర్ వెనుక నున్న రెండు బోగీలు, వాటిని ఢీకొన్న రాయఘడ పాసింజర్ రైలు ఇంజన్‌తో పాటూ మరో మూడు బోగీలు పలాస రైలు మీద పడి నుజ్జునుజ్జయ్యాయి. అదే సమయంలో కొన్ని బోగీలు పక్క ట్రాక్‌పై ఉన్న గూడ్స్ మీద పడ్డాయి. దీంతో పెను విషాదం అలముకుంది.

మృతులు ఎనిమిది మంది..

ఈ ఘటనలో ఎనిమిది మంది మృతిచెందినట్లు గుర్తించారు. వారి మృతదేహాలను బయటికి తీశారు. నుజ్జునుజ్జయిన బోగీల్లో మరిన్ని మృతదేహాలు ఉండే అవకాశం ఉందని అధికారులు భావిస్తున్నారు. ఇక బోగీల్లో చిక్కుకున్న మృతదేహాలను వెలికి తీసేందుకు సహాయక చర్యలను ముమ్మరం చేశారు. మృతుల్లో ఒక లోకో పైలట్ ఉన్నట్లు సమాచారం. ఇప్పటికే 32 మంది క్షతగాత్రులను 20 అంబులెన్స్‌ల్లో విజయనగరం, విశాఖల్లో వేర్వేరు ఆస్పత్రులకు తరలించారు.

చీకట్లో సహాయక చర్యలు..

ఇక ప్రమాద స్థలిలో విద్యుత్ వైర్లు తెగిపోవటంతో పూర్తిగా చీకట్లు అలముకున్నాయి. దీంతో సహాయక చర్యలు కాస్త నెమ్మదిగా జరుగుతున్నాయి. రెండు రైళ్లలో మిగిలిన బోగీల్లో ఉన్న ప్రయాణికులు రోడ్డు మార్గంలో తమ గమ్యాలకు వెళ్లేందుకు సిద్ధమయ్యారు. ప్రస్తుతం దెబ్బతిన్న బోగీల్లో చిక్కుకున్న వారిని బయటికి తీసేందుకు స్థానికులు, రైల్వే, జిల్లా అధికార యంత్రాంగం, పోలీసులు, వైద్య సిబ్బంది తదితరులు అంతా సహాయక చర్యల్లో పాల్గొన్నారు.



సంఘటన స్థలంలో సహాయక చర్యలను పర్యవేక్షిస్తున్న మంత్రి బొత్స సత్యనారాయణ, విజయనగరం జెడ్పీ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు, ఎస్.కోట ఎమ్మెల్యే కడుబండి శ్రీనివాసరావు

హుటాహుటిన ప్రజాప్రతినిధులు, అధికారుల రాక

ప్రమాద ఘటన వార్త తెలుసుకున్న వెంటనే మంత్రి బొత్స సత్యనారాయణ, జెడ్పీ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు, ఎమ్మెల్యే కడుబండి శ్రీనివాసరావు, కలెక్టర్ నాగలక్ష్మి, ఎస్పీ ఎం.దీపికతో పాటూ పలువురు జిల్లా అధికారులు హుటాహుటిన సంఘటనా స్థలికి చేరుకుని సహాయక చర్యలను సమీక్షించారు. జిల్లా యంత్రాంగానికి మంత్రి బొత్స పలు సూచనలు చేశారు. ప్రస్తుతం ఘటనాస్థలిలో సహాయక చర్యలు ముమ్మరంగా సాగుతున్నాయి.

వైద్యశాఖ అప్రమత్తం..

ప్రమాద ఘటన నేపథ్యంలో రాష్ట్ర ప్రభుత్వం వైద్య శాఖను పూర్తిస్థాయిలో అప్రమత్తం చేసింది. క్షతగాత్రులకు మెరుగైన వైద్యసేవలు అందించడానికి యుద్ధప్రాతిపదికన చర్యలు చేపట్టింది. ప్రమాదం గురించి తెలిసిన కొద్ది నిమిషాల్లోనే అప్రమత్తమైన రాష్ట్ర ప్రభుత్వం 108 అంబులెన్సులను ఘటనా స్థలికి తరలించింది. విజయనగరం, అనకాపల్లి, విశాఖపట్నం, శ్రీకాకుళం జిల్లాల నుంచి 30 వరకూ 108 అంబులెన్సుల్లో క్షతగాత్రులను ఆస్పత్రులకు తరలించారు. తీవ్రంగా గాయపడిన వారిని విశాఖ కేజీహెచ్‌కు.. స్వల్పంగా గాయపడ్డ వారిని విజయనగరంతో పాటు, సమీపంలోని ప్రభుత్వాస్పత్రులకు తరలించారు. బాధితులకు వైద్య సహాయార్థం కేజీహెచ్‌లో 24/7 హెల్ప్‌లైన్ నెంబర్లను ఏర్పాటుచేశారు. మరోవైపు.. ప్రమాద స్థలంలోనే క్షతగాత్రులకు తక్షణ వైద్యం కోసం ప్రత్యేక వైద్య బృందాలను రంగంలోకి దించారు.

సీఎం జగన్ దిగ్భ్రాంతి

ఇక ఈ దుర్ఘటనపై ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తంచేశారు. విశాఖ నుంచి రాయగడ వెళ్తున్న ప్యాసింజర్ రైలుకు ప్రమాదం జరిగినట్లుగా.. పలు బోగీలు పట్టాలు తప్పినట్లుగా ప్రాథమిక సమాచారం అందుతోందని సీఎంఓ అధికారులు ముఖ్యమంత్రికి వివరించారు. వెంటనే హుటాహుటిన సహాయక చర్యలు చేపట్టాలని ఆయన అధికారులను ఆదేశించారు. విజయనగరం సమీప జిల్లాలైన విశాఖపట్నం, అనకాపల్లి నుంచి వీలైనన్ని అంబులెన్సులను పంపించాలని, మంచి వైద్యం అందించడానికి సమీప ఆస్పత్రుల్లో అన్నిరకాల ఏర్పాట్లుచేయాలని ముఖ్యమంత్రి ఆదేశించారు. వైద్య ఆరోగ్య, పోలీసు, రెవిన్యూ సహా ఇతర ప్రభుత్వ శాఖలు సమన్వయంతో వేగంగా సహాయక చర్యలు చేపట్టి, క్షతగాత్రులకు సత్వర వైద్యసేవలు అందేలా చూడాలన్నారు. ఘటనకు సంబంధించిన వివరాలను ఎప్పటికప్పుడు తనకు నివేదించాలన్నారు. మరోవైపు.. దుర్ఘటనపై రాష్ట్ర హోం, విపత్తుల నివారణ శాఖ మంత్రి తానేటి వనిత కూడా దిగ్భ్రాంత్రి వ్యక్తంచేసి మృతుల కుటుంబాలకు తన ప్రగాఢ సానుభూతిని, సంతాపాన్ని తెలిపారు. సహాయక చర్యలు కొనసాగుతున్నాయని 'సాక్షి'కి చెప్పారు.

ముఖ్యమంత్రికి రైల్వే మంత్రి ఫోన్

ఈ ప్రమాదంపై కేంద్ర రైల్వేశాఖ మంత్రి అశ్విని వైష్ణవ్ సీఎం జగన్‌తో ఫోన్‌లో ఆదివారం రాత్రి మాట్లాడారు. ప్రమాదం జరిగిన వెంటనే తీసుకున్న చర్యలను సీఎం జగన్ ఆయనకు వివరించారు. సహాయ బృందాలను వెంటనే ఘటనా స్థలానికి పంపించామని, క్షతగాత్రులకు వైద్యం అందించేందుకు సత్వర చర్యలు తీసుకున్నామని చెప్పారు. జిల్లాకు చెందిన మంత్రి బొత్స సత్యన్నారాయణ, స్థానిక కలెక్టర్, ఎస్పీ కూడా అక్కడే ఉండి సహాయ కార్యక్రమాలను పర్యవేక్షిస్తున్నట్లు తెలిపారు. క్షతగాత్రులకు సరైన వైద్యసేవలు అందించడంపై అధికారులు దృష్టిపెట్టారని, వీరిని సమీపంలో ఉన్న ఆస్పత్రులకు పంపిస్తున్నారని, ఆ మేరకు ఆయా ఆస్పత్రుల్లో అత్యాధునిక వైద్యసేవలు అందించేలా చర్యలు కూడా తీసుకున్నామని ముఖ్యమంత్రి కేంద్ర మంత్రికి చెప్పారు.

ఏపీ మృతులకు రూ.10 లక్షల ఎక్స్‌గ్రేషియా

- గాయపడ్డ వారికి రూ.రెండు లక్షలు..
- ఇతర రాష్ట్రాలకు చెందిన మృతుల కుటుంబాలకు రూ.2లక్షలు, తీవ్ర గాయాలపాలైన వారికి రూ.50 వేలు పరిహారం
- ప్రకటించిన సీఎం జగన్ ప్రభుత్వం

సాక్షి, అమరావతి : విజయనగరం జిల్లాలో రైలు ప్రమాదంలో మృతుల కుటుంబాలతో పాటు, క్షతగాత్రులకు సీఎం జగన్ ప్రభుత్వం అండగా నిలిచింది. ఏపీకి చెందిన మృతుల కుటుంబాలకు ఒక్కొక్కరికి రూ.10 లక్షలు, తీవ్రంగా గాయపడ్డ వారికి రూ.2 లక్షలు చొప్పున సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం ఎక్స్‌గ్రేషియా ప్రకటించింది. రైలు ప్రమాద ఘటనలో మరణించిన వారి కుటుంబాలను ఆదుకునేందుకు అన్నిరకాల చర్యలు తీసుకోవాలని సీఎం అధికారులను ఆదేశించారు. మరణించన వారిలో ఇతర రాష్ట్రాలకు చెందిన వారు ఉంటే బాధిత కుటుంబాలకు రూ.2 లక్షల చొప్పున, తీవ్రంగా గాయపడ్డ వారికి రూ.50వేల చొప్పున సహాయం అందించాలన్నారు.

రైలు ప్రమాదంపై ప్రధాని విచారం

మృతుల కుటుంబాలకు రూ.2 లక్షల పరిహారం

న్యూఢిల్లీ: ఆంధ్రప్రదేశ్‌లో ఆదివారం రెండు రైళ్లు ఢీకొన్న ప్రమాదంలో ప్రాణ నష్టం జరగడం పట్ల ప్రధాని నరేంద్ర మోదీ తీవ్ర విచారం వ్యక్తం చేశారు. మృతుల కుటుంబాలకు ప్రధాని జాతీయ విపత్తుల సహాయ నిధి నుంచి రూ.రెండు లక్షల చొప్పున పరిహారాన్ని చెల్లించనున్నట్లు ప్రకటించారు. క్షతగాత్రులకు రూ.50,000 చొప్పున సహాయం అందించనున్నట్లు ప్రధాని కార్యాలయం తెలిపింది. తక్షణమే పరిస్థితిని సమీక్షించాలని రైల్వే మంత్రి అశ్విని వైష్ణవ్‌ను ప్రధాని ఆదేశించారు.

ఏం జరిగిందో అర్థంకాలేదు..



పార్వతీపురంలోని మా ఇంటికి వెళ్లేందుకు పెందుర్తిలో రైలెక్కాను. సుమారు గంట తరువాత ఆకస్మాత్తుగా రైలు భారీ కుదుపునకు గురైంది. మా బోగీలో అందరూ చెల్లాచెదురైపోయారు. కాసేపు ఏం జరిగిందో అర్థంకాలేదు. తేరుకునేటప్పటికి నా కాలికి తీవ్ర గాయమైంది. మా అల్లుడు వచ్చి పెందుర్తి ఆసుపత్రిలో చికిత్స చేయించాడు.

– వరలక్ష్మి, ప్రమాదంలో గాయపడిన మహిళ

వెనుక నుంచి ఢీకొట్టడంవల్లే..

- ప్రమాద ఘటనపై రైల్వేశాఖ ప్రాథమిక ఎఫ్ఐఆర్
- రాత్రి 7 గంటలకు జరిగినట్లు నిర్ధారణ
- 10 నిమిషాల వ్యవధిలో కంటకాపల్లి నుంచి బయలుదేరిన రైళ్లు

సాక్షి, విశాఖపట్నం/విజయనగరం అర్బన్/రైల్వేస్టేషన్ (విజయవాడ పశ్చిమ) : వాల్తేరు డివిజన్ పరిధిలోని విజయనగరం జిల్లా అలమండ సమీపంలో రైలు ప్రమాదం జరిగిన ప్రాంతం భీతావహంగా మారింది. ఈ ప్రమాదం ఎలా జరిగిందన్న దానిపై వాల్తేరు రైల్వే డివిజన్ అధికారులు ప్రాథమిక ఎఫ్ఐఆర్ సిద్ధంచేసి రైల్వే మంత్రిత్వ శాఖకు పంపించారు. ప్రమాదం ఎప్పుడు జరిగింది? ఏఏ రైళ్లు ప్రమాదానికి గురయ్యాయి? అనే ప్రాథమిక అంశాల్ని అందులో పొందుపరిచారు. ఈ ఎఫ్ఐఆర్ ప్రకారం వివరాలిలా ఉన్నాయి..

- ప్రమాదం జరిగిన తీరు: వెనుక నుంచి ఢీకొట్టడంవల్ల..
- ప్రమాదం జరిగిన సమయం: 29 అక్టోబరు రాత్రి 7 గంటలకు..
- డివిజన్ : వాల్తేరు రైల్వే డివిజన్
- ఏ సెక్షన్‌లో జరిగింది: కంటకాపల్లి–అలమండ డీఎస్ మిడిల్ లైన్‌లో
- ప్రమాదం జరిగిన ప్రాంతం: 840/27 కి.మీ వద్ద
- ఏఏ రైళ్లు ప్రమాదానికి గురయ్యాయి: 08532 ఎక్స్‌ప్రెస్, 08504 ఎక్స్‌ప్రెస్
- సమీప స్టేషన్ నుంచి ఎప్పుడు బయలుదేరాయి: 08532 ఎక్స్‌ప్రెస్ సా. 6.42 గంటలకు బయల్దేరింది.. 08504 ఎక్స్‌ప్రెస్ 6.52 గంటలకు బయలుదేరింది
- ఇతర సమాచారం: యాక్సిడెంట్ రిలీఫ్ మెడికల్ ఎక్విప్‌మెంట్ కోసం 7.05కి సమాచారం ఇచ్చారు
- 7.07 గంటలకు యాక్సిడెంట్ రిలీఫ్ ట్రైన్‌ను (ఏఆర్‌టీ) ఆర్డర్ చేయగా 7.31 గంటలకు విశాఖ నుంచి బయల్దేరింది.
- 7.10 గంటలకు 120 టన్నుల క్రేన్ బయల్దేరింది
- సహాయక చర్యల్లో పాల్గొన్న అధికారులు : వాల్తేరు డివిజన్ డీఆర్ఎం, ఏడీఆర్ఎం (ఆపరేషనల్), ఇతర అధికారులు

బాధితుల సమాచారం కోసం కంట్రోల్ రూం..

మరోవైపు.. బాధితులకు సహాయం, వారి సమాచారం తెలుసుకోవడం కోసం కంట్రోల్ రూంలను ఏర్పాటుచేసినట్లు విజయనగరం జిల్లా కలెక్టర్ నాగలక్ష్మి. ఎస్ తెలిపారు.

కలెక్టరేట్ కార్యాలయంలో: 9493589157..
రైల్వే శాఖలో: 89780 80006
రైల్వే కంట్రోల్ రూంలో: 8978080777
విశాఖ కలెక్టరేట్‌లో కంట్రోల్ రూమ్: 9030226621, 7036111169, 0891 2590102

విజయవాడ డివిజన్ అధికారులు ప్రకటించిన హెల్ప్‌లైన్ నంబర్లు..

ఏలూరు: 0881-2232267, **సామర్లకోట:** 0884-2327010
రాజమహేంద్రవరం: 0883-2420541, **తుని:** 0885-4252172

రైలు ప్రమాదంపై గవర్నర్ దిగ్భ్రాంతి

సాక్షి, అమరావతి : విజయనగరం జిల్లాలో రైలు ప్రమాదంపై గవర్నర్ ఎస్. అబ్దుల్ నజీర్ దిగ్భ్రాంతి వ్యక్తంచేశారు. మృతుల కుటుంబాలకు ఆయన తన ప్రగాఢ సానుభూతి తెలిపారు. క్షతగాత్రులకు మెరుగైన వైద్యసేవలు అందించాలని ఆయన అధికారులను ఆదేశించినట్లు రాజ్‌భవన్ వర్గాలు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపాయి.

రైలు ప్రమాదంపై బీజేపీ, జనసేన నేతల దిగ్భ్రాంతి

సాక్షి, అమరావతి: విజయనగరం జిల్లాలో చోటు చేసుకున్న రైలు ప్రమాద ఘటనపై బీజేపీ రాష్ట్ర అధ్యక్షురాలు పురందేశ్వరి దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. గాయపడిన వారికి మెరుగైన వైద్యం అందించడానికి అవసరమైన చర్యలన్నీ ప్రభుత్వం తీసుకోవాలని ఆమె ఓ ప్రకటనలో కోరారు. బాధితులకు అండగా నిలవాలని బీజేపీ శ్రేణులకు పిలుపునిచ్చారు.

దురదృష్టకరం: పవన్

కొద్ది నెలలక్రితం ఒడిశాలో జరిగిన రైలు ప్రమాద సంఘటనను మరువకముందే మన రాష్ట్రంలో మరో ప్రమాదం చోటు చేసుకోవడం దురదృష్టకరమని జనసేన అధ్యక్షుడు పవన్‌కళ్యాణ్ పేర్కొన్నారు. ప్రమాదంపై సమగ్ర విచారణ చేపట్టాలని కోరారు. మృతుల కుటుంబాలకు తన ప్రగాఢ సానుభూతి తెలిపారు.

ఎక్కడి రైళ్లు అక్కడే

వివిధ స్టేషన్లలో నిలిచిపోయిన రైళ్లు

- పలు రైళ్లు రద్దు.. మరికొన్ని దారి మళ్లింపు
- విశాఖ నుంచి విజయవాడ వైపు వెళ్లే రైళ్లు యథాతథం
- ప్రమాద స్థలానికి చేరుకున్న అధికారులు, యంత్ర సామగ్రి
- విశాఖ నుంచి సహాయక చర్యల కోసం మూడు ప్రత్యేక రైళ్లు

తాటిచెట్లపాలెం (విశాఖ ఉత్తర)/విశాఖపట్నం: విజయనగరం జిల్లా కొత్తవలస మండలం కంటకాపల్లి–అలమండ మధ్య ఆదివారం రాత్రి విశాఖ నుంచి పలాస వెళ్తున్న ప్రత్యేక పాసింజర్ రైలును విశాఖ–రాయగడ రైలు వెనుక నుంచి ఢీకొట్టిన ప్రమాదం కారణంగా వివిధ స్టేషన్లలో రైళ్లు నిలిచిపోయాయి. పలు రైళ్ల రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. ఈ దుర్ఘటనతో రైల్వే అధికారులు పలు రైళ్లను రద్దు చేశారు. మరికొన్ని రైళ్లను దారి మళ్లించారు. విశాఖ నుంచి విజయవాడ వైపు వెళ్లే రైళ్లు మాత్రం యథాతథంగా నడుస్తున్నాయి. ప్రమాద వివరాలను తెలియజేసేందుకు ఎక్కడికక్కడ సహాయ కేంద్రాలు ఏర్పాటు చేశారు. విశాఖపట్నం రైల్వే స్టేషన్‌లో హెల్ప్ లైన్ నంబర్ల 0891-2746330/0891-2744619ను ఏర్పాటు చేశారు. ప్రమాద వార్త తెలిసిన వెంటనే వాల్తేర్ డివిజనల్ రైల్వే మేనేజర్ సౌరభ్ ప్రసాద్, అధికారులు, సిబ్బంది ప్రత్యేక రైలులో ఘటనా స్థలానికి చేరుకున్నారు. విశాఖపట్నం నుంచి సహాయక చర్యల్లో పాల్గొనేందుకు 120 టన్నుల, 140 టన్నుల సామర్థ్యం గల క్రేన్లతో జీఆర్పీ, రైల్వే అధికారులు, సిబ్బందితో మరో రెండు ప్రత్యేక రైళ్లు బయల్దేరాయి.

ఎక్కడికక్కడ నిలిచిపోయిన రైళ్లు

ఈ ఘటనతో విజయనగరం వైపు వెళ్లాల్సిన, విజయనగరం వైపు నుంచి రావలసిన పలు రైళ్లు ఎక్కడికక్కడ నిలిచిపోయాయి. ఈ రైళ్లలో కొన్నింటిని దారి మళ్లించారు. విశాఖపట్నం రైల్వేస్టేషన్‌లో చెన్నై సెంట్రల్–హౌరా (12842) కోరమాండల్, యశ్వంత్‌పూర్–పూరీ (22842) గరీబ్‌రథ్ ఎక్స్‌ప్రెస్‌లను పునరుద్ధరించే వరకు నిలిపివేశారు. మరికొన్ని రైళ్లు దువ్వాడ, అనకాపల్లి, విజయనగరం, శ్రీకాకుళం స్టేషన్లలో నిలిపివేశారు.

రద్దయిన రైళ్లు

సోమవారం రాయ్‌పూర్–విశాఖపట్నం–రాయ్‌పూర్ (08527/08528) పాసింజర్ స్పెషల్ రద్దు చేశారు. ఆదివారం రాత్రి విశాఖపట్నంలో బయల్దేరాల్సిన విశాఖపట్నం–కోర్బా ఎక్స్‌ప్రెస్ కూడా రద్దయింది.

దారి మళ్లించిన రైళ్లు

ఈ దిగువ రైళ్లను ఆదివారం రెగ్యులర్ మార్గం విశాఖపట్నం–విజయవాడ మీదుగా కాకుండా టిట్లాఘడ్–రాయ్‌పూర్–నాగ్‌పూర్–బల్హార్షా–విజయవాడ మీదుగా దారి మళ్లించారు. 28వ తేదీన బారునిలో బయల్దేరిన బారుని–కోయంబత్తూర్ (03357) స్పెషల్ ఎక్స్‌ప్రెస్, 29వ తేదీన టాటాలో బయల్దేరిన టాటా–ఎర్నాకుళం(18189) ఎక్స్‌ప్రెస్, ఈ నెల 29వ తేదీన భువనేశ్వర్‌లో బయల్దేరిన భువనేశ్వర్–ముంబయ్ (11020) కోణార్క్ ఎక్స్‌ప్రెస్, 29వ తేదీన హౌరాలో బయల్దేరిన హౌరా–సికింద్రాబాద్ (12703) ఫలక్‌నుమా ఎక్స్‌ప్రెస్, 29వ తేదీన హౌరాలో బయల్దేరిన హౌరా–బెంగళూరు (12245) దురంతో ఎక్స్‌ప్రెస్ రైళ్లను దారి మళ్లించారు.

గమ్యం కుదించిన రైళ్లు ఇవీ

- 29న సంబల్‌పూర్‌లో బయల్దేరిన సంబల్‌పూర్–నాందేడ్(20809)ఎక్స్‌ప్రెస్ విజయనగరం వరకు నడిచింది. అక్కడ నుండి తిరిగి సంబల్‌పూర్ చేరుకుంది.
- నెల 29న పూరీలో బయల్దేరిన పూరీ–తిరుపతి (17479) ఎక్స్‌ప్రెస్ బలుగాం వరకు నడిచింది. అక్కడ నుండి తిరిగి పూరీ చేరుకుంది.
- 29న విశాఖపట్నంలో బయల్దేరిన విశాఖపట్నం–విజయనగరం (07468) పెందుర్తి నుండి విశాఖకు చేరుకుంది.
- 28వ తేదీన ముంబైలో బయల్దేరిన ముంబై–భువనేశ్వర్ (11019) కోణార్క్ ఎక్స్‌ప్రెస్ విశాఖపట్నం వరకు మాత్రమే నడుస్తుంది. ఈ రైలు విశాఖపట్నం నుండి భువనేశ్వర్–ముంబై (11020) రైలుగా ముంబై బయల్దేరుతుంది.

ఆర్టీసీ అప్రమత్తం

రైళ్ల ప్రమాద ఘటనతో ఆర్టీసీ యంత్రాంగం అప్రమత్తమైంది. ఘటనా స్థలానికి విజయనగరం నుంచి 10, సింహాచలం నుంచి 5, గాజువాక నుంచి 3, ఎస్.కోట నుంచి 2 బస్సులను పంపించారు. క్షతగాత్రులను ఈ బస్సుల్లో వివిధ ఆస్పత్రులకు తరలిస్తున్నారు. మరో 5 బస్సులను విజయనగరంలో సిద్ధం చేశారు. పార్వతీపురం, పలాస వైపు వెళ్లే ప్రయాణికులకు, ప్రమాదం వల్ల వివిధ స్టేషన్లలో నిలిచిపోయిన ప్రయాణికుల కోసం విశాఖ ద్వారకా బస్ స్టేషన్‌లో సరిపడినన్ని బస్సులను అందుబాటులో ఉంచామని ఆర్టీసీ జోన్–1 ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ సి.రవికుమార్ 'సాక్షి'కి చెప్పారు. అలాగే రైల్వే స్టేషన్‌లో కూడా బస్సులను సిద్ధంగా ఉంచామన్నారు. విశాఖ ద్వారకా బస్ స్టేషన్‌లో ఇద్దరు అధికారులను నియమించామని, ఘటనా స్థలానికి మరికొందరు అధికారులను పంపించామని తెలిపారు.

పారదర్శకంగా ఇసుక టెండర్లు

- జిల్లాల పునర్విభజన వల్లే ప్యాకేజీ రిజర్వు ధరల్లో మార్పులు: గనుల శాఖ డైరెక్టర్ వెంకటరెడ్డి
- గతం కంటే రూ.33 కోట్లు అధికంగా పెర్ఫార్మెన్స్ సెక్యూరిటీ ఆదాయం

సాక్షి, అమరావతి: ఇసుక టెండర్ల ప్రక్రియపై టీడీపీ నేతలు చేస్తున్న ఆరోపణలు పూర్తిగా అవాస్తవమని గనుల శాఖ డైరెక్టర్ వీజీ వెంకటరెడ్డి స్పష్టం చేశారు. జిల్లాల పునర్విభజన కారణంగా ప్యాకేజీల రిజర్వు ధరల్లో మార్పులు చేశామని, ఈ విషయం తెలుసుకోకుండా తప్పుడు ఆరోపణలు ఎలా చేస్తారని ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. 2021లో మూడు ప్యాకేజీలకు రిజర్వు ధర రూ.1,510 కోట్లు కాగా ఇప్పుడు జారీ చేసిన టెండర్లలో రిజర్వు ధర రూ.1,529 కోట్లని తెలిపారు. ప్యాకేజీ–2లో తగ్గిన రూ.55 కోట్లు ప్యాకేజీ–1 రిజర్వు ధరలో కలిశాయన్నారు. దీనిపై అవగాహన లేకుండా అక్రమాలు జరిగిపోతున్నాయంటూ గగ్గోలు పెట్టడం హాస్యాస్పదంగా ఉందన్నారు. జిల్లాల పునర్విభజన వల్ల గతంలో ప్యాకేజీ–2 కింద పశ్చిమ గోదావరి జిల్లా పరిధిలో ఉన్న 20 ఇసుక రీచ్‌లు ఇప్పుడు ప్యాకేజీ–1 కింద తూర్పు గోదావరి జిల్లా పరిధిలోకి వచ్చాయన్నారు. ఇసుక టెండర్లకు ఖరారు చేసిన బిడ్ సెక్యూరిటీ, పెర్ఫార్మెన్స్ సెక్యూరిటీపై అవగాహన లేకుండా ఆరోపణలు చేస్తున్నారని తెలిపారు. ప్రీ బిడ్ సమావేశాన్ని అక్టోబర్ 17వతేదీన నిర్వహించామని, దసరా సెలవుల కారణంగా సహేతుకమైన సమాధానాలను ఈ నెల 26వ తేదీన నోటిఫై చేశామని తెలిపారు. గతంలో ఉచిత ఇసుక విధానం పేరుతో కోట్లాది రూపాయల ఆదాయం ప్రభుత్వానికి రాకుండా ఇసుక మాఫియా జేబుల్లోకి వెళ్లిందన్నారు. ఈ దోపిడీని నివారించేందుకు సీఎం జగన్ అత్యంత పారదర్శకంగా నూతన ఇసుక విధానాన్ని రూపొందించి అమలు చేస్తున్నారని, దీనివల్ల ఏటా రూ.765 కోట్ల ఆదాయం ఖజానాకు సమకూరుతోందని వివరించారు. ప్రభుత్వానికి గతం కంటే రూ.33 కోట్లు పెర్ఫార్మెన్స్ సెక్యూరిటీ అధికంగా వస్తుండగా కాంట్రాక్టర్‌కు మేలు చేసేలా ఉన్నట్లు ఆరోపణలు చేయడం దారుణమన్నారు.

క్లుప్తంగా...

నేడు సీఎం జగన్ విజయవాడ పర్యటన

హైకోర్టు జడ్జిగా జస్టిస్ నరేందర్ ప్రమాణ స్వీకార కార్యక్రమంలో పాల్గొననున్న ముఖ్యమంత్రి


సాక్షి, అమరావతి: ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి సోమవారం విజయవాడలో పర్యటించనున్నారు. సాయంత్రం 4.47 గంటలకు తాడేపల్లిలోని తన నివాసం నుంచి బయలుదేరి రాజ్‌భవన్ చేరుకుంటారు. అక్కడ నిర్వహిస్తున్న రాష్ట్ర హైకోర్టు న్యాయమూర్తిగా జస్టిస్ జి.నరేందర్ ప్రమాణ స్వీకార కార్యక్రమంలో పాల్గొంటారు. అనంతరం ఆయన తాడేపల్లిలోని నివాసానికి చేరుకుంటారు. కాగా, కర్ణాటక హైకోర్టు న్యాయమూర్తిగా ఉన్న నరేందర్‌ను ఏపీ హైకోర్టుకు బదిలీ చేస్తూ ఆగస్టు 10న సుప్రీంకోర్టు కొలీజియం తీర్మానం చేసింది. ఈ తీర్మానానికి ఆమోద ముద్ర వేస్తూ రాష్ట్రపతి ఈ నెల 18న ఉత్తర్వులిచ్చారు. తదనుగుణంగా జస్టిస్ నరేందర్ బదిలీని నోటిఫై చేస్తూ కేంద్ర న్యాయ శాఖ నోటిఫికేషన్ జారీ చేసిన విషయం తెలిసిందే. తమిళనాడుకు చెందిన జస్టిస్ నరేందర్ 1993లో తన ప్రాక్టీస్‌ను కర్ణాటకకు మార్చారు. 2015లో కర్ణాటక హైకోర్టు అదనపు న్యాయమూర్తిగా నియమితులై 2017లో శాశ్వత న్యాయమూర్తి అయ్యారు.

1న 'వైఎస్సార్' అవార్డుల ప్రదానోత్సవంలో పాల్గొననున్న సీఎం

ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నవంబర్ 1న విజయవాడలో పర్యటించనున్నారు. బుధవారం ఉదయం 10.48 గంటలకు తాడేపల్లిలోని నివాసం నుంచి బయలుదేరి విజయవాడలోని ఎ కన్వెన్షన్ సెంటర్‌కు సీఎం చేరుకుంటారు. అక్కడ నిర్వహించే వైఎస్సార్ లైఫ్‌టైమ్ అచీవ్‌మెంట్ అవార్డులు, అచీవ్‌మెంట్ అవార్డుల ప్రదానోత్సవంలో గవర్నర్ అబ్దుల్ నజీర్‌తో కలిసి సీఎం జగన్ పాల్గొంటారు.

టీడీపీ నాయకులకు ప్రజలే బుద్ధి చెప్పాలి

శాసనమండలి చీఫ్ విప్ ఉమ్మారెడ్డి



పొన్నూరు: రాష్ట్రంలో దాడులకు పాల్పడుతున్న దుర్మార్గపు తెలుగుదేశం పార్టీ నాయకులకు తగిన బుద్ధి చెప్పాలని శాసనమండలి చీఫ్ విప్ డాక్టర్ ఉమ్మారెడ్డి వెంకటేశ్వర్లు ప్రజలకు విజ్ఞప్తి చేశారు. ఆదివారం పొన్నూరులో మహాత్మా జ్యోతిరావు పూలే విగ్రహావిష్కరణ సభలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. రాష్ట్ర జలవనరుల శాఖ మంత్రి అంబటి రాంబాబు ఏం చేశారని టీడీపీ నేతలు ఆయనపై దాడులకు పాల్పడుతున్నారని నిలదీశారు. నిజాలు నిర్భయంగా చెప్పడమే ఆయన చేసిన తప్పిదమా అని ప్రశ్నించారు. సభలో ఎంపీ మోపిదేవి వెంకట రమణారావు, ఎమ్మెల్సీ జంగా కృష్ణమూర్తి, ఎమ్మెల్యే కిలారి వెంకట రోశయ్య పాల్గొన్నారు.

కులోన్మాదంతోనే అంబటిపై దాడి

నరహరశెట్టి శ్రీహరి

వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): కులోన్మాదంతోనే మంత్రి అంబటి రాంబాబుపై దాడి జరిగిందని కాపు సమాఖ్య జాతీయ అధ్యక్షుడు నరహరశెట్టి శ్రీహరి ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. కాపులను దారుణంగా మోసగించిన టీడీపీ నేడు దాడులకు పురిగొల్పుతుందని మండిపడ్డారు. నోటికొచ్చినట్లు తిట్టడం, కర్రలతో దాడికి ప్రయత్నించడం చూస్తుంటే కాపులపై ఆ సామాజికవర్గం ఎంత దారుణానికి ఒడిగడుతోందో అర్థమవుతోందన్నారు.

దేశ అభ్యున్నతి కోసం 'ఇండియా'

సీడబ్ల్యూసీ సభ్యుడు రఘువీరారెడ్డి

సాక్షి, అమరావతి: దేశ అభ్యున్నతి కోసం 28 రాజకీయ పార్టీలతో ఇండియా కూటమి ఏర్పడిందని కాంగ్రెస్ పార్టీ వర్కింగ్ కమిటీ (సీడబ్ల్యూసీ) సభ్యుడు డాక్టర్ ఎన్.రఘువీరారెడ్డి చెప్పారు. సీడబ్ల్యూసీ సభ్యుడిగా బాధ్యతలు స్వీకరించిన రఘువీరారెడ్డికి సీపీఐ రాష్ట్ర కమిటీ అభినందన సత్కార కార్యక్రమాన్ని నిర్వహించింది. విజయవాడ దాసరి భవన్‌లో ఆదివారం జరిగిన ఈ కార్యక్రమంలో రఘువీరారెడ్డి మాట్లాడుతూ కేంద్రంలోని బీజేపీ, రాష్ట్రంలో వైఎస్సార్‌సీపీ ప్రభుత్వాలు అహంకారంతో అడ్డగోలుగా పాలన సాగిస్తున్నాయని ఆరోపించారు. సీపీఐ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ, పీసీసీ అధ్యక్షుడు రుద్రరాజు పాల్గొన్నారు.

టీడీపీని కాపాడేందుకు పురందేశ్వరి యత్నం

1,127వ రోజు దీక్షల్లో బహుజన నేతలు



రిలే దీక్షలో బహుజన పరిరక్షణ సమితి నేతలు

తాడికొండ: ఏపీకి కేంద్ర ప్రభుత్వం నుంచి సహకారం ఇప్పించలేని బీజేపీ రాష్ట్ర అధ్యక్షురాలు పురందేశ్వరి అమరావతే రాజధానిగా ఉంటుందనే వ్యాఖ్యలు చేయడం హాస్యాస్పదమని బహుజన పరిరక్షణ సమితి నేతలు ఆగ్రహం వ్యక్తం చేశారు. తుళ్లూరు మండలం తాళ్లాయపాలెం సీడ్ యాక్సిస్ రోడ్డు జంక్షన్‌లో మూడు రాజధానులకు మద్దతుగా బహుజన పరిరక్షణ సమితి ఆధ్వర్యంలో చేపట్టిన రిలే నిరాహార దీక్షలు ఆదివారం 1,127వ రోజుకు చేరాయి. ఈ సందర్భంగా నేతలు ప్రసంగిస్తూ పురందేశ్వరి బీజేపీని అభివృద్ధి చేయడం మాని టీడీపీని, మరిదిని కాపాడుకునేందుకు ప్రయత్నిస్తున్నారని విమర్శించారు. బహుజన పరిరక్షణ సమితి నేతలు మాదిగాని గురునాథం, ఈపూరి ఆదాం, పులి దాసు, నూతక్కి జోషి తదితరులు పాల్గొన్నారు.

తెలంగాణలో చేతులెత్తేసిన టీడీపీ

ఎన్నికల్లో పోటీకి సైకిల్ దూరం

- కాంగ్రెస్‌కు లాభం చేకూర్చేందుకే
- టీ టీడీపీ నేతల భేటీకి లోకేశ్ గైర్హాజరు
- భగ్గుమన్న నేతలు.. ఇండిపెండెంట్లుగా బరిలోకి

సాక్షి, హైదరాబాద్/సాక్షి, అమరావతి: ఊహించినట్లుగానే తెలంగాణలో తెలుగుదేశం పార్టీ చేతులెత్తేసింది. తెలంగాణ అసెంబ్లీ ఎన్నికల్లో పోటీ చేయలేమని చినబాబు తేల్చేశారు. రాజమహేంద్రవరం సెంట్రల్ జైలులో చంద్రబాబును శుక్రవారం ములాఖత్‌లో లోకేశ్‌తోపాటు తెలంగాణ టీడీపీ అధ్యక్షుడు కాసాని జ్ఞానేశ్వర్ కలిశారు. తెలంగాణలో పోటీ చేసే విషయంపై తాను మాట్లాడలేనని, లోకేశ్‌తో మాట్లాడి నిర్ణయం తీసుకోవాలని జ్ఞానేశ్వర్‌కు ఈ సందర్భంగా చంద్రబాబు సూచించినట్లు తెలిసింది. నిజానికి లోకేశ్ చాలా రోజుల ముందే పోటీకి దూరంగా ఉంటున్నట్లు జ్ఞానేశ్వర్‌కు చెప్పినట్లు తెలిసింది. ఈ నేపథ్యంలో ఆదివారం హైదరాబాద్‌లోని ఎన్టీఆర్ ట్రస్టు భవన్‌లో కాసాని జ్ఞానేశ్వర్ అధ్యక్షతన జరిగిన తెలంగాణ టీడీపీ నేతల సమావేశానికి గైర్హాజరైన లోకేశ్ ఎన్నికల్లో పోటీ చేయడం లేదనే సమాచారాన్ని పంపడంతో నేతలంతా భగ్గుమన్నారు. టీడీపీ కచ్చితంగా పోటీ చేయాల్సిందేనని, బలమున్న స్థానాల్లో అయినా పోటీకి అంగీకరించాలని డిమాండ్ చేశారు. స్థానిక నాయకత్వం నిస్సహాయత వ్యక్తం చేయడంతో సమావేశానికి హాజరైన నేతలు అక్కడే ఆందోళనకు దిగారు. ఎవరి ప్రయోజనాల కోసం ఈ నిర్ణయం తీసుకున్నారంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు. తండ్రీకుమారుల కోసం తాము త్యాగాలెందుకు చేయాలని నిలదీసిన నేతలు బీ ఫారాలు ఇవ్వకుంటే ఇండిపెండెంట్లుగా అయినా బరిలోకి దిగాలని తీర్మానించారు. ఏపీలో ఎదురవుతున్న పరిస్థితులను తట్టుకుని నిలబడేందుకే తమకు సమయం సరిపోతోందని, తెలంగాణ ఎన్నికలపై దృష్టి కేంద్రీకరించలేమని చినబాబు సంజాయిషీ ఇచ్చినట్లు సమాచారం. ఏపీ రాజకీయాలకు, తెలంగాణ ఎన్నికలకు ముడిపెట్టడం ఏమిటని టీ టీడీపీ నేతలు విస్మయం వ్యక్తం చేస్తున్నారు.

చివరి వరకు నాన్చి..

తెలంగాణ ఎన్నికల్లో పోటీ చేసే అంశంపై టీడీపీ చాలా రోజులుగా నాన్చుతూ వస్తోంది. బలమున్న చోట పోటీకి దిగుదామని ఆ పార్టీ నేతలకు ముఖ్య నాయకులు చెబుతూ వచ్చారు. చివరకు చేతులెత్తేసి పోటీ చేయలేమని తేల్చేశారు. హైదరాబాద్‌ను తానే నిర్మించానని, ఐటీకి తానే మూల పురుషుడినని పదేపదే చెప్పుకునే చంద్రబాబు అక్కడ కనీసం పోటీ ఎందుకు పెట్టలేకపోతున్నారనే ప్రశ్నలకు సమాధానం లేదు. ఒకవైపు హైదరాబాద్‌లో చంద్రబాబుకు మద్దతుగా ఐటీ ఉద్యోగుల పేరుతో ఆందోళనలు చేయిస్తూ ఎన్నికలకు దూరంగా ఉండడం దేనికి సంకేతమని ఆ పార్టీ నేతలే ప్రశ్నిస్తున్నారు.

కాంగ్రెస్‌కు మేలు చేసేందుకేనా!

కాంగ్రెస్‌తో కుదిరిన రహస్య ఒప్పందం మేరకు తెలంగాణ ఎన్నికలకు టీడీపీ దూరంగా ఉన్నట్లు పార్టీ నేతల మధ్య చర్చ జరుగుతోంది. కాంగ్రెస్‌కు లాభం చేకూర్చాలనే చంద్రబాబు ఈ నిర్ణయం తీసుకున్నారని చెబుతున్నారు. తెలంగాణ పీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి చంద్రబాబుకు శిష్యుడనే విషయం తెలిసిందే. పోటీకి దూరంగా ఉండాలనే నిర్ణయంతో తెలంగాణ టీడీపీ అధ్యక్షుడు కాసాని జ్ఞానేశ్వర్ అసంతృప్తితో రగిలి పోతున్నారు. చంద్రబాబు తనను మోసం చేశారని ఆయన పార్టీ నేతల వద్ద వాపోతున్నట్లు తెలిసింది. ఎన్నికల్లో పోటీ చేసేందుకు అన్ని ఏర్పాట్లు చేసుకోవాలని తనకు చెప్పి ఇప్పుడు కాడి పారేయడం ఏమిటని ఆయన అసహనం వ్యక్తం చేస్తున్నారు. పార్టీ కోసం ఇన్నాళ్లూ చాలా ఖర్చు పెట్టానని, పార్టీ కోసం పని చేసిన నాయకులకు మొహం ఎలా చూపించాలని మండిపడుతున్నారు. తాజా పరిణామాల నేపథ్యంలో టీడీపీకి కాసాని రాజీనామా చేసే యోచనలో ఉన్నట్లు తెలుస్తోంది. మరోవైపు ఇన్నాళ్లూ చంద్రబాబును జాతీయ పార్టీ అధ్యక్షుడిగా చెబుతున్న తాము ఇకపై ఏం చెప్పాలని ఏపీ టీడీపీ నేతలు వాపోతున్నారు.

ప్లాట్ల కేటాయింపు వెనుక వాస్తవాలకు

ఈనాడు తూట్లు

- గత ప్రభుత్వం చేసిన అన్యాయాన్ని కప్పిపుచ్చి రామోజీ అడ్డగోలు రాతలు
- రైతులకు న్యాయం చేసేలా ప్లాట్లు కేటాయించేందుకు సీఆర్డీఏ సిద్ధమవడంపై దుష్ప్రచారం
- దీర్ఘకాలిక సమస్యకు పరిష్కారం చూపుతుంటే ఓర్వలేని ఎల్లో మీడియా


సాక్షి, అమరావతి: అమరావతి సీఆర్డీఏ ప్రాంతంలో రైతులకు ప్లాట్ల కేటాయింపు వ్యవహారంపై 'ఈనాడు' దినపత్రిక మరోసారి తన దివాళాకోరు తనాన్ని బయటపెట్టింది. గత ప్రభుత్వంలో రైతులకు జరిగిన అన్యాయాన్ని సరిదిద్దే ప్రయత్నం ఈ ప్రభుత్వం చేస్తుంటే తట్టుకోలేక బురద జల్లేందుకు పూనుకుంది. 'ప్లాట్లు రద్దు చేసుకోవాలంటూ రైతులకు లేఖలు' శీర్షికన వాస్తవాలను దాచేసి పూర్తిగా వక్రీకరణకు దిగింది. వాస్తవానికి అమరావతి సీఆర్డీఏ ప్రాంతంలో గత ప్రభుత్వం భూ సమీకరణ ద్వారా 34,400 ఎకరాలను సమీకరించింది. ఈ భూములిచ్చిన రైతులకు 63,462 నివాస/వాణిజ్య ప్లాట్లు కేటాయించింది. అయితే.. కొందరు రైతులు భూ సమీకరణకు భూములిచ్చేందుకు నిరాకరించగా, ఇలాంటి చోటా గత ప్రభుత్వం భూ సేకరణ నోటిఫికేషన్ జారీ చేసింది. దీనిపై ఆ ప్రాంత రైతులు న్యాయస్థానాలను ఆశ్రయించి స్టే కూడా తెచ్చుకున్నారు. ఈ వివాదాలు పరిష్కారం కాకుండానే ఆ భూముల్లోనూ ప్లాట్లను కేటాయించేశారు. గత ప్రభుత్వం భూసేకరణను, ప్లాట్ల కేటాయింపు ఎంత అస్తవ్యస్తం చేశారో చెప్పడానికి ఇదో నిదర్శనం.

రైతులకు మేలు చేస్తుంటే తప్పుడు రాతలు

సీఆర్డీఏ ప్రాంతంలో భూములిచ్చిన వారికి కేటాయించిన ప్లాట్లలో 3,356 ప్లాట్లు ఈ విధంగా భూసేకరణ ప్రక్రియలో, కోర్టు తగాదాలతో రైతులకు రిజిస్ట్రేషన్ చేసుకునే వీలు లేకున్నా 953 ప్లాట్లను రిజిస్టర్ చేసేశారు. అంటే భూమి లేకుండానే రిజిస్ట్రేషన్లు జరిగిపోయాయి. ఈ సమస్యను సరిదిద్ది, ల్యాండ్ పూలింగ్‌కు భూములిచ్చిన వారికి మేలు చేసే ఉద్దేశంతో భూ సేకరణ, కోర్టు వివాదాల్లో ఉన్న ప్లాట్లకు ప్రత్యామ్నాయంగా వేరే ప్లాట్లను కేటాయించేందుకు ప్రస్తుత ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. ప్లాట్ల తాత్కాలిక కేటాయింపు ఉత్తర్వుల్లోని 3వ నిబంధన మేరకు కేటాయించిన ప్లాటు విషయంలో ఏదైనా సమస్య ఉంటే నిర్ణీత కాలంలో పరిష్కరించేందుకు లేదా ప్రత్యామ్నాయ ప్లాటు కేటాయించేందుకు ఏపీ సీఆర్డీఏ బాధ్యత తీసుకుంది. అందుకు అనుగుణంగానే పూలింగ్‌కు భూములిచ్చిన యజమానుల అంగీకారం కోసం వారికి కేటాయించిన ప్లాట్లలో భూసేకరణ/కోర్టు వివాదాల సమస్య ఉన్నందున ప్రత్యామ్నాయ ప్లాట్లు కేటాయించేందుకు వారికి సమాచారం ఇచ్చి అంగీకారం తీసుకుంటోంది. ఎంతోకాలంగా అపరిష్కృతంగా ఉన్న సమస్యను పరిష్కరించేందుకు ఈ ప్రక్రియ చేపడితే ఎల్లో మీడియా వక్రీకరించి ప్రభుత్వంపై బురద జల్లుతూ దిగజారుడు కథనాన్ని ప్రచురించింది.

న్యాయ వ్యవస్థను కించపరుస్తున్న లోకేశ్

మంత్రి అమర్‌నాథ్ మండిపాటు



స్కిల్ స్కామ్ సంబంధించిన నోట్ ఫైళ్లపై అప్పటి ముఖ్యమంత్రి హోదాలో చంద్రబాబు చేసిన డిజిటల్ సంతకం

మహారాణిపేట (విశాఖ దక్షిణ): స్కిల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ ప్రాజెక్ట్ పేరుతో అడ్డగోలుగా అవినీతికి పాల్పడి, ఆధారాలతో సహా దొరికిన దొంగ చంద్రబాబు అని రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి గుడివాడ అమర్‌నాథ్ ఘాటుగా విమర్శించారు. సీఐడీ నమోదు చేసిన కేసులో ఆధారాలు ఉన్నాయనే న్యాయస్థానం ఆయనకు రిమాండ్ విధించిందన్నారు. విజయవాడ న్యాయస్థానం నుంచి సుప్రీంకోర్టు వరకు అన్ని కోర్టుల మెట్లు ఎక్కినా, ఆయనకు ఊరట లభించకపోవడంతో 50 రోజులుగా రాజమహేంద్రవరం సెంట్రల్ జైల్లో రిమాండ్ ఖైదీగా ఉన్నారని చెప్పారు. వాస్తవాలు ఇలా ఉంటే ముఖ్యమంత్రి వైఎస్‌జగన్‌మోహన్‌రెడ్డి వ్యవస్థలను మేనేజ్ చేశారని లోకేశ్ విమర్శించడం న్యాయ వ్యవస్థను అవమానించడమేనని మండిపడ్డారు. విశాఖపట్నంలో ఆదివారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. చంద్రబాబుకు వ్యతిరేకంగా ఎలాంటి సాక్ష్యాలు లేవని, వ్యవస్థలను మేనేజ్ చేస్తున్నారని లోకేశ్ వ్యాఖ్యానించడం పట్ల ఆయన తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారు. స్కిల్ స్కామ్‌కు సంబంధించి అప్పటి ముఖ్యమంత్రిగా చంద్రబాబు ఏకంగా 13 ఫైళ్లలో సంతకాలు చేశారని గుర్తు చేశారు. తద్వారా ప్రజాధనాన్ని కొల్లగొట్టారని సీఐడీ ఆధారాలతో సహా వెలికి తీసిందన్నారు. ఆయన ఎక్కడెక్కడ సంతకాలు పెట్టారో అసెంబ్లీలో స్క్రీన్‌పై ప్రదర్శించి ప్రజలకు స్పష్టంగా వివరించామని చెప్పారు. ఇంతకంటే ఏం సాక్ష్యాలు కావాలని లోకేశ్‌ను ప్రశ్నించారు. మంత్రి అమర్‌నాథ్ ఇంకా ఏం చెప్పారంటే..



Signatures/Approvals in the note files by Sri N.Chandrababu Naidu

Signed in the following documents

A-2 Signed in the following documents

స్కిల్ స్కామ్‌కు పాల్పడుతూ అప్పటి ముఖ్యమంత్రి హోదాలో చంద్రబాబు సంతకాలు చేసిన 13 నోట్ ఫైళ్ల వివరాలు

సీమెన్స్' తిరుగులేని సాక్ష్యం

> స్కిల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ ప్రాజెక్ట్‌తో తమకు ఎలాంటి సంబంధం లేదని జర్మనీకి చెందిన సీమెన్స్ కంపెనీ స్పష్టం చేసింది. చంద్రబాబు అవినీతికి పాల్పడ్డారనేందుకు ఇది తిరుగులేని సాక్ష్యం. అసలు కేబినెట్ అనుమతి లేకుండానే ఈ కార్పొరేషన్‌ను ఏర్పాటు చేయడం ద్వారా చంద్రబాబు అవినీతికి నాంది పలికారు.

> స్కిల్ ప్రాజెక్ట్ పేరిట జారీ చేసిన జీవోకు విరుద్ధంగా ఒప్పందం చేసుకోవడం.. సీమెన్స్ కంపెనీకి తెలియకుండానే ఆ కంపెనీ పేరుతో ఒప్పందం చేసుకుంటున్నట్లు మోసం చేయడం.. అనంతరం డిజైన్‌టెక్ అనే కంపెనీ ద్వారా త్రైపాక్షిక ఒప్పందంగా మార్చడం అంతా కూడా ప్రజాధనాన్ని దోచేందుకు వేసిన పన్నాగమే. ఇదంతా పూర్తి ఆధారాలతో బయటపడిన విషయాన్ని లోకేశ్ గుర్తించాలి.

> నిబంధనలకు విరుద్ధంగా రూ.371 కోట్లు చెల్లించాలని చంద్రబాబు ఆర్థిక శాఖ అధికారులను ఆదేశించడం వాస్తవం కాదా? ఆ విధంగా చెల్లించిన నిధులు షెల్ కంపెనీల ద్వారా హైదరాబాద్ జూబ్లీ హిల్స్‌లోని చంద్రబాబు నివాసానికి చేరడం సీఐడీ దర్యాప్తులో వెల్లడి కావడం నిజం కాదా?

> అసలు చంద్రబాబుకు ఐటీ శాఖ ఎందుకు నోటీసులు జారీ చేసిందో సమాధానం చెప్పగలరా?



OFFICE OF THE ASSISTANT COMMISSIONER OF INCOME TAX, CENTRAL CIRCLE 2(4) HYDERABAD

SHOW CAUSE NOTICE

1.1 The main contention in all the letters cited above is as per the scrutiny guidelines notice u/s.143(2) /notice u/s.142(1) should be issued by jurisdictional Assessing Officer whereas notice u/s.143(2) was issued by this office which was not correct in your opinion as it should have been issued by the jurisdictional Assessing Officer before the case is transferred to this office u/s.127.

1.2 From a perusal of the arguments put forth by you and also a cursory look at the scrutiny guidelines quoted, it is understood that as per the scrutiny guidelines, wherein it is mentioned that notice u/s.143(2) / u/s.142(1) should be issued by JAO before the case is transferred u/s.127 to Central Circle AO, the opinion expressed by you is not correct. It is pertinent to mention here that nowhere in the scrutiny guidelines, it was mentioned that notice u/s 153C should also be issued by the JAO

చంద్రబాబుకు ఆదాయపన్ను శాఖ జారీ చేసిన నోటీసులు



SIEMENS

February 3, 2022

1 / 4

స్కిల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ ప్రాజెక్ట్‌కు తమకు సంబంధం లేదని స్పష్టం చేస్తూ సీమెన్స్ కంపెనీ పంపిన ఈ-మెయిల్

మేనేజ్ చేయటంలో దిట్ట మీ బాబే

- 40 ఏళ్లుగా చంద్రబాబు కంటే బాగా వ్యవస్థలను మేనేజ్ చేయగల వ్యక్తి దేశంలోనే కాదు ప్రపంచంలోనే ఎవరూ లేరు. వ్యవస్థలను మేనేజ్ చేయడం ద్వారానే మీ బాబు చంద్రబాబు టీడీపీ వ్యవస్థాపకుడు ఎన్టీఆర్‌కు వెన్నుపోటు పొడిచి, అడ్డదారిలో సీఎం పదవి దక్కించుకున్నారు. టీడీపీని, ఆ పార్టీ గుర్తును, ట్రస్టును కూడా కొట్టేశారు.
- వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిపై కాంగ్రెస్ పార్టీతో కలసి అక్రమ కేసులు పెట్టించింది చంద్రబాబే అన్నది ప్రజలకు తెలుసు. ఆనాడు కాంగ్రెస్‌తో కలిసి చంద్రబాబు వ్యవస్థలను మేనేజ్ చేసిన విషయం తెలియదా లోకేశ్? వైఎస్ జగన్‌పై కాంగ్రెస్ పెట్టిన అక్రమ కేసుల్లో టీడీపీ నేతలు అశోక్ గజపతిరాజు, ఎర్రన్నాయుడు ఇంప్లీడ్ అయ్యారనే విషయం తెలియదా? బాబులా మేనేజ్ చేయాల్సిన అవసరం సీఎంకు, వైఎస్సార్‌సీపీకి లేదు.
- లోకేశ్ 35 రోజులు ఢిల్లీలో ఎందుకు ఉన్నారు. పైగా కేంద్ర హోమ్ మంత్రి అమిత్ షానే తనను పిలిపించుకున్నారని అబద్ధాలు చెప్పారు. కానీ ఆయన పదే పదే అడిగితేనే అమిత్ షా అపాయింట్‌మెంట్ ఇచ్చారని కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి చెప్పడంతో అసలు బండారం బయటపడింది. అబద్ధాలు చెప్పడం, గోబెల్స్ ప్రచారంలో లోకేశ్.. తండ్రి చంద్రబాబును మించిపోయారు.



స్కిల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ స్కామ్ కేసులో నలుగురు నిందితులను అరెస్టు చేసినట్లు ఈడీ జారీ చేసిన ప్రకటన

చంద్రబాబుకు లోకేశ్‌తోనే ముప్పు

- చంద్రబాబుకు ఏదైనా ముప్పు ఉంటే అది లోకేశ్‌తోనే ఉండొచ్చు. చంద్రబాబు ఎన్టీఆర్‌ను వెన్నుపోటు పొడిచి ఆయన చావుకు కారణం అయినట్టే.. ప్రస్తుతం చంద్రబాబుకు లోకేశ్ వెన్నుపోటు పొడిచే అవకాశాలున్నాయి.
- చంద్రబాబును అరెస్ట్ చేసిన సీఐడీ అధికారుల కాల్ డేటా ఎందుకోసం? పోలీసుల కాల్ డేటాతో చంద్రబాబుకు ఏం సంబంధం? దర్యాప్తు అధికారులు విచారణ ప్రక్రియలో భాగంగా ఉన్నతాధికారులతో మాట్లాడతారు. ఆ కాల్ డేటాను టీడీపీకి ఎందుకు ఇవ్వాలి. జైలు అధికారులతో మాట్లాడాల్సిన అవసరం ప్రభుత్వ సలహాదారు సజ్జల రామకృష్ణారెడ్డికి లేదు. జైల్లో చంద్రబాబు ఆరోగ్యాన్ని వైద్యులు 24 గంటలూ పర్యవేక్షిస్తున్నారు.

టీడీపీ డైవర్షన్ పాలిటిక్స్

రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన సామాజిక సాధికార యాత్ర నుంచి ప్రజల దృష్టిని మళ్లించేందుకే లోకేశ్ నిరాధార ఆరోపణలు చేస్తున్నారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్ నాయకత్వంలో ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ, ఇతరత్రా పేదలకు ప్రభుత్వం చేస్తున్న మేలును ఈ యాత్రలో వివరిస్తుంటే సర్వత్రా ప్రజలు బ్రహ్మరథం పడుతున్నారు. దీన్ని చూసి ఓర్వ లేకే టీడీపీ డైవర్షన్ పాలిటిక్స్ చేస్తోంది. ఈవెంట్ మేనేజ్‌మెంట్ తప్ప చంద్రబాబుకు ప్రజలకు మేలు చేయడం అన్నది తెలియదు. ఆయన ఒక్క ఎన్నికల్లో అయినా పొత్తు లేకుండా గెలిచారా? గత ఎన్నికల్లో టీడీపీకి కేవలం 23 సీట్లు వచ్చాయి. చివరికి లోకేశ్‌ను కూడా గెలిపించుకోలేకపోయారు.

ఐటీ శాఖ ప్రశ్నించడం వాస్తవం కాదా?

- స్కిల్ స్కామ్ కేసులో విచారణకు సీఐడీ నోటీసులు జారీ చేయగానే చంద్రబాబు తన పీఎస్ పెండ్యాల శ్రీనివాస్, షాపూర్జీ-పల్లోంజీ కంపెనీ ప్రతినిధి వాసుదేవ్ పార్థసానిలను ఎందుకు విదేశాలకు పంపించారో సమాధానం చెప్పగలవా లోకేశ్?
- అమరావతిలో తాత్కాలిక సచివాలయం భవనాల నిర్మాణం, టిడ్కో ప్రాజెక్ట్‌ల టెండర్ల కేటాయింపులో కాంట్రాక్ట్ సంస్థల నుంచి ముడుపులు తీసుకున్నందుకే చంద్రబాబుకు నోటీసులు ఇచ్చినట్టు ఐటీ శాఖే వెల్లడించింది. తమకు హైదరాబాద్ జూబ్లీ హిల్స్ బ్రాంచి అధికారులు నోటీసులు ఇవ్వాలి తప్ప.. ఢిల్లీ ఆఫీసు వారు కాదని చంద్రబాబు చేసిన వాదనను ఐటీ శాఖ కొట్టి పారేసింది. లెక్కల్లో చూపని రూ.118 కోట్ల ఆదాయానికి ఆధారాలు చూపాలని ఐటీ శాఖ ప్రశ్నించడం వాస్తవం కాదా లోకేశ్?

ఫుట్‌బాల్‌కూ ప్రాధాన్యత

ఏపీ ఫుట్‌బాల్ అసోసియేషన్ అధ్యక్షుడు, ఏలూరు ఎంపీ కోటగిరి శ్రీధర్

యలమంచిలి(అనకాపల్లి రూరల్)

క్రికెట్‌తో పాటు రాష్ట్రంలో ఫుట్‌బాల్ క్రీడకూ సమాన ప్రాధాన్యత కల్పిస్తున్నామని ఏపీ ఫుట్‌బాల్ అసోసియేషన్ అధ్యక్షుడు, ఏలూరు ఎంపీ కోటగిరి శ్రీధర్ తెలిపారు. అనకాపల్లి జిల్లా యలమంచిలిలోని రాజీవ్ క్రీడా మైదానంలో ఆదివారం యలమంచిలి-విశాఖపట్నం జట్ల మధ్య జరిగిన ఫుట్‌బాల్ ఎగ్జిబిషన్ మ్యాచ్‌ను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా కోటగిరి శ్రీధర్ మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లో ప్రతిభావంతులైన ఫుట్‌బాల్ క్రీడాకారులను గుర్తించి, వారికి మంచి తర్ఫీదు ఇవ్వడమే లక్ష్యంగా పనిచేస్తున్నామని తెలిపారు. ప్రపంచంలో అత్యంత ఆదరణ కలిగిన ఫుట్‌బాల్‌కు మన దేశంలో ఆదరణ తక్కువగా ఉందని, దీనిని పెంచడానికి ఏపీ ఫుట్‌బాల్ అసోసియేషన్ స్పష్టమైన కార్యాచరణతో ముందుకు వెళుతోందని తెలిపారు. భవిష్యత్‌లో రాష్ట్రం నుంచి ప్రపంచస్థాయి క్రీడాకారులను తయారుచేసేందుకు కృషి చేయనున్నట్టు చెప్పారు. ఆసక్తి ఉన్న గ్రామీణ ప్రాంతాల క్రీడాకారులకు తమవంతు సహాయ, సహకారాలు అందజేస్తామని ఆయన హామీ ఇచ్చారు. అంతకుముందు స్థానిక రాజీవ్ క్రీడా మైదానంలో యలమంచిలి, విశాఖ జట్ల క్రీడాకారులను పరిచయం చేసుకున్న శ్రీధర్ రెండు జట్ల మధ్య నిర్వహించిన ఎగ్జిబిషన్ మ్యాచ్‌ను తిలకించారు. ఈ కార్యక్రమంలో ఏపీ ఫుట్‌బాల్ అసోసియేషన్ హెడ్ ఆఫ్ ఆపరేషన్స్ ఆర్ రాజేష్, కోనసీమ ఫుట్‌బాల్ అసోసియేషన్ అధ్యక్షుడు నీలాద్రి, ఎస్ఐఎస్ చీఫ్ కోచ్ ఎం.శేషుమోహన్, ఉత్తరాంధ్ర కో ఆర్డినేటర్ ఎస్‌జీ రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.



యలమంచిలిలో ఫుట్‌బాల్ మ్యాచ్ చూస్తున్న ఎంపీ కోటగిరి శ్రీధర్, ప్రజాప్రతినిధులు

పునాదులు కూలి పెడబొబ్బలు

▶ మొదటి పేజీ తరువాయి

వాటాలు పంచుకున్న ముఠాలకు ఈ విషయాలు బాగా తెలుసు. ఎన్టీఆర్‌కు వెన్నుపోటు పొడిచి ఆయన పార్టీని, కుర్చీని, ఆస్తులను లాక్కున్న వారు ఇవాళ వ్యవస్థల గురించి మాట్లాడుతుంటే నవ్వు వస్తోంది. రాజమండ్రి సెంట్రల్ జైలు బయట కల్లు తాగిన కోతిలా, తేలు కుట్టిన దొంగలా అరుస్తున్న లోకేశ్ వ్యవస్థల్ని మేనేజ్ చేయటానికే దాదాపు నెల రోజులపాటు ఢిల్లీ వెళ్లాడు. ఇందుకు పురందేశ్వరి సహకారం అందిస్తోంది. ఆమెకు కన్నతండ్రి కంటే మరిదిపై మమకారం ఎక్కువైపోయింది. ఏపీ బీజేపీని ఆమె చంద్రబాబు కుటుంబానికి ఓ అనుబంధ విభాగంలా మార్చేసింది. కేంద్ర హోంమంత్రి అమిత్ షా తనను పిలిపించుకున్నట్లు లోకేశ్ పచ్చి అబద్ధాలు చెబుతుంటే పార్టీ పరువు కాపాడాలనే ఉద్దేశం ఆమెకు ఏ కోశానా లేనట్లుంది. లోకేశ్, చంద్రబాబు కోసం రాజకీయాలు నడిపే ఓ పచ్చి స్వార్థపరురాలిని ఆ పదవిలో కొనసాగించవచ్చా? అనేది బీజేపీ నేతలంతా ఆలోచించాలి. కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి వెల్లడించిన వాస్తవాలతో వ్యవస్థల మేనేజ్‌మెంట్‌లో చంద్రబాబు, పురందేశ్వరి ఉమ్మడి నాటకం బయటపడింది. లోకేశ్ ఒక పక్కన బీజేపీకి కన్ను కొడుతూ మరోవైపు కాంగ్రెస్‌కు కన్ను గీటినట్లు వెల్లడైంది. ఇదీ టీడీపీ రెండు కళ్ల సిద్ధాంతం.

బాబు 'మేనేజ్‌మెంట్'పై విచారించాలి

దేశ న్యాయ వ్యవస్థను మేనేజ్ చేసేందుకు 30 ఏళ్లుగా చంద్రబాబు చేసిన ప్రయత్నాలను న్యాయ కోవిదులంతా చెబుతారు. దీనిపై న్యాయ విచారణ జరిపితే చంద్రబాబుకు మించిన క్రిమినల్ మరొకరు లేరని అందరికీ తెలుస్తుంది. జైలు బయట లోకేశ్ చెవి కోసిన మేకలా అరిచినంత మాత్రాన తన తండ్రి చేసిన వెయ్యి పాపాలు నాలుగు సినిమా డైలాగులతో మాఫీ కావు. 45 ఏళ్ల పాపాలపై ఎలాంటి విచారణ జరగకుండా ఒక మనిషి తప్పించుకుంటే ఈ దేశంలో చట్టం, న్యాయస్థానాలపై నమ్మకం పెరుగుతుందా? ప్రతి ఎన్నికలోనూ చంద్రబాబును ప్రజలు ఛీత్కరిస్తుంటే కొన్ని ప్రేరేపిత వర్గాలు ఖమ్మం, నిజామాబాద్, కూకట్‌పల్లి, హైటెక్ సిటీ, అమెరికా, యూకేలో హడావుడి చేస్తున్నాయి. ఎస్సీల్లో పుట్టాలని ఎవరైనా కోరుకుంటారా? తోకలు కత్తిరిస్తా.. తాటతీస్తా! అంటూ బడుగు బలహీన వర్గాలను అవమానించడంతో పాటు దేశ ద్రోహం కేసులు బనాయించి మైనార్టీలను అవమానించిన చరిత్ర చంద్రబాబుదే. మంత్రివర్గంలో స్థానం కల్పించకుండా గిరిజనులను చిన్నచూపిన చూసిన ఆయనకు ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ వర్గాలపై ప్రేమ ఎందుకు ఉంటుంది?.

నేటి భవితలో..

- టాప్ స్టోరీ:
  యూసీడ్ 2024: ఐఐటీల్లో డిజైన్ కోర్సులు
  అండర్ గ్రాడ్యుయేట్ కామన్ ఎంట్రన్స్ ఎగ్జామ్ ఫర్ డిజైన్.. సంక్షిప్తంగా యూసీడ్! దేశంలో సాంకేతిక విద్యకు పేరు గడించిన ఐఐటీ క్యాంపస్‌ల్లో.. బ్యాచిలర్ ఆఫ్ డిజైన్ కోర్సుల్లో.. ప్రవేశానికి నిర్వహించే పరీక్ష ఇది. డిజైన్ రంగంలో అడుగు పెట్టాలనుకునే వారికి చక్కటి మార్గం.. యూసీడ్!! ఇందులో సాధించిన స్కోర్ ఆధారంగా నాలుగు ఐఐటీలు, ట్రిపుల్‌ఐటీడీఎం -జబల్‌పూర్‌లో బీ.డిజైన్ కోర్సుల్లో అడ్మిషన్ లభిస్తుంది. తాజాగా యూసీడ్-2024 నోటిఫికేషన్ వెలువడింది. ఈ నేపథ్యంలో.. యూసీడ్‌తో ప్రయోజనాలు, అర్హతలు, పరీక్ష విధానం, ఎంట్రెన్స్‌లో రాణించేందుకు గైడెన్స్..
- **గ్రూప్1, గ్రూప్2 ప్రత్యేకం-కరెంట్ అఫైర్స్:** సివిల్స్, గ్రూప్స్ వంటి పోటీ పరీక్షల అభ్యర్థులకు ప్రయోజనం చేకూర్చేలా.. అంతర్జాతీయం, జాతీయం, రాష్ట్రీయం, వార్తల్లో వ్యక్తులు, ఎకానమీ, సైన్స్ అండ్ టెక్నాలజీ, స్పోర్ట్స్ తదితర తాజా పరిణామాలతో వీక్లీ కరెంట్ అఫైర్స్ రౌండ్ అప్..
- విద్య, ఉద్యోగ సమాచారం

నేటి భవిత పేజీ కోసం ఈ క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి

నా అజ్ఞానపు వాస్తవం తప్ప,
నాకు ఇంకేమీ తెలియదు.
– డైయొజినీజ్

సాక్షి
సోమవారం, 30 అక్టోబర్ 2023

మాటలంటే మాటలా!

మాటలదేముంది మాటలే కదా అని తేలికగా తీసిపారేయలేము. మాటలు కేవలం మాటలే కావచ్చు గాని, మాటలంటే మాటలు కాదు. లోకంలో మాటలు నేర్చిన జీవులు మనుషులే! తాము నేర్చిన మాటలను ఊసుపోక శుక పికాదులకు నేర్పించిన ఘనత కూడా మనుషులకే దక్కుతుంది గాని, అది వేరే విషయం. మాటల మహిమను వర్ణించాలంటే మాటలు చాలవు. మాటకారులు ఎలాంటి పరిస్థితుల్లోనైనా ఇట్టే నెట్టుకొచ్చేయగలరు. అసాధ్యమనుకున్న పనులను చిటికెలో చక్కబెట్టగలరు. మాటకారులైన దౌత్యవేత్తలు మాటలతో యుద్ధాలను కూడా నివారించగలరు.

మాటల మహత్తును ఒక పూర్వకవి ఇలా వర్ణించాడు: 'మాటల చేత దేవతలు మన్నన జేసి వరంబు లిత్తురా/ మాటల చేత భూపతులు మన్నన జేసి పురంబు లిత్తురా/ మాటల చేత మానినులు మన్నన జేసి మనంబు లిత్తురా/ మాటలు నేర్వకున్న నవమానము, న్యూనము, మానభంగమున్'. చక్కగా మాట్లాడటం చేతనైతే దేవతలను; భూపతులను; మానినులను సైతం మెప్పించి, వారి ద్వారా కోరిన ప్రయోజనాలు పొందడం సాధ్యమవుతుంది. సక్రమంగా మాట్లాడటం చేతగాకుంటే చీవాట్లు, శిక్షలు తప్పకపోవచ్చు. నలుగురిలోనూ నవ్వుల పాలయ్యే పరిస్థితులు కూడా తప్పకపోవచ్చు.

మాటకారితనానికి మారుపేరుగా వెలిగిన మహానుభావులు చరిత్రలో చాలామంది ఉన్నారు. అక్బర్ ఆస్థానంలోని బీర్బల్, శ్రీకృష్ణదేవరాయల వారి ఆస్థానంలోని తెనాలి రామకృష్ణుడు వంటి వారు ఆ కోవలోకే వస్తారు. వారి మాటకారితనాన్ని ఇప్పటికీ జనాలు కథలు కథలుగా చెప్పుకుంటూనే ఉన్నారు. కొందరు ముక్తసరిగా మాట్లాడతారు. కొందరు ఆచి తూచి తూకం వేసినట్లుగా మాట్లాడతారు. కొందరు గలగలా ధారాళంగా మాట్లాడతారు. కొందరు రసజ్ఞులు సరసంగా మాట్లాడతారు. రసజ్ఞత బొత్తిగాలేని కొందరు విరసంగా మాట్లాడతారు. కొందరు నిష్ఠురంగా మాట్లాడతారు. 'నరుడు మదిలో దొంగ/ నాల్క బూతులబుంగ/ కడుగజాలదు గంగ' అన్నారు ఆరుద్ర. అదేం కర్మమోగాని కొందరు నోరు తెరిస్తే చాలు, బూతులతో మోత మోయిస్తారు. ఇటీవలి రాజకీయాల్లో ఇలాంటివారి వాగ్ధాటి విపరీతంగా మార్మోగుతోంది.

కొందరు మాటలతోనే కోటలు కట్టేస్తుంటారు కొందరి మాటలు కోటలు దాటేస్తుంటాయి. అలాంటివారు రాజకీయాల్లో అమోఘంగా రాణిస్తుంటారు. 'ఏదైనా సభలో ఆశువుగా మాట్లాడటానికి ముందు నేను కనీసం మూడువారాల పాటు సాధన చేస్తాను' అని చెప్పుకున్న మార్క్ ట్వేన్ మన రాజకీయ నాయక దిగ్గజాల ముందు ఎంతటి అర్భకుడో కదా పాపం! మన రాజకీయ నాయకులు అంత శ్రమ లేకుండానే, ఎంత పెద్ద బహిరంగ సభలోనైనా గంటల కొద్ది ఏకధాటిగా ప్రసంగించగలరు. రాజకీయరంగంలోనే కాదు, సాహితీ రంగంలోనూ, ఆధ్యాత్మిక ప్రవచన రంగంలోనూ ఇలాంటి అనర్గళ వాక్ప్రతిభాసంపన్నులు తారసపడుతుంటారు.

మాటలు రకరకాలు. మనుషుల్లో ఎన్ని రకాలో మాటలు కూడా అన్ని రకాలు. హితవైన మాటలు, మధురమైన మాటలు, కల్లబొల్లి మాటలు, సరళమైన మాటలు, పరుషమైన మాటలు, దుందుడుకు మాటలు, ముతక మాటలు, నాజూకు మాటలు, చమత్కారం మాటలు, వెటకారం మాటలు– చెప్పుకుంటూ పోతే జాబితా చేంతాడంతవుతుంది. మనది ప్రజాస్వామ్యం. అందువల్ల మనకు మాట్లాడుకునే స్వేచ్ఛ ఉంది. మన రాజ్యాంగం ప్రకారం 'వాక్స్వాతంత్య్రం' మన ప్రాథమిక హక్కుల్లో ఒకటి. దురదృష్టవశాత్తు జనాలు అతిగా దుర్వినియోగం చేసుకునే హక్కు కూడా ఇదే! 'ప్రజలు వాక్స్వాతంత్య్రాన్ని ఎందుకు కోరుకుంటారంటే, దాన్ని ఆలోచనా స్వాతంత్య్రానికి ప్రత్యామ్నాయంగా భావిస్తారు. ఆలోచనా స్వాతంత్య్రాన్ని దాదాపుగా వారు ఎప్పుడూ ఉపయోగించుకోరు' అని డేనిష్ కవి, తత్త్వవేత్త సోరెన్ కీర్కెగార్డ్ వాక్స్వాతంత్య్రాభిలాష వెనుకనున్న మతలబును రెండు శతాబ్దాల కిందటే తేటతెల్లం చేసేశాడు.

మాటలు నోటి ద్వారా వెలువడతాయి. అంతమాత్రాన మాట్లాడటానికి నోరు మాత్రమే ఉంటే సరిపోదు. మాట్లాడటానికి ఆలోచన అవసరం. అనాలోచితంగా మాట్లాడే మాటలు ఒక్కోసారి చిక్కుల్లోకి నెడతాయి. 'వివేకవంతులు తమ మాటలను ఆలోచనలతో జల్లెడ పడతారు' అన్నాడు బుద్ధుడు. కాకపోతే సమాజంలో వివేకవంతుల సంఖ్య ఎప్పుడూ పరిమితమే! అరకొర జ్ఞానంతో అల్లాడే వాక్శూరులు వినేవాళ్లను వెర్రిగొర్రెల్లా లెక్కగట్టి చేటభారతాలు చెప్పుకుంటూ పోతారు. వారి వాక్స్వాతంత్య్రాన్ని ఎవరూ హరించలేరు గాని, అమెరికా మాజీ ప్రధాన న్యాయమూర్తి వారెన్ ఇ బర్గర్ అన్నట్లుగా 'వాక్స్వాతంత్య్రంలో శ్రవణ స్వాతంత్య్రం కూడా మిళితమై ఉంటుంది' అనే వాస్తవాన్ని గుర్తెరగాలి. అప్పుడే వాక్స్వాతంత్య్రాన్ని సద్వినియోగం చేసుకోగలుగుతాం.

మనకు బహుభాషా పరిజ్ఞానం ఉంటే ఉండవచ్చు; అపారమైన పదసంపద ఉండవచ్చు; అనర్గళ వాగ్ధార ఉండవచ్చు. అంతమాత్రాన అనాలోచితంగా నోటికి ఎంతొస్తే అంత మాట్లాడుతూ పోతే శృంగభంగం తప్పదు. అసలే ఇది మనోభావాల కాలం. ఏ మాట ఎలాంటి విపరిణామాలకు దారితీస్తుందో అనేదానిపై కనీసమైన అంచనా మాట్లాడే ముందే ఉండాలి. ఎంతటి భాషావేత్తలయినా మాటలను ఆచి తూచి ఉపయోగించాలి. మాటల గురించి ఇన్ని మాటలు ఎందుకంటే, 'ఆది నుంచి ఆకాశం మూగది/ అనాదిగా తల్లి ధరణి మూగది/ నడుమ వచ్చి ఉరుముతాయి మబ్బులు/ నడమంత్రపు మనుషులకే మాటలు– ఇన్ని మాటలు' అని సెలవిచ్చారు వేటూరి. అదీ సంగతి. మరి మాటలంటే మాటలా!

పోయినవాళ్లు మిగిల్చేవి జ్ఞాపకాలే!

కామెంట్



కరణ్ థాపర్

ఇటీవల మరణించిన క్రికెటర్ బిషన్ సింగ్ బేడీ ఉల్లాసంగా ఉండేవారు. ఆయన భావోద్వేగాలు పారదర్శకంగా ఉండేవి. మంచి సంభాషణను ఇష్టపడతారు. మాట్లాడినదంతా ఓపిగ్గా వింటారు. ఆపలేనంతగా మాట్లాడుతూనే ఉంటారు. మరో క్రికెటర్ స్నేహితుడు టైగర్ పటౌడీలో ఆహ్లాదం కలిగించే హాస్యస్ఫూర్తి ఉంటుంది. అది అచ్చమైన బ్రిటిష్ నుడికారంతో కూడిన వెటకారం. పడాల్సిన చోట, పడాల్సిన మాటను సమయానికి, సందర్భానికి తగినట్లుగా తనదైన శైలిలో తటాలున జారవిడుస్తారు. మరో క్రికెట్ దిగ్గజం అబ్బాస్ అలీ బేగ్ లోతైన రాజకీయ అవగాహనను కలిగి ఉండేవారు. టైగర్, బిషన్ ఇప్పుడు మనతో లేరు. స్నేహితులకు సంబంధించిన ముఖ్యమైన విషయాలలో తరచు మనలో కదలాడేది వారి జ్ఞాపకాలే.

నేను క్రికెట్ అభిమానిని కాదన్న సంగతి రహస్యమేమీ కాదు. నిజానికి ఆ ఆట నాకు అర్థమయ్యేది కాదు. ఎప్పుడో గాని చూడను కూడా. ఫలితంగా చాలా మంది క్రికెటర్లు నాకు తెలియదు. కానీ గొప్ప జ్ఞాన గాంభీర్యంతో నేను క్రికెట్ చర్చలకు తెగించినప్పుడు, తెలిసీ తెలియని విషయ సమాచారంతో బుద్ధిహీనమైన ప్రశ్నలు సంధించినప్పుడు పదే పదే నన్ను గట్టున పడేసిన వారిలో నేను స్నేహితులుగా పరిగణించే క్రికెటర్లు ముగ్గురున్నారు. వారు – టైగర్ పటౌడీ, బిషన్ సింగ్ బేడీ, అబ్బాస్ అలీ బేగ్.

బాధాకరం... టైగర్(2011లో మరణించారు), బిషన్ ఇప్పుడు మనతో లేరు. బగ్గీ (అబ్బాస్ అలీ బేగ్) ఈ మధ్యే తన భార్య వినూ (వినూ మీర్‌చందానీ)ను కోల్పోయారు. గత సోమవారం (23 అక్టోబర్) నాటి బిషన్ సింగ్ మరణం ఈ ముగ్గురు స్నేహితుల జ్ఞాపకాలను తిరిగి తెచ్చిపెట్టింది. వారి గౌరవార్థం, ఆ జ్ఞాపకాలను మీతో పంచుకోవాలని అనుకుంటున్నాను.

టైగర్‌కు నా క్రీడా పరిజ్ఞానం అంతంత మాత్రమేనని తెలుసు. ఒక్క టీవీ స్టూడియోలో తప్ప, ఆయన నా ముఖంపై కోడిగుడ్లు పగిలే అవకాశం ఉన్న పరిస్థితికి నన్ను వదిలేయకుండా మా సంభాషణను సున్నితంగా, నేర్పుగా నాకు నచ్చిన విషయాల వైపు మళ్లించేవారు. తరచు ఆ మళ్లింపు నేను ధరించిన టై గురించిన పొగడ్త అయివుండేది. వివేచనను అభిరుచిగా కలిగిన వ్యక్తి ఆయన. కనుక ఆయన మెచ్చుకోలు నన్ను అదే టైని మళ్లీ మళ్లీ ధరించేలా చేసేది. ఒక సందర్భంలో తొలిసారిగా ఆయన తన కనుబొమ నొకదాన్ని ఎగరేస్తూ, నెమ్మదైన స్వరంతో... "మీరు ఆ టై ధరించడం ఇది మూడోసారి!" అని అనేంతవరకు ఆ టైని నేను వదిలిపెట్టలేదు.

టైగర్‌లో ఆహ్లాదం కలిగించే హాస్యస్ఫూర్తి కూడా ఉంది. అది అచ్చమైన బ్రిటిష్ నుడికారంతో కూడిన వెటకారం. పడాల్సిన చోట, పడాల్సిన మాటను సమయానికి, సందర్భానికి తగినట్లుగా తనదైన శైలిలో తటాలున జారవిడుస్తారు.

బిషన్ చాలా భిన్నమైనవారు. ఉల్లాసంగా ఉండేవారు. ఆయన భావోద్వేగాలు, అంతర్గత భావాలు తరచు పారదర్శకంగా, పైకి కనిపించేలా ఉండేవి. మంచి సంభాషణను ఆయన ఇష్టపడతారు. మాట్లాడినదంతా ఓపికగా వింటారు. అలాగే ఆపలేనంతగా మాట్లాడుతూనే ఉంటారు.



మన్సూర్ అలీ ఖాన్ పటౌడీ



బిషన్ సింగ్ బేడీ



అబ్బాస్ అలీ బేగ్

మేము తరచు బగ్గీ, వినూ వాళ్లింట్లో కలుసుకునేవాళ్లం. మేడపైన మాటల్లో మునిగిపోయేవాళ్లం. 'ప్రస్తుత రాజకీయ పరిస్థితిపై మీ ఆలోచనలు ఏమిటి' అని బగ్గీ నన్ను అడిగేవారు. అయితే రాజకీయాలను ఆయన నాకంటే బాగా అర్థం చేసుకున్నారని నాకు అర్థమయ్యేందుకు ఎక్కువ సమయం పట్టేది కాదు. నేను చెప్పేది వినేవారు. నా గ్రహింపులో లేని లోతైన గమనింపుల గురించి చెప్పి నన్ను ఉల్లాసపరిచేవారు.

ముగ్గురిలోకి బగ్గీ ఎక్కువగా తటపటాయింపుతో ఉండేవారు. వినూ అప్పుడు ఆ సంకోచాల నుంచి ఆయన్ని కాపాడేందుకు ముందుకొచ్చేవారు. ఆమె చురుకైనవారు. సంభాషణ ప్రియత్వం కలిగినవారు. విలాసవంతమైన జీవనశైలిని ఆస్వాదించే స్నేహశీలి. అతిథులను ఆదరించే అద్భుతమైన మహిళ. రుచిగా వండినంత మాత్రానే కాదు, అతిథుల సన్నిధి ఆమెను ఉల్లాసపరచడం వలన కూడా వారింట్లో భోజనం ఆరగించడం అన్నది ఒక సంతుష్టికరమైన భావనను కలిగించేది. తన స్నేహితుల సమక్షంలో ఆమె అపరిమితమైన సంతోషంతో ఉండేవారు.

నేనిది రాస్తున్న సమయానికి, స్నేహితులకు సంబంధించిన ముఖ్యమైన విషయాలలో తరచు మనలో కదలాడేది వారి జ్ఞాపకాలే నన్న మెలకువను కూడా మొత్తంగా నేను కలిగి ఉన్నాను. మీరు నెలలు లేదా ఏళ్లపాటు కలుసుకుని ఉండకపోవచ్చు. మిమ్మల్ని సముద్రాలు, తరచు రాసుకోని ఉత్తరాలు వేరు చేస్తుండొచ్చు. అయితే ఆ దూరమే మిమ్మల్ని కలిపి ఉంచే జ్ఞాపకాలను శక్తిమంతం చేస్తుంది. కాలక్రమేణా ఆ జ్ఞాపకాలు తమ సొంత అస్తిత్వాన్ని ఏర్పరచుకుంటాయి. ఇప్పుడు టైగర్, బిషన్, వినూ గురించి నాకు మిగిలింది జ్ఞాపకాలు మాత్రమే! ఆ ముగ్గురూ నాకు దూరమయ్యాక తమవైన స్థానాలను నాలో ఏర్పరచుకున్నారు.

ఒక అర్థంలో నేను స్పష్టమైన దానిని చెబుతున్నాను. అలాగే, మరొక విషయం కూడా చెబుతాను. మనుషులు చనిపోయినప్పుడు మాత్రమే మళ్లీ ఇక వారిని కలవలేం అన్న భావనలో మనం మునిగిపోతాం. అప్పుడు వారి జ్ఞాపకాలు వేరే భిన్నమైన స్థాయిని పొందుతాయి. బతికున్నవాళ్లను – రేపో, తర్వాతి వారమో, ఫోన్ కాల్‌లోనో, ఈమెయిల్ ద్వారానో – జ్ఞాపకం చేసుకున్నట్లుగా అది ఇకపై ఉండదు. ఇప్పుడిక మీకున్నవన్నీ కేవలం జ్ఞాపకాలే! ఒక సమావేశం, ఒక సంభాషణ, ఒక ఈమెయిల్ అన్నది ఇక ఎప్పటికీ సంభవించనివే!

అనేకమైన ఈ ఆలోచనలు నిస్సందేహంగా వయసు నిర్దేశించినవే. అది అనివార్యం. నిజాయతీగా చెప్పాలంటే 34 ఏళ్ల క్రితం నా భార్య నిషా చనిపోయినప్పుడు కూడా పూర్తి భిన్నంగా ఏమీ లేదు. 2015లో మా అమ్మ చనిపోయినప్పుడు కూడా! లేదా నేను సన్నిహితంగా ఉన్న మరెవరి విషయంలోనైనా! నా చిన్నతనంలో నేను జ్ఞాపకాలు ఎలా జనిస్తాయి, ఎలా రూపాంతరం చెందుతాయి అనే ఆలోచనను కలిగిలేను. ఇటీవల కొద్ది వారాల తేడాతో సంభవించిన వినూ, బిషన్ మరణాలు నాలో ఆ స్పృహను కలిగించాయి.

ప్రియ మిత్రమా! నా ఉద్దేశం మనో దౌర్బల్యం లోనికో, తాత్విక చింతన లోనికో జారుకోవడం కాదు. ఆనందకరమైన జ్ఞాపకాలతోనే నేను మొదలయ్యాను. కానీ నేను చెప్పాలని భావించిన దానికంటే విచారంగా ముగించినట్లున్నాను. అంటుంటారు కదా: ఇదే జీవితం!

వ్యాసకర్త సీనియర్ జర్నలిస్ట్

సోషల్ మీడియా

సోషల్ నెట్ వర్కింగ్ వెబ్‌సైట్లు ఫేస్‌బుక్, ట్విట్టర్‌లలో సెలబ్రిటీల 'మనసులోని మాట'లు తాజాగా ఇలా...!

ఆగని దుఃఖం



ఒక పాలస్తీనియన్‌గా ఉండటం ఎంత బాధాకరమో ఎవరికీ అర్థం కాదు. నేను దుఃఖిస్తున్నాను. నన్ను నేను ఊరడించుకోలేను. వాళ్లు నా జనాన్ని తుడిచిపెడుతున్నారు. ఒక వైపే సైన్యం ఉన్నప్పుడు దాన్ని యుద్ధం అనరు!

– కరీమ్ వఫా అల్-హుస్సేనీ, రచయిత

జోస్యం



2016 ఎన్నికల సమయంలో యూఎస్‌లో పనిచేస్తున్నాను. డెమోక్రాట్లకు ఓటు వేసే స్నేహితులకు... ఎందుకో ట్రంప్ (రిపబ్లికన్) గెలుస్తాడన్న చెడ్డ ఫీలింగ్ వస్తోందని చెప్పేవాడిని. కానీ వాళ్లు నన్ను పిచ్చోడి కింద జమకట్టారు. అయితే చాలామంది క్లింటన్ (హిల్లరీ)ను ద్వేషించి, ఆమెకు ఓటు వేయడానికి నిరాకరించారు. ఇక వచ్చే 2024లో డెమోక్రాట్లు (మళ్లీ) ఎందుకు ఓడిపోబోతున్నారో కొన్ని వారాలుగా నాకు స్పష్టంగా అర్థమవుతోంది.

– ఆసిఫ్ కపాడియా, దర్శకుడు

ఇదేం తర్కం?



కుర్దుల ఊచకోత, తమ కోసం ఒక సొంత నేల ఉండాలన్న వారి పోరాటాన్ని ముస్లిం ప్రపంచం ఏనాడూ పట్టించుకోలేదు. ముస్లింలు తమ సహ మతస్థులను వధించినప్పుడు ముస్లిం సమాజం నిశ్శబ్దంగా ఉండిపోతుంది. కానీ అదే ఘర్షణ ముస్లింలు, ముస్లిమేతరుల మధ్య అయినప్పుడు మాత్రం... వాటి వెనకుండే భౌగోళిక రాజకీయాంశాలను విస్మరించి మతం పేరుతో ఉన్మత్తతకు లోనవుతారు.

– యూసుఫ్ ఉంర్యూవాలా, స్కాలర్

బాధాకరం



కొన్ని సందర్భాల్లో, మనం జీవితాంతం దేనికోసం పనిచేశామో అదంతా నిరర్థకం అనిపిస్తుంది. మనం విశ్వాసం పెట్టుకున్న ప్రతి సంస్థా తన శక్తిహీనతను చూపుతుంది. మనకు మిగిలివున్నవల్లా... మాట్లాడలేని దుష్టత్వం మీద మన ఆగ్రహం, మన శోకం, మన అరుపు! ఇంకా మనకు మిగిలివున్నదల్లా మన హృదయం.

– శైలజా పటేల్, రచయిత్రి

కదా!



అంపైర్లలో మహిళలు ఎందుకు లేరు? తీర్పులు ఇవ్వడంలో సహజంగానే మహిళలకు మంచి నేర్పు ఉంటుంది కదా!

– రాజేశ్వరి, ఆర్కిటెక్ట్

మహారాజునే!



నేను డబ్బుల విషయంలో జాగ్రత్తగా లేనప్పుడల్లా మా అమ్మ, "నువ్వేమైనా మైసూరు మహారాజు అనుకుంటున్నావా?" అనేది. నేననుకోవడం తమిళుల ఇళ్లలో ఇది సాధారణ సామెత. కానీ వారికి మైసూరు మహారాజు ఎవరో, ఎలా ఉంటాడో తెలుసని అనుకోను. ఇదిగో... ఆయన ఇక్కడున్నారు. ఆయన అందరికీ సంపదను ఆశీర్వదించాలని ప్రార్థిస్తాను. (కృష్ణరాజ వడయార్ విగ్రహంతో ఉన్న ఫొటోను షేర్ చేశారు.)

– రెక్స్ క్లెమెంటైన్, శ్రీలంక క్రికెట్ రచయిత

సింహాళ బౌద్ధానికి పెద్దక్క

శ్రీలంక జనాభా రెండు కోట్లు. ఉత్తరం నుంచి దక్షిణానికి 432 కి.మీ.లుంటే, తూర్పు నుంచి పడమరకు 224 కిలోమీటర్ల దూరం. సముద్రంలో నీటిబొట్టు లాంటి చిన్నదేశం. విస్తీర్ణంలో చిన్నదే కానీ, వైవిధ్యాల సుమహారం. బౌద్ధం జనజీవనాన్ని స్వచ్ఛంగా, నిశ్శబ్దంగా శాసిస్తోంది. బౌద్ధావలంబకులుగా సింహళీయులు ప్రశాంత జీవనాన్ని సాగిస్తుంటారు. బౌద్ధ క్షేత్రాలు ప్రశాంతతకు నిలయాలు. వందలు, వేలాది మంది ఒకే ఆవరణలో నిశ్శబ్దంగా ధార్మిక సాధన చేస్తుంటారు. వాళ్ల వైపు చూస్తే చాలు... స్వచ్ఛంగా నవ్వుతారు. భారతీయులను ఇట్టే పట్టేస్తారు. పుట్టింటికి వచ్చిన పెద్దక్కతో పంచుకుంటున్న ఆత్మీయతను తలపిస్తుంది వాళ్ల అభిమానం. బౌద్ధ భిక్కులు ధ్యాన సంచారులు. మనుషుల మధ్య జీవిస్తున్నప్పటికీ లౌకిక విషయాలతో మమేకమవకుండా నడుస్తున్నప్పుడు కూడా ధ్యానంలోనే ఉంటారు.

శ్రీలంకలో అనూరాధపుర, పొలోన్నరువా, సిగిరియా, దంబుల్లా, కాండీ... ప్రసిద్ధ బౌద్ధ క్షేత్రాలు. మన దేశం నుంచి బౌద్ధం శ్రీలంకలో తొలి అడుగువేసిన నేల – అనూరాధపుర. అశోకుడి కుమార్తె థెరి 'సంఘమిత్ర' శ్రీలంకకు వెళ్తూ బుద్ధుడికి జ్ఞానోదయం అయిన బోధివృక్షం (బోధ్‌గయ) నుంచి ఒక మొక్కను తీసుకుని వెళ్లింది. ఆ మొక్కను సింహళరాజు 'దేవానాంపియ తిస్స' అత్యంత భక్తి ప్రపత్తులతో అందుకుని అనూరాధపురలో నాటాడు. ఆ బోధి వృక్షమే 'జయ శ్రీ మహా బోధి'. ఈ వృక్షానికి వెళ్లే దారిలో దేవానాం పియ తిస్సకు సంఘమిత్ర బోధి మొలకను అందిస్తున్న శిల్పం ప్రాచీన కాలం నాటి భారత్– సింహళ బౌద్ధ బంధానికి ప్రతీక. అశోకుడి కుమారుడు అర్హత్ 'మహేంద్ర' కూడా శ్రీలంకలో బౌద్ధాన్ని వికసింపచేశాడు. మహేంద్ర కోరిక మీద దేవానాంపియ తిస్స నిర్మించిన 'తూపారామ' విహారాయ శ్రీలంకలో తొలి బౌద్ధ స్తూపం. స్తూప ఆరామ... తూపారామగా మారింది. ఈ స్తూపం గంట ఆకారంలో ఉంటుంది.



సింహళ బౌద్ధులు తమ నేల మీద పుట్టని వ్యక్తిని గురువుగా స్వీకరించింది మన తెలుగువాడైన బుద్ధఘోషుడిని మాత్రమే! బుద్ధఘోషుడు రాసిన 'విశుద్ధిమగ్గ' గ్రంథాన్ని ఆచరణీయ కావ్యంగా గౌరవిస్తారు. నాటి ఆత్మీయ బంధాన్ని రెండు దేశాలూ కొనసాగిస్తున్నాయి. రెండు ప్రభుత్వాలూ 1977లో కల్చరల్ ఎక్స్‌ఛేంజ్ ప్రోగ్రామ్ ద్వారా బంధాన్ని పటిష్ఠపరుచుకున్నాయి. ఆ మరుసటి ఏడాది మనదేశంలో ఉన్న బుద్ధుడి అవశేషాలను శ్రీలంకలో ప్రదర్శన పెట్టారు. దేశం దేశమే కదిలి వచ్చిందా అన్నట్లు కోటిమంది దర్శించుకున్నారు. బుద్ధుడికి జ్ఞానోదయం అయిన 2,600 సంవత్సరాల వేడుకలకు కూడా అవశేషాలు మనదేశం నుంచి శ్రీలంకకు వెళ్లివచ్చాయి. తాజాగా 2020లో మనదేశం శ్రీలంకలోని బౌద్ధ క్షేత్రాలు, మ్యూజియమ్‌ల పరిరక్షణ కోసం భారీగా నిధులిచ్చింది. బుద్ధుడు మహా పరినిర్వాణం చెందిన 'కుశి' నగరంలోని విమానాశ్రయాన్ని అంతర్జాతీయ విమానాశ్రయంగా అభివృద్ధి చేయడం రెండుదేశాల మధ్య బౌద్ధ బంధాన్ని పటిష్ఠం చేయడంలో భాగమే! కోవిడ్ సమయంలో భారతీయుల క్షేమాన్ని కూడా కాంక్షిస్తూ శ్రీలంక బౌద్ధులు ప్రార్థనలు చేశారు. వాళ్ల దేశంలో చర్చిలో బాంబుదాడులు జరిగినప్పుడు మన నుంచి అందిన సహాయాన్ని గుర్తు చేసుకుంటారు. సింహళీయులు భారతీయులనూ, భారతీయ కళలను కూడా ప్రేమిస్తారు.

శ్రీలంక ఎగుమతుల్లో 60 శాతం మనదేశానికే వస్తాయి. మన నుంచి వస్త్రాన్ని దిగుమతి చేసుకుని దుస్తులు కుట్టి ప్రాచ్య, పాశ్చాత్యదేశాలకు ఎగుమతి చేస్తోందా దేశం. కొలంబో కేంద్రంగా వ్యాపారం చేస్తున్న బ్రాండిక్స్ కంపెనీ మన విశాఖపట్టణంలో భారీ యూనిట్‌ని స్థాపించి మనవాళ్లకు ఉపాధినిస్తూ వ్యాపారాన్ని విస్తరించుకుంటోంది. ఒక్కమాటలో చెప్పాలంటే సింహళులు మనదేశాన్ని పరాయి దేశంగా చూడరు, తమ ప్రధాన దేశంగా చూస్తారు.

– వాకా మంజులారెడ్డి, జర్నలిస్ట్

ఢిల్లీ పీఠాన్ని బెంబేలెత్తించిన వీరుడు

అభిప్రాయం



ప్రొ॥ నాగపట్ల భక్తవత్సల రెడ్డి

ఊరూరా కోటలు కట్టి, వరంగల్లు కోటని దోచుకొని, దొరల, జమీందారుల కోపానికి గురయి, పద్దెనిమిదో శతాబ్ది తొలినాళ్లలో ప్రభుత్వాల్ని ముప్పుతిప్పలు పెట్టిన ప్రజాబంధువు సర్దార్ సర్వాయి పాపన్న. చరిత్రకారులకు బందిపోటుగా, వృత్తిగాయకులకు గోలకొండ కోటని ఆక్రమించిన పరాక్రమవంతుడుగా, బహదూర్ షా చక్రవర్తికి 'సర్దార్' బిరుదుకి తగ్గవాడుగా కనబడ్డ పాపన్న చరిత్ర ఎటు చూసినా అద్భుతమే.

సర్దార్ సర్వాయి పాపన్న చారిత్రక వ్యక్తి. ఔరంగజేబు చరిత్రను పరామర్శించిన ప్రతి చరిత్రకారుడు పాపన్నను పరామర్శించారు. అయితే వాళ్ల దృష్టిలో పాపన్న బందిపోటు. దానికి ప్రధాన కారణం పాపన్న తన అనుచరులతో మొహరం (1 ఏప్రిల్ 1708) నాడు ఓరుగల్లు కోటను ముట్టడించి, లక్షల విలువ చేసే సొత్తుని, పన్నెండు వేల మందిని బందీలుగా చేసుకోవడం. అందులో ఓరుగల్లు సంస్థానాధీశుడైన కాశి మొహమ్మద్ సైద్ భార్య, కూతురు కూడా ఉన్నారు. ఈ విజయంతో సర్వాయి పాపన్న విజృంభించి చాలా గ్రామాల్లో కోటలు కట్టి తన స్థానాన్ని పదిలపర్చుకొంటాడు. హుసేన్, హుసేన్, హిమామ్, దూదేకుల పీరు, జక్కుల పెరుమాళ్లు, నెల్లూరి హనుమంతు, చాకలి సర్వన్న, మంగలి మాసన్న, కుమ్మరి గోవిందు, మేదరి యెంకన్న లాంటి సాహసవంతులైన యోధులతో దళాన్ని ఏర్పర్చుకొన్నాడు. సర్వాయి పాపన్నని బందీగా చేసుకొని తమను రక్షించవలసిందిగా బహదూర్ షాకు విజ్ఞాపనలు వరంగల్లు నుంచి అందే దాకా అతడికి తిరుగులేకుండా పోయింది. యూసుఫ్ ఖాన్ రుజ్బహానీని పాపన్నను పట్టుకోవడానికి పంపిస్తాడు చక్రవర్తి. అతను షాహపురం ఆక్రమించుకున్నా పాపన్న దొరకకుండా తాటికొండ కోటకు చేరుకొంటాడు. తొమ్మిది నెలల తర్వాత తన అనుయాయులు ఒక్కొక్కరే వదిలి వెళ్లడం వల్ల గత్యంతరం లేక ఏకాకిగా హుస్నాబాదు చేరి యూసుఫ్ ఖాన్‌కు చిక్కుతాడు. 1710లో యూసుఫ్ ఖాన్ సైన్యం సర్వాయి పాపన్నను ముక్కలుగా నరికి చంపారనీ, అతని తలను చక్రవర్తికి పంపారనీ చరిత్రకారుల (టి.డబ్ల్యు. హేగ్) మాట.

1709 మే మాసంలో నాగపట్నం నుంచి బటేవియాకు పంపిన ఒక డచ్ ఉత్తరంలో హైదరాబాదులో బహదూర్ షా చక్రవర్తి ప్రముఖుల సమక్షంలో సర్దార్ (డెన్ రోవర్ సెర్వాపాపర్) బిరుదును పాపన్నకు ఇచ్చినట్లు తెలుస్తోంది. అంటే బహదూర్ షా ఒక పక్క సర్వాయి పాపన్నను అణచటానికి సైన్యాన్ని పంపి, మరో పక్క అతణ్ణి గౌరవించాడని అర్థం చేసుకోవాల్సి ఉంది. అది అసంబద్ధం. అయితే ఈ చరిత్ర రాసిన వారు ఒకరు అధికార పక్షానికి చెందిన వారైతే, మరొకరు డచ్ కంపెనీ అధికార వర్గానికి చెందినవారు.



సర్వాయి పాపన్న గురించిన వీరగాథలు చాలా ప్రచారంలో ఉండేవి. 1874లో జె.ఏ. బోయలు దొర బళ్లారిలో, 1906లో ప్రచురణ పొందిన గాథను మల్లంపల్లి వారు, 1966లో పీలేరు ప్రాంత వాసి అయిన వెంకటరమణ చెప్పిన కథను తిరుపతిలో 1966లో తంగిరాల వెంకట సుబ్బారావు, పూదోట కోటిలింగం చెప్పిన కథను 1974లో జెని రోషైర్, 'క్లాం భిక్షం' కథను నల్లగొండలో శత్రుఘ్న రెడ్డి, 1998లో సిరిగిరి వెంకటయ్య బృందం చెప్పిన కథని వరంగల్లు జానపద గిరిజనవిజ్ఞాన పీఠం సేకరించాయి. ఈ కథల మధ్య సామ్యాలూ, భేదాలూ ఉన్నాయి. ఇవే కాకుండా నవలలు, నాటకాలు, బుర్రకథలు లాంటి వాటిని... ఒక రకంగా సర్వాయి పాపన్న సమగ్ర సాహిత్యాన్ని ఆచార్య పేర్వారం జగన్నాథం సేకరించారు.

'క్లాం బిక్షం' చెప్పిన కథలో పాపన్న... దోచుకున్న డబ్బు మొత్తాన్నీ ప్రజలకు పంచాడనీ, ఇండ్లు లేని వారికి ఇండ్లు కట్టించాడనీ, బావులు లేని వారికి బావులు తవ్వించాడనీ, అందరికీ మేలే చేసినాడనీ 'భళా భళి' అని కీర్తిస్తారు.

మొగలు సామ్రాజ్య చివరి దశలో చాలా మంది స్వాతంత్య్రం ప్రకటించుకొన్నారు. అదే సమయంలో రాబిన్ హుడ్ లాంటి జానపద వీరులు కూడా వచ్చారంటారు బర్బరా. "దుర్గములను నిర్మించి, దుర్గములను సాధించి రాజ్యమును విస్తరింపజేసికొన ప్రయత్నించిన వాడు దొర కాక దొంగ ఎట్లగును" అన్నది మల్లంపల్లి వారి ప్రశ్న.

పట్టుదలతో సాధించి, దోచుకొన్న సంపదను ప్రజల కోసమే వినియోగించిన సర్దార్ సర్వాయి పాపన్న ధన్యుడు. అతని చరిత్రను వీరగాథలుగా ప్రచారం చేసి అద్భుత వ్యక్తిగా మల్చిన గాయకులు ప్రశంసనీయులు.

వ్యాసకర్త తెలుగు యూనివర్సిటీ జానపద గిరిజన విజ్ఞాన పీఠం మాజీ డీన్
మొబైల్: 94401 70703

సహనంతోనే!

రమణాశ్రమానికి ఒకరోజు కుంభకోణం నుంచి ఓ మహిళ వచ్చింది. 'స్వామీ! అందరూ అజ్ఞానం, అజ్ఞానం అని అంటుంటారు. అదేమిటీ' అని అడిగింది. ఆయన ఏమీ చెప్పకుండా కాలయాపన చేయడంతో 'నాకు రైలు సమయం మించుతోంది. తొందరగా చెబితే వెళ్లి పోతాను' అంది.

కొద్ది సమయం తర్వాత భగవాన్ 'అన్నీ వెంట వెంటనే దొరకాలి. చాలామంది తిరిగి వెళ్లిపోవడానికి ఏదో ఒక రైలందుకోవాలనే ఆలోచనలోనే ఉన్నారు. ఆదరాబాదరగా వచ్చి, తొందరగా మోక్షంతో వెళ్ళాలనుకుంటారు. అందరూ ఇక్కడ శ్రద్ధగా సాధన చేయాలనే వస్తారు. తీరా వచ్చిన తర్వాత వారిలో అహం తలకెక్కుతుంది. వారు ఎందుకు ఇక్కడకు వచ్చారో ఆ సంగతే మరచిపోతారు. నాకు ఏదో గొప్ప సేవ చేస్తున్నట్టు అనుకొంటారు. వారు మాత్రమే భగవాన్‌కి సేవ చేయడానికి పుట్టినట్లూ, మిగిలిన వారందరూ ఏదో కాలక్షేపం చేయడానికి వస్తున్నట్లూ అనుకొంటారు. ఆ ధ్యాస వారిక్కడకు వచ్చిన ప్రధానోద్దేశాన్ని చెడగొడుతుంది. వినయ విధేయతలు మాత్రమే అహంకారాన్ని నాశం చేయగలవు. ఈశ్వరుడి తలుపులు ఎప్పుడూ తెరిచే ఉంటాయి. కానీ ప్రవేశద్వారం ఎత్తు చాలా చిన్నది. తల వంచితేనే లోపలికి వెళ్ళగలం. కానీ అది గ్రహించరు. మనసులో 'నేనే' అనే భావం రవ్వంత ఉన్నా అది వేగంగా వ్యాపించి ఇక్కడకు ఎందుకు వచ్చామన్న ఉద్దేశాన్ని చెడగొడుతుంది. దుష్ట ఆలోచనలు, దుష్ట కార్యాలు వేగంగా విస్తరిస్తాయి' అన్నారు భగవాన్. ఆ మహిళకు తన అజ్ఞానం అవగతమై సంతోషంగా ఇంటి దారి పట్టింది.

జ్యోతిర్మయం

– యామిజాల జగదీశ్

గ్రహం అనుగ్రహం

శ్రీ శోభకృత్ నామ సంవత్సరం, దక్షిణాయనం, శరదృతువు, ఆశ్వయుజ మాసం, **తిథి:** బ.విదియ రా.11.30 వరకు, తదుపరి తదియ, **నక్షత్రం:** భరణి ఉ.6.11 వరకు, తదుపరి కృత్తిక, **వర్జ్యం:** సా.6.05 నుండి 7.42 వరకు, **దుర్ముహూర్తం:** ప.12.06 నుండి 12.52 వరకు, తదుపరి ప.2.23 నుండి 3.10 వరకు, **అమృతఘడియలు:** రా.3.38 నుండి 5.13 వరకు; **రాహుకాలం:** ఉ.7.30 నుండి 9.00 వరకు, **యమగండం:** ఉ.10.30 నుండి 12.00 వరకు, **సూర్యోదయం:** 6.01, **సూర్యాస్తమయం:** 5.27.

మీకు సాక్షి దినపత్రిక అందడంలో ఏమైనా ఇబ్బందులున్నా లేక సాక్షి బదులుగా ఇతర దినపత్రికలు వేస్తున్న యెడల టోల్ ఫ్రీ నెంబర్‌కు ఉ. 7.00 గం.ల నుండి రా. 8.00 గం.ల లోపు తెలుపగలరు. వెంటనే తగు చర్యలు తీసుకోబడును.
టోల్ ఫ్రీ నం: 1800 425 9899

క్లుప్తంగా...

శ్రీవారి సేవలో హైకోర్టు న్యాయమూర్తి


ఆలయం వెలుపల జస్టిస్ బి.శ్యాంసుందర్

తిరుమల: తిరుమల శ్రీవారిని ఆదివారం ఏపీ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ బి.శ్యాంసుందర్ దర్శించుకున్నారు. ఆయనకు ఆలయాధికారులు ప్రత్యేక దర్శనం ఏర్పాట్లు చేశారు. దర్శనానంతరం ఆలయ రంగనాయకుల మండపంలో పండితులు వేదాశీర్వచనాలను, అధికారులు లడ్డూ ప్రసాదాలను అందజేశారు. ఎంపీ బెల్లాన చంద్రశేఖర్, ఎమ్మెల్సీ భరత్ కూడా శ్రీవారిని దర్శించుకున్నారు.

గంజాయి తోటల తొలగింపు

స్వచ్ఛందంగా ముందుకు వచ్చిన గిరిజనులు


వంద్రంగులలో గంజాయి పంటకు నిప్పు అంటిస్తున్న గిరిజనులు

ముంచంగిపుట్టు (అల్లూరి సీతారామరాజు జిల్లా): మండలంలోని బరడ పంచాయతీ మారుమూల గ్రామాలైన వంద్రంగుల, నగ్గులు, కోడంజోల, బిమిడి, సోలగంపుట్టు, కర్రబయలులుల్లో సాగులో ఉన్న గంజాయి తోటలను గిరిజనులు ఆదివారం స్వచ్ఛందంగా తొలగించి నిప్పంటించారు. బరడ సర్పంచ్ పార్వతి, ఎంపీటీసీ నొబ్బో, వైఎస్ఆర్‌సీపీ మండల అధ్యక్షుడు మల్లికార్జున్, పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి జగబంధు ఆయా గ్రామాల్లో పర్యటించి, గంజాయి వల్ల కలిగే అనర్థాలను వారికి వివరించారు. జరిగే నష్టంపై అవగాహన కల్పించారు. దీంతో ఆయా గ్రామాల గిరిజనులు స్వచ్ఛందంగా ముందుకు వచ్చి సాగులో ఉన్న గంజాయి తోటలను దహనం చేశారు. వైఎస్ఆర్‌సీపీ నేతలు బలరాజు, పులిరాజు, తిరుపతి పాల్గొన్నారు.

వైభవం ఉట్టిపడేలా...

ప్రారంభమైన విజయనగరం ఉత్సవాలు


విజయనగరం ఉత్సవ ర్యాలీలో మంత్రి బొత్స,కోలగట్ల తదితరులు

సాక్షి ప్రతినిధి,విజయనగరం: ఉత్తరాంధ్ర ప్రజల ఆరాధ్యదైవం పైడితల్లమ్మవారి జాతర మహోత్సవానికి ఒక రోజు ముందు ప్రారంభమయ్యే విజయనగరం ఉత్సవాలు సంస్కృతి, సంప్రదాయాలను ప్రతిబింబించేలా ఆదివారం అట్టహాసంగా ప్రారంభమయ్యాయి. ఉత్సవాలను అమ్మవారి ఆలయం నుంచి మంత్రి బొత్స సత్యనారాయణ, అసెంబ్లీ డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి, జెడ్పీ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు, కలెక్టర్ నాగలక్ష్మి సెల్వరాజన్, ఎస్పీ దీపికాపాటిల్ ప్రారంభించారు. వేలాది మంది కళాకారులు, క్రీడాకారులు, స్వచ్ఛంద సంస్థలు, పలు శాఖల సమన్వయంతో నిర్వహించిన ర్యాలీ విజయనగరం సాంస్కృతిక వైభవాన్ని ఉట్టిపడేలా సాగింది. సంగీత కళాశాలలో ఫల, పుష్ప ప్రదర్శన ఆకట్టుకుంది. ట్యాంక్ బండ్ రోడ్డులో 250పైగా స్టాల్స్‌తో ఏర్పాటు చేసిన అఖిల భారత డ్వాక్రా బజార్ అలరించింది.

నేడు పైడితల్లమ్మ తొలేళ్ల ఉత్సవం

సిరుల తల్లి పైడితల్లమ్మవారి సిరిమాను సంబరంలో తొలి ఘట్టమైన తొలేళ్ల ఉత్సవానికి ప్రభుత్వం ఏర్పాట్లు పూర్తి చేసింది. సోమవారం ఉదయం నుంచి లక్షలాది మంది భక్తులు అమ్మవారిని దర్శించుకునేందుకు తరలిరానుండగా..రాత్రి ప్రధాన పూజారి అమ్మవారి చరిత్రను ఆలయం ఎదుట ఉంచిన ఘటాల వద్ద చెప్పి రైతులకు విత్తనాలు అందజేస్తారు. ఈ ఘట్టాన్ని తొలి ఏరుగా పేర్కొంటారు. రైతుల పండుగగా చెప్పుకునే ఘట్టానికి రైతులు, భక్తజనం అధిక సంఖ్యలో తరలివస్తారు. సోమవారం వేకువజాము నుంచి మంగళవారం మధ్యాహ్నం వరకు అమ్మవారి దర్శన భాగ్యం భక్తులకు కలగనుంది.

ముగిసిన గ్రహణం..తెరుచుకున్న ఆలయం


తెరుచుకున్న శ్రీవారి ఆలయ తలుపులు


ఇంద్రకీలాద్రిపై క్యూలైన్లలో భక్తులు


శ్రీశైలంలో భక్తులతో కిటకిటలాడుతున్న క్యూ లైన్

తిరుమల/ఇంద్రకీలాద్రి (విజయవాడ పశ్చిమ)/శ్రీశైలం/శ్రీకాళహస్తి: పాక్షిక చంద్రగ్రహణం కారణంగా శనివారం సాయంత్రం నుంచి మూతపడిన ప్రధాన ఆలయాలన్నీ ఆదివారం తెరుచుకున్నాయి. తిరుమల శ్రీవారి ఆలయం, విజయవాడ ఇంద్రకీలాద్రిపై దుర్గామల్లేశ్వర స్వామి వారి ఆలయం, ఉపాలయాలు, శ్రీశైల క్షేత్రాల్లో గ్రహణ కాలం ముగిసిన అనంతరం ఆలయ శుద్ధి చేపట్టారు. అనంతరం మూలమూర్తులకు ప్రత్యేక పూజలు నిర్వహించి, నైవేద్యాలను నివేదించి దర్శనాలకు అనుమతించారు. తిరుమలలో ఆదివారం ఉదయం 9 గంటల నుంచి తరిగొండ వెంగమాంబ అన్నప్రసాద భవనంలో భక్తులకు అన్నప్రసాదాలు అందించారు. గ్రహణానంతరం విజయవాడ దుర్గమ్మ ఆలయం తెరవడంతో భవానీలతో ఆలయ పరిసరాలు సందడిగా మారాయి. ఆదివారం ఉదయం శ్రీశైలం ఆలయానికి భక్తులు పోటెత్తడంతో వారికి సౌకర్యవంతమైన దర్శనం కల్పించేందుకుగాను గర్భాలయ అభిషేకాలు, సామూహిక అభిషేకాలను తాత్కాలికంగా నిలుపుదల చేశారు.

శ్రీకాళహస్తిలో గ్రహణ కాల పూజలు

తిరుపతి జిల్లా శ్రీకాళహస్తీశ్వరాలయంలో గ్రహణకాల పూజలను శాస్త్రోక్తంగా నిర్వహించారు. గ్రహణాల సమయా ల్లో రాష్ట్రంలోని అన్ని ఆలయాలను మూసివేసినా శ్రీకాళహస్తీశ్వరాల యం మాత్రం తెరిచే ఉంటుంది. గ్రహణ కా ల సమయంలో స్వామి అమ్మవార్ల మూలమూర్తులకు ప్రత్యే కాభిషేకాలు నిర్వహించారు. ఆదివారం వేకువజాము 1 గంటకు మొదటి కాలాభిషేకం, 1:45 గంటలకు రెండోకాలాభిషేకం, 2.30 గంటలకు మూడోకాలాభిషేకాన్ని ఆగమోక్తంగా నిర్వహించారు. ఈ అభిషేకాలకు భక్తులు పోటెత్తారు.

ముగిసిన ఏఎంసీ శతాబ్ది ఉత్సవాలు


డాక్టర్ పెదవీర్రాజు శత కవితా సంకలనం పుస్తక ఆవిష్కరణ కార్యక్రమంలో పాల్గొన్న ప్రముఖులు

మహారాణిపేట: ఈ నెల 27వ తేదీ నుంచి నిర్వహిస్తున్న ఆంధ్ర వైద్య కళాశాల(ఏఎంసీ) శతాబ్ది ఉత్సావాలు ఆదివారం ఘనంగా ముగిశాయి. చివరి రోజు పలు అంశాలపై ప్యానెల్ డిస్కషన్స్ నిర్వహించారు. వివిధ ఆరోగ్య సమస్యలపై వైద్యులు చర్చించారు. ఉత్సవాల్లో భాగంగా ఏయూ కన్వెన్షన్ సెంటర్‌లో నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు విశేషంగా ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమాలకు ప్రముఖ వైద్యుడు, సాహితీవేత్త డాక్టర్ బి.రఘురామారావు అధ్యక్షత వహించారు. డాక్టర్ పెదవీర్రాజు రచించిన శత కవితా సంకలనాన్ని డాక్టర్ డీవీజీ శంకరరావు ఆవిష్కరించారు. తెలుగు పద్య వైభవం గురించి ఆచార్య బేతవోలు రామబ్రహ్మం, తెలుగు సినిమా పాట గురించి సుద్దాల అశోక్ తేజ, తెలుగు పద్య నాటకంపై డాక్టర్ మీగడ రామలింగస్వామి, తెలుగు కథ గురించి డాక్టర్ డీవీజీ శంకరరావు ప్రసంగించారు. ఎంఎం కీరవాణి, ఎంఎం శ్రీలేఖ బృందం మ్యూజికల్ నైట్ అలరించింది.

తాజా బంధాలు.. పచ్చని జీవితాలు!

ఉపాధినిస్తున్న కూరగాయల మార్కెట్

- రైతులు, వ్యాపారుల మధ్య పెనవేసుకున్న బంధం
- నిద్రలేని రాత్రిళ్లతో భారంగా జీవనం
- పచ్చి సరుకుతో బతుకు పోరాటం
- ప్రత్యక్షంగా, పరోక్షంగా వందల మందికి పని

ఫిదా సినిమాలో హీరోయిన్ సాయిపల్లవి బర్రె పాలు పితికితే.. ఇవేంటని ఓ కుర్రాడు అడుగుతాడు. ఉదయాన్నే పాలు తాగుతావు కదా.. అవి ఎలా వస్తాయని ప్రశ్నిస్తే సూపర్ మార్కెట్ అంటాడు. సరిగ్గా ఇప్పటి కాలం పిల్లల పరిస్థితి కూడా అలానే ఉంటోంది. పాలు, నిత్యావసరాలు ఎలా వస్తున్నాయనే విషయం కాంక్రీట్ వనాల్లో పెరుగుతున్న పిల్లల్లో కొందరికి తెలియదంటే అతిశయోక్తి కాదు. తల్లిదండ్రులు ఇద్దరూ ఉద్యోగులు అయితే.. ఇంట్లో పని వాళ్లు సరుకులన్నీ కొనుగోలు చేసి తీసుకురావడం, వంట వాళ్లు వండి పెడుతుండటంతో.. పిల్లలు ఇలాంటివేమీ తెలియకుండానే పెరుగుతున్నారు. కష్టం తెలియకుండా, బాధ కనపడకుండా సంవత్సరాలు గడుస్తుండటంతో మానవీయ విలువలు మరుగవుతున్నాయి.. రైతు కష్టం మట్టిలోనే కలిసిపోతుంది. ఒక్కసారి కూరగాయల మార్కెట్‌లోకి కాలు పెడితే ఓ ప్రపంచమే కళ్ల ముందు కనిపిస్తుంది. జీవితం అంటే ఏంటో అడుగడుగులో ఒక పాఠం నేర్పుతోంది.

– సాక్షి, కర్నూలు డెస్క్





తెల్లవారుజామున 4 గంటల సమయంలో కూరగాయల మార్కెట్‌లో సందడి

ఏం అక్కా బాగున్నావా.. రెండు రోజుల నుంచి కనిపించలేదు. ఇదిగో ఈ క్యారెట్ తీసుకుపో. మంచి సరుకు వచ్చింది. ఏం వదినా ఈ మధ్య కనిపించడమే లేదు.. ఈ రోజు క్యాబేజీ బాగుంది, గిట్టుబాటవుతుంది.. ఏం బావా లేటైంది. ఇంకొంచెం ముందు వచ్చింటే బీన్స్ చాలా బాగున్నిండ. ఇం కొందరు ఇంకోలా బంధుత్వం కలుపుతూ కూరగాయలు, ఆకుకూరల విక్రయాలు చేపట్టడం కర్నూలు నడిబొడ్డున ఉన్న కూరగాయల మార్కెట్‌లో కనిపిస్తుంది. ఉదయం 8 గంటలైనా కళ్లు తెరిచేందుకు ఇష్టపడని పరిస్థితుల్లో.. ఇక్కడ మాత్రం తెల్లవారుజామున 3.30 గంటల నుంచే సరికొత్త కుటుంబం తలుపులు తెరుస్తుంది. రక్త సంబంధం లేకపోయినా, బంధుత్వం కాకపోయినా.. అందరూ వ్యాపారులు, కొనుగోలుదారులే అయినప్పటికీ పేరుతో కాకుండా ఇంటి మనుషుల్లా కలిసిపోతున్న తీరు పని ఒత్తిడిని దూరం చేస్తుంది. ఒక్క రోజు ఒకరు కనిపించకపోయినా, ఏదో కోల్పోయిన భావన అక్కడున్న వాళ్లలో కనిపిస్తుండటం మార్కెట్‌తో పెనవేసుకున్న బంధానికి అద్దం పడుతుంది.

రైతుల కష్టం వెలకట్టలేనిది

మట్టి మనుషుల కష్టం ఎంత చెప్పుకున్నా తక్కువే. అందరికీ అన్నం పెట్టే రైతులకు అడుగడుగునా గండాలే. పంట పండించడం ఒక ఎత్తయితే, అమ్ముకోవడం మరో ఎత్తు. తెల్లవారుజామున పొలానికి వెళ్లాలి. పండించిన కూరగాయలు, ఆకుకూరలను కూలీలతో తెంపించాలి. పొలం వద్దకు ఆటో వెళ్లలేని పరిస్థితి ఉంటే నెత్తిన పెట్టుకొని రోడ్డు మీదకు చేర్చాలి. ఆ తర్వాత కిలోమీటర్ల దూరం ప్రయాణించి కర్నూలు మార్కెట్‌కు మధ్యాహ్నం 2 గంటలకంతా చేర్చాలి. అక్కడ వేలం సుమారు 4 గంటల సమయంలో మొదలవుతుంది. ఆ ప్రక్రియ పూర్తయ్యే వరకు పడిగాపులు కాయాల్సిందే. ఆ తర్వాత మంచి ధర పలికితే ముఖంలో కాస్త నవ్వు కనిపిస్తుంది. లేదంటే.. ఈ బతుకింతే అనుకుని అక్కడి నుంచి వెళ్లిపోయినా, మరుసటి రోజు మళ్లీ అడుగులు పొలం వైపు పడాల్సిందే.

వ్యాపారులకు కంటి మీద కునుకు దూరం

రైతుల పరిస్థితి ఇలా ఉంటే మార్కెట్‌లో వ్యాపారులకు కంటి మీద కునుకు లేకుండా పోతుంది. మీకేం నాయనా రెండు చేతులా సంపాదిస్తారు అనేవాళ్లే కానీ.. సాయంత్రం 5 గంటల నుంచి మరుసటి రోజు 10 గంటల వరకు వీళ్ల ఒళ్లంతా కళ్లు చేసుకుంటే కానీ వ్యాపారం సాగదు. కూరగాయలు, ఆకుకూరలు పచ్చి సరుకు కావడంతో ఏరోజుకు ఆ రోజు విక్రయాలు పూర్తి చేస్తే కానీ రెండు రాళ్లు చేతిన పడని పరిస్థితి. ధర ఫర్వాలేదంటే సరే కానీ.. ఆ రోజు ధర పడిపోయిందంటే కొనుగోలు చేసిన సరుకును వందల నుంచి పదుల్లో కూడా వదిలించుకోవాల్సిందే.

వేలమంటే మాటలా!

రైతులు తీసుకొచ్చిన సరుకును మార్కెట్‌లోని సుమారు 10 దుకాణాల యజమానులు వేలంలో కొనుగోలు చేస్తారు. వీరితో పాటు బయటి ప్రాంతాల నుంచి కూడా వ్యాపారులు పాటలో పాల్గొంటారు. మార్కెట్‌కు జిల్లాతో పాటు సమీపంలోని తెలంగాణ ప్రాంత గ్రామాల నుంచి కూడా చౌళకాయలు, బెండకాయలు, టమాట, మిర్చి.. వంకాయలు.. క్యాబేజీ, క్యాలీఫ్లవర్.. బుడంకాయలు, సొరకాయలు.. దోసకాయలు, ఆకుకూరలు తీసుకొస్తుంటారు. సాయంత్రం 5 నుంచి 8 వరకు ఈ ప్రక్రియ పూర్తయితే.. ఆ తర్వాత హమాలీలు ఆయా ప్రాంతాలకు తరలించేందుకు సరుకును లోడ్ చేస్తారు. ఇదంతా పూర్తయ్యేందుకు రాత్రి సుమారు 11 గంటలు దాటుతుంది.

ఉదయాన్నే మరో ప్రపంచం

సాయంత్రం వేలంలో కొనుగోలు చేసిన సరుకుతో పాటు బెంగళూరు, హైదరాబాద్ నుంచి దిగుమతి చేసుకున్న సరుకును ఇక్కడి వ్యాపారులు ఉదయం 3.30 గంటల నుంచి విక్రయానికి ఉంచుతారు. సాయంత్రం సంచుల రూపంలో విక్రయాలు జరిగితే.. తెల్లవారుజామున కిలోల ప్రకారం అమ్మకాలు ఉంటాయి. అంటే.. ఇక్కడ కొనుగోలు చేసిన వాళ్లు తిరిగి వాటిని ఇళ్ల వద్ద దుకాణాల్లో, తోపుడు బండ్లు, గంపల్లో పెట్టుకొని విక్రయిస్తుంటారు. ఇదంతా పూర్తయ్యేందుకు 10 నుంచి 11 గంటల సమయం గడిచిపోతుంది. ఇలా రోజంతా మార్కెట్‌లో హడావుడి కనిపిస్తుంది. కొందరు అప్పటికప్పుడు డబ్బులు చెల్లించి కొనుగోలు చేస్తే.. మరి కొందరు అప్పటికి సరుకు తీసుకెళ్లి విక్రయాలు పూర్తయ్యాక సాయంత్రానికి చెల్లింపులు చేస్తుంటారు. ఇదంతా నమ్మకం మీద సాగుతున్న వ్యవహారం.

మార్కెట్ అంటేనే ఉపాధి

వ్యాపారులు, రైతుల మాట అలాఉంటే.. ఒక్కో దుకాణం మీద ఆధారపడి పదుల సంఖ్యలో ఉపాధి పొందుతున్నారు. వీరిలో కొందరికి జీతాలు, రోజువారీ కూలీ ఇస్తుండగా.. మరికొందరు చేతనైన పని చేస్తూ ఇచ్చింది తీసుకెళ్తుంటారు. రాత్రిళ్లు సరుకు ఇతర ప్రాంతాల నుంచి వస్తుండటంతో దుకాణాల్లో పనికి కుదిరిన యువకులు సాయంత్రం 6 గంటలకే అక్కడికి చేరుకొని దినచర్యలో తలమునకలవుతారు. అక్కడి నుంచి యజమానులు తెల్లవారుజామున 3.30 గంటలకు దుకాణానికి చేరుకునే సమయానికి సరుకును లెక్క చూసుకొని, దింపుకొని విక్రయానికి సిద్ధం చేస్తారు. ఇవన్నీ అమ్ముడుపోయి, ఇంటికి చేరుకునేందుకు గడియారం 10 గంటలు కొట్టాల్సిందే.

కరోనా సమయంలో ఉక్కిరిబిక్కిరి

ప్రపంచాన్ని ఉక్కిరిబిక్కిరి చేసిన కరోనా మహమ్మారి మార్కెట్‌ను కూడా కుదిపేసింది. అయితే నిత్యావసరంలో భాగం కావడంతో కూరగాయలు, ఆకుకూరల విక్రయం ఎంతో మందికి కొత్తగా ఉపాధి కూడా చూపింది. కరోనా ఉద్ధృతి నేపథ్యంలో ఇక్కడున్న మార్కెట్‌ను మొదట పెద్దపాడుకు, ఆ తర్వాత కర్నూలు శివారుకు.. అనంతరం జగన్నాథగట్టుకు మార్చడంతో వ్యాపారులతో పాటు రైతులు చుక్కలు చూడాల్సి వచ్చింది. అయినప్పటికీ వీళ్ల కరోనాకు ఎదురొడ్డి నిలవడంతో అందరి ఆకలి తీరింది.. వీళ్ల జీవితం నిలదొక్కుకుంది.


తూకం వేసి బరువును సంచిపై రాస్తూ..

మార్కెట్ స్వరూపం

విస్తీర్ణం: సుమారు 10 ఎకరాలు		పరోక్షంగా ఆధారపడిన కుటుంబాలు 700-800	
కూరగాయల విక్రయ దుకాణాలు 100	ఒక్కో దుకాణంలో గుమాస్తాలు 8-10 మంది	ఆకుకూరల విక్రయ దుకాణాలు 60	ఒక్కో దుకాణంలో గుమాస్తాలు 3-5 మంది



ఇతని పేరు శాంసన్. వయస్సు 20 ఏళ్లు. తండ్రి అకాల మరణంతో కుటుంబానికి పెద్ద దిక్కుగా మారాడు. ఇద్దరు అక్కలకు వివాహమైంది. అయితే పుట్టుకతోనే ఈ యువకుడు దివ్యాంగుడు. ఒక చేయి పూర్తిగా సహకరించని పరిస్థితిలో ఐదేళ్ల నుంచి మార్కెట్‌నే నమ్ముకొని జీవిస్తున్నాడు. ఒంటి చేత్తోనే ఇది చేతకాదు అనుకోకుండా అన్ని పనులు చక్కబెడుతున్నాడు.



ఈమె పేరు వరలక్ష్మి. వయస్సు 40 పైనే. భర్త హమాలీ పనులు చేస్తుండగా, ఇద్దరు ఆడ పిల్లలు సంతానం. ఒక కుమార్తెకు వివాహమైంది. ఒక్కరి సంపాదనతో కుటుంబం గడవటం కష్టం కావడంతో కూరగాయల విక్రయాన్ని ఉపాధిగా మార్చుకుంది. కోడి కూయక ముందే మార్కెట్‌కు చేరుకుంటుంది. ఎక్కువగా విక్రయమయ్యే కూరగాయలను కొనుగోలు చేసి నంద్యాల చెక్‌పోస్టు ప్రాంతంలో విక్రయిస్తూ భర్తకు అండగా నిలుస్తోంది.



ఈమె పేరు శంకరమ్మ. వయస్సు 50 ఏళ్లు. నగరంలోని షరీన్‌నగర్‌లో నివాసం. ఏడేళ్ల క్రితం వరకు భర్త మాదన్న చిన్న చిన్న పనులు చేసుకుంటూ కుటుంబాన్ని పోషించేవాడు. అయితే పక్షవాతం రావడంతో మంచానికే పరిమితం అయ్యాడు. అప్పటి నుంచి కూలీ పనులు చేస్తూ శంకరమ్మ కుటుంబాన్ని నెట్టుకొస్తోంది. కరోనాతో ఈ కుటుంబం పస్తులుండాల్సిన పరిస్థితి. ఆ సమయంలోనే కూరగాయల విక్రయాన్ని ఉపాధిగా చేసుకొంది. తెల్లవారుజామున మార్కెట్‌కు వచ్చి అవసరమైన కూరగాయలు కొనుగోలు చేసి ఇంటి సమీపంలోనే విక్రయాలు చేస్తూ జీవనం సాగిస్తోంది.


కూరగాయలను అమ్మేందుకు వెళ్తున్న వృద్ధుడు


కూరగాయలను లోడింగ్ చేస్తున్న దృశ్యం

కొత్తవలసలో ఏనుగు హల్‌చల్

- అర్ధరాత్రి దాటాక సంచారం
- భయాందోళనలో ప్రజలు


పార్వతీపురం టౌన్ రైల్వేస్టేషన్ ప్లాట్‌ఫాంపై సంచరిస్తున్న ఏనుగు

పార్వతీపురం టౌన్: పార్వతీపురం మన్యం జిల్లా, కొత్తవలసలో ఓ ఏనుగు శనివారం అర్ధరాత్రి దాటాక హల్‌చల్ చేసింది. కొత్తవలస ప్రాంతంలోని మణికంఠ కాలనీ, కొత్తవీధి, పార్వతీపురం టౌన్ రైల్వేస్టేషన్ ప్లాట్‌ఫాంపై ఏనుగు సంచరిస్తున్న వీడియోలు సామాజిక మాధ్యమాల్లో వైరల్ అయ్యాయి. ఆదివారం తెల్లవారుజామున నాలుగు గంటల వరకు ఏనుగు కొత్తవలసలోనే ఉందని, తరువాత దాని ఆచూకీ కనిపించలేదని స్థానికులు చెప్పారు. ఈ విషయమై అటవీ శాఖాధికారులను సంప్రదించగా, బలిజిపేట మండలం మిర్తివలస గ్రామం నుంచి పార్వతీపురం పట్టణ శివారు ప్రాంతంలో సంచరిస్తున్నట్టు గుర్తించామని తెలిపారు. పార్వతీపురం పట్టణ ప్రజలతో పాటు కొత్తవలస, నవిరికాలనీ, పరిసర గ్రామాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని అధికారులు సూచించారు.

అనంతపురంలో 'బ్రౌన్' శాఖ ఏర్పాటు చేయాలి

- 'జానమద్ది' పురస్కార ప్రదానోత్సవంలో జస్టిస్ దుర్గాప్రసాద్‌రావు
- డాక్టర్ నాగసూరి వేణుగోపాల్‌కు జానమద్ది పురస్కారం


వేణుగోపాల్ దంపతులకు పురస్కారాన్ని అందజేస్తున్న జస్టిస్ దుర్గాప్రసాద్‌రావు

కడప కల్చరల్: డాక్టర్ జానమద్ది హనుమచ్ఛాస్త్రి కడపలో నిర్మించిన సీపీ బ్రౌన్ గ్రంథాలయం శాఖను అనంతపురంలోనూ ఏర్పాటుచేసే అంశాన్ని పరిశీలించాలని హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ ఉపమాక దుర్గాప్రసాద్‌రావు సూచించారు. జానమద్ది అనంతపురం జిల్లాకు చెందినవారని, అందువల్ల అక్కడ కూడా బ్రౌన్ గ్రంథాలయ శాఖను ఏర్పాటు చేస్తే బాగుంటుందన్నారు. డాక్టర్ జానమద్ది హనుమచ్ఛాస్త్రి (బ్రౌన్ శాస్త్రి) జయంతిని పురస్కరించుకుని జానమద్ది 11వ వార్షిక సాహిత్య సేవా పురస్కార ప్రదానోత్సవం ఆదివారం కడపలోని సీపీ బ్రౌన్ గ్రంథాలయంలో నిర్వహించారు. జానమద్ది సాహితీపీఠం ఆధ్వర్యాన నిర్వహించిన ఈ కార్యక్రమంలో జస్టిస్ ఉపమాక దుర్గాప్రసాద్‌రావు ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. రచయిత, ఆకాశవాణి విశ్రాంత అధికారి నాగసూరి వేణుగోపాల్‌కు జానమద్ది పురస్కారాన్ని జస్టిస్ దుర్గాప్రసాద్‌రావు ప్రదానం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్వయంకృషి, సాహిత్యాభిలాష, సామాజిక దృష్టి జానమద్ది ప్రత్యేకతలని, భావితరాలకు వాటిని తెలియజేయాల్సిన బాధ్యత మనందరిపై ఉందన్నారు. ఎమ్మెల్సీ ఎంవీ రామచంద్రారెడ్డి మాట్లాడుతూ జానమద్ది సాహితీసేవ భావితరాలకు స్ఫూర్తినిస్తుందని అభిప్రాయపడ్డారు. యోగి వేమన విశ్వవిద్యాలయం వీసీ ఆచార్య చింతా సుధాకర్ మాట్లాడుతూ బ్రౌన్ గ్రంథాలయాన్ని సాహిత్యంతోపాటు కళానిలయంగా తీర్చిదిద్దుతామని చెప్పారు. కవి యలమర్తి మధుసూదన 'తెలుగు భాషా ప్రాశస్త్యం–పద్య వైభవం'పై స్మారకోపన్యాసం చేశారు. పురస్కార గ్రహీత డాక్టర్ నాగసూరి వేణుగోపాల్ మాట్లాడుతూ తాను కడపలో పనిచేసిన సమయంలో బ్రౌన్ గ్రంథాలయం, జానమద్దితో అనుబంధం ఏర్పడిందని తెలిపారు. అనంతరం వివిధ రంగాల్లో విశేష సేవలు అందించిన పలువురు వ్యక్తులు, సంస్థల ప్రతినిధులను జానమద్ది సాహితీపీఠం తరఫున సన్మానించారు. విజయవాడ దుర్గగుడి ఈవో కేఎస్ రామారావు అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో జానమద్ది సాహితీపీఠం ట్రస్టీ విజయభాస్కర్, కార్యదర్శి యామిని, డాక్టర్ వైపీ వెంకటసుబ్బయ్య, జానమద్ది కుటుంబ సభ్యులు, కవులు, రచయితలు పాల్గొన్నారు.

తెలంగాణ

నేడు ఆర్డినెన్స్ ఫ్యాక్టరీ సీసీపీటీ వాహనాల విడుదల

టెక్నికల్ ఫైర్ కంట్రోల్ విధుల్లో అత్యంత కీలకం

సాక్షి, హైదరాబాద్: భారత రక్షణశాఖ అమ్ములపొదిలో మరో కీలక అస్త్రం చేరనుంది. మెదక్ ఆర్డినెన్స్ ఫ్యాక్టరీ తయారు చేసిన సీసీపీటీ(క్యారియర్ కమాండ్ పోస్ట్ ట్రాక్డ్) వాహనాలను సోమవారం సంగారెడ్డి జిల్లా ఎద్దుమైలారంలోని ఆర్డినెన్స్ ఫ్యాక్టరీలో విడుదల చేయనున్నారు. మేకిన్ ఇండియాలో భాగంగా స్వదేశీ పరిజ్ఞానంతో అనేక రక్షణ ఉత్పత్తులను ఆర్డినెన్స్ ఫ్యాక్టరీ ఉత్పత్తి చేస్తోంది. ఆర్మ్‌డ్ వెహికల్స్ నిగమ్ లిమిటెడ్(ఏవీఎన్ఎల్) ఐదు ఉత్పత్తి యూనిట్లలో మెదక్ ఆర్డినెన్స్ ఫ్యాక్టరీ ఒకటి. ఏవీఎన్ఎల్ ప్రధానంగా ఆర్మ్‌డ్ ఫైటింగ్ వెహికల్స్(మెయిన్ బ్యాటిల్ ట్యాంకులు), మైన్ ప్రొటెక్టెడ్ వెహికల్స్‌ని భారత సైన్యంలోని వివిధ విభాగాల కోసం తయారు చేస్తుంది. ఇప్పటికే టీ–90 ట్యాంక్, టీ–72 ట్యాంక్, బీఎంపీ–2(శరత్ ట్యాంక్), ఎంబీటీ అర్జున్ ఉండగా, యుద్ధక్షేత్రంలో మారుతున్న అవసరాలకు అనుగుణంగా తాజాగా ఈ క్యారియర్ కమాండ్ పోస్ట్ ట్రాక్డ్(సీసీపీటీ) వాహనాన్ని రూపొందించారు.

సీసీపీటీ ప్రత్యేకతలు ఇవీ..

సీసీపీటీని డీఆర్‌డీవోలోని కంబాట్ వెహికల్స్ రీసెర్చ్ అండ్ డెవలప్‌మెంట్ ఎస్టాబ్లిష్‌మెంట్(సీవీఆర్‌డీఈ) రూపొందించింది. అన్ని వ్యూహాత్మక, సాంకేతిక అగ్ని నియంత్రణ విధుల కోసం దీనిని ప్రత్యేకంగా రూపొందించారు. ఆర్టిలరీ గన్‌ల అన్ని వెర్షన్ల ఫైర్ కంట్రోల్ ఫంక్షన్లను సాధించడం కోసం తయారు చేశారు. సీసీపీటీ అనేది అన్ని భారతీయ ఆర్టిలరీ గన్ కమాండ్ పోస్ట్ ఫంక్షన్లకు ఒక సాధారణ వేదికగా పనిచేస్తుంది. తొలుత 2018లో 43 వాహనాల సరఫరా కోసం మెదక్ ఆర్డినెన్స్ ఫ్యాక్టరీకి ఇండెంట్ ఇచ్చారు. 2021లో మెదక్ ఆర్డినెన్స్ ఫ్యాక్టరీ రెండు సీసీపీటీ వాహనాలు ఉత్పత్తి చేసి, ట్రయల్స్ కోసం భారత సైన్యానికి అప్పగించింది.

క్లుప్తంగా...

క్రికెట్ ఆడుతుండగా కాల్పులు

శ్రీనగర్: జమ్మూకశ్మీర్‌లో ఆదివారం ఓ పోలీసు అధికారి క్రికెట్ ఆడుతుండగా ఉగ్రకాల్పులకు బారిన పడ్డారు. ఇన్‌స్పెక్టర్ మన్సూర్ అహ్మద్ వనీ శ్రీనగర్ శివార్లలో ఈద్గా క్రీడాస్థలంలో క్రికెట్‌ఆడుతుండగా లష్కరే తొయిబా ఉగ్రవాది ఒకడు అతి సమీపం నుంచి మూడు రౌండ్లు కాల్పులకు దిగాడు. కంట్లోకి, పొట్టలోకి, చేతిలోకి తూటాలు దూసుకెళ్లడంతో వని కుప్పకూలారు. ఆయన పరిస్థితి ఆందోళనకరంగా ఉన్నట్టు వైద్యులు తెలిపారు. ముష్కరుడిని బాసిత్ దార్‌గా గుర్తించినట్టు ఏడీజీ విజయ్ కుమార్ తెలిపారు. అతని కోసం ఆ ప్రాంతాన్నంతా పోలీసులు జల్లెడ పడుతున్నారు.

అమెరికాలో మళ్లీ కాల్పులు

తంపా (యూఎస్): అమెరికాలో మరోసారి కాల్పులు జరిగాయి. ఫ్లోరిడాలో స్థానిక కాలమానం ప్రకారం ఆదివారం తెల్లవారుజామున రెండు గ్యాంగుల మధ్య పోరాటం కాల్పుల దాకా వెళ్లడంతో ఇద్దరు మరణించారు. 18 మంది దాకా గాయపడి ఆస్పత్రి పాలయ్యారని పోలీసులు తెలిపారు. ఆ ప్రాంతమంతా బార్లు, క్లబ్బులతో, లేట్ నైట్ కార్యకలాపాలతో నిండి ఉంటుంది. అనుమానితుల్లో ఒకరు ఇప్పటికే పోలీసులకు లొంగిపోయారు. మిగతావారి కోసం గాలింపు జరుగుతున్నట్టు పోలీసులు తెలిపారు. మరో ఘటన... జార్జియా యూనివర్సిటీ అట్లాంటా క్యాంపస్‌లో జరిగిన కాల్పుల ఘటనలో ఇద్దరు విద్యార్థులు సహా నలుగురు గాయపడ్డారు. క్షతగాత్రుల్లో ఒకరి పరిస్థితి విషమంగా ఉందని పోలీసులు తెలిపారు.

అధ్యక్ష రేసుకు పెన్స్ దూరం

వాషింగ్టన్: అమెరికా అధ్యక్ష ఎన్నికల రేసు నుంచి తప్పుకుంటున్నట్టు దేశ మాజీ ఉపాధ్యక్షుడు, రిపబ్లికన్ పార్టీ నేత మైక్ పెన్స్ ప్రకటించారు. లాస్‌వెగాస్‌లో పార్టీ జ్యూయిష్ కోవలిషన్ డోనర్ సదస్సులో ఆయన ఈ మేరకు పేర్కొన్నారు. రిపబ్లికన్ పార్టీ అభ్యర్థిత్వం కోసం మాజీ అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్‌పై కొద్ది నెలలుగా ఆయన పోటీ పడుతుండటం తెలిసిందే. ''ఆరు నెలలుగా దేశవ్యాప్తంగా తిరిగిన అనంతరంఒక స్పష్టత వచ్చింది. అధ్యక్ష బరిలో దిగేందుకు నాకింకా సమయం రాలేదు. తప్పుకుందామని నిర్ణయించుకున్నా''అని చెప్పారు. దాంతో ట్రంప్‌కు రిపబ్లికన్ అభ్యర్థిత్వం దిశగా లైన్ మరింత క్లియరైనట్టు భావిస్తున్నారు. అయితే ట్రంప్‌కు మద్దతిస్తారా అని ప్రశ్నించగా పెన్స్ సూటిగా బదులివ్వలేదు. పార్టీలో ట్రంప్‌కు గట్టి ప్రత్యర్థిగా భావించిన డిశాంటిస్ కూడా మద్దతు కూడగట్టుకునేందుకు ఆపసోపాలు పడుతున్నారు. ట్రంప్ మాత్రం తిరుగులేని మద్దతుతో దూసుకుపోతున్నారు.

అంబానీకి మళ్లీ బెదిరింపులు

ముంబై: కుబేరుడు, రిలయన్స్ ఇండస్ట్రీస్ అధినేత ముకేశ్ అంబానీకి మరోసారి బెదిరింపులు వచ్చాయి. రూ.20 కోట్లు ఇవ్వాలని లేకుంటే చంపేస్తామని శుక్రవారం ఓ అగంతకుడు మెయిల్ ద్వారా బెదిరించిన విషయం తెలిసిందే. ఆదివారం మళ్లీ అదే అడ్రస్‌తో మరోసారి బెదిరింపు మెయిల్ పంపినట్లు పోలీసులు తెలిపారు. రూ.200 కోట్లు ఇవ్వకుంటే చంపేస్తామని అందులో ఉందన్నారు. అంబానీ నివాసం ఆంటీలియా భద్రతాధికారి దేవేంద్ర మున్షీరామ్ ఫిర్యాదు చేశారు. నిందితుడు యూరప్‌కు చెందిన ఈ–మెయిల్ సర్వీస్ ప్రొవైడర్ ఉపయోగించాడని చెప్పారు. అతడిపై ఐపీసీ 387, 506(2) సెక్షన్ల కింద కేసులు నమోదు చేశామన్నారు. అయితే షాదాబ్ ఖాన్ అనే వ్యక్తి నుంచి ఆ బెదిరింపు మెయిల్ వచ్చినట్లు పోలీసులు ప్రాథమికంగా గుర్తించారు. అతడి కోసం గాలిస్తున్నట్లు పోలీసులు వెల్లడించారు.

గుజరాత్ కాంగ్రెస్ ఎమ్మెల్యే ఇంట్లో యువకుడి ఉరి

జునాగఢ్: గుజరాత్ రాష్ట్రం జునాగఢ్ జిల్లా చార్వాడ్ గ్రామంలో కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్యే విమల్ చుదాసామా ఇంట్లో ఓ యువకుడు(28) అనుమాస్పద స్థితిలో ఉరికి వేలాడుతూ శవమై కనిపించాడు. ఘటనా స్థలంలో సూసైడ్ నోట్ లభించిందని, తన ఆత్మహత్యకు ఎమ్మెల్యే విమల్‌తోపాటు అతడి అత్త, మామ వేధింపులే కారణమంటూ ఆ లేఖలో ఉందని వివరించారు. బలవన్మరణానికి పాల్పడిన యువకుడిని నితిన్ పర్మర్‌గా పోలీసులు గుర్తించారు. శనివారం అర్ధరాత్రి తర్వాత ఇంటి పైకప్పునకు ఉరి వేసుకొని చనిపోయినట్లు చెప్పారు. చనిపోయిన యువకుడు నితిన్ ఎమ్మెల్యేకు దగ్గరి బంధువేనని తెలిసిందని అన్నారు. అయితే, ఎమ్మెల్యే విమల్ వాదన మరోలా ఉంది. నితిన్‌ను ఎవరో హత్య చేశారని, తనను అప్రతిష్టపాలు చేయడానికే ఆత్మహత్య చేసుకున్నట్లు చిత్రీకరించారని, నకిలీ సూసైడ్ నోట్‌ను సృష్టించారని ఆరోపించారు. నితిన్ చావుకు తానే కారణం అంటూ రాజకీయ ప్రత్యర్థులు నిందలు మోపుతున్నారని వాపోయారు.

'నాలుగు రోజుల్లో మధ్యప్రదేశ్‌లోనూ ఈడీ దాడులు'

భోపాల్: త్వరలో అసెంబ్లీ ఎన్నికలు జరగనున్న రాజస్తాన్‌లో మాదిరిగానే మధ్యప్రదేశ్‌లో కూడా వచ్చే నాలుగు రోజుల్లో ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్(ఈడీ) బృందాలు సోదాలు జరిపే అవకాశముందని కాంగ్రెస్ పార్టీ సీనియర్ నేత దిగ్విజయ్ సింగ్ జోస్యం చెప్పారు. ఇటీవలే రాజస్తాన్ కాంగ్రెస్ అధ్యక్షుడు, మాజీ విద్యాశాఖ మంత్రి గోవింద్ సింగ్ దోతాస్రా ఇంటిపై ఈడీ దాడులు జరిగిన విషయం తెలిసిందే. పరీక్ష పేపర్ లీకేజీ కేసులో మనీల్యాండరింగ్ ఆరోపణలపై సోదాలు జరిపినట్లు ఈడీ తెలిపింది. ఆదివారం భోపాల్‌లో జరిగిన మీడియా సమావేశంలో దిగ్విజయ్ సింగ్ ఈ దాడులను ప్రస్తావించారు. ఒకపక్క అధికారులను వేధిస్తున్న బీజేపీ నేతలు, మరోపక్క రాజస్తాన్‌లో మాదిరిగా మధ్యప్రదేశ్‌లోనూ ఈడీ సోదాలు జరిపిస్తారని అన్నారు. దాడులు జరగటానికి అవకాశం ఉందంటూ కాంగ్రెస్ పార్టీకి చెందిన పలువురు నేతల పేర్లను ఆయన పేర్కొన్నారు.

హమాస్ స్థావరాలే లక్ష్యం

గాజాలో భూతల, వైమానిక దాడులు ఉధృతం

- 24 గంటల వ్యవధిలో 450 స్థావరాలపై నిప్పుల వర్షం
- మిలిటెంట్లపై రెండో దశ యుద్ధం కొనసాగుతోందన్న ఇజ్రాయెల్ ప్రధాని బెంజమిన్ నెతన్యాహూ
- గాజాలో 8,000 దాటిన మృతుల సంఖ్య

గాజాస్ట్రిప్/జెరూసలేం/న్యూఢిల్లీ: గాజాలో హమాస్ మిలిటెంట్ గ్రూప్ స్థావరాలను నామరూపాల్లేకుండా చేయడమే లక్ష్యంగా ఇజ్రాయెల్ సైన్యం భూతల దాడులు మరింత ఉధృతం చేసింది. ఇజ్రాయెల్ పదాతి దళం ముమ్ముందుకు చొచ్చుకెళ్తోంది. మరోవైపు వైమానిక దళం నిప్పుల వర్షం కురిపిస్తూనే ఉంది. గత 24 గంటల్లో 450 హమాస్ స్థావరాలపై దాడుల చేసినట్లు ఇజ్రాయెల్ సైన్యం ఆదివారం ప్రకటించింది. మిలిటెంట్ల కమాండ్ సెంటర్లు, అబ్జర్వేషన్ పోస్టులు, యాంటీ–ట్యాంక్ మిస్సైల్ లాంచింగ్ కేంద్రాలను ధ్వంసం చేసినట్లు తెలియజేసింది. గాజాలోకి మరిన్ని పదాతి దళాలు అడుగుపెట్టబోతున్నాయని పేర్కొంది. ఖాన్ యూనిస్ సిటీలో ఓ భవనంపై జరిగిన వైమానిక దాడిలో 13 మంది మరణించారు. వీరిలో 10 మంది ఒకే కుటుంబానికి చెందినవారు. హమాస్ కమాండ్ పోస్టు ఉందని భావిస్తున్న షిఫా ఆసుపత్రిపై ఇజ్రాయెల్ యుద్ధ విమానాలు దాడి చేశాయి. గాజా సిటీలో ఇదే అతిపెద్ద ఆసుపత్రి. ఇక్కడ వందలాది మంది క్షతగాత్రులు చికిత్స పొందుతున్నారు. ఎంతమంది బలయ్యారన్నది తెలియరాలేదు. హమాస్‌పై రెండో దశ యుద్ధం కొనసాగుతోందని ఇజ్రాయెల్ ప్రధానమంత్రి బెంజమిన్ నెతన్యాహూ ఉద్ఘాటించారు. రాబోయే రోజుల్లో శత్రువులపై భీకర పోరు తప్పదన్న సంకేతాలు ఇచ్చారు. మరోవైపు హమాస్ మిలిటెంట్లు సైతం వెనక్కి తగ్గడం లేదు. ఇజ్రాయెల్‌పైకి అప్పుడప్పుడు రాకెట్లు ప్రయోగిస్తున్నారు. దక్షిణ ఇజ్రాయెల్‌లో తరచుగా సైరన్ల మోత వినిపిస్తూనే ఉంది.

మూడు వారాలు దాటిన ఘర్షణ

ఇజ్రాయెల్ దాడుల్లో కమ్యూనికేషన్ల వ్యవస్థ దారుణంగా దెబ్బతిన్నది. మొబైల్ ఫోన్, ఇంటర్నెట్ సేవలు పూర్తిగా నిలిచిపోయాయి. ఆదివారం కొన్ని ప్రాంతాల్లో కమ్యూనికేషన్ల వ్యవస్థను పునరుద్ధరించారు. ఇజ్రాయెల్–హమాస్ మధ్య ఘర్షణ మొదలై మూడు వారాలు దాటింది. ఇజ్రాయెల్ దాడుల్లో గాజాలో ఇప్పటిదాకా మరణించిన పాలస్తీనియన్ల సంఖ్య 8,000 దాటిందని గాజా ఆరోగ్య శాఖ వెల్లడించింది. వీరిలో 3,300 మంది మైనర్లు, 2,000 మందికిపైగా మహిళలు ఉన్నారని ప్రకటించింది. శిథిలాల కింద మరో 1,700 మంది చిక్కుకుపోయినట్లు అంచనా. వారు ఎంతమంది బతికి ఉన్నారో చెప్పలేని పరిస్థితి. మృతుల సంఖ్య మరింత పెరిగే అవకాశం కనిపిస్తోంది. ఇజ్రాయెల్‌దాడులు తీవ్రతరం కావడం పాలస్తీనియన్లలో గుబు లు పుట్టిస్తోంది. ఇలాంటి భీకర దాడులను తామెప్పుడూ చూడలేదని వారు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

ఆర్మీకి నెతన్యాహూ క్షమాపణ

ఇజ్రాయెల్ భద్రతా దళాలకు ప్రధానమంత్రి బెంజమిన్ నెతన్యాహూ క్షమాపణ చెప్పారు. ఈ నెల 7న జరిగిన హమాస్ దాడిని ముందుగా గుర్తించడంలో నిఘా వ్యవస్థ దారుణంగా విఫలమైందంటూ ఆయన తొలుత 'ఎక్స్'లో పోస్టు చేశారు. దాడికి సంబంధించి భద్రతా దళాల అధికారులు ఎలాంటి ముందస్తు హెచ్చరికలు జారీ చేయలేదని తప్పుపట్టారు. నెతన్యాహు పోస్టుపై ఆయన సహచర మంత్రులు, విపక్షాల నుంచి విమర్శలు వెల్లువెత్తాయి. భద్రతా సిబ్బంది ఆత్మస్థైర్యాన్ని దెబ్బతీసేలా పోస్టులు పెట్టడం ఏమిటని పలువురు మండిపడ్డారు. దీంతో బెంజమిన్ తన వ్యాఖ్యలను ఉపసంహరించుకున్నారు. భద్రతా బలగా లకు క్షమాపణ చెప్పారు. వారికి తన పూర్తి మద్దతు ఉంటుందని పేర్కొన్నారు.

పశ్చిమాసియాలో శాంతి నెలకొనాలి: మోదీ

ఇజ్రాయెల్–హమాస్ యుద్ధం కారణంగా పశ్చిమాసియాలో ఉద్రిక్తత పెరిగిపోతుండడం పట్ల భారత ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ఆందోళన వ్యక్తం చేశారు. ఆయన శనివారం ఈజిప్ట్ అధ్యక్షుడు అబ్దెల్ ఫతా ఎల్–సిసీతో ఫోన్‌లో మాట్లాడారు. పశ్చిమాసియా పరిణామాలపై చర్చించారు. గాజాలో పరిస్థితులు నానాటికీ దిగజారుతుండడం, సాధారణ ప్రజలు మరణిస్తుండడం తీవ్ర విచాకరమని మోదీ పేర్కొన్నారు. పశ్చిమాసియాలో సాధ్యమైనంత త్వరగా శాంతియుత పరిస్థితులు నెలకొనాలని, ఇందుకు అంతర్జాతీయ సమాజం చొరవ చూపాలని కోరారు. ఈ మేరకు మోదీ ఆదివారం 'ఎక్స్'లో పోస్టు చేశారు. గాజాకు మానవతా సాయం అందిస్తామన్నారు.



దాడులతో గాజాస్ట్రిప్‌లో చెలరేగిన మంటలు. ఇజ్రాయెల్‌లోని సమీప సెదెరాట్ నగరం నుంచి కనిపించిన దృశ్యమిది

'ద్విదేశ' విధానమే పరిష్కారం: బైడెన్

ఇజ్రాయెల్–పాలస్తీనా వివాదానికి తెరపడాలని అమెరికా అధ్యక్షుడు జో బైడెన్ ఆకాంక్షించారు. ఇజ్రాయెల్–హమాస్ యుద్ధం ముగిసిన తర్వాత సమస్య పరిష్కారం కోసం ఏం చేయాలన్న దానిపై ఇజ్రాయెల్ ప్రభుత్వం, అరబ్ దేశాల నాయకత్వం ఇప్పటినుంచే దృష్టి పెట్టాలని సూచించారు. ద్విదేశ విధానానికి అత్యధిక ప్రాధాన్యం ఇవ్వాలని, దీనిపై ఒప్పందానికి వస్తే బాగుంటుందని అభిప్రాయపడ్డారు. ఇజ్రాయెల్, స్వతంత్ర పాలస్తీనా అనే రెండు దేశాలు ఉండాలని తాను కోరుకుంటున్నట్లు బైడెన్ స్పష్టం చేశారు. ఇదే విషయాన్ని ఇజ్రాయెల్ ప్రధాని నెతన్యాహూకు తెలియజేశానని అన్నారు.

వెస్ట్‌బ్యాంక్‌లో మరో దారుణం

ఇజ్రాయెల్‌పై హమాస్ రాకెట్ దాడులు మొదలైన తర్వాత వెస్ట్‌బ్యాంక్‌లో పాలస్తీనియన్లపై దాడులు పెరిగిపోతున్నాయి. ఆదివారం వెస్ట్‌బ్యాంక్‌లోని నబ్లూస్‌లో ఓ యూదు సెటిలర్ జరిపిన కాల్పుల్లో బిలాల్ సాలెహ్ అనే పాలస్తీనియన్ రైతు మరణించాడు. ఈ రైతు ఆలివ్ తోటలు సాగుచేస్తుంటాడు. వెస్ట్‌బ్యాంక్‌లో గత 23 రోజుల్లో యూదు సెటిలర్ల దాడుల్లో ఏడుగురు పాలస్తీనియన్లు మృతిచెందారు. ఇక ఇజ్రాయెల్ సైన్యం దాడుల్లో ఇక్కడ 110 మందికిపైగా జనం ప్రాణాలు కోల్పోయారు.

గోదాములు లూటీ

మూడు వారాలుగా కొనసాగుతున్న యుద్ధం వల్ల 23 లక్షల మంది గాజా ప్రజల్లో ఆగ్రహావేశాలు పెరిగిపోతున్నాయి. చల్లారని ఆకలి మంటలు వారిని లూటీలకు పురికొల్పుతున్నాయి. అంతర్జాతీయ సంస్థలు, ప్రపంచ దేశాలు అందిస్తున్న మానవతా సాయాన్ని గాజాలో ఐక్యరాజ్యసమితి ఆధ్వర్యంలోని యూఎన్‌ఆర్‌డబ్ల్యూఏ సంస్థ గోదాముల్లో భద్రపరుస్తోంది. ప్రజలకు పంపిణీ చేస్తోంది. అయితే, ఆకలికి తాళలేని జనం గోదాములను లూటీ చేస్తున్నారని, గోధుమ పిండి, ఇతర నిత్యావసరాలు, పరిశుభ్రతకు సంబంధించిన సామగ్రిని తీసుకెళ్తున్నారని వెల్లడించింది. గాజాలో 'సివిల్ ఆర్డర్' గతి తప్పుతోందని పేర్కొంది. పరిస్థితి నానాటికీ ఆందోళనకరంగా మారతోందని, ఆవేశంలో ఉన్న ప్రజలను నియంత్రించలేకపోతున్నామని తెలియజేసింది. రణభూమిగా మారిన గాజాలో ఉండలేక, ఇతర దేశాలకు వలస వెళ్లే మార్గం కనిపించక జనం నిరాశలో మునిగిపోతున్నారని, అంతిమంగా వారిలో హింసాత్మక ధోరణి పెరిగిపోతోందని స్పష్టం చేసింది.



ఐరాస కేంద్రం నుంచి సరుకులు ఎత్తుకుపోతున్న పాలస్తీనియన్లు

కేరళలో వరుస పేలుళ్లు

'జెహోవా' క్రైస్తవుల మత ప్రార్థనల్లో ఘటన

- ఇద్దరు మహిళలు మృతి... 51 మందికి గాయాలు
- దేశవ్యాప్తంగా చర్చిల వద్ద భద్రత కట్టుదిట్టం

కొచ్చి: కేరళ రాష్ట్రం ఎర్నాకుళంలోని కొచ్చి నగర సమీపంలో వరుస పేలుళ్ల ఘటన తీవ్ర సంచలనం సృష్టించింది. మతపరమైన వేడుక జరుగుతున్న కన్వెన్షన్ సెంటర్‌లో చోటుచేసుకున్న ఈ పేలుళ్లలో ఇద్దరు మహిళలు మృతి చెందారు. మరో 51 మంది గాయపడ్డారు. వారిలో కొందరి పరిస్థితి విషమంగా ఉంది. మూడు రోజులుగా జరుగుతున్న ఈ వేడుకల ముగింపు కార్యక్రమంలో భాగంగా ప్రత్యేక ప్రార్థనల్లో పాల్గొనేందుకు కలామాస్సెరీలోని జామ్రా ఇంటర్నేషనల్ కన్వెన్షన్ సెంటర్‌కు ఆదివారం ఉదయం వందలాది మంది 'జెహోవా' క్రైస్తవులు తరలివచ్చారు. అందరూ ప్రార్థనల్లో ఉండగా, ఉదయం 9.40 గంటలకు హఠాత్తుగా పేలుడు జరిగింది. కొద్దిసేపటికే మరోరెండు పేలుళ్లు సంభవించాయి. దీంతో జనమంతా తీవ్ర భయాందోళనకు గురయ్యారు. ఏం జరిగిందో అర్థమయ్యేలోపే ఇద్దరు మహిళలు ప్రాణాలు కోల్పోయారు. చాలామంది మంది రక్తమోడుతూ కనిపించారు. ఘటనా స్థలంలో భయానక వాతావరణం నెలకొంది. మొదటి రెండు పేలుళ్లు శక్తివంతమైనవిగా, మూడోది తక్కువ తీవ్రత కలిగిన పేలుడుగా పోలీసులు గుర్తించారు. పేలుళ్ల కోసం దుండగులు ఐఈడీ ఉపయోగించినట్లు కేరళ డీజీపీ షేక్ దర్వేష్ సాహెబ్ చెప్పారు. ఇది ఉగ్రవాద చర్యా? లేక మరేదైనా కారణం ఉందా? అనేది ఇప్పుడే చెప్పలేమని పేర్కొన్నారు. పేలుళ్లకు కారణమైన ముష్కరులను గుర్తించేందుకు ప్రత్యేక దర్యాప్తు బృందాన్ని(సిట్) ఏర్పాటు చేయనున్నట్లు వెల్లడించారు. క్షతగాత్రులను ఆసుపత్రికి తరలించామని, చికిత్స కొనసాగుతోందని డీజీపీ స్పష్టంచేశారు. పేలుళ్ల సమాచారం తెలియగానే కేరళ రాష్ట్ర యాంటీ–టెర్రరిజం స్క్వాడ్, జాతీయ దర్యాప్తు సంస్థ(ఎన్‌ఐఏ) అధికారులు రంగంలోకి దిగారు. ఘటనా స్థలంలో ఆధారాల కోసం అన్వేషణ ప్రారంభించారు. అన్ని కోణాల్లో దర్యాప్తు చేస్తున్నామని అధికారులు తెలిపారు.



బాంబు పేలుడుతో కన్వెన్షన్ సెంటర్ నుంచి భయంతో పరుగులు తీస్తున్న జనం

కేరళ గవర్నర్ దిగ్భ్రాంతి

క్రైస్తవుల మత ప్రార్థనల్లో పేలుళ్లు జరగడం పట్ల కేరళ గవర్నర్ ఆరిఫ్ మొహమ్మద్ దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. మృతురాలి కుటుంబానికి సంతాపం తెలిపారు. క్షతగాత్రులు త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. పేలుళ్ల ఘటన అత్యంత దురదృష్టకరమని కేరళ ముఖ్యమంత్రి పినరయి విజయన్ పేర్కొన్నారు. ఈ సంఘటనను తీవ్రంగా పరిగణిస్తున్నామని, దోషులను కఠినంగా శిక్షిస్తామని తేల్చి చెప్పారు.

పేలుళ్లకు తానే కారణం అంటూ వ్యక్తి లొంగుబాటు

కలామాస్సెరీలో తానే వరుస పేలుళ్లకు పాల్పడ్డానంటూ ఓ వ్యక్తి ఆదివారం కేరళలోని త్రిసూర్ జిల్లా కొడాకర పోలీసు స్టేషన్‌లో లొంగిపోయాడు. తాను కూడా 'జెహోవా' సభ్యుడినేనని చెప్పారు. లొంగిపోయిన వ్యక్తి పేరు డొమినిక్ మార్టిన్ అని పోలీసులు తెలిపారు. పేలుళ్లకు తానే కారణం అంటూ కొన్ని ఆధారాలు చూపించాడని వెల్లడించారు. అతడు చెప్పేది నిజమేనా? అనేది క్షుణ్నంగా విచారిస్తున్నామని అన్నారు.

కళ్ల ముందు అగ్నిగోళం కనిపించింది

కలామస్సెరీలో మత ప్రార్థనల్లో జరిగిన పేలుళ్లను తల్చుకొని ప్రత్యక్ష సాక్షులు బెంబేలెత్తిపోతున్నారు. తాను కళ్లు మూసుకొని పార్థన చేస్తున్నానని, హఠాత్తుగా భారీ పేలుడు శబ్దం వినిపించిందని ఓ మహిళ చెప్పారు. వెంటనే ఉలిక్కిపడి కళ్లు తెరిచానని అన్నారు. కళ్ల ముందు భగభగ మండుతున్న ఒక అగ్నిగోళం కనిపించిందని పేర్కొన్నారు.

పటేల్ జయంతి నాడు... మేరా యువ భారత్

యువతకు అద్భుత వేదిక • మన్ కీ బాత్‌లో మోదీ



న్యూఢిల్లీ: జాతి నిర్మాణ కార్యకలాపాల్లో యువత మరింత చురుగ్గా పాల్గొనేందుకు వీలుగా మేరా యువ భారత్ పేరుతో జాతీయ స్థాయి వేదికను అందుబాటులోకి తేనున్నట్టు ప్రధాని నరేంద్ర మోదీ ప్రకటించారు. సర్దార్ వల్లభ్ బాయి పటేల్ జయంతి సందర్భంగా అక్టోబర్ 31న దీన్ని ప్రారంభిస్తామని పేర్కొన్నారు. ఆ సందర్భంగా మేరా యువ భారత్ వెబ్‌సైట్‌ను కూడా ప్రారంభిస్తామని చెప్పారు. MYBharat.Gov.in సైట్‌లో పేర్లు నమోదు చేసుకోవాలని యువతకు సూచించారు. దీన్ని యువ శక్తిని జాతి నిర్మాణానికి, ప్రగతికి వినియోగపరిచేందుకు తలపెట్టిన అద్భుత కార్యక్రమంగా మోదీ అభివర్ణించారు. ఆదివారం ఆయన మన్ కీ బాత్ కార్యక్రమంలో జాతినుద్దేశించి మాట్లాడారు. అక్టోబర్ 31 దివంగత ప్రధాని ఇందిరాగాంధీ వర్ధంతి కూడానని గుర్తు చేసుకున్నారు. ఆమెకు ఘనంగా నివాళులర్పించారు. నవంబర్ 15న ఆదివాసీ నేత బిర్సా ముండా జయంతి సందర్భంగా ఆయనకు కూడా మోదీ నివాళులర్పించారు. విదేశీ పాలనను ఒప్పుకోని ధీర నాయకునిగా ఆయన చరిత్రలో నిలిచిపోతారన్నారు. తిల్కా మహరాజ్, సిద్ధూ, కాన్హు, తాంతియా భీల్ వంటి వీర గిరిజన నాయకులు దేశ చరిత్రలో అడుగడుగునా కనిపిస్తారన్నారు. గిరిజన సమాజానికి దేశం ఎంతగానో రుణపడిందన్నారు. స్థానికతకు మరింతగా పెద్ద పీట వేయాలని ప్రజలకు పిలుపునిచ్చారు. గాంధీ జయంతి రోజున ఖాదీ వస్తువుల అమ్మకం రికార్డులు సృష్టించిందని గుర్తు చేశారు.

ఢిల్లీలో అమృత్ వాటిక

రెండున్నరేళ్లుగా దేశవ్యాప్తంగా జరుగుతున్న ఆజాదీ కా అమృత్ మహోత్సవ్ అక్టోబర్ 31న ఘనంగా ముగియనుందని మోదీ చెప్పారు. ''దీనికి గుర్తుగా ఢిల్లీలో అమృత్ వాటిక నిర్మించనున్నాం. ఇందుకోసం అమృత్ కలశ్ యాత్రల పేరుతో దేశవ్యాప్తంగా మట్టిని సేకరించి పంపుతుండటం హర్షణీయం''అన్నారు. వ్యర్థాల నుంచి సంపద అన్నది మన నూతన నినాదమని మోదీ అన్నారు. గుజరాత్‌ల అంబా జీ మందిర్‌లో వ్యర్థబూాల నుంచి రూపొందించిన పలు కళాకృతులు అద్భుతంగా ఆకట్టుకుంటున్నాయన్నారు. దీన్ని దేశవాసులంతా స్ఫూర్తిగా తీసుకోవాలన్నారు. బెర్లిన్‌లో తాజాగా ముగిసిన ఒలింపిక్స్ వరల్డ్ సమ్మర్ గేమ్స్‌లో భారత్ 75 స్వర్ణాలతో పాటు ఏకంగా 200 పతకాలు సాధించడం గర్వకారణమన్నారు.

గిరిజన వీరుల ప్రస్తావన

ప్రధాని నరేంద్ర మోదీ మన్‌కీ బాత్‌లో గిరిజన వీరుల గురించి ప్రస్తావించారు. గిరిజన యుద్ధ వీరుల చరిత్రను ప్రశంసించారు. తెలంగాణలోని నిర్మల్, ఉట్నూరు, చెన్నూరు, ఆసిఫాబాద్ ప్రాంతాలను పరిపాలించి బ్రిటిష్ పాలనకు వ్యతిరేంగా పోరాడి ఉరికొయ్యకు ప్రాణాలర్పించిన రాంజీ గోండు, ఛత్తీస్‌గఢ్‌లో బస్తర్‌ప్రాంతానికి చెందిన వీర్ గుండాధుర్, మధ్యప్రదేశ్‌కు చెందిన ప్రథమ స్వాతంత్ర్య సమర యోధుడు భీమా నాయక్‌ల వీర చరిత్రను కొనియాడారు. అన్యాయానికి వ్యతిరేకంగా పోరాడిన తిల్కా మాంఝీ, సమానత్వం కోసం పోరాడిన సిద్ధో–కన్హూ, స్వాతంత్ర్య యోధుడు తాంతియా భీల్‌లు ఈ గడ్డపై పుట్టినందుకు గర్విస్తున్నామని ప్రధాని నరేంద్ర మోదీ పేర్కొన్నారు. గిరిజన ప్రజల్లో అల్లూరి సీతారామరాజు నింపిన స్ఫూర్తిని దేశం ఇప్పటికీ గుర్తుంచుకుందని పేర్కొన్నారు. గిరిజన సమాజానికి స్ఫూర్తినిచ్చిన రాణి దుర్గావతి 500వ జయంతిని దేశం జరుపుకొంటోందని, గిరిజన సమాజానికి స్ఫూర్తినిచ్చిన వారి గురించి యువత తెలుసుకొని వారి నుంచి స్ఫూర్తి పొందాలని ప్రధాని నరేంద్రమోదీ పేర్కొన్నారు.

సార్.. ప్రేమలో పడ్డా కాస్త డబ్బు సర్దండి!

నాగాలాండ్ బీజేపీ నేతకు యువకుడి వినతి

కోహిమా: రాజకీయ నాయకులకు తరచూ ఉద్యోగం, ఉపాధి, డబ్బు సాయం కావా లంటూ విజ్ఞాపనలు అందుతుండటం సహజంగా జరిగేదే. కానీ, ఓ యువకుడు మాత్రం తన కలల రాణితో ప్రేమ వ్యవ హారం సాగించేందుకు డబ్బు సర్దాలంటూ ప్రాధేయ పడ్డాడు. ఈ విడ్డూరం నాగాలాండ్‌లో చోటుచేసుకుంది. బీజేపీ నాగాలాండ్ అధ్యక్షుడు టెమ్‌జెన్ ఇమ్నా అలోంగ్ తనకు ఎదురైన అరుదైన అనుభవాన్ని స్వయంగా 'ఎక్స్'లో వివరించారు. ఆయనకు అరవింద పాండా అనే ఓ యువకుడు పంపిన మెయిల్‌లో ఇలా ఉంది.. 'సర్, ఈ నెల 31వ తేదీన నా గర్ల్‌ఫ్రెండ్‌తో మొద టిసారిగా డేటింగ్‌కు వెళ్తున్నాను. కానీ, ఇప్పటి వరకు నాకు ఉద్యోగం రాలేదు. దయవుంచి కొద్దిగా సాయం చేయండి. ఏదో ఒకటి చేయండి సార్'అని అందులో ఉంది. అందుకాయన, 'ఎలాంటి సాయం కావాలో చెప్పండి'అంటూ బదులి చ్చారు. 'ఎక్స్'లో అలోంగ్ పోస్టుకు నెటిజన్లు తమాషా వ్యాఖ్యలతో స్పందించారు. యువకు డితోపాటు డేటింగ్‌కు వెళ్లాలంటూ అలోంగ్‌కు ఒకరు సూచించగా, అతడికి డబ్బు సాయం చేయాలని మరొకరు కోరారు. లవర్ బోయ్ అరవింద పాండాకు ఎమ్మెల్యేగా అవకాశమి వ్వాలని, అతడికి ఉద్యోగమి వ్వాలని.. ఇలా రకరకాల సూచనలు చేశారు. తల్లిదండ్రులు ఎంపిక చేసిన అమ్మాయిని పెళ్లి చేసుకోవాలని మరొకరు ఆ యువకుడికి తెలిపారు. ఆ యు వకుడు జీవితంలో కఠినమైన పాఠా లను నేర్చుకోవాల్సిన అవసరం ఉన్నందున ఆ వినతిని పట్టించుకోవద్దని కొందరు పేర్కొన్నారు.

దేశ రాజధానికి చేరుకున్న తెలుగునేల మట్టి కలశాలు

సాక్షి, న్యూఢిల్లీ: ఆంధ్రప్రదేశ్, తెలంగాణల్లోని నలు మూలల నుంచి సేకరించిన మట్టి కలశాలు ఆదివారం ప్రత్యేక రైలులో ఢిల్లీకి చేరుకున్నాయి. ఆజాదీ కా అమృత్ మహోత్సవ్‌లో భాగంగా నా నేల నా మట్టి కార్యక్రమానికి ఆంధ్రప్రదేశ్, తెలంగాణల్లోని వందలాది గ్రామాల నుంచి సేకరించిన మట్టిని తీసుకొచ్చారు. ఈ క్రమంలో ప్రత్యేక రైలులో ఏపీ నుంచి 800 మంది, తెలంగాణ నుంచి 150 మంది వచ్చారు. సోమవారం ఇండియా గేట్ దగ్గర నిర్వహించే కార్యక్రమంలో ఉంచే కలశంలో ఈ మట్టిని పోస్తారు. తర్వాత ఆజాదీ కా మహోత్సవ్ గుర్తుగా చేపట్టే నిర్మాణాల్లో ఈ మట్టిని వినియోగించనున్నారు. తెలుగు రాష్ట్రాలకు చెందిన వారికి నిజాముద్దీన్ రైల్వేస్టేషన్‌లో ఏపీ భవన్ అదనపు రెసిడెంట్ కమిషనర్ హిమాన్షు కౌశిక్ ఆధ్వర్యంలో సిబ్బంది సంప్రదాయ దుస్తులతో ఘన స్వాగతం పలికారు. ఏపీ ప్రభుత్వం వారందరికీ వసతి, బస సౌకర్యాలు ఏర్పాటు చేసింది. లైజన్ ఆఫీసర్ సురేశ్‌బాబు, ఓఎస్డీ రవిశంకర్, జీవీఆర్ మురళి పాల్గొన్నారు.

ట్రాక్టర్‌తో విన్యాసం.. అతడి ప్రాణం తీసింది

చండీగఢ్: ట్రాక్టర్‌తో విన్యాసం చేస్తూ ఓ వ్యక్తి దురదృష్టవశాత్తూ ప్రాణాలు కోల్పోయాడు. పంజాబ్‌లోని గురుదాస్‌పూర్ జిల్లా సర్చుర్‌లో శనివారం ఈ విషాదం చోటుచేసుకుంది. సుఖ్‌మన్‌దీప్ సింగ్(29) గ్రామంలో జరుగుతున్న ఉత్సవంలోని మైదానంలో ట్రాక్టర్‌తో విన్యాసాలు చేస్తున్నాడు. స్టంట్స్‌లో నిపుణుడైన సుఖ్‌మన్‌దీప్ ముందుగా తన ట్రాక్టర్ రెండు చక్రాలను గాల్లోకి లేపి కిందికి దిగాడు. ఆ వాహనం గిరగిరా తిరుగుతుండగానే తిరిగి టైరుపైకి కాలుపెట్టి డ్రైవర్ సీట్లో కూర్చునే ప్రయత్నం చేశాడు. ఈ క్రమంలో కాలు జారీ ట్రాక్టర్ వెనుక చక్రాల కిందపడిపోయాడు. వేగంగా తిరుగుతున్న ట్రాక్టర్ అతడిపైకి పలుమార్లు వెళ్లడంతో తీవ్రంగా గాయపడి ప్రాణాలు కోల్పోయాడు.

రూ.160 కోట్ల డ్రగ్స్ పట్టివేత

ముంబై: మహారాష్ట్రలోని ఛత్రపతి సంభాజీనగర్‌లోని ఓ ఫ్యాక్టరీలో డైరెక్టరేట్ ఆఫ్ రెవెన్యూ ఇంటెలిజెన్స్ అధికారులు భారీగా డ్రగ్స్ పట్టుకున్నారు. ఆదివారం అపెక్స్ మెడికెమ్ ప్రైవేట్ లిమిటెడ్‌కు చెందిన రెండు ప్రాంతాల్లో దాడులు జరిపి రూ.160 కోట్ల విలువైన 107 లీటర్ల మెఫెడ్రిన్‌ను గుర్తించారు. ఈనెల 20న ఇదే జిల్లాలో జరిపిన దాడుల్లో రూ.250 కోట్ల విలువైన కెటమిన్, కొకైన్, మెఫెడ్రిన్‌లను స్వాధీనం చేసుకున్నారు.

పిస్టల్‌తో పారిపోయిన రేపిస్టు... ఎట్టకేలకు అదుపులోకి

నోయిడా: ఒక కస్టమర్‌పై ఆమె ఫ్లాట్‌లో అత్యాచారానికి పాల్పడి పోలీసుల నుంచి తప్పించుకున్న డెలివరీ బాయ్ ఆదివారం ఎట్టకేలకు మళ్లీ చిక్కాడు. నోయిడాకు చెందిన డెలివరీ బాయ్ సుమిత్ శర్మ శుక్రవారం ఒక స్థానిక అపార్ట్‌మెంట్‌లో పార్సిల్ డెలివరీ సందర్భంగా ఫ్లాట్‌లో ఒంటరిగా ఉన్న యువతిపై అత్యాచారానికి పాల్పడ్డాడు. దాంతో పోలీసులు శనివారం అతన్ని ఖరీపుర్‌లో అరెస్ట్ చేశారు. పోలీస్ స్టేషన్ తీసుకెళ్తే దారిలో అతను పోలీసుల నుంచి పిస్టల్ లాక్కుని పారిపోయాడు. దాంతో పోలీసులు బృందాలుగా ఏర్పడి అతనికోసం వేట సాగించారు. ఎట్టకేలకు వారి కంటబడ్డ సుమిత్ కాల్పులకు దిగాడు. పోలీసుల కాల్పుల్లో కాలికి తూటా దిగి పట్టుబడ్డాడు. అతనికి, సోదరునికి నేర చరిత్ర ఉన్నట్టు పోలీసులు తెలిపారు.

సాక్షి 24|7 కర్ణాటక
KARNATAKA
సోమవారం : 30 : అక్టోబర్ : 2023



తరగని ఆకర్షణ

ఆదివారం మైసూరు ప్యాలెస్ వీక్షణకు వచ్చిన పర్యాటకులు. దసరా ఉత్సవాలు ముగిసినప్పటికీ సందర్శకుల రద్దీ తగ్గలేదు

న్యూస్‌రీల్

రాఘవ సన్నిధిలో హోమం



హోమం నిర్వహిస్తున్న అర్చకులు

బనశంకరి: నగరంలో జయనగర ఐదోబ్లాక్‌లో వెలసిన నంజనగూడు శ్రీ గురురాఘవేంద్ర స్వామి మఠంలో చంద్రగ్రహణం సందర్భంగా గ్రహణ శాంతి హోమం నిర్వహించారు. శనివారం అర్ధరాత్రి మఠం ప్రముఖులు ఆర్‌కే.వాదీంద్రచార్య, జీకే.ఆచార్య ఆధ్వర్యంలో లోక కళ్యాణార్థం హోమం జరిపారు. ముగ్గులో లక్ష్మీ నరసింహస్వామి ఆకృతిని వేసి పూజలు చేశారు.

కేరళలో పేలుళ్లు.. రాష్ట్రంలో భద్రత పెంపు

శివాజీనగర: కేరళలో ఆదివారం బాంబు పేలుళ్ల నేపథ్యంలో రాష్ట్రంలో అటువంటివి జరగకుండా తీవ్ర నిఘా వహించాలని పోలీసులను ఆదేశించినట్లు హోం మంత్రి జీ పరమేశ్వర్ తెలిపారు. మడికెరి, మైసూరు, మంగళూరులో దసరా సమయంలో అవాంఛనీయాలు చోటుచేసుకోకుండా జాగ్రత్తలు తీసుకోవడమైనది. అలాగే కేరళను ఆనుకుని ఉండే జిల్లాలతో పాటు రాష్ట్రంలో దుస్సంఘటనలు జరగకుండా భద్రతను పెంచినట్లు తెలిపారు. రాష్ట్రంలో సైబర్ నేరాలు అధికం కావటం ఆందోళన కలిగిస్తోందన్నారు, వాటి అడ్డుకట్టకు ఆధునిక చర్యలను తీసుకోనున్నట్లు తెలిపారు. బిట్‌కాయిన్ అక్రమాల తరువాత రాష్ట్రంలో పోలీసులు ప్రపంచస్థాయి సాఫ్ట్‌వేర్‌ను ఉపయోగిస్తున్నారని చెప్పారు.

ఐటీ సిటీలో చిరుతపులి



రోడ్డుపై చిరుత వెళ్తున్న దృశ్యాలు

బొమ్మనహళ్లి: అడవుల నుంచి చిరుతపులులు ఏకంగా ఐటీ సిటీలోకి వచ్చేస్తున్నాయి. నగరంలోని బొమ్మనహళ్ళి దగ్గర హోసూరు రోడ్డులోని కూడ్లు గేట్‌లో చిరుతపులి సంచరించడం అక్కడి సీసీ కెమెరాల్లో రికార్డయింది. దామోదర్ రెడ్డి అనే వ్యక్తి ఇంటి ముందు నుంచి దర్జాగా రాత్రివేళ నడుచుకుంటూ చిరుత వెళ్లడం వీడియోలో ఉంది. చిరుతను వీధి కుక్కలు వెంబడించడంతో అది మరోచోటుకు పారిపోయింది. చిరుత సంచారం గురించి తెలిసి ప్రజలు రాత్రి ఇంటిలో నుంచి బయటకి రావడానికి భయపడుతున్నారు.

అటవీసిబ్బంది ఏమన్నారు?

దొడ్డబళ్లాపురం: అటవీశాఖ అధికారులు చిరుత సంచరించిన పరిసరాలలో గాలింపు జరిపారు. అవసరం అనిపిస్తే బోను ఏర్పాటు చేసి చిరుతను బంధిస్తామని తెలిపారు. ప్రజలు వదంతులను నమ్మకుండా జాగ్రత్తగా వ్యవహరించాలని సూచించారు.

హజ్‌భవన్‌లో రూ.3 కోట్ల సామగ్రి బుగ్గి

దొడ్డబళ్లాపురం: యలహంక సమీపంలో నిర్మాణమవుతున్న హజ్ భవనంలోని సభాభవనంలో శనివారం అగ్నిప్రమాదం సంభవించింది, ఆదివారంనాడు మంత్రి జమీర్ అహ్మద్ హజ్ భవనాన్ని పరిశీలించారు. అగ్నిప్రమాదంలో రూ.3 కోట్ల విలువైన ఫర్నిచర్, ఇతర వస్తువులు కాలిబూడిదయ్యాయి. ఇది ప్రమాదం కాదని, ఎవరో దుండగులు నిప్పు పెట్టారని హజ్ కమిటీ వారు కొత్తనూరు పోలీసులకు ఫిర్యాదు చేశారు. మంత్రి మాట్లాడుతూ ప్రమాదంపై విచారణ చేయిస్తామని, భవనానికి మరమ్మతులు చేయిస్తామని చెప్పారు.

త్వరలోనే మైసూరు దసరా ఖర్చుల ప్రకటన



దసరా ఉత్సవాలకు భారీగానే వ్యయం

మైసూరు: మైసూరు దసరా ఉత్సవాల ఖర్చులను జిల్లా కలెక్టర్ త్వరలోనే ప్రకటిస్తారని మంత్రి హెచ్.సి.మహదేవప్ప తెలిపారు. ఆదివారం మైసూరులో ఆయన మీడియాతో మాట్లాడారు. ఈసారి దసరా వేడుకలను కరువు సమస్య వల్ల ఘనంగా కాకుండా సంప్రదాయ రీతిలో జరిపినట్లు చెప్పారు. అధికారులు బాగా పనిచేశారని, సుమారు 10 లక్షల మంది ఉత్సవాలకు వస్తే ఎక్కడా ఇబ్బంది ఏర్పడలేదన్నారు. పర్యాటకులు భారీగా వస్తున్నందున నవంబర్ 5వ తేదీ వరకు నగరంలో విద్యుద్దీపాలంకరణను కొనసాగిస్తామన్నారు.

రాగి ముద్ద కోసం వెళ్లాము

బెంగళూరులో హోం శాఖ మంత్రి పరమేశ్వర్ ఇంటిలో భేటీకి వెళ్లడంపై మంత్రి మాట్లాడుతూ, ఆయన పిలవడంతో రాగి ముద్ద తినడం కోసం కలిశాము తప్ప అక్కడ ఎలాంటి రాజకీయ పోస్టుల గురించి చర్చ జరగలేదని అన్నారు.

ఎఫ్‌డీఏ పరీక్షల్లో గోల్‌మాల్?

- కలబురిగి, యాదగిరి జిల్లాల్లో హైటెక్ కాపీయింగ్
- ఇప్పటికి 9 మందికి పైగా అరెస్టు
- ఎస్‌ఐ స్కాం సూత్రధారి ఆర్‌డీ పాటిల్‌పై కేసు





శనివారం మంగళూరులోని ఓ సెంటర్‌లో ఎఫ్‌డీఏ పరీక్ష రాస్తున్న అమ్మాయిలు



లీకేజీల్లో నిపుణుడు.. ఆర్‌డీ పాటిల్

యశవంతపుర: గత ఏడాది 550 ఎస్‌ఐ పోస్టుల రాత పరీక్షలో బ్లూటూత్, హైటెక్ చూచిరాత ద్వారా భారీగా అక్రమాలు జరగడం తెలిసిందే, మళ్లీ విద్యుత్ శాఖ నిర్వహించిన ఉద్యోగ నియామకాల్లోనూ అక్రమాలు జరిగినట్లు ఆరోపణలు వచ్చాయి. తిరిగి అదే తంతు పునరావృతమైంది. శనివారం కర్ణాటక పరీక్ష ప్రాధికారచే ఎఫ్‌డీఏ (క్లర్క్) ఉద్యోగాల భర్తీకి అన్ని జిల్లాల్లో రాత పరీక్షలు జరిగాయి. ఇందులో కొందరు పరీక్షార్థులు బ్లూటూత్‌ను ఉపయోగించి బయటి నుంచి సమాధానాలు పొందారని కలబురిగి, యాదగిరిలో వెలుగులోకి వచ్చింది. గతంలో ఎస్‌ఐ కుంభకోణంలో కింగ్‌పిన్ ఆర్‌డీ పాటిల్‌పై మళ్లీ ఆరోపణలు గుప్పుమనడం గమనార్హం.

ఎలక్ట్రానిక్ సామగ్రి సీజ్

యాదగిరి, కలబురిగిలలో పోలీసులు 9 మందిని అరెస్ట్ చేసినట్లు కలబురగి నగర పోలీసు కమిషనర్ ఆర్ చేతన్ తెలిపారు. నిందితుల నుంచి బ్లూటూత్, వాకీటాకీ, పలు ఎలక్ట్రానిక్ ఉపకరణాలను స్వాధీనం చేసుకున్నట్లు వివరించారు. కలబురిగిలో శరణబసవేశ్వర కాలేజ్‌లోని పరీక్షా కేంద్రంలో అక్రమాలు జరిగినట్లు, అభ్యర్థి త్రిమూర్తి తళవార, అతని తమ్ముడు అంబరీష్, ఆర్‌డీ పాటిల్‌పై కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

యాదగిరిలో

పరీక్షల అక్రమాలలో పలువురిని అరెస్టు చేసినట్లు యాదగిరి ఎస్పీ జీ.సంగీత ఒక ప్రకటనలో తెలిపారు. అఫ్జల్‌పూర్ తాలూకా, విజయపుర జిల్లాలకు చెందిన అభ్యర్థులు వీరిలో ఉన్నట్లు చెప్పారు. వివిధ కాలేజీలలో ఏర్పాటైన పరీక్షా కేంద్రాల్లో వీరు పరీక్షలు రాస్తూ అక్రమాలకు పాల్పడుతూ దొరికిపోయారు. కోట్లాది రూపాయలు గతంలో ఎస్‌ఐ ఉద్యోగాల స్కాంలో చేతులు మారడం, ఆర్‌డీ పాటిల్‌తో సహా పలువురు సీనియర్ ఐపీఎస్‌లు కూడా అరెస్టు కావడం తెలిసిందే. పాటిల్ ఇటీవలే జైలు నుంచి విడుదలయ్యాడు. ఎఫ్‌డీఏ పరీక్షల బాగోతం ఎంత దూరం వెళ్తుందోనన్న ఉత్కంఠ ఏర్పడింది.

లోపల అన్న బయట తమ్ముడు

అభ్యర్థి త్రిమూర్తి ఎడమ చెవిలో రహస్యంగా బ్లూటూత్ డివైస్ పెట్టుకుని గుసగుసగా ప్రశ్నలు చెబుతుంటే, బయటి నుంచి సమాధానాలు వచ్చాయి. లేదా బయటి ప్రశ్నాపత్రం చూస్తూ సమాధానాలు ఫోన్లో చెప్పి ఉంటారని అనుమానాలున్నాయి. అతని తమ్ముడు అంబరీశ్ పరీక్షా కేంద్రం బయట కారులో కూర్చొని సమాధానాలు చెప్పాడు. ఇతడు ఎస్‌ఐ స్కాం సూత్రధారి ఆర్‌డీ పాటిల్‌కు అనుచరుడు. త్రిమూర్తి ధోరణి చూసి పరీక్షా కేంద్రం ఇన్‌చార్జి శిల్పా చక్కి ఇచ్చిన ఫిర్యాదు ఆధారంగా పోలీసులు కేసు నమోదు చేసి విచారణ చేపట్టగా గుట్టు బయటపడింది.



బాగల్‌కోటలో వాల్మీకి మహర్షి జయంతి ర్యాలీలో బృహత్ దప్పులతో కళాకారులు

జనవరిలో కుల గణన నివేదిక స్వీకరిస్తా: సీఎం

శివాజీనగర: కుల గణన నివేదికను తమ ప్రభుత్వం స్వీకరించనుందని సీఎం సిద్దరామయ్య చెప్పారు. ఆదివారం బెంగళూరులో ఓ కార్యక్రమంలో మాట్లాడిన ఆయన, దేశంలో కుల గణాంకాలు ముందుగా చేసినది తమ ప్రభుత్వమే, ప్రతి కులం ఆర్థిక, సామాజిక స్థితిని తెలియాలనేది లక్ష్యమన్నారు. ఇందుకోసం రూ.165 కోట్లు ఖర్చు చేశామని తెలిపారు. కుల గణాంకాల నివేదిక నేను దిగిపోయాక వచ్చింది. తరువాత యడియూరప్ప, కుమారస్వామి, బొమ్మయ్ వచ్చారు, వారు నివేదికను విడుదల చేయలేదని అన్నారు. కుమారస్వామిని నివేదిక తీసుకోవద్దని కొందరు బెదిరించారన్నారు. బీసీ కమిషన్ అధ్యక్షుడు జయప్రకాశ్ హెగ్డే జనవరిలో నివేదికను తనకు అందజేస్తారని చెప్పారు.

మామూలు విద్యార్థినే

తమ గ్రామంలో శానభోగరు.. మా కుటుంబంలో ఎవరూ లాయర్ కోర్సు చదవరాదన్నారు, కానీ నేను న్యాయవాదిని అయి అదే శానభోగరును ఆస్తుల కేసులో 2 గంటలపాటు ప్రశ్నించానని సిద్దరామయ్య చెప్పారు. చదువులో మామూలు విద్యార్థినే అయినా నేడు సీఎం అయ్యానని అన్నారు.

పాక్షిక గ్రహణం



బనశంకరీ దేవి ఆలయంలో పూజలు



బెళగావిలో పాక్షిక చంద్ర గ్రహణం దృశ్యం

బనశంకరి: శనివారం అర్ధరాత్రి పాక్షిక చంద్ర గ్రహణం సందర్భంగా మూతపడిన ఆలయాలను ఆదివారం వేకువజాము నుంచి తెరిచి శుద్ధి కార్యక్రమాలు, విశేష పూజలను నిర్వహించారు. అర్ధరాత్రి 1.05 గంటలకు గ్రహణం మొదలై 2.24 గంటలకు ముగిసింది. పలుచోట్ల ప్రజలు మేలుకుని రోదసీ వింతను వీక్షించారు. ఉదయం ప్రజలు ఇళ్లను శుభ్రం చేసి ఆలయాలకు వెళ్లి దేవున్ని దర్శించుకుని పూజలు నిర్వహించారు.

హోమాలు, పూజలు

బెళగావిలో దక్షిణ కాశీగా పేరుగాంచిన కపిలేశ్వర దేవస్థానంలో మూలవిరాట్టుకు బిల్వపత్రాలతో అర్చనలు చేశారు. మలెనాడులో సిగందూరు చౌడేశ్వరి ఆలయంలో తెల్లవారుజామున 4 గంటల నుంచి పూజలు ప్రారంభించారు. హోమం నిర్వహించి భక్తులకు దర్శనం కల్పించారు. విజయపురలో శ్రీచిదంబరేశ్వర మందిరంలో హోమం నిర్వహించి, స్వామికి ప్రత్యేక పూజలు చేపట్టారు. బెంగళూరులో బనశంకరి దేవస్థానంలో శుద్ధి తరువాత అమ్మవారికి విశేష పూజలు నిర్వహించారు. అలాగే గవి గంగాధరేశ్వర, కాడు మల్లేశ్వర, హలసూరు శివాలయంలోనూ శుద్ధి, ప్రత్యేక పూజలు జరిగాయి. పెద్దసంఖ్యలో భక్తులు తరలివచ్చి దేవుళ్లను దర్శించుకున్నారు.

గుండెల గుడిలో రెండేళ్లు

- పునీత్ రాజ్‌కుమార్ 2వ వర్ధంతి
- సమాధి వద్ద అభిమాన సంద్రం



సమాధికి సతీమణి అశ్విని, కుటుంబ సభ్యులు పూజలు



యశవంతపుర: అటు నటన, ఇటు సేవా వ్యక్తిత్వంతో మంచి పేరు సంపాదించి ఆకస్మికంగా అందరి నుంచి దూరమైన పవర్‌స్టార్ దివంగత పునీత్ రాజ్‌కుమార్ (46) రెండవ వర్ధంతిని అంతటా భారమైన హృదయాలతో నిర్వహించారు. ఆదివారానికి అప్పు అస్తమించి రెండేళ్లు అయ్యింది.

ఆ రోజు ఘోర విషాదం..

2021 అక్టోబరు 29... ఆరోజు ఉదయం 11 గంటలకు పునీత్ ఇంట్లో ఉండగా, ఆకస్మికంగా గుండెపోటు రావడంతో కారులో ఓ ఆస్పత్రికి వచ్చారు, అక్కడ పరీక్షించిన వైద్యుడు.. వెంటనే ఏదైనా పెద్ద ఆస్పత్రికి వెళ్లాలని సూచించారు. దీంతో పునీత్ కారులో మరో కార్పొరేట్ ఆస్పత్రికి వెళ్తుండగా ట్రాఫిక్‌లో చిక్కుకుని విలువైన సమయం గడిచిపోయింది. ఈలోపున మృత్యువు ముంచుకొచ్చింది. అర్ధగంటలో ఆయన కన్నుమూశారు. యావత్ కన్నడిగులు, సినీలోకంతో పాటు అభిమానులు దిగ్భ్రాంతికి లోనయ్యారు.



కంఠీరవలో తరలివచ్చిన జనసంద్రం

కంఠీరవలో సమాధికి పూజలు

అంతటా పుణ్య స్మరణను నిర్వహించారు. పునీత్ దూరమైనా, గుండెల్లో నిలిచిపోయారని అభిమానులు నివాళులు అర్పించారు. బెంగళూరులో కంఠీరవ స్టూడియోలోని పునీత్ సమాధికి కుటుంబ సభ్యులు, అభిమానులు చేరుకుని పూజలు చేశారు. ఆయనకు ఇష్టమైన వంటకాలను నైవేద్యంగా పెట్టారు. ఉదయం 9 గంటలకు సతీమణి అశ్విని, సోదరులు రాఘవేంద్ర, శివ రాజ్‌కుమార్‌లు ప్రత్యేక పూజలు నిర్వహించారు. స్టూడియోలో రక్తదాన, అన్నదాన కార్యక్రమాలను నిర్వహించారు. అభిమానులు తెల్లవారుజాము నుంచే క్యూ కట్టి సమాధిని దర్శించుకొన్నారు.

బైక్ ప్రమాదంలో యూట్యూబర్ మృతి

- గతంలో ట్రాఫిక్‌పై జాగృతికి కృషి



ఢీకొన్న బైక్‌లు



యూట్యూబర్ గణి

దొడ్డబళ్లాపురం: రెండు బైక్‌లు ముఖాముఖి ఢీకొన్న ప్రమాదంలో ఇద్దరు మృతి చెందిన సంఘటన బెంగళూరు యలహంక ట్రాఫిక్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని దొడ్డబళ్లాపురం–యలహంక రహదారి మార్గంలోని బీఎస్‌ఎఫ్ క్యాంపస్ ముందు శనివారం అర్ధరాత్రి చోటుచేసుకుంది. యూట్యూబర్ గణి, బీఎస్‌ఎఫ్ క్యాంపస్ ఉద్యోగి సుధాకర్ దుర్మరణం చెందారు. రోడ్డు భద్రత, ట్రాఫిక్ నిబంధనలపై వీడియోలు తీస్తూ ప్రజల్లో అవగాహన తీసుకువస్తున్న యూట్యూబర్ గణి.. తానే రోడ్డు ప్రమాదానికి బలి కావడం అభిమానులను కలచివేసింది.

గణి బుల్లెట్ బైక్‌పై వేగంగా వస్తుండగా బీఎస్‌ఎఫ్ క్యాంపస్ నుండి సుధాకర్ స్కూటర్‌లో వచ్చాడు. ఎదురెదురుగా ఢీకొనగా ఇద్దరికీ తీవ్ర గాయాలయ్యాయి. సుధాకర్ అక్కడికక్కడే మృతిచెందగా, గణి ఆస్పత్రికి తరలించగా చికిత్స ఫలించక చనిపోయాడు. ఇద్దరూ హెల్మెట్ ధరించకపోవడం గమనార్హం. యలహంక ట్రాఫిక్ పోలీసులు కేసు నమోదు చేసుకున్నారు.

పొలంలో మొసలి

ఈ చిత్రంలో కనిపిస్తున్నది బొమ్మ కాదు, నిజమైన మొసలే. మండ్య జిల్లాలోని మళవళ్ళి తాలూకాలోని బొప్పెగౌడన పుర దగ్గర కగ్గళ గ్రామంలో చెరువు పక్కనున్న పొలంలో ఈ మొసలి ప్రత్యక్షమైంది. రైతులు మొసలిని చూసి భయపడిపోయారు. అటవీ సిబ్బందికి ఫోన్ చేయగా, వారు వచ్చి సుమారు గంటపాటు శ్రమించి దానిని పట్టుకుని వెళ్లారు. సమీపంలోని కావేరి నదిలోకి వదిలిపెట్టారు. –మండ్య:



తీర్థయాత్రకు వెళ్తుంటే.. చెరువులోకి కారు పల్టీ

- భార్య, అత్తమామలు మృతి
- క్షేమంగా బయటపడిన అల్లుడు
- తుమకూరు జిల్లాలో సంఘటన



ఓ మహిళ మృతదేహం



చెరువు దగ్గర గుమిగూడిన జనం



కారును బయటకు తీస్తున్న దృశ్యం

తుమకూరు: ధర్మస్థలంలో మంజునాథ స్వామి దర్శనం కోసం బయలుదేరిన కుటుంబం కొంతసేపటికే ఘోర ప్రమాదంలో చిక్కుకుంది. స్వామిని కళ్లారా చూడకుండానే జల సమాధి అయ్యింది. కారు రోడ్డు పక్కన ఉన్న చెరువులోకి పడిపోవడంతో ఒకే కుటుంబానికి చెందిన ముగ్గురు మరణించిన ఘటన తుమకూరు జిల్లాలోని శిర తాలూకాలోని రామలింగాపురం చెరువు వద్ద ఆదివారం తెల్లవారుజామున జరిగింది.

వేగంలో అదుపుతప్పి..

వివరాలు.. శిరా తాలూకాలోని పట్టనాయకనహళ్ళి దగ్గర వీరాపుర గ్రామానికి చెందిన దొడ్డణ్ణ (60), సణ్ణమ్మ (55), వారి కుమార్తె యమున (35), ఈమె భర్త ప్రదీప్ (38)లు కారులో ధర్మస్థలకు బయల్దేరారు. శిరలో మెడికల్ షాపు నిర్వహించే ప్రదీప్ కారు నడుపుతున్నాడు. మార్గ మధ్యంలో బుక్కా పట్టణం దగ్గర రామలింగాపుర మణ్ణమ్మదేవి గుడికి వెళ్లాలని నిర్ణయించారు. రామలింగాపుర చెరువు కట్ట పైన వెళుతున్న సమయంలో కారు వేగంలో అదుపుతప్పి చెరువులోకి దూసుకెళ్లింది. యమున, ఆమె తల్లిదండ్రులు కారులో నుంచి బయటకు రాలేక నీట మునిగి ప్రాణాలు వదిలారు. ప్రదీప్ ఒక్కడు ఎలాగో బయటపడ్డాడు. రామలింగాపురం, వీరాపుర గ్రామస్తులు వచ్చి శిర పోలీసులకు సమాచారం ఇచ్చారు. ఫైర్ సిబ్బంది, ప్రజలు కలిసి కారును, మృతదేహాలను చెరువులో నుంచి బయటకు తీశారు. శిర పోలీసులు కేసు విచారణ చేపట్టారు. కాగా, యమున– ప్రదీప్ దంపతులకు సంతానం లేదు. ప్రమాదంపై కొన్ని అనుమానాలు తలెత్తడంతో పోలీసులు ప్రదీప్‌ను విచారణ చేపట్టారు.

కర్ణాటక పేరు మారిస్తే ఊరుకోం

దొడ్డబళ్లాపురం: కర్ణాటకను బసవనాడుగా పిలవచ్చన్న మంత్రి ఎంబీ పాటిల్ వ్యాఖ్యలపై కన్నడ భాషా సంఘాలు భగ్గుమన్నాయి. ఇటీవల మంత్రి ఎంబీ పాటిల్ మీడియాతో మాట్లాడుతూ కర్ణాటకను బసవనాడుగా పిలిస్తే తప్పేముందని అన్నారు. చెన్నపట్టణ పట్టణంలోని కావేరి సర్కిల్‌లో కస్తూరి కర్ణాటక జనపర వేదిక ఆధ్వర్యంలో ఆదివారం ఉదయం ధర్నా చేశారు. కన్నడ భాషా సంఘాల కార్యకర్తలు మంత్రి ఫోటోకు నిప్పంటించి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. బసవన్నపై తమకు అపారమైన గౌరవం ఉందని అయితే రాజకీయ లబ్ధి కోసం రాష్ట్రం పేరు మార్చాలనుకోవడం సమంజసం కాదన్నారు. కర్ణాటక పేరును యథాతథంగా కొనసాగించాలని, పేరు మార్చాలనే ప్రయత్నాలు చేస్తే తీవ్ర పరిణామాలుంటాయని హెచ్చరించారు.

క్లుప్తంగా

నగదు పురస్కారం



హజరాబి, ఆమె తండ్రిని సన్మానిస్తున్న దృశ్యం

కంప్లి: పీహెచ్‌డీలో బంగారు పతకాలు సాధించిన ఎమ్మిగనూరు గ్రామానికి చెందిన హాజరాబిని స్థానిక గ్రామ పంచాయతీ అభినందించి నగదు పురస్కారం అందజేసింది. స్థానికంగా నివాసం ఉంటున్న సాయిబన్న కుమార్తె హజరాబీ శ్రీకృష్ణదేవరాయ వర్సిటీలో రసాయన శాస్త్రంలో చేసిన పీహెచ్‌డీలో మూడు బంగారు పతకాలు సాధించింది. తమ ఊరికే గర్వకారణమని భావించి రూ. 75 వేల నగదు పురస్కారంతో పాటు తండ్రిని, హజరాబీని ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో పంచాయతీ పీడీఓ తారు లక్ష్మణ నాయక్, పంచాయతీ అధ్యక్షురాలు హెచ్‌జీ.శారద, ఉపాధ్యక్షులు హెచ్.గాదిలింగప్ప, కార్యదర్శి దొడ్డ బసవరాజ్, పంచాయతీ సభ్యులు పాల్గొన్నారు.

అధ్యాపకులకు వేతనాలు చెల్లించాలి

రాయచూరు రూరల్: రాష్ట్రంలో ఎయిడెడ్ పాఠశాలలు, కళాశాల అధ్యాపకులకు వెంటనే బకాయి వేతనాలు చెల్లించాలని ఎయిడెడ్, కళాశాల అధ్యాపకుల సంఘం అధ్యక్షుడు హర్షవర్ధన్ డిమాండ్ చేశారు. ఆదివారం విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ...నూతన పింఛన్ విధానం వల్ల తమకు అన్యాయం జరుగుతోందని, పాత పింఛన్‌ను కొనసాగించాలన్నారు.

జానపద కళలను ప్రోత్సహించండి



మాట్లాడుతున్న పాపారెడ్డి

రాయచూరు రూరల్: రాష్ట్రంలో నశించిపోతున్న జానపద కళలను ప్రోత్సహించాలని మాజీ శాసన సభ్యుడు పాపారెడ్డి పిలుపునిచ్చారు. ఆదివారం గిరి అభయాంజనేయ ఆలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. నేడు టీవీ, మొబైళ్లు రావడంతో జానపద కళలు అంతరించిపోతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో బసవరాజ, శరణప్ప గోనాళ, ప్రతిభ, వీరేంద్ర, నరేంద్ర తదితరులు పాల్గొన్నారు.

స్వాధీనం చేసుకున్న భూములను అప్పగించాలి

కంప్లి: ప్రభుత్వ కర్మాగారాల స్థాపన కోసం స్వాధీనం చేసుకున్న రైతుల భూములను తిరిగి అప్పగించాలని కుడితిని పట్టణ బస్టాండ్ వద్ద సీఐటీయూ, కర్ణాటక ప్రాంత రైతు సంఘం కుడితిని భూ సంత్రస్తర పోరాట సమితి కన్నడ పర సంఘాలు, రైతులు చేపట్టిన నిరవధిక ఆందోళన నేటితో 316వ రోజుకు చేరింది. ప్రభుత్వం కనీసం స్పందించకపోవడం దారుణమని, ఇది రైతు వ్యతిరేక ప్రభుత్వమని వారు ఆగ్రహం వ్యక్తం చేశారు.

వైభవంగా ఉద్భవ యల్లమ్మ ఉత్సవాలు





రాయచూరు రూరల్: జిల్లాలో ఆదివారం శరన్నవ రాత్రి ఉత్సవాలు ముగింపులో భాగంగా ఆశాపూర రహదారిలో వెలసిన ఉద్బవ యల్లమ్మ ఉత్సవాలు ఘనంగా నిర్వహించారు. పెద్ద ఎత్తున భక్తులు అమ్మవారిని దర్శించుకున్నారు.

విద్యార్థులకు వ్యాసరచన పోటీలు



బళ్లారిటౌన్: తాలూకాలోని కొళగల్లు గ్రామంలో స్థానిక శ్రీ ఎర్రితాత దేవాలయ ఆవరణంలో ఆదివారం స్థానిక పూర్వవిద్యార్థులు ఆధ్వర్యంలో కన్నడ రాజ్యోత్సవాలను పురస్కరించుకొని విద్యార్థులకు వ్యాసరచన పోటీలను ఏర్పాటు చేశారు. ఈ పోటీల్లో 1వ తరగతి నుంచి 10వ తరగతి వరకు ఆ గ్రామ విద్యార్థులతో పాటు నగర విద్యార్థులు కూడా దాదాపు 100 మంది దాక పోటీల్లో పాల్గొన్నారు. ఇందులో 3 దశలుగా పోటీలు నిర్వహించి హైస్కూల్ విద్యార్థులకు మొదటి బహుమానం రూ.3 వేలు, రెండవ బహుమతి రూ.1500, ప్రాథమిక విద్యార్థులకు మొదటి బహుమతి రూ.2000, రెండవ బహుమతి రూ.1000 పంపిణీ చేశారు. కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు వీరేష, శివనందా, వినోద్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

బాల్య వివాహాలకు అడ్డుకట్ట ఏదీ ?

- చట్టాలు చేసినా ఆగని సాంఘిక దురాచారం
- ఉమ్మడి బళ్లారి జిల్లాలో కొనసాగుతున్న వైనం

సాక్షి బళ్లారి: 18 ఏళ్లు నిండకుండా వివాహం చేయడం చట్ట రీత్యా నేరమని తెలిసినా బంధుత్వం తప్పిపోతుందని, తాము మరణించే లోపు పిల్లల పెళ్లి చేయాలని కొందరు నిబంధనలు ఉల్లంఘిస్తున్నారు. పెళ్లీడు రాకముందే జరుగుతున్న వివాహాలకు అడ్డుకట్ట పడటం లేదు. ప్రభుత్వాలు పట్టించుకోకపోవడంతో పాటు గ్రామీణ ప్రాంతాల్లో తల్లిదండ్రుల్లో ఉన్న మూఢ నమ్మకాలు, ఆర్థిక ఇబ్బందులు బాల్య వివాహాలు కొనసాగుతూనే ఉన్నాయి. గత ఆరు నెలలుగా ఉమ్మడి బళ్లారి జిల్లాలోని విజయనగర జిల్లా చుట్టుపక్కల తాలూకాలతో పాటు బళ్లారి జిల్లాలో కూడా బాల్యవివాహాల సంఖ్య గణనీయంగా పెరుగుతున్నట్లు అధికారుల గణంకాలు చెబుతున్నాయి. దాదాపు 100కి పైగా బాల్య వివాహాలను జరిగాయని, 52 మందిపై కేసులు నమోదు చేసినట్లు తెలుస్తోంది.



వివాహ భారంతో పసిప్రాయం నలిగిపోతోంది

చట్టాలు తెచ్చినా..:

బాల్య వివాహాల నిరోధానికి ఎన్ని చట్టాలు తెచ్చినా గట్టు చప్పుడు కాకుండా వివాహాలు జరుగుతున్నాయి. విజయనగర జిల్లాల్లో దేవదాసి పద్ధతి నిర్మూలన చేస్తున్నప్పటికీ, బాల వివాహాలు పెరిగిపోతున్నాయి. ప్రభుత్వాలు, స్వచ్ఛంద సంస్థలు జాగృతి కార్యక్రమాలను చేపడుతున్నప్పటికీ కుగ్రామాల్లో పేదరికంతో తమ పిల్లలకు చిన్న వయస్సు లోనే పెళ్లిళ్ల చేసి చేతులు దులుపుకుంటున్నారు. బాల్య వివాహాల టోల్ ఫ్రీ నెంబర్ 1098కు ఫోన్ చేసి సమాచారం ఇస్తుండటంతో కొంతవరకు అడ్డు కట్టపడుతోంది. హగరిబొమ్మనహళ్లి, హడగలి, హరప్పనహళ్లి, కూడ్లిగి, బళ్లారి, హొసపేట, సిరుగుప్ప నియోజక వర్గాల్లో పెద్ద ఎత్తున బాల్య వివాహాలు జరుగుతుండటంతో ఇప్పటి వరకు అధికారులు 40 బాల్య వివాహాలకు అడ్డుకట్టపడింది. బాల్య వివాహాల సమాచారం అందిన వెంటనే సంబంధిత అధికారులు రంగంలోకి దిగుతున్నారు.

ఆందోళన కలిగించే పరిణామాలు :

జిల్లాలో విపరీతమైన కరువు, పిల్లలను చదివించలేని దుస్థితి. దీంతో తల్లిదండ్రులు పదో తరగతి పూర్తయిన వెంటనే బాలికలకు పెళ్లిల్లు చేస్తున్నారు. జిల్లాలో బాల్య వివాహాలు, బాలకార్మికులు, దేవదాసీ పద్ధతి నిర్మూలన చేసేందుకు మరింత జాగృతి కల్పించాల్సిన అవసరం ఉందని పలు మహిళా సంఘాలు పేర్కొంటున్నారు. రాష్ట్రంలోనే ఇతర జిల్లాలతో పోలిస్తే ఇక్కడ బాల్య వివాహాలు పెద్ద ఎత్తున జరుగుతున్న తరుణంలో ఉమ్మడి బళ్లారి జిల్లాలో సామాజిక దురాచారంగా ఉన్న ఈ వ్యవస్థను నిరోధించేలా కఠిన చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

పునీత్ వర్ధంతి



బళ్లారిలో పునీత్‌కు నివాళి



కంప్లిలో పునీత్‌కు నివాళి అర్పిస్తున్న దృశ్యం



హొసపేటలో పునీత్ విగ్రహం వద్ద అభిమానులు

కంప్లి: అనాధలకు అండగా ఉండి, అనాథశ్రమాలకు ఆర్థిక సాయం చేస్తూ దానగుణం కలిగిన డాక్టర్ పునీత్ రాజ్‌కుమార్ అందరి హృదయాల్లో చిరస్థాయిగా నిలిచిపోయారని యూత్ కాంగ్రెస్ అధ్యక్షులు శశికుమార్ తెలిపారు. దివంగత డాక్టర్.పునీత్ రాజ్‌కుమార్ ద్వితీయ వర్ధంతి సందర్భంగా అంబేడ్కర్ సర్కిల్ వద్ద పునీత్ విగ్రహానికి శ్రద్ధాంజలి సమర్పించారు. ఆస్పత్రి ముందు అభిమానులు పట్టణ సమస్త పునీత్ అభిమానులు కరాటే విద్యార్థినులు నివాళి అర్పించారు. ఈ సందర్భంగా రామచంద్ర సోఫిసాట్ పెయింటర్ నీలప్ప, కరాటే కోచ్ మొహ్మద్, జింబాళు గంగణ్ణ, ఆర్‌పీ శశికుమార్ రాజాబక్షి తదితరులు పాల్గొన్నారు.

రాయచూరు రూరల్ : నగరంలో డాక్టర్ పునీత్ రాజ్ కుమార్ ద్వితీయ వర్ధంతిని నిర్వహించారు. ఆదివారం నిరాశ్రిత కేంద్రంలో పునీత్ రాజ్ కుమార్ ట్రస్ట్ ఆధ్వర్యంలో వర్ధంతిని జరిపారు. కార్యక్రమంలో ట్రస్ట్ అధ్యక్షుడు సాదిక్ తదితరులు పాల్గొన్నారు.

పునీత్ సేవలు శ్లాఘనీయం

బళ్లారిటౌన్: పునీత్ సేవలు శ్లాఘనీయమని కర్ణాటక రక్షణ వేదిక కవాలుపడే రాష్ట్ర అధ్యక్షులు హెచ్.సురేష్ పేర్కొన్నారు. ఆదివారం నగరంలో ముగులు నగే ఫౌండేషన్ కర్ణాటక రక్షణ వేదిక కవాలుపడే ఆధ్వర్యంలో కర్ణాటక రత్న డాక్టర్ పునీత్‌రాజ్ కుమార్ వర్ధంతిని స్థానిక సూర్యనివాస వృద్ధాశ్రమంలో జరుపుకొని మాట్లాడారు. రాష్ట్రానికి ఆయన చేసిన సేవలు అపారమని, ఆయన చిరస్మరణీయుడని కొనియాడారు. కార్యక్రమంలో ఫౌండేషన్ సంస్థాపకులు వీఎస్.సాగర్ అప్పు, నేతలు శివు, శ్రీకాంత్, శేఖు, అయాన్, దినేష్‌కుమార్, రసూల్, నరసింహ, శరత్ తదితరులు పాల్గొన్నారు.

పునీత్‌కు నివాళి

హొసపేటె: నగరంలో డాక్టర్ పునీత్‌రాజ్‌కుమార్ సర్కిల్ వద్ద అప్పు అభిమానులు ఆదివారం పునీత్ రాజ్‌కుమార్ విగ్రహానికి ఘన నివాళి అర్పించారు. విగ్రహాన్ని కౌగిలించుకుని అభిమానాన్ని చాటారు. అనంతరం అభిమానులకు విందు భోజనం ఏర్పాటు చేశారు.

ఎస్టీ రిజర్వేషన్‌ను కేంద్రం అనుమతించాలి



వాల్మీకి చిత్రపటాన్ని ఊరేగిస్తున్న దృశ్యం

గంగావతి: ఎస్టీలకు 7.5 శాతం రిజర్వేషన్ కల్పిస్తూ రాష్ట్ర అసెంబ్లీ చేసిన తీర్మానాన్ని కేంద్రం అనుమతించాల్సి ఉందని ప్రజా పనుల శాఖ మంత్రి సతీష్‌జారకిహొళి తెలిపారు. తాలూకాలోని ఆనెగుంది గ్రామంలో ఆదివారం వాల్మీకి జయంతిని కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించి మాట్లాడారు. ఆర్టికల్ 9 ప్రకారం కేంద్ర ప్రభుత్వం ఎస్టీ వర్గాలకు 7.5 శాతం రిజర్వేషన్ విషయం దిద్దుబాటు చేయాల్సి ఉందని ఆయన వివరించారు. తమ వంతుగా కేంద్రంపై ఒత్తిడి తెస్తామని తెలిపారు. ఈ రిజర్వేషన్ వల్ల సమాజంలో వెనుకబడిన వారికి ఆర్థికంగా, విద్య, ఉద్యోగ అవకాశాలు లభిస్తాయని తెలిపారు. రామాయణాన్ని రచించిన మహర్షి వాల్మీకి ఆదర్శాలు, తత్వాలను నేటి తరాల యువకులు ఆచరించాలని సూచించారు. అంతకుముందు వాల్మీకి చిత్రపటాన్ని ట్రాక్టర్‌పై గ్రామ వీధుల్లో ఊరేగించారు. కార్యక్రమంలో కొప్పళ ఎమ్మెల్యే రాఘవేంద్ర హిట్నాల్, జిల్లా పంచాయతీ మాజీ అధ్యక్షులు రాజశేఖర్ హిట్నాల్, జిల్లా పంచాయతీ మాజీ సభ్యులు హనుమేష్ నాయక్, కంప్లి ఎమ్మెల్యే గణేష్, గంగావతి వాల్మీకి నేతలు వడ్డరహట్టి వీరభద్రప్ప నాయక్, హనుమంతప్పనాయక్, స్థానిక వాల్మీకి ప్రముఖులు పాల్గొన్నారు.

స్కూటర్ డిక్కీలో రూ.8 లక్షలు చోరీ

హుబ్లీ: స్కూటర్ డిక్కీలో ఉంచిన రూ. 8 లక్షల నగదు చోరీ జరిగిన ఘటన ఆదివారం చోటు చేసుకుంది. విద్యానగర్ నివాసి సునీల్‌జాడ్ డబ్బు పోగొట్టుకున్న బాధితుడు. ఆయన కంపెనీ నగదు రూ. 6 లక్షలు, తన వద్ద ఉన్న రూ. 2 లక్షల నగదును స్కూటర్ డిక్కీలో ఉంచి ఓ పార్కింగ్ ప్రదేశంలో పెట్టి వెళ్లాడు. కొద్దిసేపు తరువాత వచ్చి చూడగా డిక్కీ తెరిచి ఉంది. అందులో నగదు కనిపించలేదు. బాధితుడు ఉపనగర పోలీసులకు ఫిర్యాదు చేశాడు.

కారు అపహరణ

గుర్తు తెలియని వ్యక్తులు కారు అపహరించిన ఘటన నవనగర పరిధిలో చోటు చేసుకుంది. నవనగర బసవాయ ఎస్టేట్ నివాసి సునీత తాను పని చేసే కార్యాలయం ఎదుట బెల్లనో కారును పార్కు చేసింది. సాయంత్రం వచ్చి చూడగా కారు కనిపించలేదు. బాధితురాలు నవనగర ఏపీఎంసీ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు.

ఆభరణాలు, నగదు చోరీ

హుబ్లీ: ఇంటి తాళం పగలకొట్టి రూ.3.55 లక్షల విలువైన బంగారు నగలు, కొంత నగదు చోరీ జరిగిన ఘటన పాత హుబ్లీ అజ్మీర్ నగర్‌లో చోటు చేసుకుంది. మహమ్మద్ షేక్ అనే వ్యక్తి కుటుంబ సమేతంగా పొరుగూరికి వెళ్లాడు. ఈ సమయంలో దొంగలు ఇంటి తాళం బద్దలు కొట్టి ఇంటిలో ఉన్న 75 గ్రాముల బంగారు నగలు, కొంత వెండి, రూ. 40 వేల నగదు ఎత్తుకెళ్లారు. బాధితుడు పోలీసులకు ఫిర్యాదు చేశాడు.

మలియమ్మదేవి జాతర



అమ్మవారి ఊరేగింపు దృశ్యం

గంగావతి: కారటగి పట్టణంలో మలియమ్మదేవి 12వ జాతర మహోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మలియమ్మదేవిని అడ్డపల్లకిపై కూర్చొబెట్టి డప్పుల వాయిద్యాలు, మహిళల పూర్ణకుంభాలతో ఊరేగింపు నిర్వహించారు. సందర్భంగా భక్తులకు భోజన సదుపాయం కల్పించారు.

విద్యకు అడ్డంకులు రాకూడదు



జ్యోతి వెలిగిస్తున్న దృశ్యం

రాయచూరు రూరల్: సమాజంలో పేద విద్యార్థుల విద్యకు అడ్డంకులు రాకూడదని మాజీ మంత్రి పుట్టరంగ శెట్టి, శాసన సభ్యుడు శివరాజ్ పాటిల్ అన్నారు. శనివారం వీరశైవ కళ్యాణ మంటపంలో భగీరథ ఉప్పార సమాజం ఏర్పాటు చేసిన ప్రతిభావంత విద్యార్థులకు సన్మాన కార్యక్రమంలో వారు మాట్లాడారు. గ్రామీణ విద్యకు ప్రాధాన్యత కల్పించి విద్యార్థులను భావి భారత పౌరులగా తీర్చిదిద్దాలన్నారు. విద్యతోనే సమాజం అభివృద్ధి చెందుతుందన్నారు. భగీరథ ఉప్పార సమాజం సభ్యులు ఆర్థికంగా, రాజకీయంగా ఎదగాలన్నారు. సమావేశంలో మలదకల్ నిజానంద స్వామీజీ, వెంకోబ, శ్రీకాంత్ పద్మావతి, రామాంజినేయ, శుభాష్‌చంద్ర పాల్గొన్నారు.

చిక్‌జాజూర్ రైలును చిక్కమగళూరు వరకు పొడిగించాలి



రాయదుర్గం రైల్వేస్టేషన్‌లో గుంతకల్లు-చిక్కమగళూరు ప్యాసింజర్ రైలు

రాయదుర్గంటౌన్: రాయదుర్గం మీదుగా నడిచే గుంతకల్లు-చిక్కజాజూర్ ఫాస్ట్ ప్యాసింజర్ రైలును (07585/07586) చిక్కమగళూరు వరకు పొడిగించాలని ఆంధ్ర కర్ణాటక ప్రాంత ప్రజలు డిమాండ్ చేస్తున్నారు. ప్రస్తుతం గుంతకల్లు-చిక్‌జాజూర్ ప్యాసింజర్ రైలును బళ్లారి, రాయదుర్గం, మొలకాల్మూరు, చెళ్లకెర, చిత్రదుర్గం మీదుగా చిక్‌జాజూర్ వరకు రాకపోకలు సాగిస్తోంది. ఈ రైలును చిక్‌జాజూర్ నుంచి కేవలం 100 కిలోమీటర్ల దూరంలో ఉన్న ప్రముఖ పర్యాటక, ఎన్నో ఆకర్షణీయ స్థలాలతోపాటు ప్రముఖ ఆధ్యాత్మిక స్థలమైన దాదాపహాడ్ (బాబాబుడెన్‌గిరి హిల్స్)కు వెళ్లేందుకు చిక్కమగళూరు వరకు పొడిగించాలని కోరుతున్నారు. దాదాపహాడ్‌కు ప్రతి రోజూ ప్రయాణికులు వెళుతుంటారన్నారు. బెంగళూరు వెళ్లి ప్రతిసారి కడూరులో దిగి చిక్‌మగళూరు వెళ్లాల్సి ఉంటోందన్నారు. గుంతకల్లు, చిక్‌జాజూర్ రైలును కడూరు మీదుగా చిక్‌మగళూరుకు నడిపితే ప్రయాణికులకు ఎంతో సౌకర్యంగా ఉంటుందన్నారు.

మరింత క్షీణించిన నీటిమట్టం

- 34 టీఎంసీలకు చేరిన టీబీ డ్యాం



తుంగభద్ర జలాశయం

బొమ్మనహాళ్: హొసపేటె వద్దనున్న తుంగభద్ర జలాశయంలో నానాటికీ నీటిమట్టం పడిపోతోంది. దీంతో ఆయకట్టు జిల్లాల రైతులు, ప్రజల్లో సాగు, తాగునీటి కోసం తీవ్ర ఆందోళన నెలకొంది. ఆదివారం 34.53 టీఎంసీల నీటి నిల్వ ఉంది. గతేడాది ఇదే సమయానికి డ్యాంలో పూర్తి సామర్థ్యం మేరకు 105.42 టీఎంసీల నీటితో అటు నది, ఇటు డ్యాం తొణికిసలాడుతూ ఉండేది. ఈ ఏడాది తీవ్ర వర్షాభావం కారణంగా జలాశయంలోకి ఆశించిన స్థాయిలో నీరు చేరలేదు. అలాగే కాలువలకు వదులుతున్న నీరు, ఆవిరి రూపంలో నీరు వేగంగా తరిగిపోతోంది. ఇప్పుడు 1608 అడుగులతో 34.53 టీఎంసీల నీరు మాత్రమే మిగిలి ఉన్నట్లు డ్యాం అధికారులు తెలిపారు. జలాశయంలోకి వచ్చే ఇన్‌ఫ్లో నిలిచిపోగా, కాలువలకు వదిలే ఔట్ ఫ్లో 8,909 క్యూసెక్కులుంది. ఆంధ్రా సరిహద్దులో (105వ కిలోమీటర్ వద్ద) 1,790 క్యూసెక్కులు నీటి ప్రవాహం కొనసాగుతోంది. గతేడాది ఇదే సమయానికి 1632 అడుగుల పరిమాణంలో నీరుండేది. 8,881 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో, 8,978 క్యూసెక్కుల అవుట్ ఫ్లో ఉండేది. రానున్న రోజుల్లో వర్షాలు రాకపోతే డ్యాం దాదాపు ఎండిపోయే ప్రమాదముందని భావిస్తున్నారు.

కులగణనకు అగ్ర కులాల అడ్డు



మాట్లాడుతున్న శెట్టి

రాయచూరు రూరల్: రాష్ట్రంలో కుల గణన నివేదిక బహిరంగ పరచడానికి ముఖ్యమంత్రి సిద్దరామయ్య సిద్ధంగా ఉన్నా అగ్రకులాలు అడ్డుకుంటున్నాయని మాజీ మంత్రి పుట్టరంగ శెట్టి అన్నారు. శనివారం వీరశైవ కళ్యాణ మంపటంలో భగీరథ ఉప్పార సమాజం ఏర్పాటు చేసిన ప్రతిభావంత విద్యార్థుల సన్మాన కార్యక్రమంలో మాట్లాడారు. కాంతరాజ కమిషన్ విషయంలో మాజీ ముఖ్యమంత్రి కుమారస్వామి అడ్డు పడ్డారన్నారు. దేవరాజ అరసును ఉప్పార సమాజం ఎప్పటికి మరువదన్నారు

సాహిత్య రంగానికి ఉన్నత సేవలందించాలి

రాయచూరు రూరల్: జిల్లాలో సాహిత్య రంగానికి కవులు, సాహితీవేత్తలు ఉన్నత సేవలందించాలని హంపి విశ్వ విద్యాలయం రిజిస్ట్రార్ విజయ్ పుణచ్చ పిలుపునిచ్చారు. ఆదివారం భారతీయ వైద్యకీయ భవనంలో మాన్వి బసవకేంద్రం, లోహియ ప్రతిష్టాన ఆధ్వర్యంలో బసవప్రభు పాటిల్ రాసిన సాహిత్య పుస్తకాలను విడుదల చేసి మాట్లాడారు. జిల్లాలో శరణులు, దాసులు, సంతుల పరంపరాన్ని పుచ్చుకున్న విషయాన్ని ప్రస్తావించారు. సమావేశంలో అల్లమప్రభు పాటిల్, అమరేష్, సర్వ మంగళ, చెన్న బసవణ్ణ తదితరులు పాల్గొన్నారు.

వాల్మీకి విగ్రహం ఆవిష్కరణ



వాల్మీకి విగ్రహనికి పూజలు

రాయచూరు రూరల్: తాలూకాలోని లింగఖాన్ దొడ్డిలో మహర్షి వాల్మీకి జయంతిని నిర్వహించారు. ఆదివారం గ్రామంలో వాల్మీకి సర్కిల్ వద్ద కొత్తగా ఏర్పాటు చేసిన వాల్మీకి విగహాన్ని కిల్లే బ్రహన్మఠ మఠాధిపతి శాంతమల్ల శివాచార్యులు పూజలు చేసి ప్రారంభించారు. కార్యక్రమంలో ఉమాదేవి, నాగరాజ్ నాయక్ తదితరులు పాల్గొన్నారు.

ఆర్‌ఎస్‌ఎస్ మహా ర్యాలీ



హొసపేటె: ఆర్‌ఎస్‌ఎస్ నాయకులు, కార్యకర్తలు ఆదివారం నగరంలో మహా ర్యాలీ నిర్వహించారు. హంపీ రోడ్డులోని పాత వాసవీ స్కూల్ నుంచి యూనిఫామ్ ధరించి నగర ప్రధాన సర్కిళ్లలో ర్యాలీ నిర్వహించారు. హోస్పేట్ డీవైఎస్పీ మంజునాథ్ తల్వార్ ఆధ్వర్యంలో బందోబస్తు నిర్వహించారు.

కోలారు వార్తలు...

వెనుకబడిన వర్గాలకు అన్యాయం



కార్యక్రమాన్ని జ్యోతి వెలిగించి ప్రారంభిస్తున్న దృశ్యం

కోలారు: దేశంలో అనాదిగా వెనుకబడిన వర్గాలకు తీరని అన్యాయం జరుగుతోందని కాంగ్రెస్ నాయకుడు బికె హరి ప్రసాద్ తెలిపారు. ఆదివారం నగరంలోని ప్రైవేటు హోటల్‌లో వెనుకబడిన వర్గాల పరివర్తనా సమావేశ నిర్వహణపై పూర్వ సిద్ధతా సమావేశంలో పాల్గొని మాట్లాడారు. దేశానికి స్వాతంత్ర్యం వచ్చిన నాటి నుంచి రాక ముందు కూడా వెనుకబడిన వర్గాలకు న్యాయం జరగలేదు. ప్రభుత్వాలు మారినా వెనుకబడిన వర్గాలకు న్యాయం జరగలేదన్నారు. పిల్లల ఉజ్వల భవిష్యత్తును రూపొందించే ప్రభుత్వానికి మద్దతు తెలిపి అధికారంలోకి తీసుకు రావాలని అన్నారు. 60 శాతానికి పైగా మంది తక్కువ ఆదాయం కలిగిన వారే జీఎస్టీ అధికంగా కడుతున్నారు. ప్రజల నుంచి సేకరించిన పన్నులు సరైన రీతిలో వ్యయం కాలేదని, దీనిపై ప్రజలను జాగృతం చేయాల్సి ఉందన్నారు. కార్యక్రమంలో జిల్లాలోని బీసీ నాయకులు, కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

నల్లబ్యాడ్జీలతో వాల్మీకి జయంతి వేడుకలు



ఆవణి వాల్మీకి ఆశ్రమంలో పూజలు నిర్వహించిన దృశ్యం

కోలారు: తమ డిమాండ్లను నెరవేర్చలేదని వాల్మీకి జయంతి వేడుకలకు దూరంగా ఉన్న వాల్మీకి సముదాయ ప్రముఖులు ఆదివారం ముళబాగిలు తాలూకాలోని ఆవణి గ్రామంలోని వాల్మీకి పర్వతంపై ఉన్న వాల్మీకి ఆశ్రమంలో పూజలు నిర్వహించి వేడుకలను ప్రత్యేకంగా జరుపుకున్నారు. వాల్మీకి జయంతి రోజున నల్లబ్యాడ్జీలు ధరించి ప్రతిఘటన నిర్వహించాలనే ఉద్దేశం ఉన్నా మంత్రి నాగేంద్ర ఇచ్చిన హామీతో ఆందోళన విరమించిన సముదాయ ప్రముఖులు జిల్లా యంత్రాంగం నిర్వహించిన వాల్మీకి జయంతి కార్యక్రమంలో పాల్గొనకుండా ప్రత్యేకంగా నిర్వహించి తమ నిరసన వ్యక్తం చేశారు. భవిష్యత్తులో వాల్మీకి సముదాయ భవనం వద్ద ఆక్రమణలు తొలగించకుండా వాల్మీకి భవన నిర్మాణాన్ని త్వరగా పూర్తి చేయకుంటే ఆందోళన చేపడతామని ప్రముఖులు నరసింహయ్య, ఎం బాలగోవింద హెచ్చరించారు.

పాడి రైతులు సద్వినియోగం చేసుకోవాలి

మాలూరు: పశు పాలనా, పశు వైద్య సేవా శాఖ ఆధ్వర్యంలో పాడి రైతులకు రబ్బర్ మ్యాట్, మేత కత్తిరించే యంత్రాలు, మొక్కజొన్న విత్తనాలు తదితర సౌలభ్యాలను సద్వినియోగం చేసుకోవాలని పశు సంవర్ధక శాఖ అసిస్టెంట్ డైరెక్టర్ రెడ్డప్ప తెలిపారు. పట్టణంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. 2023-24లో పాడిపరిశ్రమపై ఆధారపడి జీవనం సాగిస్తున్న రైతులకు ఆర్థికంగా ఆదుకునే ఉద్దేశంతో ఈ సౌలభ్యాలను అందిస్తున్నామని, పాడి రైతులు సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు. తాలూకాలో రైతులు 32 వేలకు పైగా పాడి పశువులను పోషిస్తున్నారు. 158 మంది రైతులకు తలా 2 ప్రకారం 336 రబ్బర్ మ్యాట్‌లను అందిస్తున్నట్లు తెలిపారు. మేత కత్తిరించే యంత్రాలను పొందడానికి రైతులు దరఖాస్తులు అందజేయాలన్నారు. రబ్బర్ మ్యాట్‌లను సబ్సిడీతో అందిస్తున్నట్లు చెప్పారు. తాలూకాను కరువు జాబితాలో చేర్చడం వల్ల 6 వేల మందికి మేత విత్తనాల మినికిట్‌లను అందిస్తున్నట్లు తెలిపారు.

విజేతలకు అభినందన



విజేతకు ప్రశంసాపత్రం అందజేస్తున్న దృశం

కోలారు: తుమకూరులోని మహాత్మా గాంధీ క్రీడా మైదానంలో జరుగుతున్న ప్రభుత్వ ఉద్యోగుల రాష్ట్ర స్థాయి క్రీడా పోటీలలో జిల్లాకు చెందిన క్రీడాకారులు ఉత్తమ ప్రదర్శన చూపారు. దేహదారుఢ్య పోటీలలో నగరానికి చెందిన ఎస్ఎన్ఆర్ ఆస్పత్రి వైద్యుడు డాక్టర్ సోమశేఖర్ ప్రథమ స్థానం సాధించారు. అదేవిధంగా జిల్లా పంచాయతీ రాజ్ శాఖలో పనిచేస్తున్న రేష్మా కుస్తీ పోటీలలో ప్రథమ స్థానం సాధించి రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికయ్యారు. వీరిని జిల్లా ప్రభుత్వ ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు సురేష్‌బాబు అభినందించారు. జాతీయ స్థాయి పోటీలో కూడా సత్తా చాటాలని ఆకాక్షించారు. ఈ సందర్భంగా రాష్ట్ర ఉద్యోగుల సంఘం సీనియర్ ఉపాధ్యక్షుడు బసవరాజ్, హాసన జిల్లా అధ్యక్షుడు కృష్ణేగౌడ పాల్గొన్నారు.

నేడు జనతా దర్శన్



ఏర్పాట్లు పరిశీలిస్తున్న దృశ్యం

కెజీఎఫ్: నగరంలోని తహసీల్దార్ కార్యాలయంలో సోమవారం జనతా దర్శన్ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు ఇన్‌చార్జ్ తహసీల్దార్ హరిప్రసాద్ తెలిపారు. ఆదివారం తహసీల్దార్ కార్యాలయ ప్రాంగణంలో జనతా దర్శన్ నిర్వహణపై జరుగుతున్న ఏర్పాట్లను ఆయన పరిశీలించి మాట్లాడారు. ఎమ్మెల్యే రూపా శశిధర్, ఇన్‌చార్జ్ మంత్రి బైరతి సురేశ్ అధ్యక్షతన కార్యక్రమం జరుగుతుందన్నారు. జనతా దర్శన్‌లో సమర్పించిన ఫిర్యాదులను 15 రోజుల్లోగా పరిష్కరించడం జరుగుతుందని తెలిపారు. ఈ సందర్భంగా ఉప విభాగాధికారి వెంకటలక్ష్మి తదితరులు ఉన్నారు.

హస్తకళా మేళా కనువిందు



మైసూరు: కేంద్ర జౌళిశాఖ ఆధ్వర్యంలో మైసూరు నగరంలోని కుశాలనగరలో ఏర్పాటు చేసిన వస్తు ప్రదర్శన క్రాఫ్ట్ అండ్ వీవ్స్ అందరినీ ఆకట్టుకుంటోంది. పెద్దసంఖ్యలో స్టాళ్లు వెలిశాయి. రాష్ట్రంతో పాటు దేశంలో పేరుమోసిన చెక్క బొమ్మలు, గృహాలంకరణ సామగ్రి, వస్త్రాలు, చీరలు ఇక్కడ విక్రయిస్తున్నారు. నవంబర్ 1వ తేదీ వరకూ మేళా కొనసాగుతుంది.

క్లుప్తంగా

ఇంట్లో చొరబడ్డ దొంగలు

● ఇద్దరిని పట్టుకున్న పోలీసులు



ఘటన జరిగిన ఇంటి వద్ద పోలీసులు

తుమకూరు: తాళం వేసి ఇంట్లో చోరీ చేస్తుండగా పోలీసులు వచ్చి పట్టుకున్నారు. ఈ సమయంలో దొంగలు దాడి చేయడంతో పోలీసులకు గాయాలయ్యాయి. ఆదివారం ఉదయం శిరా పట్టణంలో విద్యానగర పార్క్ వద్ద ఈ ఘటన జరిగింది. పోలీసు శాఖలో ఉద్యోగం చేసే మహేష్ అనే వ్యక్తి కుటుంబంతో ఊరికి వెళ్లాడు. ఈ సమయంలో నలుగురు దొంగలు వచ్చి తాళం పగలగొట్టి ఇంటిలోకి దూరారు. గమనించిన పక్కింటివారు పోలీసులకు సమాచారం ఇవ్వడంతో వారు వచ్చి ఇద్దరు దొంగలను పట్టుకోగా, మరో ఇద్దరు పారిపోయారు. ఈ సమయంలో ఒక దొంగ దాడి చేయడంతో అబ్దుల్ కలీం, ధర్మేంద్ర అనే ఇద్దరు పోలీసులు గాయపడ్డారు. పట్టుబడినవారు ఖాలిద్, రియాన్‌గా పోలీసులు తెలిపారు. గాయపడిన పోలీసులు ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు.

పాము కాటుతో కూలీ మృతి



మృతుని కుటుంబానికి నేతల పరామర్శ

తుమకూరు: జిల్లాలోని శిరా తాలూకాలో ఉన్న హోసహళ్లి గ్రామంలో కూలీ కార్మికుడు నరసింహయ్య (38) పొలంలో పని చేస్తుండగా పాము కాటుకు గురై చనిపోయాడు. ఎమ్మెల్యే టి.బీ. జయచంద్ర వచ్చి ఆయన మృతదేహానికి నివాళులర్పించి కుటుంబానికి సాంత్వన పలికారు. ప్రభుత్వం నుంచి పరిహారం వచ్చేలా చూస్తానన్నారు. అంత్యక్రియల కోసం కొంత డబ్బు అందజేశారు. శిరా ఎమ్మెల్సీ చిదానంద్ ఎం గౌడ మృతుని ఇంటి వద్దకు వచ్చి కుటుంబాన్ని పరామర్శించారు.

కాంగ్రెస్ ఎమ్మెల్సీ అభ్యర్థులు వీరే

శివాజీనగర: పట్టభద్రుల, ఉపాధ్యాయుల కోటాలో జరిగే ఎమ్మెల్సీ ఎన్నికలకు కాంగ్రెస్ పార్టీ తన అభ్యర్థులను ఆదివారం ప్రకటించింది. వచ్చే సంవత్సరం మే–జూన్‌లో రెండు పట్టభద్రుల, మూడు ఉపాధ్యాయుల నియోజక వర్గాలకు ఎన్నికలు జరుగుతాయి.

అభ్యర్థుల పేర్లు ఈ విధంగా ఉన్నాయి.

బెంగళూరు పట్టభద్రుల నియోజకవర్గం–రామోజిగౌడ, బెంగళూరు ఉపాధ్యాయుల క్షేత్రం–పుట్టణ్ణ, నైరుతీ ఉపాధ్యాయుల క్షేత్రం–కే.కే. మంజునాథ్, ఆగ్నేయ ఉపాధ్యాయుల క్షేత్రం–డీ.టీ.శ్రీనివాస్, ఈశాన్య పట్టభద్రుల క్షేత్రం–డాక్టర్ చంద్రశేఖర్ బీ.పాటిల్.

అతివ చేతిలో ట్రాక్టర్ స్టీరింగ్

యశవంతపుర: మహిళలు తలచుకుంటే ఏదైనా సాధిస్తారనేందుకు హుక్కేరి తాలూకా శింధిహట్టికి చెందిన మహదేవి చక్కటి ఉదాహరణ. పురుష డ్రైవర్లు ఎంతో కష్టంగా చేసే పనిని ఆమె అలవోకగా చేస్తారు. ఆమె తన పొలంలో పండించిన చెరకును రెండు ట్రాక్టర్ ట్రాలీల్లో లోడ్ చేసుకొని చిక్కోడి తాలూకా హిడకల్ డ్యాం వద్దనున్న హిరణ్యకేశి చెక్కర పరిశ్రమకు తరలించింది. ఈ దృశ్యాన్ని ఎవరో వీడియో తీసి సామాజిక మాధ్యమాల్లో ఉంచడంతో వైరల్ అయ్యింది. వీక్షించిన వారందరూ నారీ భళా అంటూ కామెంట్లు పెడుతున్నారు.

బీచ్‌లో చెత్త వేస్తే జరిమానా

యశవంతపుర: కార్వారలోని రవీంద్రనాథ టాగూరు బీచ్‌లో చెత్త వేస్తే జరిమానా విధిస్తామని జిల్లా కలెక్టర్ గంగూబాయి మానకర హెచ్చరించారు. కార్వార నగర సభ ఆదివారం రవీంద్రనాథ టాగూరు బాచ్‌లో ఏర్పాటు చేసిన మన కార్వార–స్వచ్ఛ కార్వార అభియాన కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. స్వయంగా చెత్తను తొలగించి మాట్లాడారు. ప్లాస్టిక్ డబ్బాలు, తినుబండారాల కవర్లు వేస్తుండటంతో బీచ్‌లో కలుషితం అవుతోందన్నారు. బీచ్‌ను శుభ్రంగా ఉంచేందుకు ప్రతి ఒక్కరూ సహకరించాలన్నారు.

రాజకీయాలంటే సులభం కాదు



పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న హెచ్.విశ్వనాథ్

మండ్య : అదృష్టం, అవకాశం ఉన్నప్పుడు మాత్రమే రాజకీయాల్లో రాణించగలిగే అవకాశం ఉంటుందని మాజీ మంత్రి హెచ్. విశ్వనాథ్ పేర్కొన్నారు. మండ్యలోని రైతు సమావేశం హాలులో రచయిత బీ. బసవరాజుకు అభిమానుల సంఘం ఆదివారం ఏర్పాటు చేసిన అభినందన సభలో ఆయన పాల్గొన్నారు. బసవరాజు రచించిన మౌన చింతన పుస్తకాన్ని ఆవిష్కరించి మాట్లాడారు. అన్ని సముదాయాల వారికి రాజకీయాల్లో సరైన అవకాశాలు రావడం లేదన్నారు.

వన్యజీవుల రక్షణకు గరుడాక్షి

- వేటగాళ్ల వివరాలు డిజిటలైజేషన్
- ప్రత్యేక సాఫ్ట్‌వేర్ వినియోగం
- త్వరగా కేసుల పరిష్కారానికి అవకాశం









అధికారులకు శిక్షణ

బనశంకరి: వేటగాళ్ల బారినుంచి వన్యజీవులను రక్షించేందుకు అటవీశాఖ కసరత్తు చేస్తోంది. వేటగాళ్ల నేరచరిత్రను, నేరాల తీవ్రతను తక్షణం తెలుసుకునేందుకు హాస్టైటల్ యాక్టివిటి వాచ్ కర్నల్(హాక్) అనే సాఫ్ట్‌వేర్‌ను వినియోగించడానికి సిద్ధమైంది. దీనికి అటవీశాఖ గరుడాక్షి అని పేరుపెట్టింది. వన్యజీవులకు హాని కలిగించే వారిపై ఈ పథకం కింద పేపర్‌లెస్ ఎఫ్ఐఆర్ నమోదు చేసేందుకు అవకాశం ఉంది. భారతీయ వన్యజీవి ట్రస్ట్ అనే ఎన్‌జీఓ, ఎన్‌టీటీ డేటా అనే ఐటీ కంపెనీ సంయుక్తంగా ఈ అప్లికేషన్ రూపొందించి అటవీశాఖకు అందజేసింది. అటవీశాఖలో నమోదైన కేసులు, అరెస్ట్ అయిన వారి వివరాలు, వారి ఆధార్ నంబర్లు, ఓటర్‌గుర్తింపుకార్డు, ఫొటోలు ఈ అప్లికేషన్‌లో ఉంటాయి. అటవీకేసులకు సంబంధించి దుండగులు పట్టుబడి వెంటనే వారి వివరాలు ఇందులో ఎంటర్ చేస్తే అతని గత చరిత్ర తెరపై కనిపిస్తుంది. చెట్ల నరికివేత, వన్యజీవులను వేటాడటం తదితర నేరాలకు సంబంధించిన సెక్షన్ల గురించి హాక్‌ద్వారా తెలుసుకొని క్షణాల్లో ఎఫ్ఐఆర్ నమోదుచేయవచ్చు. దీంతో అటవీశాఖ అధికారులకు సమయం ఆదా అవుతుంది. దుండగులకు త్వరగా శిక్ష విధించడానికి సహాయపడుతుంది.

కేరళలో ఇప్పటికే అమలు

హాక్ వ్యవస్థను దేశంలోనే తొలిసారిగా కేరళ రాష్ట్రం అమలు చేసింది. ప్రస్తుతం కర్ణాటకలో అమలు చేస్తే ఇది రెండో రాష్ట్రంగా గుర్తింపు పొందుతుంది. ఉత్తరప్రదేశ్ కూడా దీనిపై ఆసక్తి చూపుతోంది.

ఈ అప్లికేషన్ వినియోగించడంపై రాష్ట్రంలో ప్రతి అటవీపరిధి నుంచి కనీసం 5 మంది సిబ్బందికి నిపుణులతో శిక్షణ అందిస్తున్నారు. ఇందు కోసం కేరళ నుంచి నిపుణులను రప్పించారు. బండీపుర, నాగరహోళెతో పాటు మొత్తం 300 మందికిపైగా అటవీశాఖ అధికారులు శిక్షణ పొందుతున్నారు. ఈ ఏడాది 500 మందికికు శిక్షణ అందించాలని టార్గెట్‌గా పెట్టుకున్నారు.

పరస్పరం సమాచార మార్పిడికి అవకాశం

వన్యజీవుల పరిరక్షణ, నేరాల నియంత్రణపై సమాచారం పరస్పరం ఇచ్చిపుచ్చుకునేందుకు గతంలో దేశంలో ఎలాంటి వ్యవస్థలు లేని కారణంగా హాక్‌ను అభివృద్ధి చేశాం. దీనిని కార్యరూపంలోకి తీసుకువచ్చి మద్దతు ఇచ్చిన ఎన్‌టీటీడీ డేటా కంపెనీకి కతజ్ఞతలు. –వివేక్‌మెనన్, వైల్డ్‌లైఫ్ ట్రస్ట్ ఆఫ్ ఇండియా సంస్థాపక కార్యనిర్వహణ డైరెక్టర్

నేరాల నియంత్రణలో ముందడుగు

నేరాలను నియంత్రించడంలో అటవీశాఖ ముందడుగు వేసింది. హాక్ వ్యవస్థ ద్వారా రాష్ట్రంలో అటవీశాఖ పరిధిలో ఎక్కడ నేరం జరిగినా క్షణాల్లో ఇతర ప్రాంతాల్లోని అటవీశాఖ అధికారులకు తెలిసిపోతుంది. –సుబాష్ కే. మళఖెడే, అటవీశాఖ వన్యజీవి విభాగం

కుమారస్వామి ప్రమాణం చేస్తే రాజకీయ సన్యాసం



మాట్లాడుతున్న మాగడి ఎమ్మెల్యే బాలకృష్ణ

దొడ్డబళ్లాపురం: ఉప ముఖ్యమంత్రి డీకే శివకుమార్‌పై నిందలు వేస్తున్న హెచ్‌డీ కుమారస్వామి ధర్మస్థలం వచ్చి తాను నిజాయితీపరుడినని ప్రమాణం చేస్తే తాను రాజకీయ సన్యాసం తీసుకుంటానని మాగడి ఎమ్మెల్యే బాలక్రిష్ణ అన్నారు. ఆదివారం ఆయన మీడియాతో మాట్లాడారు. హెచ్‌డీ కుమారస్వామి కాంగ్రెస్ నాయులపై చేసిన ఆరోపణలు ఒప్పుకుంటానన్నారు. అయితే ప్రభుత్వ సొమ్ము తినలేదని, ఏ సమయంలోనూ లంచం తీసుకోలేదని, అవినీతికి పాల్పడలేదని కుమారస్వామి ధర్మస్థలం వచ్చి ప్రమాణం చేస్తే తాను రాజకీయాల నుంచి తప్పుకుంటా అని సవాలు విసిరారు. తన సవాలును స్వీకరించని పక్షంలో నిందలు వేయడం మానుకోవాలన్నారు.

రాజ్యోత్సవ ఏర్పాట్లలో అపశ్రుతి

● విద్యుదాఘాతంతో యువకుడు మృతి



ప్రజ్వల్

యశవంతపుర: కన్నడ రాజ్యోత్సవ ఏర్పాట్లలో అపశ్రుతి చోటు చేసుకొని యువకుడు మృతి చెందాడు. ఈ ఘటన ఘటన బెళగావి జిల్లా బైలహొంగల తాలూకాలో జరిగింది. తాలూకా వక్కుంద గ్రామానికి చెందిన ప్రజ్వల్ చెన్నగౌడ మునేప్పనవర(18) స్థానిక బస్టాండ్ వద్ద కన్నడ రాజ్యోత్సవం కోసం ఇనుప స్తంభం ఏర్పాటు చేస్తుండగా విద్యుత్ ప్రసారమైంది. గాయపడిన యువకుడిని ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందాడు. కొడుకు మృతితో తల్లిదండ్రులు కన్నీరు మున్నీరయ్యారు. బైలహొంగల పోలీసులు కేసు దర్యాప్తు చేపట్టారు.

బీఎంటీసీ బస్‌లు ఢీకొని ఇద్దరు మృతి



మృతుడు కుమార్, బీఎంటీసీ బస్సు

బనశంకరి: సిలికాన్ సిటీలో రోజురోజుకు రోడ్డు ప్రమాదాలు, అందులోనూ కిల్లర్ బీఎంటీసీ బస్సులకు బలి అవుతున్న వారి సంఖ్య పెరిగిపోతోంది. విజయనగర ట్రాఫిక్ పోలీస్ స్టేషన్, హుళిమావు ట్రాఫిక్ పోలీస్‌స్టేషన్ల పరిధిలో జరిగిన రెండు బీఎంటీసీ బస్ ప్రమాదాల్లో ఇద్దరు మరణించారు. గోవిందరాజనగర మెయిన్‌రోడ్డు బై టు కాఫీ షాపు ముందు బైక్‌ను సిటీ బస్ ఢీకొట్టగా సుంకదకట్టె నివాసి కుమార్(45) తీవ్రగాయాలతో మృతి చెందాడు.

గార్మెంట్స్ ఉద్యోగిని

హుళిమావు పరిధిలో అరికెరెలో సాయిగార్మెంట్స్ వద్ద రోడ్డు దాటుతున్న గార్మెంట్స్ ఉద్యోగిని వీణా (20) మీద బీఎంటీసీ బస్సు దూసుకెళ్లడంతో ఆమె అక్కడికక్కడే మృత్యువాత పడింది. శివమొగ్గ జిల్లా సొరబ తాలూకాకు చెందిన వీణా గ్మెంట్స్‌లో పని చేస్తూ హుళిమావులో ఉంటోంది. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు.

అభిమానుల గుండెల్లో పునీత్ రాజ్ పదిలం



పునీత్ రాజ్‌కుమార్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే ఎం.సతీష్ రెడ్డి

బొమ్మనహళ్లి : కన్నడ పవర్ స్టార్ నటుడు, కర్ణాటక రత్న పునీత్ రాజ్ కుమార్ భౌతికంగా లేకపోయినా కోట్లాది మంది అభిమానుల గుండెల్లో పదిలంగా ఉన్నారని, ఆయనకు మరణం ఉండదని బొమ్మనహళ్లి ఎమ్మెల్యే ఎం. సతీష్ రెడ్డి అన్నారు. హొంగసంద్రలో పునీత్‌రాజ్ అభిమానులు ఆదివారం ఏర్పాటు చేసిన పునీత్ రాజ్‌కుమార్ రెండవ వర్ధంతి కార్యక్రమంలో ఆయన పాల్గొని పునీత్‌రాజ్ కుమార్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ పునీత్ రాజ్‌కుమార్ చేసిన సమాజ సేవా కార్యక్రమాలు మరువలేనివన్నారు. కార్యక్రమంలో బొమ్మనహళ్లి నగరసభ మాజీ సభ్యుడు టి.రామచంద్ర, పెద్ద సంఖ్యలో అభిమానులు పాల్గొన్నారు.

పునీత్‌కు నివాళిగా బైక్‌ర్యాలీ



ర్యాలీలో పాల్గొన్న బైక్ రైడర్స్



తుమకూరులో నివాళులర్పించిన దృశ్యం

బనశంకరి: పునీత్‌రాజ్‌కుమార్ రెండో వర్ధంతి సందర్భంగా బ్రదర్‌హుడ్ రైడర్స్ ఆర్గనైజేషన్ ఆధ్వర్యంలో అక్టోబర్ బైకర్స్ ఫెస్ట్ పేరుతో ఆదివారం విధానసౌధ ముందు టీవీఎస్ సంస్థ ఆధ్వర్యంలో బైక్ ర్యాలీ జరిగింది. స్త్రీ, పురుష బైకర్లు వందమంది కెంగేరి వరకు ర్యాలీ నిర్వహించారు. ప్రతి ఒక్కరూ ట్రాఫిక్ నిబంధనల్ని పాటించాలని, హెల్మెట్ ధరించాలని, భారీ శబ్దాలను సృష్టించేలా బైక్‌లను, కార్లను మార్చవద్దని విజ్ఞప్తి చేశారు. కెంగేరిలోని జీకే.అరేనాలో ఏర్పాటు చేసిన మడ్‌రైడ్‌లో బిగ్‌బాస్ పోటీదారుడు కేపీ.అరవింద్ , నటి దివ్యా ఉరుడుగ పాల్గొన్నారు.

తుమకూరు: తుమకూరు నగరంలోని కువెంపు సర్కిల్‌లో ఉన్న నాగరకట్టె సంఘం ఆధ్వర్యంలో పునీత్‌రాజ్ కుమార్ వర్ధంతిని నిర్వహిచారు. కన్నడ నటుడు హనుమంతెగౌడ హాజరై పునీత్ చిత్రపటానికి నివాళులర్పించారు.

పునీత్ అభిమానుల రక్తదానం



రక్తదానం చేస్తున్న దృశ్యం

మండ్య: దివంగత కన్నడ పవర్ స్టార్ పునీత్ రాజ్‌కుమార్‌ది ఆదర్శనీయమైన వ్యక్తిత్వమని, ఆయన నేటి యువతకు స్ఫూర్తి అని అదనపు కలెక్టర్ హెచ్ ఎల్ నాగరాజు అన్నారు. ఆదివారం మండ్య నగరంలోని ఎస్‌బి భవనంలో పునీత్ వర్ధంతిని నిర్వహించారు. అభిమానులు రక్తదానం చేశారు. నాగరాజు మాట్లాడుతూ పునీత్ రాజ్ కుమార్ తండ్రికి తగిన కుమారునిగా పేరు పొందారని అన్నారు. అటు సినిమాల్లో, ఇటు సమాజ సేవా కార్యక్రమాల్లో రాణించారని చెప్పారు.

రామాయణంతో నైతిక విలువలు



వాల్మీకి చిత్ర పటానికి పూజలు చేస్తున్న దృశ్యం

గౌరిబిదనూరు: రామాయణ కథలను పిల్లలకు తెలియజేయడం ద్వారా వారిలో నైతిక విలువలను పెంచవచ్చని ప్రజ్ఞ ట్రస్ట్ నాగరాజు తెలిపారు. పట్టణంలోని మానసిక అరుణోదయ దివ్యాంగుల ప్రత్యేక పాఠశాల, రేవతి దివ్యాంగుల పునర్వసతి కేంద్రం, ప్రతీక్షా కేంద్రంలో శనివారం జరిగిన మహర్షి వాల్మీకి జయంతి కార్యక్రమంలో ఆయన పాల్గొని ప్రసంగించారు. వాల్మీకి రామాయణంలో శ్రీరాముని దివ్య గుణాలను, మానవ సంబంధాలను తెలియజేయాలన్నారు. విజయలక్ష్మి, శాంతామహేశ్, ఉష,కీర్తి,శాంతలక్ష్మి పాల్గొన్నారు.

మట్టితో ఢిల్లీ వెళ్లిన బీజేపీ నాయకులు



ఢిల్లీ వెళుతున్న తాలూకా బిజెపి నాయకులు

గౌరిబిదనూరు: అమృత కలశ యాత్రను పురస్కరించుకొని ప్రధాని నరేంద్ర మోదీ పిలుపు ఇచ్చిన నా దేశం నా మట్టి కార్యక్రమంలో భాగంగా పలు పవిత్ర ప్రాంతాలనుంచి మట్టి సేకరించారు. స్వాతంత్ర్యం కోసం సంగ్రామం జరిగి వందలాది మంది వీరమరణం పొందిన విదురాశ్వత్థం, ముదుగానకుంటె గంగాబాగీరథీ ఆలయం, ఆలకాపుర సోమేశ్వరాలయం తదితర ప్రాంతాలనుంచి మట్టి సేకరించారు. ఆ మట్టిని తీసుకొని ఈ నెల 31వ తేదీన ఢిల్లీలో జరుగనున్న కార్యక్రమంలో పాల్గొనడానికి తాలూకా బీజేపీ అధ్యక్షుడు రమేష్ రావ్, కార్యదర్శి బెంగుళూరు విశ్వేశ్వరయ్య టర్మినల్ నుంచి ప్రత్యేక రైలులో బయలు దేరారు.

హోసూరు వార్తలు..

పేదలపై కేంద్రం చిన్నచూపు



ఆందోళన నిర్వహిస్తున్న సీపీఎం కార్యకర్తలు

హోసూరు: కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం కార్పొరేట్ సంస్థలకు రుణాలు రద్దు చేస్తూ సాధారణ ప్రజలపై ఎనలేని భారం మోపుతోందని ఆరోపిస్తూ ఆదివారం ఉదయం పట్టణంలోని రామ్‌నగర్ అన్నా విగ్రహం వద్ద సీపీఎం పార్టీ ఆందోళన నిర్వహించింది. పట్టణ కార్యదర్శి జయరామన్ అధ్యక్షతన జరిగిన ధర్నాలో జిల్లా కమిటీ సభ్యులు శేఖర్, గోవిందస్వామి, ప్రకాష్, జేమ్స్‌ఎంజిలామేరి, సురేష్, నారాయణమూర్తి, శ్రీధర్ తదితరులు కేంద్ర ప్రభుత్వాన్ని ఖండించి మాట్లాడారు. కేంద్రంలోని మోదీ ప్రభుత్వం కార్పొరేట్ సంస్థలను ఆదరిస్తూ నిత్యవసర వస్తువుల ధరలను పెంచి సాధారణ, మధ్యతరగతి ప్రజలపై భారం మోపుతున్నారని నినాదాలు చేశారు.

శివాలయాల్లో విశేష పూజలు



సిద్దలింగేశ్వరునికి అన్నం, కూరగాయలతో అలంకారం

కెలమంగలం: తమిళ మాసం ఐపసి పౌర్ణమి సందర్భంగా శనివారం రాత్రి శివాలయాల్లో విశేష పూజలు నిర్వహించారు. పౌర్ణమి రోజు శివునికి పూజలు నిర్వహిస్తే కోరిన కోర్కెలు తీరుస్తాడని తమిళ ప్రజల ప్రగాఢ నమ్మకం. అందులో భాగంగా క్రిష్ణగిరి జిల్లా వ్యాప్తంగా శనివారం రాత్రి శివాలయాల్లో విశేష పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా కెలమంగలంలో ప్రసిద్ధి పొందిన సిద్దలింగేశ్వరస్వామి ఆలయంలో శనివారం ఉదయం నుంచి స్వామివారికి అభిషేకం, ఆరాధన, అలంకరణతో పాటు పూజా కార్యక్రమాలను చేపట్టారు. రాత్రి అన్నాభిషేకం, కాయగూరలతో అలంకరణ చేపట్టారు. చుట్టుపక్కల గ్రామాల నుంచి భక్తజనం తరలివచ్చారు.

మహిళ ఆత్మహత్య

క్రిష్ణగిరి: భార్యాభర్తల మధ్య ఏర్పడిన గొడవల్లో జీవితంపై విరక్తి చెందిన మహిళ ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకొన్న ఘటన క్రిష్ణగిరి తాలూకాలో జరిగింది. వివరాల మేరకు క్రిష్ణగిరి సమీపంలోని జాకీర్ మోటూర్ గ్రామానికి చెందిన రాజ భార్య గౌరి (38). వీరి మధ్య తరచూ పోట్లాటలు జరిగేవి. శనివారం రాత్రి ఏర్పడిన గొడవల్లో జీవితంపై విరక్తి చెందిన గౌరి ఉరివేసుకొని ప్రాణాలు తీసుకుంది. క్రిష్ణగిరి తాలూకా పోలీసులు శవాన్ని స్వాధీనపరచుకొని ఆస్పత్రికి తరలించారు. కేసు నమోదు చేశారు.

ఉపాధ్యాయులకు అవార్డులు



అవార్డులతో ఉపాధ్యాయులు

హోసూరు: హోసూరులోని రోటరీ సంఘాల ద్వారా ఏటేటా ఉత్తమ ఉపాధ్యాయులను ఎంపిక చేసి నేషన్ బిల్డర్ అవార్డులను అందజేయడం ఆనవాయితీ. అందులో భాగంగా హోసూరు, తళి, కెలమంగలం, సూళగిరి యూనియన్‌లలోని ప్రభుత్వ పాఠశాలల్లో పనిచేస్తున్న వంద మంది ఉపాధ్యాయులను ఎంపిక చేసి అవార్డులందజేశారు. హోసూరులోని అద్వైత్ స్కూల్‌లో ఈ వేడుక జరిగింది. రోటరీ క్లబ్ అధ్యక్షుడు సుబ్రమణి, అశ్వత్‌నారాయణ, మురళీధరన్, రాజ తదితరులు పాల్గొని ఉపాధ్యాయులకు అవార్డులను అందజేశారు.

అన్నదాతపై అధికారి దాష్టీకం

● షూతో దాడి చేసేందుకు యత్నం

మైసూరు: వరుస నష్టాలు దండెత్తుతున్నా మొక్కవోని దీక్షతో పంటలు సాగు చేసి దేశానికి అన్నం పెట్టే అన్నదాతపై ఓ అధికారి దాష్టీకాన్ని ప్రదర్శించాడు. షూతో దాడి చేసేందుకు యత్నించాడు. ఈ అమానుష ఘటన మైసూరులోని పొగాకు మార్కెట్‌లో జరిగింది. మార్కెట్‌లో చిల్కుంద పొగాకు మండలి అధికారి బ్రిజ్ భూషన్ అక్రమాలపై రైతు కృష్ణకుమార్ ప్రశ్నించగా సదరు అధికారి నోటి కొచ్చినట్లు దూషించాడు. అనంతరం షూ తీసుకొని రైతుపై దాడికి యత్నించాడు. ఈ దృశ్యాన్ని ఓ వ్యక్తి వీడియో తీసి సామాజిక మాధ్యమాల్లో అప్‌లోడ్ చేయగా వైరల్ అయ్యింది.

యువకుడి ఆత్మహత్య

మైసూరు : తాను ప్రేమించిన యువతికి మరో యువకుడితో నిశ్చితార్థం కావడంతో ఆవేదనకులోనైన యువకుడు ఉరి వేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. ఈఘటన మైసూరులోని విద్యారణ్యపురలో జరిగింది. మృతుడిని సూర్యకుమార్‌గా గుర్తించారు. విద్యారణ్యపుర పోలీసులు కేసు దర్యాప్తు చేపట్టారు.

స్తంభాన్ని ఢీకొన్న బస్సు

● తప్పిన పెను ప్రమాదం

యశవంతపుర: బస్సు కరెంట్ స్తంభాన్ని ఢీకొన్న ఘటన చిక్కమగళూరు జిల్లా మూడిగెరె వద్ద జరిగింది. బెంగళూరు నుంచి బయలుదేరిన ప్రైవేట్ బస్సు ఆదివారం ఉదయం మూడిగెరె సమీపంలో బిళగుళ వద్దకు రాగానే నియంత్రణ కోల్పోయి కరెంట్ స్తంభాన్ని ఢీకొంది. దీంతో స్తంభం ముక్కలైంది. అయితే వైర్లు పక్కన పడటంతో పెను ప్రమాదం తప్పింది. ఘటనపై మూడిగెరె పోలీసులు కేసు దర్యాప్తు చేపట్టారు.



విశ్వవిఖ్యాత మైసూరు దసరా ఉత్సవాలు ముగిసినా రాచనగరి మైసూరుకు పర్యాటకులు పోటెత్తుతున్నారు. ప్యాలెస్‌తోపాటు ఇతర పర్యాటక ప్రాంతాల్లో సందడి నెలకొంది. ఆదివారం రాత్రి ప్యాలెస్ వద్ద జన సందడి

దుడ్డుకర్రతో బాదడంతో వ్యక్తి మృతి

మైసూరు: దుడ్డు కర్రతో తలపై బాదడంతో వ్యక్తి మృతి చెందిన ఘటన మైసూరులోని ఉదయగిరిలో జరిగింది. కేహెచ్‌బీ కాలనికి చెందిన ఆసీఫ్ పాషాతో డబ్బు విషయంపై సలీమ్ పాషా, సయ్యద్ అన్వర్‌లు గొడవ పడ్డారు. ఓ దశలో దుడ్డుకర్రతో బాదారు. దీంతో ఆసీఫ్ పాషా తీవ్ర గాయాలతో మృతి చెందాడు. ఉదయగిరి పోలీసులు కేసు దర్యాప్తు చేపట్టి నిందితులను అరెస్టు చేశారు.

బెళగావిలో బ్లాక్‌డేకు ఎంఈఎస్ తీర్మానం

శివాజీనగర: కన్నడ రాజ్యోత్సవాన్ని నిర్వహించేందుకు ప్రభుత్వం ఏర్పాట్లు చేస్తుండగా మరో వైపు మహారాష్ట్ర సరిహద్దు విషయమై మళ్లీ వివాదం సృష్టించేందుకు ఎంఈఎస్ కసరత్తు చేస్తోంది. బెళగావి సరిహద్దు గ్రామాల్లో ప్రభుత్వ ఆరోగ్య పథకం అమలుకు ప్రభుత్వం సిద్ధమైన నేపథ్యంలో నవంబర్ 1న బ్లాక్ డే జరిపేందుకు మహారాష్ట్ర ఏకీకరణ సమితి(ఎంఇఎస్) తీర్మానించింది. ఈ సంస్థకు మహారాష్ట్ర ముఖ్యమంత్రి ఏకనాథ్ శింధె మద్దతు ప్రకటించారు. ఇటీవల బెళగావిలో జరిగిన రాజ్యోత్సవ ముందస్తు సభలో బెళగావి జిల్లాధికారి నితేశ్ పాటిల్ మాట్లాడుతూ బ్లాక్ డేకు అనుమతి ఇచ్చేది లేదని ఎంఇఎస్‌కు స్పష్టం చేశారు. అయినా కూడా ఎంఇఎస్ బ్లాక్ డే దినాచరణకు సిద్ధం కావటం ద్వారా దురుసుతనంతో ముందుకు సాగేందుకు సిద్ధమైంది.

రోడ్డు ప్రమాదంలో ఉపాధ్యాయుడి మృతి



రేణుకేశ్(ఫైల్)

దొడ్డబళ్లాపురం: రోడ్డు ప్రమాదంలో ఉపాధ్యాయుడు మృతిచెందిన ఘటన దొడ్డ తాలూకా తోడలబండె గ్రామం వద్ద చోటుచేసుకుంది. కాశీనహళ్లికి చెందిన రేణుకేశ్(49) తంబేనహళ్లి ప్రభుత్వ పాఠశాలలో ఉపాధ్యాయుడిగా పనిచేస్తున్నాడు. బైక్‌పై స్వగ్రామానికి వెళ్తుండగా అదుపుతప్పి కిందపడగా తలకు తీవ్ర గాయమై అక్కడికక్కడే మృతిచెందాడు. దొడ్డబెళవంగల పోలీసులు కేసు దర్యాప్తు చేపట్టారు.

ఆస్పత్రిలో బంగారు గాజులు మాయం

యశవంతపుర: గుండెపోటుతో ఆస్పత్రిలో చేరి మృతి చెందిన మహిళ చేతిలోని రెండు బంగారు గాజులు మాయమయ్యాయి. చిక్కమగళూరు జిల్లా, తళగార గ్రామానికి చెందిన లక్ష్మీదేవి ఈనెల 24న గుండెపోటు రావడంతో ఎంజీఎం ప్రభుత్వ ఆస్పత్రిలో చేర్చారు. అత్యవసర చికిత్స కారణంగా ఆమె చేతిలో ఉన్న బంగారు గాజులు పక్కలో పెట్టారు. 15 నిమిషాల తర్వాత ఆమె మృతి చెందింది. దీంతో దుఃఖంలో కుమారుడు శేఖర్, భార్య అనితలు లక్ష్మీదేవి మృతదేహాన్ని ఇంటికి తీసుకొచ్చారు. అక్కడకు వెళ్లిన తర్వాత చేతిలో గాజులు కనిపించలేదు. ఆస్పత్రిలోనే గాజులు మాయమైనట్లు పోలీసులకు ఫిర్యాదు చేశారు.

బావిలో చిక్కుకుని బాలుడు మృతి

కెలమంగలం: బావిలో పీతలు పట్టేందుకెళ్లిన బాలుడు బురదలో చిక్కి మృతి చెందిన ఘటన డెంకణీకోట వద్ద జరిగింది. తాలూకాలోని బెట్ట ముగిళాలం గ్రామానికి చెందిన వినోద్ కొడుకులు మాధవన్ (10), ఆదవన్ (8), మదన్ (6) అదే ప్రాంతంలోని ప్రభుత్వ పాఠశాలలో చదువుతున్నారు. శనివారం పాఠశాల సెలవు కావడంతో ముగ్గురూ కలిసి సమీపంలోని మట్టిబావిలో పీతలు పట్టేందుకెళ్లారు. మాధవన్ బావిలోకి దిగగా మిగతా ఇద్దరు గట్టుపై కూర్చొన్నారు. ఈ సమయంలో మాధవన్ బురదలో కూరుకుపోయాడు, అది చూసి ఇద్దరూ పరుగున ఇంటికెళ్లి తల్లిదండ్రులకు తెలిపారు. వారు స్థానిక ప్రజలతో వచ్చి చూసేసరికి బాలుడు చనిపోయి ఉన్నాడు. మృతదేహాన్ని బయటకు తీసి పోలీసులకు సమాచారమిచ్చారు. వారు వచ్చి ఆస్పత్రికి తరలించి కేసు నమోదు చేశారు.

బోనులో చిక్కిన చిరుత

మైసూరు: మైసూరు జిల్లా టి.నరిసిపుర తాలూకా బొమ్మనహళ్లిలో ప్రజలకు కునుకు లేకుండా చేసిన చిరుత ఎట్టకేలకు బోనులో పడింది. గడిచిన కొన్ని రోజులుగా చిరుత గ్రామంలోకి చొరబడి మూగజీవాలను దాడి చేసి హతమారుస్తోంది. భయాందోళనకు గురైన ప్రజలు అటవీ శాఖ అధికారులకు సమాచారం ఇవ్వడంతో బోనులు ఏర్పాటు చేశారు. శనివారం రాత్రి ఆహారం కోసం వచ్చిన చిరుత ఒక తోటలో ఉంచిన బోనులోకి వెళ్లి బందీ అయ్యింది. ఆదివారం ఉదయం అటవీశాఖ అధికారులు వచ్చి చిరుతను పరిశీలించగా ఆడ చిరుతగా తేలింది. అనంతరం దానిని తీసుకొని వెళ్లి అటవీ ప్రాంతంలో వదిలేశారు.

ధర వరించేలా!

గోదావరి జిల్లాల్లో మొదలైన వరి కోతలు

- వచ్చే వారం నుంచి కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం సేకరణ
- రాష్ట్ర వ్యాప్తంగా 3,500 ఆర్బీకే క్లస్టర్లలో ధాన్యం కొనుగోలుకు ఏర్పాట్లు
- ఈ ఖరీఫ్‌లో మొత్తం 37 లక్షల టన్నుల దిగుబడి వస్తుందని అంచనా
- మద్దతు ధరతో పాటు రవాణా, హమాలీ, కూలీ చార్జీలు అందజేత
- రవాణా శాఖ, లారీ ఓనర్స్ అసోసియేషన్స్ సమన్వయంతో ధాన్యం తరలింపునకు సన్నాహాలు

సాక్షి, అమరావతి: రాష్ట్రంలో ధాన్యం కోతలు ప్రారంభమయ్యాయి. దిగుబడులు సైతం ఆశాజనకంగా కనిపిస్తున్నాయి. ఉమ్మడి ఉభయ గోదావరి జిల్లాల్లో నవంబర్ మొదటి వారం నుంచి కొనుగోలు కేంద్రాలకు ధాన్యం తరలించేందుకు రైతులు సిద్ధమవుతున్నారు. దీంతో రైతులకు సంపూర్ణ మద్దతు ధర కల్పించడమే లక్ష్యంగా ప్రభుత్వం 3,500 ఆర్బీకే క్లస్టర్లలో ధాన్యం కొనుగోళ్లకు రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాట్లు చేసింది. ఆర్బీకేల్లో ఈ-క్రాప్ సోషల్ ఆడిట్ పూర్తయిన వెంటనే షెడ్యూల్ ఇచ్చి రైతుల నుంచి ధాన్యం సేకరించనుంది. ఏ-గ్రేడ్ ధాన్యం క్వింటాల్‌కు రూ.2,203, సాధారణ రకానికి రూ.2,183 చొప్పున మద్దతు ధర చెల్లించేందుకు ప్రభుత్వం నిర్ణయించింది. ఈసారి జిల్లాలకు ఎటువంటి లక్ష్యం నిర్దేశించకుండా ఎంత ధాన్యం వచ్చినా కొనుగోలు చేసేలా ప్రభుత్వం ఇప్పటికే ఆదేశాలు జారీ చేసింది.



మార్కెట్‌లోనూ మంచి ధర

ఖరీఫ్‌లో 67.43 లక్షల టన్నుల ధాన్యం వస్తుందని వ్యవసాయ శాఖ ప్రాథమికంగా అంచనా వేసింది. ఇందులో 50 శాతం వరకు ఏ-గ్రేడ్ (ఫైన్ వెరైటీలు) ఉండటం విశేషం. వీటికి బహిరంగ మార్కెట్‌లో మంచి ధర లభిస్తుంది. ఇప్పటికే గోదావరి జిల్లాల్లో పంజాబ్ రైస్-126 రకాన్ని ప్రైవేటు వ్యాపారులు కొనుగోలు చేస్తున్నారు. మొత్తం దిగుబడుల్లో విత్తనాలకు, గృహ అవసరాలతోపాటు బహిరంగ మార్కెట్‌లో విక్రయిస్తుండగా.. 50–60 శాతం ధాన్యాన్ని ప్రభుత్వమే కొనుగోలు చేస్తుంది. కాగా.. అంతర్జాతీయ మార్కెట్‌లో బియ్యానికి డిమాండ్ పెరుగుతోంది. ఈ క్రమంలోనే ఫైన్ వెరైటీలతోపాటు సాధారణ ధాన్యం రకాలను కూడా వ్యాపారులు కొనుగోలు చేసేందుకు ఆసక్తి చూపుతున్నారు. ఇక్కడ ప్రభుత్వం రైతులకు పారదర్శకంగా సంపూర్ణ మద్దతు ధర అందించడంతో పాటు ఆర్థిక భారాన్ని తగ్గిస్తూ రవాణా, హమాలీ, గన్నీ చార్జీల కింద టన్నుకు రూ.2,523 అందిస్తోంది. తద్వారా బయటి వ్యాపారులు తమకు కావాల్సిన ధాన్యాన్ని మద్దతు ధర కంటే ఎక్కువ ఇచ్చి కొనుగోలు చేయాల్సిన పరిస్థితి నెలకొంది.

పకడ్బందీగా రవాణా ఏర్పాట్లు

రవాణా శాఖ, లారీ ఓనర్స్ అసోసియేషన్ల సమన్వయంతో జాప్యం లేకుండా కళ్లాల్లోని ధాన్యాన్ని తరలించేలా ప్రభుత్వం చర్యలు చేపట్టింది. ప్రతి ఆర్బీకే పరిధిలో 10–15 వాహనాలకు జీపీఎస్ పరికరాలను అమర్చి ధాన్యం రవాణాను పర్యవేక్షించనున్నారు. తూర్పు గోదావరి, పశ్చిమ గోదావరి, కోనసీమ, ఏలూరు, కాకినాడ, కృష్ణా జిల్లాల్లో నవంబర్ తొలి రెండు వారాల్లో ధాన్యం అధికంగా వచ్చే అవకాశం ఉంది. మూడవ వారంలో ఎన్టీఆర్, నాలుగో వారంలో పార్వతీపురం మన్యం, చివరి వారంలో శ్రీకాకుళం, విజయనగరంలో పంట వస్తుందని అంచనా వేస్తున్నారు. డిసెంబర్ మొదటి రెండు వారాల్లో విశాఖపట్నం, అనకాపల్లితో పాటు డిసెంబర్ నెలాఖరు నుంచి పల్నాడు, గుంటూరు, బాపట్ల, ప్రకాశం, కడప జిల్లాల్లో కొనుగోళ్లు ఊపందుకోనున్నాయి. చాలా ప్రాంతాల్లో లేట్ ఖరీఫ్‌తో కోతలు ఆలస్యం అవుతున్నాయి.

దళారులతో పని లేకుండా..

ధాన్యం సేకరణలో ప్రభుత్వం విప్లవాత్మక మార్పులు తీసుకొచ్చింది. దళారీ వ్యవస్థను రూపుమాపి చరిత్రాత్మక నిర్ణయం తీసుకుంది. మిల్లర్ల ప్రమేయం లేకుండా పకడ్బందీ చర్యలు చేపడుతోంది. 21 రోజుల్లోనే మద్దతు ధర జమ చేసేలా ఏర్పాట్లు చేపట్టింది. ఈ క్రమంలోనే ధాన్యం కొనుగోళ్లలో నిబంధనలను వివరిస్తూ రైతుల్లో చైతన్యం తీసుకొస్తోంది. రైతులు ఆర్బీకేలో ధాన్యం ఇచ్చిన తర్వాత ఫండ్ ట్రాన్స్‌ఫర్ ఆర్డర్ (ఎఫ్‌టీవో) వచ్చేలా ఏర్పాట్లు చేసింది. అందులో ధాన్యం వివరాలు, ప్రభుత్వం నుంచి వచ్చే మద్దతు ధర నమోదై ఉంటాయి. ఎఫ్‌టీవో జనరేట్ అయితే రైతుకు, ధాన్యానికి సంబంధం ఉండదు. పూర్తి మద్దతు ధర ఇచ్చే బాధ్యత ప్రభుత్వం తీసుకుంటుంది. రవాణా, దిగుమతి, మిల్లర్‌కు సరుకు వచ్చినట్టు ఇచ్చే క్లియరెన్స్‌ను మిల్లుల వద్ద ప్రభుత్వం నియమించే కస్టోడియన్ (డిప్యూటీ తహసీల్దార్ స్థాయి) అధికారులు చూసుకుంటారు. తేమ, ఇతర నాణ్యత విషయంలో ఆర్బీకేలో ధ్రువీకరించిన ప్రమాణాలను మిల్లరు ఫైనల్‌గా పరిగణించాల్సిందే. రైతులకు మిల్లర్ నుంచి ఎటువంటి ఒత్తిడి/డిమాండ్ వచ్చినా ప్రభుత్వ కాల్‌సెంటర్ 1967కు సంప్రదిస్తే వెంటనే చర్యలు చేపట్టేలా ప్రభుత్వం ఏర్పాట్లు చేసింది.

మద్దతు ధరల చెల్లింపు ఇలా..

ఏ-గ్రేడ్ ధాన్యం: రూ.2,203 (క్వింటాల్‌కు)	సాధారణ రకాలకు రూ.2,183 (క్వింటాల్‌కు)
చార్జీలు: రూ.2,523 (టన్నుకు)	రవాణా, హమాలీ, గన్నీ

ప్రభుత్వ కొనుగోలు కేంద్రాలకు వచ్చే ధాన్యం అంచనా ఇలా..
సేకరణ అంచనా (నెల, లక్షల టన్నుల్లో)

నెల	అంచనా
నవంబర్	2
డిసెంబర్	7
జనవరి	15
ఫిబ్రవరి	10
మార్చి	3

కొనుగోళ్లకు సిద్ధం

గోదావరి జిల్లాల్లో కోతలు మొదలయ్యాయి. వచ్చే వారంలో 150 ఆర్బీకేల్లో పంట కొనుగోళ్లు ప్రారంభమవుతాయి. ఇప్పటికే కోతలు పూర్తయిన చోట రైతులు పంటను ఆరబెడుతున్నారు. మార్కెట్‌లో ధాన్యానికి గిరాకీ పెరుగుతోంది. అందుకే గోదావరి జిల్లాల్లో ఫైన్ వెరైటీలతో పాటు సాధారణ రకాలను కూడా ప్రైవేటు వ్యాపారులు మంచి ధరకు కొంటున్నట్టు తెలుస్తోంది. రైతుకు పూర్తి మద్దతు ధర అంటే ఎక్కువ రేటు తీసుకురావడంలో ప్రభుత్వం చిత్తశుద్ధితో పని చేస్తోంది. పెద్ద మిల్లుల్లో ధాన్యం ఆరబోతకు డ్రయర్లు పెట్టేలా ప్రోత్సహిస్తున్నాం. తొలుత వంద మిల్లుల్లో పెట్టాలని కోరాం.

– జి.వీరపాండియన్, ఎండీ, పౌర సరఫరాల సంస్థ

ప్రభుత్వానిదే పూర్తి బాధ్యత

పంట ఉత్పత్తులు బాగుండటంతో మార్కెట్‌లో ధర కూడా బాగా పలుకుతోంది. ప్రభుత్వ కొనుగోలు కేంద్రాలకు ఎంత ధాన్యం వచ్చినా తీసుకుంటాం. రైతులు ఆర్బీకేల్లో ధాన్యం ఇచ్చిన తర్వాత పూర్తి బాధ్యత ప్రభుత్వమే తీసుకుంటుంది. ఆర్బీకేల వారీగా అవసరమైన సంచులను అందుబాటులో ఉంచాం. సీఎంఆర్ కేటాయించిన ప్రకారం మిల్లర్లు సంచులు అందిస్తారు. ధాన్యం రవాణా కోసం ముందస్తుగానే వాహనాలను రిజిస్ట్రేషన్ చేశాం.

– హెచ్.అరుణ్‌కుమార్, కమిషనర్, పౌర సరఫరాల శాఖ

ఉపాధి సృష్టించే స్థాయికి పాలిటెక్నిక్ విద్య

నైపుణ్యాభివృద్ధి శాఖ ముఖ్య కార్యదర్శి సురేష్ కుమార్

సాక్షి, అమరావతి: ఉపాధిని సృష్టించే స్థాయికి పాలిటెక్నిక్ విద్య రూపాంతరం చెందాలని రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి శాఖ ముఖ్య కార్యదర్శి సురేష్‌కుమార్ అన్నారు. రాష్ట్ర సాంకేతిక విద్యాశాఖ, సాంకేతిక విద్య, శిక్షణా మండలి ఆధ్వర్యాన విజయవాడలో 'ప్రపంచ వ్యాప్త పోటీతత్వం దిశగా పాలిటెక్నిక్ విద్యా విధానం మార్పు' అంశంపై సదస్సు నిర్వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న సురేష్‌కుమార్ మాట్లాడుతూ పాలిటెక్నిక్ అంటే స్వతంత్ర పారిశ్రామికవేత్తలుగా ఎదిగేందుకు అవసరమైన కోర్సు అని చెప్పారు. నైపుణ్యం ఉంటే రానున్నకాలంలో అంతర్జాతీయ ఉపాధి అవకాశాలు లభిస్తాయని చెప్పారు. సాంకేతిక విద్యాశాఖ కమిషనర్, సాంకేతిక విద్యా, శిక్షణా మండలి చైర్‌పర్సన్ చదలవాడ నాగరాణి మాట్లాడుతూ పాలిటెక్నిక్ విద్యార్థులు ప్రపంచ పారిశ్రామిక రంగంలో అత్యుత్తమ ఉద్యోగులుగా నిలిచేలా జాతీయ విద్యా విధానం-2020 ఉందని తెలిపారు. ఎన్ఎస్ క్యూఎఫ్ మార్గదర్శకాలకు అనుగుణంగా అదనపు కోర్సులను రూపొందిస్తున్నామని, పాలిటెక్నిక్ విద్యార్థులకు ఆ కోర్సుల్లో శిక్షణ పొందే అవకాశం కల్పిస్తామన్నారు. ప్రభుత్వ, ప్రయివేట్ పాలిటెక్నిక్ కాలేజీల్లో శాస్త్రీయ డాక్యుమెంటేషన్, రికార్డ్ ప్రక్రియలతో 'అకడమిక్ ఆడిట్'ను పునఃప్రారంభిస్తున్నామని చెప్పారు. సాంకేతిక విద్యాశాఖ ఉపసంచాలకులు డాక్టర్ ఎంఏవీ రామకృష్ణ మాట్లాడుతూ 2023–24 విద్యా సంవత్సరంలో విద్యార్థులకు 100 శాతం ఉపాధి చూపగలిగేలా జాబ్ మేళాలు, క్యాంపస్ డ్రైవ్‌లకు సన్నద్ధత గురించి వివరించారు. సాంకేతిక విద్యా శిక్షణా సంస్థ సంయుక్త కార్యదర్శి(అకడమిక్) మూర్తి, సాంకేతిక విద్యాశాఖ అదనపు సంచాలకులు వి.పద్మారావు తదితరులు పాల్గొన్నారు.



జ్యోతి ప్రజ్వలన చేస్తున్న సురేష్ కుమార్

క్లుప్తంగా...

ఉత్సాహంగా హాఫ్ మారథాన్

- పాల్గొన్న 2,800 మంది క్రీడాకారులు



హాఫ్ మారథాన్‌ను ప్రారంభిస్తున్న రామనాథరెడ్డి

ప్రొద్దుటూరు కల్చరల్: జాతీయ ఐక్యతా దినోత్సవం (సర్దార్ వల్లభాయ్ పటేల్ జయంతి) సందర్భంగా ఆదివారం వైఎస్సార్ జిల్లా ప్రొద్దుటూరులో 'ఐరన్ మ్యాన్ రన్ ఫర్ యూనిటీ' పేరుతో సేవాంష్ ట్రస్ట్ ఆధ్వర్యంలో హాఫ్ మారథాన్ నిర్వహించారు. పలు రాష్ట్రాల క్రీడాకారులతోపాటు కెన్యా దేశానికి చెందిన అథ్లెట్లు పాల్గొన్నారు. దాదాపు 2,800 మంది పోటీపడిన ఈ హాఫ్ మారథాన్ ఉత్సాహంగా సాగింది. ప్రజలకు ఆరోగ్యం పట్ల అవగాహన కల్పించేందుకు, విద్యార్థుల్లో క్రీడాస్ఫూర్తిని నింపేందుకు హాఫ్ మారథాన్ ఏర్పాటు చేసినట్లు నిర్వాహక సంఘం అధ్యక్షుడు, ఐఆర్ఎస్ అధికారి ఉండేల రామనాథ రెడ్డి తెలిపారు. 5 కిలోమీటర్లు, 10 కిలోమీటర్లు, 21.1 కిలోమీటర్ల కేటగిరీల్లో స్త్రీ, పురుషులకు వేర్వేరుగా నిర్వహించిన ఈ హాఫ్ మారథాన్‌లో విజేతలకు నగదు బహుమతులను అందజేశారు. ఈ పోటీల్లో కెన్యా అథ్లెట్లు ప్రత్యేక ఆకర్షణగా నిలిచారు.

పోలవరం బాధ్యత కేంద్రానిదే

సీపీఎం రాష్ట్ర కార్యదర్శి శ్రీనివాసరావు

సాక్షి, అమరావతి: విభజన హామీల్లో భాగంగా పోలవరం ప్రాజెక్ట్ పూర్తి బాధ్యత కేంద్ర ప్రభుత్వానిదేనని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు చెప్పారు. పోలవరం పూర్తి చేసేందుకు కేంద్రంపై రాష్ట్ర ప్రభుత్వం ఒత్తిడి తీసుకువచ్చి నిధులు సాధించాలని పేర్కొన్నారు. సీపీఎం రాష్ట్ర కమిటీ సమావేశం ఆదివారం విజయవాడలో జరిగింది. శ్రీనివాసరావు విలేకరులతో మాట్లాడుతూ కర్ణాటకలో కరువు పరిస్థితిని అంచనా వేసేందుకు ప్రత్యేక బృందాలను పంపిన కేంద్ర ప్రభుత్వం, ఆంధ్రప్రదేశ్‌కు ఎందుకు పంపలేదని ప్రశ్నించారు. రాష్ట్రాన్ని కేంద్రం దగా చేస్తోందన్నారు. కరువు పరిస్థితిపై రాష్ట్ర ప్రభుత్వం అప్రమత్తమై తక్షణ చర్యలు చేపట్టాలని, నిత్యావసర సరుకుల ధరలు పెరగకుండా చూడాలని కోరారు. 'అసమానతలు లేని అభివృద్ధి కోసం ప్రజా రక్షణ భేరీ'నినాదంతో సీపీఎం సోమవారం నుంచి రాష్ట్రంలో మూడు జాతాలను నిర్వహించనున్నట్లు తెలిపారు. నవంబర్ 15న విజయవాడలో బహిరంగ సభ నిర్వహిస్తామన్నారు.

నవభారత నిర్మాణ బాధ్యత యువతదే..

మాజీ ఉప రాష్ట్రపతి వెంకయ్యనాయుడు



ఉంగుటూరు(గన్నవరం): వివక్షలకు అతీతంగా విజ్ఞానాన్ని సముపార్జించుకుని నవభారత నిర్మాణ బాధ్యతను యువత తీసుకోవాలని మాజీ ఉప రాష్ట్రపతి ఎం.వెంకయ్యనాయుడు సూచించారు. కృష్ణా జిల్లా ఉంగుటూరు మండలం ఆత్కూరులోని స్వర్ణభారత్ ట్రస్ట్‌లో ఆదివారం అఖిల భారతీయ విద్యార్థి పరిషత్(ఏబీవీపీ) అమృత్ మహోత్సవాలు నిర్వహించారు. ముఖ్య అతిథి వెంకయ్యనాయుడు మాట్లాడుతూ 'క్షణం క్షణం.. కణం కణం భరతమాతకే సమర్పణ' అనే స్ఫూర్తిని అందిపుచ్చుకోవాలని సూచించారు. మాతృభాషను గౌరవిస్తూ ఇతర భాషలను కూడా నేర్చుకోవాలని చెప్పారు. మాతృభాషకు పెద్దపీట వేస్తూ, నైపుణ్యాభివృద్ధికి ప్రాధాన్యత ఇస్తూ భవిష్యత్ అవసరాలను దృష్టిలో ఉంచుకుని రూపొందించిన జాతీయ నూతన విద్యావిధానం సమగ్రమైనది, దూరదృష్టి గలదని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఉన్నత విద్యామండలి చైర్మన్ హేమచంద్రారెడ్డి, ఏబీవీపీ రాష్ట్ర అధ్యక్షుడు మురళీధరరావు తదితరులు పాల్గొన్నారు.

అంతర్జాతీయ స్థాయికి ఏపీ విద్యా వ్యవస్థ

ఎమ్మెల్సీలు పర్వతరెడ్డి చంద్రశేఖర్‌రెడ్డి, కల్పలతా రెడ్డి



మాట్లాడుతున్న ఎమ్మెల్సీ చంద్రశేఖర్‌రెడ్డి, పక్కన ఎమ్మెల్సీ కల్పలతారెడ్డి

తిరుపతి సిటీ: విద్యారంగంలో విప్లవాత్మక మార్పులు తెచ్చి అంతర్జాతీయ స్థాయికి ఏపీ విద్యా వ్యవస్థను సీఎం జగన్ తీసుకువెళ్లారని తూర్పు రాయలసీమ టీచర్స్ ఎమ్మెల్సీ పర్వతరెడ్డి చంద్రశేఖర్ రెడ్డి, కృష్ణా, గుంటూరు టీచర్స్ ఎమ్మెల్సీ టీ.కల్పలతారెడ్డి కొనియాడారు. ఆదివారం తిరుపతి ఎస్వీ వర్సిటీ సెనేట్ హాల్‌లో ఏపీ వైఎస్సార్‌టీఎఫ్ తిరుపతి జిల్లా శాఖ ఆధ్వర్యంలో 'ఏపీ విద్యావ్యవస్థలో విప్లవాత్మక సంస్కరణలు' అంశంపై జరిగిన సదస్సులో వారు మాట్లాడారు. నాడు-నేడుతో విద్యాలయాల రూపురేఖలు మార్చారని తెలిపారు. ఏపీవైఎస్సార్‌టీఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు అశోక్‌కుమార్‌రెడ్డి మాట్లాడుతూ 35,000 మంది ఉపాధ్యాయులకు ప్రమోషన్లు కల్పించి, 1998 బ్యాచ్ డీఎస్సీ క్వాలిఫైడ్ అభ్యర్థులకు ఉద్యోగాలు కల్పించిన ఘనత జగన్‌కే దక్కుతుందన్నారు. తిరుపతి జిల్లా వైఎస్సార్‌టీఎఫ్ అధ్యక్షులు మద్దిల మునిశారద, పీఆర్‌టీయూ రాష్ట్ర అధ్యక్షుడు గిరిప్రసాద్‌రెడ్డి, ఇంటెలెక్చువల్ ఫోరం అధ్యక్షుడు కృష్ణారెడ్డి పాల్గొన్నారు.

రాజస్తాన్ బరిలో నేతల బంధువులు

అసెంబ్లీ అభ్యర్థులుగా కాంగ్రెస్, బీజేపీల నుంచి 29 మంది

జైపూర్: రాజస్తాన్ అసెంబ్లీకి నవంబర్ 25వ తేదీన జరగనున్న ఎన్నికలకు ప్రధాన పార్టీలైన కాంగ్రెస్, బీజేపీలు తమ పార్టీల ముఖ్య నేతల బంధువులు, రాజకీయ కుటుంబాలకు చెందిన కనీసం 29 మందిని అభ్యర్థులుగా ప్రకటించాయి. అసెంబ్లీలోని 200 సీట్లకు గాను అధికార కాంగ్రెస్ 95 స్థానాలకు, బీజేపీ 124 సీట్లకు ఇప్పటివరకు అభ్యర్థులను ప్రకటించాయి. రెండు పార్టీలు ఈ ఎన్నికలను ఎంతో ప్రతిష్టాత్మకంగా తీసుకున్నాయి. అభ్యర్థుల ఎంపిక గెలుపు అవకాశాలపై ప్రభావం చూపకుండా అన్ని జాగ్రత్తలు తీసుకున్నట్లు ఆయా పార్టీల నేతలు అంటున్నారు. అయితే, వారసత్వ రాజకీయాలు ప్రజాస్వామ్యానికి ప్రమాదకరంగా మారాయంటూ బీజేపీ, కాంగ్రెస్ పార్టీల నేతలు మరో వైపు విమర్శిస్తుండటం గమనార్హం. ఏదేమైనప్పటికీ, బీజేపీ ఇప్పటి వరకు ప్రకటించిన 124 మంది అభ్యర్థుల్లో పార్టీలోని ప్రముఖ నేతల కుటుంబసభ్యులైన కనీసం 11 మందికి టికెట్లు ఇచ్చింది. అదేవిధంగా, కాంగ్రెస్ పార్టీ ఖరారు చేసిన 95 మంది అభ్యర్థుల్లో రాజకీయ నేపథ్యమున్న కుటుంబాలకు చెందిన వారు 18 మంది అభ్యర్థులుగా ఉన్నారు. బీజేపీ జాబితాలో ఆ పార్టీ ప్రముఖ నేతల కుమారులు, కూతుళ్లు, మనవరాళ్లు, కోడళ్లు ఉన్నారు. ప్రధానంగా ఆరోగ్య కారణాలతో చనిపోయిన నేతల స్థానంలో వారి కుటుంబ సభ్యులకు స్థానం కల్పించినట్లు చెబుతున్నారు.

కాషాయ పార్టీలో వారసులెవరంటే..

తాజాగా అసెంబ్లీ ఎన్నికల బరిలో నిలిచిన ప్రముఖ నేతల వారసుల్లో కొందరు.. దివంగత ఎంపీ సన్వర్ లాల్ జాట్ కుమారుడు రాం స్వరూప్ లాంబాకు బీజేపీ నాయకత్వం నసీరాబాద్ టికెట్ కేటాయించింది. అదేవిధంగా, రాష్ట్ర మాజీ మంత్రి దిగంబర్ సింగ్ కుమారుడు శైలేశ్ సింగ్‌ను దీగ్-కుమ్హేర్ నియోజకవర్గం నుంచి బరిలోకి దించింది. గుర్జర్ నేత కిరోడి సింగ్ బైన్స్లా కుమారుడు విజయ్‌కి బీజేపీ డియోలి-ఉనియారా టికెట్టిచ్చింది. మాజీ ఎంపీ, జైపూర్ రాజకుటుంబానికి చెందిన గాయత్రీ దేవి మనవరాలు దియా కుమారిని విద్యాధర్ నగర్ స్థానం కేటాయించింది. మాజీ ఎంపీ కర్ని సింగ్ మనవరాలు సిద్ధి కుమారిని బికనీర్ (ఈస్ట్)స్థానంలో బరిలో నిలిపింది.

కాంగ్రెస్ పార్టీలో..

మాజీ ప్రతిపక్ష నేత రామేశ్వర్ దుడి భార్య సుశీలకు కాంగ్రెస్ పార్టీ నోఖా టికెట్టిచ్చింది. మాజీ ఎమ్మెల్యే భన్వర్‌లాల్ శర్మ కుమారుడు అనిల్ శర్మ సర్దార్‌షహర్ నుంచి, కేంద్ర మాజీ మంత్రి శ్రీష్ రామ్ ఓలా కుమారుడు బ్రిజేంద్ర ఓలాకు ఝున్‌ఝును నుంచి, సిట్టింగ్ ఎమ్మెల్యే సఫియా ఖాన్ భర్త జుబేర్ రామ్‌గఢ్ నుంచి, మాజీ ఎమ్మెల్యే బిర్దిచంద్ జైన్ బంధువు మేవారాం జైన్ బర్మేర్ నుంచి, మాజీ మంత్రి భన్వర్‌లాల్ కుమారుడు మనోజ్ సుజన్‌గఢ్ నుంచి బరిలోకి దిగుతున్నారు.

పేదలకు ఉచితంగా రూ.10 లక్షల వైద్యం



వ్యవసాయ కూలీలతో కలిసి కోసిన వరిని చూపుతున్న రాహుల్ గాంధీ, కాంగ్రెస్ నేతలు

- భూమి లేని వ్యవసాయ కూలీలకు ఏడాదికి రూ.10 వేలు
- ఛత్తీస్‌గఢ్‌లో కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీ హామీలు

రాజ్‌నందన్‌గావ్: ఛత్తీస్‌గఢ్‌లో కాంగ్రెస్ మరోసారి అధికారంలోకి వస్తే నిరుపేదలకు ఉచితంగా రూ.10 లక్షల వరకు వైద్యం చేయిస్తుందని ఆ పార్టీ అగ్ర నేత రాహుల్ గాంధీ హామీ ఇచ్చారు. భూమిలేని వ్యవసాయ కూలీలకు ఏడాదికి ప్రస్తుతం ఇచ్చే రూ.7 వేల ఆర్థిక సాయాన్ని రూ.10 వేలకు పెంచుతుందని ప్రకటించారు. రాజ్‌నందన్‌గావ్ జిల్లా కేంద్రంలో ఆదివారం జరిగిన ఎన్నికల ర్యాలీలో ఆయన మాట్లాడారు. అయిదేళ్లలో సీఎం భూపేశ్ బఘేల్ ప్రభుత్వం చేపట్టినన్ని సంక్షేమ కార్యక్రమాలు గతంలో ఏ ప్రభుత్వమూ చేయలేదని రైతులు తెలిపారన్నారు. ఛత్తీస్‌గఢ్‌లో ప్రభుత్వం ఏర్పాటైన మొదటి రోజే కులగణన మొదలుపెడుతుందని చెప్పారు. కేంద్రంలోని బీజేపీ సారథ్యంలోని ప్రభుత్వం అదానీ వంటి కోటీశ్వరుల కోసం పనిచేస్తుందని ఆరోపించారు. తమ పార్టీ పేదలు, కార్మికులు, రైతులు, వెనుకబడిన కులాలు, గిరిజనులు, దళితుల కోసం పనిచేస్తుందని, వారి ఆకాంక్షలను అర్థం చేసుకుంటుందని వివరించారు. వారి అభివృద్ధి కోసం ఎన్నో కార్యక్రమాలు చేపడుతుందని చెప్పారు. అనంతరం సీఎం బఘేల్ 'ఎక్స్'లో 'కాంగ్రెస్ మరోసారి అధికారంలోకి డాక్టర్ ఖూబ్‌చంద్ బఘేల్ ఆరోగ్య సహాయ పథకంలో భాగంగా ప్రస్తుతం పేదలకు ప్రస్తుతం చేయిస్తున్న రూ.5 లక్షల వైద్య చికిత్సల సాయాన్ని రూ.10 లక్షలకు పెంచుతాం. అదే విధంగా, ఇతరులకిస్తున్న వైద్య సాయాన్ని రూ.50 వేల నుంచి రూ.5 లక్షలకు పెంచుతాం'అని తెలిపారు.

వరి కోత పనుల్లో రాహుల్

ఎన్నికల ప్రచార కార్యక్రమాల్లో పాల్గొంటున్న రాహుల్ గాంధీ ఆదివారం ఉదయం రాయ్‌పూర్ సమీపంలోని కథియా గ్రామాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన రైతు కూలీలతో కలిసి పొలంలో వరి కోశారు. రైతులతో ముచ్చటించారు. ఛత్తీస్‌గఢ్‌లోని రైతు అనుకూల ప్రభుత్వ నమూనాను దేశమంతటా అమలు చేస్తామని చెప్పారు. రుణ మాఫీ, ఇన్‌పుట్ సబ్సిడీ వంటి వాటిని రైతుల కోసం తీసుకొచ్చామని చెప్పారు. రైతులు సంతోషంగా ఉంటే దేశం కూడా సంతోషంగా ఉంటుంది అని అనంతరం 'ఎక్స్'లో పేర్కొన్నారు.

పంచతంత్రం

రాజస్తాన్‌లో అసెంబ్లీ ఎన్నికలు సమీపిస్తున్న వేళ జరిగిన కీలక పరిణామం అధికార కాంగ్రెస్‌ను, అంతకంటే ఎక్కువగా విపక్ష బీజేపీని కలవరపెడుతోంది. రాష్ట్రంలో గణనీయ సంఖ్యలో ఉన్న జాట్లు, దళితుల పేరిట రెండు పార్టీలు ఎన్నికల బరిలో దిగాయి. కనీసం 40 అసెంబ్లీ స్థానాల్లో ఫలితాలను ప్రభావితం చేయగల ఈ రెండు సామాజికవర్గాలను అవి ఆకట్టుకుంటే ప్రధాన పార్టీలకు తీవ్ర నష్టం తప్పదన్న అభిప్రాయం వినిపిస్తోంది...

జాట్-దళితనాదం

రాజస్తాన్‌లో కొత్త పరిణామం • బీజేపీ, కాంగ్రెస్‌లకు గుబులు



రాజస్తాన్ ఎన్నికల్లో ఒంటరిగానే బరిలో దిగుతున్నట్టు ప్రముఖ జాట్ నేత, రాష్ట్రీయ లోక్‌తాంత్రిక్ పార్టీ (ఆర్ఎల్‌పీ) నేత హనుమాన్ బెనీవాల్ ప్రకటించారు. అంతేగాక 10 అసెంబ్లీ స్థానాల్లో అభ్యర్థులను కూడా శనివారమే ప్రటించారాయన. మిగతా అన్ని స్థానాల్లో కూడా పోటీ చేయడం ఖాయమని స్పష్టం చేశారు. యూపీలో చెప్పుకోదగ్గ ఆదరణ ఉన్న దళిత నేత, భీం ఆర్మీ చీఫ్ చంద్రశేఖర్ ఆజాద్ కూడా ఆజాద్ సమాజ్ పార్టీ (కాన్షీరాం) పేరుతో రాష్ట్రంలో తొలిసారి బరిలో దిగుతున్నారు. ఈ రెండు పార్టీలూ ఎన్నికల పొత్తు కుదుర్చుకుని రాజస్తాన్ బ్యాలెట్ పోరును మరింత ఆసక్తికరంగా మార్చేశాయి. రాజస్తాన్‌లో బీజేపీ, కాంగ్రెస్‌లకు బలమైన ప్రత్యామ్నాయం రావాల్సిన అవసరం చాలా ఉందని ఈ సందర్భంగా బెనీవాల్, ఆజాద్ సంయుక్త విలేకరుల సమావేశంలో చెప్పుకొచ్చారు. ఇందుకోసం 'కిసాన్, జవాన్, దళిత్'వర్గాలు కలిసి రావాలంటూ వారిచ్చిన పిలుపు వెనక లోతైన అర్థమే దాగుంది. ఈ నయా జాట్-దళిత బంధం కాంగ్రెస్, బీజేపీ అవకాశాలను బాగానే దెబ్బ తీసేలా కనిపిస్తోంది.

బీజేపీకే ఎక్కువ నష్టం...!

ఆరెల్పీకి జాట్లలో ఎంతో పట్టుండటమే గాక దళితుల్లోనూ ఆదరణ ఉంది. ఆ పార్టీకి చెందిన ముగ్గురు సిట్టింగ్ ఎమ్మెల్యేల్లో ఇద్దరు దళితులే కావడం ఇందుకు నిదర్శనం. ఇక ప్రధానంగా దళిత పార్టీ అయిన ఏఎస్పీ రాజస్తాన్‌లో తొలిసారిగా బరిలో దిగుతోంది. అది కూడా దళితుల ఓట్లను గణనీయంగానే ఆకర్షించేలా కన్పిస్తోంది. వీటి జంట పోటీతో జాట్, దళిత ఓట్లు సంఘటితమైతే అది ప్రధాన పార్టీలు కాంగ్రెస్, బీజేపీలకు చేటు చేయవచ్చంటున్నారు. ముఖ్యంగా బీజేపీకి ఎక్కువ నష్టం జరిగేలా కన్పిస్తోంది. ఎందుకంటే గత నాలుగేళ్లలో రాజస్తాన్‌లో పలు అసెంబ్లీ స్థానాలకు జరిగిన ఉప ఎన్నికల్లో బీజేపీకి ఓటమే ఎదురైంది. ఇందుకు ఆ పార్టీ ఓట్లను ఆరెల్పీ చీల్చడం కూడా గట్టి కారణమే. 2022ల సర్దార్ షహర్ స్థానంలో కాంగ్రెస్ తన ఓట్ల సంఖ్యను పెంచుకోగా, జాట్ల ఓట్లు మాత్రం బీజేపీ, ఆరెల్పీ మధ్య చీలాయి. దాంతో కాంగ్రెస్ 26 వేల ఓట్ల మెజారిటీతో నెగ్గింది. అక్కడ ఆరెల్పీకి 46,628 ఓట్లు రావడం విశేషం. అంతకుముందు 2021లో వల్లభ్‌నగర్ ఉప ఎన్నికలోనైతే ఆరెల్పీ ఏకంగా బీజేపీ తిరుగుబాటు అభ్యర్థినే రంగంలోకి దింపింది. దాంతో ఆ పార్టీ ఏకంగా నాలుగో స్థానానికి పడిపోయింది! సూజన్‌గఢ్ ఉప ఎన్నికలోనూ ఆరెల్పీ 32,210 ఓట్లు కొల్లగొట్టి సత్తా చాటింది. దాంతో ఇక్కడా కాంగ్రెసే నెగ్గింది! అందుకే ఈసారి అసెంబ్లీ ఎన్నికల పోరు హోరాహోరీగా సాగుతున్న నేపథ్యంలో కాంగ్రెస్, బీజేపీల్లో గెలుపోటములకు మధ్య ఆరెల్పీయే ప్రధాన కారణంగా నిలిచే ఆస్కారం కనిపిస్తోంది.

అసంతృప్తితో జాట్లు...

రాజస్తాన్‌లో జాట్ సామాజికవర్గంలో కొంత కాలంగా తీవ్ర అసంతృప్తి నెలకొని ఉంది. తమ కులానికి సంబంధించిన నేతే సీఎంగా ఉండాలని డిమాండ్ చేస్తోంది. రాష్ట్ర కాంగ్రెస్, బీజేపీ చీఫ్‌లిద్దరూ జాట్లే ఉండేవారు. ఇటీవలే బీజేపీ సతీశ్ పునియా స్థానంలో సీపీ జోషిని రాష్ట్ర పార్టీ అధ్యక్షున్ని చేసింది. ప్రస్తుత అసెంబ్లీలో 39 మంది జాట్ ఎమ్మెల్యేలున్నారు. అందుకే రెండు ప్రధాన పార్టీలూ తమకు కనీసం 40 చొప్పున టికెట్లివ్వాలని జాట్ మహాసభ డిమాండ్ చేస్తోంది.

ఎస్సీలు ప్రబల శక్తి

రాజస్తాన్‌లో 34 ఎస్సీ రిజర్వుడ్ అసెంబ్లీ నియోజకవర్గాలున్నాయి. 2018 అసెంబ్లీ ఎన్నికల్లో 19 చోట్ల కాంగ్రెస్, 12 స్థానాల్లో బీజేపీ నెగ్గాయి. తర్వాత 2019 లోక్‌సభ ఎన్నికల వేళ ఆరెల్పీ కేంద్రంలో ఎన్డీఏ కూటమితో జట్టు కట్టింది. బెనీవాల్ ఎంపీగా నెగ్గారు కూడా. కానీ రైతు చట్టాలపై విభేదించి బీజేపీకి దూరమయ్యారు. దీనికి తోడు ఆజాద్ పార్టీ కూడా రాష్ట్రంలో బీఎస్పీకి ఉన్న దళిత ఓటు బ్యాంకుపై దృష్టి సారించింది. 2018 అసెంబ్లీ ఎన్నికల్లో రాజస్తాన్‌లో బీఎస్పీ 6 స్థానాల్లో నెగ్గింది. తర్వాత వారంతా కాంగ్రెస్‌లో విలీనమయ్యారు. కానీ ఆ తర్వాత దళితుల పట్ల కాంగ్రెస్ ద్రోహం చేసిందని ఆజాద్ ఆరోపిస్తున్నారు.

– సాక్షి, నేషనల్ డెస్క్

బెనీవాల్.. రైతు నేత



రాజస్తాన్‌లో కాంగ్రెస్, బీజేపీలకు ప్రత్యామ్నాయంగా మూడో శక్తిగా ఎదిగే దిశగా అడుగులు వేస్తున్న హనుమాన్ బెనీవాల్ ప్రస్థానం ఆసక్తికరం. 1972లో నగౌర్‌లో ఓ జాట్ రైతు కుటుంబంలో పుట్టారు. రైతు నాయకునిగా ప్రసిద్ధుడైన బెనీవాల్ రాజకీయ జీవితం బీజేపీ కార్యకర్తగానే మొదలైంది! 2008లో ఆ పార్టీ తరఫున నగౌర్ నుంచి ఎమ్మెల్యే అయ్యారు. కానీ నాటి సీఎం వసుంధరరాజె సింధియా సహా రాష్ట్ర బీజేపీ నేతల అవినీతిని, కాంగ్రెస్ నేతలతో వారి సాన్నిహిత్యాన్ని బాహాటంగానే ప్రశ్నించి పార్టీకి దూరమయ్యారు. 2013లో స్వతంత్ర ఎమ్మెల్యేగా నెగ్గారు. రాజస్తాన్‌లో సరిగ్గా 2018 అసెంబ్లీ ఎన్నికల ముందు ఆరెల్పీని స్థాపించారు. అప్పట్లో పరిమిత స్థానాల్లోనే పోటీ చేసినా ఈ ఐదేళ్లలో చెప్పుకోదగ్గ శక్తిగా ఎదిగారు. 2019 లోక్‌సభ ఎన్నికల్లో బీజేపీ సారథ్యంలోని ఎన్డీఏతో పొత్తు పెట్టుకున్నారు. నగౌర్ స్థానం నుంచి లోక్‌సభలో అడుగు పెట్టారు. కానీ ఎన్డీఏ సర్కారు తెచ్చిన రైతు చట్టాలను, అగ్నివీర్ పథకాన్ని వ్యతిరేకిస్తూ ఆ కూటమికి దూరమయ్యారు. ఈసారి అసెంబ్లీ ఎన్నికల్లో సత్తా చాటాలని ఆశిస్తున్నారు.

ఆజాద్... భీం ఆర్మీ నేత



1986లో ఉత్తరప్రదేశ్‌లోని చుట్మల్‌పూర్‌లో జన్మించిన చంద్రశేఖర్ ఆజాద్ వృత్తిరీత్యా న్యాయవాది. సామాజిక కార్యకర్తగా వెలుగులోకి వచ్చారు. భీం ఆర్మీ సహ వ్యవస్థాపకుడు. ఈ సంస్థ దళితుల అభ్యున్నతికి కృషి చేస్తుంటుంది. వారి కోసం పశ్చిమ యూపీలో స్కూళ్లు తదితరాలు నడుపుతోంది. సహరన్‌పూర్ అల్లర్లలో జాతీయ భద్రతా చట్టం కింద ఆజాద్ జైలుకు వెళ్లారు. అనంతరం ఆజాద్ సమాజ్ పార్టీ స్థాపించారు. 2021లో టైం మేగజీన్ 100 మంది వర్ధమాన నేతల జాబితాలో చోటుచేసుకున్నారు.

ఆ 76 లక్షల ఓటర్లే లక్ష్యం...

2018 అసెంబ్లీ ఎన్నికల్లో రాజస్తాన్‌లో 3.56 కోట్ల ఓట్లు పోలయ్యాయి. వాటిలో కాంగ్రెస్, బీజేపీల్లో వేటికీ పడని ఓట్లు ఏకంగా 21.34 శాతం! అంటే 76 లక్షల ఓట్లు! వీటినే ఇప్పుడు ఆరెల్పీ, ఏఎస్పీ ప్రధానంగా లక్ష్యం చేసుకున్నాయి.

2018 అసెంబ్లీ ఎన్నికల్లో పార్టీలవారీగా సాధించిన ఓట్లు

పోలైన ఓట్లు	3.56 కోట్లు
బీజేపీ	1.38 కోట్లు
కాంగ్రెస్	1.4 కోట్లు
ఆరెల్పీ	6.5 లక్షలు
ఏఎస్పీ	-
ఇతరులు	76 లక్షలు

ఫలితాలను నిర్దేశించే అసెంబ్లీ స్థానాల సంఖ్య

జాట్లు	40 స్థానాలు
ఎస్సీలు	55 స్థానాలు

మరెన్నో స్థానాల్లో కూడా వీరి సంఖ్య గణనీయంగా ఉంది.

రాజస్తాన్‌లో జనాభాలో... జాట్లు 10 శాతం.. ఎస్సీలు 18 శాతం..

మంచిమాట

"ఆకులందున అణిగి మణిగి కవిత కోకిల పలుకవలెనోయ్" అంటారు గురజాడ. తన ఘనతని తాను ప్రకటించుకోవటం కాక, ప్రతిభని అవతలి వారు గుర్తించాలి. కోకిల కనపడ నవ సరం లేదు. దాని గుర్తింపు మధురమైన కంఠస్వరం మాత్రమే. కావాల్సిన వారు దానిని వెతుక్కోవాలి. ఎందుకంటే - రత్నాన్ని అన్వేషించాలే కాని, అది తనని తాను ప్రకటించుకోదు.



అణకువ

''అన్నీ ఉన్న ఆకు అణిగి మణిగి ఉంటుంది. ఏమీ లేని విస్తరి ఎగి రెగిరి పడుతుంది.'' అనే సామెత తెలుసు కదా! నిండు కుండ లాగా తొణకకుండా బెణకకుండా ఉండటం సమృద్ధికి, సంపదకి సంకేతం. అది ఉత్తమ వ్యక్తిత్వ లక్షణం. ఎగిరెగిరి పడకుండా, తన గొప్పని, లేదా తానే గొప్ప అని ప్రకటించుకుంటూ, ప్రదర్శించుకుంటూ ఉండక పోవటమే అణకువ. ఎందుకంటే ఎవరైనా ఒక రంగంలో గొప్ప అనుకుంటే, అదే రంగంలో అంత కన్న ఘనులు అప్పుడే కాని, తరువాత కాని ఉండచ్చు. కనక అహంకరించకూడదు. తన స్థాయి ఏమిటో తెలుసుకుని ఉండాలి. నీలో గొప్పతనం ఉంటే అది నువ్వు ప్రకటించుకోకూడదు. ఇతరులు గుర్తించాలి. ఎట్లా? ప్రవర్తన ద్వారా, మాట ద్వారా. తన గొప్పతనం తానే చెప్పుకున్న వాడు హాస్యాస్పదుడు అవుతాడు. అంతకన్న ముందు ఆయుః క్షీణం అని పెద్దలు చెప్పిన మాట. పైగా తనని తాను పొగడుకోవటం ఆత్మహత్యా సదృశం. మహాపాతకం. అంటే నివృత్తి లేని పరిహారం, ప్రాయశ్చిత్తం లేని పెద్ద పాపం.

నోటితో చెప్పక పోయినా తమ ప్రవర్తన ద్వారా తామే చాలా ఘనులు, ఇతరులు పనికిరాని వారు అనే అభిప్రాయం కలిగేట్టు ప్రవర్తి స్తారు కొందరు. అది వారి విద్యావిహీనత ను సూచిస్తుంది. విద్య వల్ల మొదట వచ్చేది వినయం. (విద్య యొసగును వినయంబు, వినయంబు వలన పాత్రత, పాత్రత వలన ధనం, ధనం వల్ల ఐహికా ముష్మిక సంపదలు బడయు నరుడు) అంటే వినయం అన్నది విద్యావంతుల లక్షణం. వినయ విధేయతలు లేని వారు డిగ్రీలు ఉన్నా విద్యావంతులుగా పరిగణిం పబడరు. చదువు ''కొన్నవారు'' మాత్రమే అవుతారు. ''వస్త్రేణ, వపుషా, వాచా, విద్యయా, వినయేన చ నరో యాతి గౌరవం'' గౌరవార్హతలలో ప్రధానమైన ఐదింటిలో వినయం కూడా ఒకటి. అలా ఒదిగి ఉండటం మనిషి గొప్పతనాన్ని ఏ మాత్రం తగ్గించదు.

''అనువు గాని చోట అధికుల మన రాదు/ కొంచెముండు టన్న కొదువ గాదు / కొండ అద్దమందు కొంచెమై ఉండదా? విశ్వ దాభిరామ వినుర వేమ.'' పరిస్థితులు అను కూలం గా లేనప్పుడు కొంచెం తగ్గి ఉండటం శ్రేయస్కరం. ఎవరో నన్ను గుర్తించి గౌరవించ లేదు అనుకుని కుంగిపోవటం, గుర్తింపు కోసం పాకులాడటం దుఃఖానికి అవమానాలకి హేతువు లవుతాయి. కాస్త తల ఒగ్గి అనుకూల పరిస్థితులు వచ్చాక మళ్ళీ తల ఎత్తవచ్చు.

> పెద్ద ఉప్పెనలు, తుఫానులు వచ్చినప్పుడు పెద్ద పెద్ద చెట్లు విరిగి పడ తాయి. కాని, గరిక ఈదురు గాలికి అనుకూ లంగా తల వంచటం వల్ల సురక్షితంగా ఉంటుంది. గాలివాన తగ్గగానే యథాప్ర కారం తల ఎత్తి నిలబడుతుంది.

సముద్రంలో అలలు ఎగసి 'పడుతూ' ఉంటాయి. ఎగిరితే ఆకా శంలో ఉండలేము కదా! కింద పడక తప్పదు. పడకుండా ఉండాలంటే ఎగరకూడదు. ఎదగాలి. ఉన్నత స్థానానికి వెళ్ళాలి అంటే పైకి క్రమం గా ఎక్కాలి. పైగా ఎత్తుకి వెళ్ళిన కొద్ది మరింత జాగ్రత్తగా ఉండాలి. నేల మీద ఉన్నప్పుడు పడితే చిన్న దెబ్బ. ఎంత ఎత్తునుండి పడితే అంత పెద్ద దెబ్బ. అణకువ తో ఉన్న వారి మీద పెద్దలకి వాత్సల్యం ఉంటుంది. వారి ఆశీస్సులు, సహాయ సహకా రాలు ఉంటాయి. ఎంత ఒదిగితే అంత ఎదు గుతారు.

– డా॥ ఎస్.అనంతలక్ష్మి

బౌద్ధవాణి

కోరికలు కలలోని పూదోటలు

ఒక రోజున బుద్ధుడు అచిరవతి నదీ తీరంలోని ఒక ఆశ్రమానికి వెళ్ళాడు. అక్కడే ఒక ఆరామం కూడా ఉంది. బుద్ధుడు అక్కడే ఉన్నాడని తెలు సుకుని ఆ పరిసర గ్రామ వాసులు ఎందరో అక్కడికి వచ్చారు.

బుద్ధుని ధర్మోపదేశం పూర్తి చేయగానే... ఒక యువకుడు లేచి నమస్క రించి...

''భగవాన్! కోరికలు చెడ్డవా? వాటి వల్ల ప్రయోజనం ఉండదా? వివ రించి చెప్పగలరు'' అని ప్రార్థించాడు.

''ఓ యువకా! జాగ్రత్తగా విను. ఒక మాంసం వ్యాపారి తన దుకాణం దగ్గరకు వచ్చిన కుక్కకు మాంసం గీకేసిన ఎముకను వేస్తాడు. ఆ ఎముకకు మాంసం చెమ్మ, కొద్దిగా రక్తం మాత్రమే అంటి ఉంటాయి. కానీ... ఆ కుక్క ఆ ఎముకను కరచుకొని నానా తంటాలు పడుతుంది. దాని వల్ల దాని ఆకలి తీరదు. దౌర్బల్యమూ తొలగదు. కోరికల వల్ల దొరికేది కూడా ఇంతే!

అలాగే... వెలుగు కోసం ఒకడు ఒక గడ్డిదివిటీని పట్టు కుని గాలికి ఎదురుగా పరుగులు తీస్తుంటాడు. దివిటీ మంట చెలరేగి, పెద్దదవుతుంది. దివిటీని పట్టుకున్న వాని ముఖం మీదకే జ్వాలలు వచ్చి పడుతుంటాయి. అప్పుడు వాడు ఆ దివిటీని వదిలి పెట్టకపోతే.. తన దివిటీనే తనని కాల్చేస్తుంది. మనలో రేగిన కామాగ్నులు కూడా మనల్ని అలానే దహిస్తాయి. నిలువెత్తు లోతులో నిప్పుల గుండం ఉంటుంది. అది రగిలి చల్లారింది. పైకి మంట గానీ, పొగ గానే లేవడం లేదు. పైపై బొగ్గలన్నీ చల్లారాయి. కానీ... దానిలో దిగిన వాడు మాత్రం నిప్పుల్లో దిగబడిపోతాడు. మాడి బొగ్గలా మారిపోతాడు. కామం అనే



నిప్పుల గుండంలో దిగబడిన వారు కూడా అలానే నశించి పోతారు. అలాగే... ఒకడు స్వప్నంలో అందమైన పూల తోటలో విహరిస్తూ ఉంటాడు. రంగురంగుల పూలచెట్లు, అందమైన సీతాకోకచిలుకలు, తుమ్మెదల ఝుంకార నాదాలూ... మత్తు కలిగించే చల్లని గాలి, వాడు ఆనందం లో తేలిపోయి, మైమరచిపోతాడు. అంతలో మెలకువ వస్తుంది. ఆనంద దృశ్యాలన్నీ అదృశ్యమై పోతాయి. మధురానుభూతి మాయమైపోతూ ఉంటుంది. కామ సుఖాలు కూడా అలాంటివే...

ఇంకా ఒకరు అందమైన, విలువైన నగల్ని అరువు తెచ్చుకుంటారు. ధరిస్తారు. దూరంగా ఉన్న పట్టణానికి వెళ్తారు. అక్కడ అంగడిలో వాటిని అమ్మకానికి పెడతారు. బేరం జరు గుతూ ఉండగా, అసలైన నగల యజమాని వస్తాడు. దూషించి తన నగలు తాను పట్టుకుపోతాడు. అవమానంతో బేలత నంతో ఆ అరువు తెచ్చుకున్న వారు హేళన పాలవుతారు.

కామాలు అంటే కోరికలు కూడా మనకి చివరికి అవమానాల్ని తెస్తాయి. హేళన పాల్జేస్తాయి.

కాబట్టి కోరికలల వెంటపడి పరుగుతీసే మన మనస్సుని మనం నియంత్రించుకోవాలి.'' అని చెప్పాడు. ఆ యువకునితో పాటు, అక్కడ ఉన్న వారందరికీ కోర్కెల వల్ల కలిగే కీడు అర్థమైంది. ఆ యువకుడు లేచి, బుద్ధునికి వంగి నమస్కరించాడు.

– డా. బొర్రా గోవర్ధన్

వాగ్గేయకార వైభవం

లోపలి అరలు, పొరలు, వాటికి అడ్డంగా తెరలు

భక్తి ఎప్పుడూ ఆధిపత్య ధోర ణిని, అహంభావాన్ని ప్రదర్శించదు. నేను గొప్ప, నాకిది వచ్చు. నాకన్నా వాళ్లెంత...అన్న వైఖరిని చూపదు.

విద్య...విత్ అంటే తెలు సుకొనుట. ఏది తెలుసుకో వాలో అది తెలుసుకుంటే అది వినయం. ''విద్యాదదాతి వినయం వినయాద్యాతిపాత్రతాం పాత్రత్వాత్ ధనమాప్నోతి ధనాద్ధర్మం తత సుఖం'' వైరాగ్య సుఖం, మోక్ష సుఖం వరకు అంతే. అందుకే త్యాగరాజ స్వామి వారిని... మీరంతవారు, మీరింత వారని అంటూంటే... ఆయన పొంగిపోలేదు. పైగా ఆయనేమన్నారు.. అంటే...

ఎందరో మహానుభావులు ...అందరికీ వందన ములు... అన్నారు. బ్రహ్మాన్ని తెలుసుకున్నవారు, రమించినవారు, పాడినవారు, అర్చించినవారు, అనుభవించినవారు ఎంతో మంది ఉండగా వారి ముందు నేనెంత, వారికి నేనేం చేయగలను, నమ స్కారం చేస్తా...'' అని వారందరినీ ఆదరపూర్వకంగా స్మరించుకున్నారు. వినయం అంటే అదీ.

ఆదిశంకరులు అంతటి వారు ''పశుం మాం సర్వజ్ఞ ప్రథితకృప యాపాలయవిభో''...'శివా! నేను పశువును. నీవు పశుపతివి. ఇదే మనిద్దరి మధ్య బంధం' అన్నారు. అది వినయం. అది విద్యకు పర మార్థం.అది దేనిచేత ప్రకాశిస్తుంది... అంటే ఉపాసనా దేవత అనుగ్రహానికి పాత్రమయితే అప్పుడు వినయం వస్తుంది. ఆ వినయం మనకు వాగ్గేయకారులందరిలో కనబడుతుంది. అందుకే వారు ఏది చెప్పినా ఏది చేసినా మనకు సందేశం ఇస్తు న్నట్లో, సలహా ఇస్తున్నట్లో ఉండదు. వారికి వారు చెప్పుకు న్నట్లు ఉంటుంది.

భిన్న కథనాలు ఉన్నప్పటికీ, త్యాగరాజ స్వామివారు ఒక సారి వేంకటాచలం వెళ్ళారు, స్వామి వారి దర్శనం కోసం కూచున్నారు. తెర అడ్డంగా ఉంది. దిగంతాలకు వ్యాపించిన కీర్తిమంతుడిని, సాక్షాత్ ఉపనిషద్బ్రహ్మేంద్రులంతటి వారు నన్నుపిలిచి కీర్తనలు పాడించుకుంటారే, నేనొస్తే తెర వేస్తారా... అని ఆయన కోపగించుకోలేదు.

ఈ తెర కాసేపయితే తీస్తారు.. ఇవ్వాళ కాకపోతే రేపయినా తీస్తారు. కానీ లోపల ఇంకొక తెర ఉంది... అనే అర్థంలో ఆయన అన్న మాటేమి టంటే...''తెర తీయగ రాదా, నాలోని తిరుపతి వేంకటరమణా! మదమ త్సరమను తెరదీయగరాదా, పరమ పురుషా!'' అని పిలిచారు.



నిజానికి భగవంతుడు ఎక్కడ దర్శనం కావాలి? మన లోపల.. 'అంతర్ముఖ సమారాధ్యా బహిర్ముఖ సుదుర్లభా... లోపల అక్కడ కనబడాలి. పరమ యోగీంద్రులకు భావగోచరమైన పాదాబ్జములు నాకు దర్శనమ యితే నేను యోగిని. .. అన్నారు

తెర వేసినందుకుగానీ, తెర తొలగించనందుకు గానీ ఆయన ఎవరినీ నింద చేయలేదు. నా అంతటివాడొస్తే.. అని అహంకరిం చలేదు. ఎప్పుడు తీస్తారని అడగ లేదు. ఇక్కడ ఉన్న తెర ఎవర యినా, ఎప్పుడయినా తీస్తారు. 'లోపల నాకు అడ్డొస్తోన్న తెరవల్ల నీవు నాకు ఎప్పటికీ కనబడడం లేదు. అది నీవే తీయాలి. నేను తీసుకోలేను. ఇంకొకరు తీయ లేరు. అది తీయవయ్యా నాలోని వేంకటరమణా!'– అని వేడుకున్నారు.

నిన్ను పొందడానికి నాకు అడ్డొస్తున్నదేమిటంటే మత్సరం... అన్నారు. ఎంతగొప్పమాట! మత్సరం అంటే అన్య సుఖ ద్వేషి. ఇంకొకరి కిఏదయినా మంచి జరిగితే మనం చాలా బాధపడి పోతుంటాం. అన్నపానీయాలు ఎక్కవు. నిద్రా సుఖం ఉండదు. వాడికి శుభం జరగడమా, నాకన్నా వాడేం గొప్ప. వాడికేం తెలుసని. వాడికి కీర్తి రావడ మేమిటి, వాడికి శుభాలు జరగడమేమిటి ... ఇలా ఇతరులను తక్కువచేసి తన గొప్పదనం స్మరించుకో వడం... అది మత్సరానికి ప్రారంభ స్థానం. అది అడ్డొస్తున్నదన్నారు.



బ్రహ్మశ్రీ చాగంటి కోటేశ్వరరావు

సినిమా

బై బై ముంబై



● రజనీకాంత్, అమితాబ్ బచ్చన్

రజనీకాంత్ హీరోగా 'జై భీమ్' ఫేమ్ టీజే జ్ఞానవేల్ దర్శకత్వంలో ఓ సినిమా తెరకెక్కుతున్న సంగతి తెలిసిందే. లైకా ప్రొడక్షన్స్ పతాకంపై సుభాస్కరన్ నిర్మిస్తున్న ఈ సినిమా షూటింగ్ ఇటీవల ముంబైలో ప్రారంభ మైంది. రజనీకాంత్, అమితాబ్ బచ్చన్ పాల్గొనగా కీలక సన్నివేశాలను చిత్రీకరించారు. ఈ ముంబై షెడ్యూల్ ముగిసిందని వెల్లడించి, ఓ వర్కింగ్ స్టిల్‌ను సోషల్ మీడియాలో షేర్ చేశారు మేకర్స్. ఇలా ముంబైకి బై బై చెప్పారు రజనీకాంత్. ఇక 1991లో విడుదలైన హిందీ చిత్రం 'హమ్' తర్వాత రజనీకాంత్, అమితాబ్ బచ్చన్ కలిసి 33 ఏళ్లకు స్క్రీన్ షేర్ చేసుకుం టున్న చిత్రం ఇది. రానా, ఫాహద్ ఫాజిల్, మంజు వారియర్, రితికా సింగ్, దుషారా విజయన్ కీలక పాత్రల్లో నటిస్తున్న ఈ సినిమాకు అనిరుధ్ రవి చంద్రన్ సంగీతం అందిస్తున్నారు. ఓ సామాజిక అంశం నేపథ్యంలో తెరకెక్కు తున్న ఈ సినిమాలో పోలీసాఫీసర్ పాత్రలో రజనీకాంత్ కనిపిస్తారని, వచ్చే ఏడాది ఈ చిత్రం విడుదల కానుందనే టాక్ వినిపిస్తోంది.

ఇంట్రో రెడీ



● కమల్‌హాసన్

కమల్‌హాసన్ హీరోగా శంకర్ దర్శకత్వంలో రూపొందు తున్న తాజా చిత్రం 'ఇండియన్ 2'. 1996లో కమల్, శంకర్ కాంబినేషన్‌లోనే వచ్చిన 'ఇండియన్'కు సీక్వెల్‌గా ఈ చిత్రం రూపొందుతోంది. ఈ సినిమా మేజర్ షూట్ పూర్తయింది. తాజాగా 'ఇండియన్ 2' సినిమాకు సంబంధించిన వీడియోను 'ఇండియన్ 2 యాన్ ఇంట్రో' టైటిల్‌తో నవంబరు 3న రిలీజ్ చేయనున్నట్లు చిత్ర యూనిట్ వెల్లడించింది. కాజల్ అగర్వాల్ హీరోయిన్‌గా నటిస్తున్న ఈ చిత్రంలో సిద్ధార్థ్, బాబీ సింహా, రకుల్‌ప్రీత్ సింగ్ కీలక పాత్రలు పోషిస్తున్నారు. సుభాస్కరన్, ఉదయ నిధి స్టాలిన్ నిర్మిస్తున్న ఈ చిత్రం వచ్చే ఏడాది విడుదల కానుంది. ఈ చిత్రానికి సంగీతం: అనిరుధ్ రవిచంద్రన్.

విష్ణు మంచుకు గాయాలు



● విష్ణు మంచు

హీరో విష్ణు మంచు టైటిల్ రోల్ చేస్తున్న మైథలాజికల్ ఫిల్మ్ 'కన్నప్ప'. ప్రస్తుతం ఈ సినిమా షూటింగ్ న్యూజి ల్యాండ్‌లో జరుగుతోంది. ఈ సినిమాలోని ఓ యాక్షన్ సీక్వెన్స్‌ను డ్రోన్ కెమెరాతో చిత్రీకరిస్తున్న సమయంలో ఆ డ్రోన్ అదుపు తప్పి విష్ణు చేతికి తాకడంతో, ఆయన గాయా లపాయ్యారని సమాచారం. దీంతో 'కన్నప్ప' షూటింగ్‌ను తాత్కాలికంగా నిలిపివేశారట. ముఖేష్ కుమార్ సింగ్ దర్శక త్వంలో రూపొందుతున్న ఈ చిత్రంలో ప్రభాస్, మోహన్ లాల్, శివ రాజ్‌కుమార్ కీలక పాత్రల్లో నటిస్తున్నారు. అవా ఎంటర్టైన్మెంట్స్, 24 ఫ్రేమ్స్ ఫ్యాక్టరీ ఈ సినిమాను నిర్మిస్తు న్నాయి.

అక్కడ మొదలైంది వేట!



● జపాన్ సినిమా వేడుకలో ఓ దృశ్యం

''ఓపెన్ చేస్తే ఓ పెద్ద సముద్రాన్ని చూపిస్తున్నాం. అందులో ఒక బుల్లి చేప. దాని వయసు పదేళ్లు. ఈ బుల్లి చేప.. అమ్మ చేప కోసం ఓ కన్నం వేసింది. అక్కడ మొదలైంది బుల్లి చేప వేట.. ఎండ్రకాయకో కన్నం, రొయ్యకో కన్నం, మొసలికో కన్నం... కన్నాల మీద కన్నాలేసి ఆ బుల్లి చేప ఓ పెద్ద తిమింగలమై పోయింది'' అంటూ మొదలైంది 'జపాన్' సినిమా తెలుగు ట్రైలర్. కార్తీ హీరోగా రాజు మురుగన్ దర్శకత్వంలో ఎస్ఆర్ ప్రకాశ్ బాబు, ఎస్ఆర్ ప్రభు నిర్మిస్తున్న చిత్రం ఇది. అనూ ఇమ్మాన్యుయేల్ హీరోయిన్‌గా నటించిన ఈ సినిమాలో సునీల్, విజయ్ మిల్టన్ కీలక పాత్రల్లో నటిస్తున్నారు. 'జపాన్' సినిమా దీపావళి సందర్భంగా విడుదల కానుంది. కార్తీ కెరీర్‌లో 25వ సినిమా తెరకె క్కుతోన్న ఈ సినిమా ట్రైలర్ రిలీజ్ వేడుక చెన్నైలో జరిగింది. తెలుగు వెర్షన్‌ను అన్నపూర్ణ స్టూడియోస్ విడు దల చేస్తోంది. ట్రైలర్ రిలీజ్ వేడుకలో హీరోలు సూర్య, విశాల్, ఆర్య, 'జయం' రవి, దర్శకులు లోకేశ్ కనకరాజ్, పా. రంజిత్ పాల్గొన్నారు. ఈ చిత్రానికి సంగీతం: జీవీ ప్రకాశ్‌కుమార్.

యాక్షన్ ఘోస్ట్



● శివరాజ్‌కుమార్

కన్నడ స్టార్ శివ రాజ్‌కుమార్ హీరోగా శ్రీని దర్శకత్వంలో రూపొందిన కన్నడ యాక్షన్ చిత్రం 'ఘోస్ట్'. అనుపమ్ ఖేర్, జయరామ్, ప్రశాంత్ నారాయణ్, అర్చనా జాయిస్, సత్య ప్రకాశ్ కీలక పాత్రల్లో నటించారు. ఎన్. సందేశ్ నిర్మించిన ఈ చిత్రం అక్టోబరు 19న విడుదలైంది. ఈ సినిమాకు ప్రేక్షకుల నుంచి సానుకూల స్పందన లభించిందని, దీంతో ఈ సిని మాను నవంబరు 4న తెలుగులోనూ విడుదల చేయనున్న ట్లుగా చిత్రం యూనిట్ వెల్లడించింది. ఈ చిత్రానికి సంగీతం: అర్జున్ జన్య.

లవ్ అండ్ ఎమోషన్



● హెబ్బా పటేల్, దినేష్, పాయల్ రాధాకృష్ణ

దినేష్ తేజ్ హీరోగా, హెబ్బా పటేల్, పాయల్ రాధాకృష్ణ హీరోయిన్లుగా నటించిన ఫీల్ గుడ్ లవ్‌స్టోరీ ఫిల్మ్ 'అలా నిన్ను చేరి'. మారేష్ శివన్ దర్శ కత్వంలో కొమ్మాలపాటి శ్రీధర్ సమర్పణలో కొమ్మాలపాటి సాయి సుధాకర్ నిర్మించిన ఈ చిత్రం నవంబరు 10న విడుదల కానుంది. ''కుటుంబ సమేతంగా చూడదగ్గ లవ్ అండ్ ఎమోషనల్ ఫిల్మ్ ఇది. చంద్రబోస్‌గారి సాహిత్యం, సుభాస్ ఆనంద్ సంగీతం అదనపు ఆకర్షణలు '' అని చిత్ర యూనిట్ పేర్కొంది.

ఓ యువతి కథ



● నిహాల్, అక్షేషా

కర్ణాటక రాష్ట్రంలో హళిబేడు ఆలయా నికి సమీపంలో ఉన్న గిరిజన తండాలో జరిగిన ఓ వాస్తవ ఘటన ఆధారంగా నిర్మాత కేఎస్ రామారావు పర్యవేక్షణలో తెరకె క్కిన పీరియాడికల్ ఫిల్మ్ 'శాంతల'. నిహాల్ కోదాటి, అశ్లేషా ఠాకూర్ హీరోహీరోయిన్లుగా నటించగా, వినోద్ కుమార్ ఓ ప్రధాన పాత్రలో నటించారు. ఇండో అమెరికన్ ఆర్ట్స్ పతాకంపై డా. యిర్రంకి సురేష్ నిర్మించిన ఈ చిత్రం నవంబరు 17న తెలుగు, మలయాళ, తమిళ, కన్నడ, హిందీ, మరాఠీ భాషల్లో విడుదల కానుంది. ''ఓ గిరిజన తండాలో అమాయక స్త్రీలను చెరబట్టే అరాచకానికి ఒడిగడుతున్న ఒక కామాం ధుడి బారి నుండి విముక్తి పొందిన ఒక యువతి కథే 'శాంతల' చిత్రకథ. బేలూరు, హళిబేడు జంట దేవాలయాల వద్ద అత్యంత సుందరమైన సన్నివేశాలు, పాటలను చిత్రీక రించాం. అలాగే కీలక సన్నివేశాలను కర్ణాటకలోని మారుమూల ప్రాంతాల్లో దర్శకుడు శేషు పెద్దిరెడ్డి నిర్దేశకత్వంలో కేఎస్ రామారావు షూటింగ్ కార్యక్రమా లను నిర్వహించారు'' అని చిత్ర యూనిట్ పేర్కొంది. ఈ చిత్రానికి సంగీతం: విశాల్ చంద్రశేఖర్.

హాలీవుడ్ నటుడు మాథ్యూ ఫెర్రీ ఇక లేరు

అమెరికన్ ప్రముఖ నటుడు మాథ్యూ ఫెర్రీ (54) ఇక లేరు. లాస్ ఏంజిల్స్‌లోని స్వగృహంలో ఫెర్రీ అనుమానాస్పద రీతిలో మరణించినట్లుగా అక్కడి పోలీస్ అధికారులు వెల్లడించారు. జాన్ బెన్నెట్ ఫెర్రీ, సుజానే మేరీ మోరిసన్ దంపతులకు 1969 ఆగస్టు 19న జన్మించారు మాథ్యూ ఫెర్రీ. ఫెర్రీకి ఏడాది వయసు పూర్తి కాక ముందే బెన్నెట్ ఫెర్రీ, సుజానే మేరీ విడాకులు తీసుకున్నారు. 15 ఏళ్ల తల్లి వద్దే ఉంటూ చదువుకున్నాడు ఫెర్రీ. ఆ తర్వాత అప్పటికే నటనా రంగంలో ఉన్న తండ్రి బాటలో నడిచారు ఫెర్రీ. అలా సినిమాలు, ముఖ్యంగా సీరియల్స్‌లో నటించి పేరు గడించారు. 1994లో ఆరం భమైన 'ఫ్రెండ్స్' సిరీస్‌తో ఆయన జీవితం కీలక మలుపు తీసుకుంది. ఇందులో ఫెర్రీ పోషించిన చాండ్లర్ బింగ్ పాత్ర అద్భుతంగా క్లిక్ అయ్యింది. ప్రపంచవ్యాప్తంగా ఫెర్రీకి అభిమానులను సంపా దించిపెట్టింది. 'ఫ్రెండ్స్' సిరీస్ 2014 వరకు ఓ అమెరికన్ చానెల్‌లో ప్రసారమైంది. అలాగే 2021లో 'ఫ్రెండ్స్ రీ యూనియన్ షో' కూడా జరిగింది. ఈ షో ఓ ప్రముఖ ఓటీటీ ప్లాట్‌ఫామ్‌లో ప్రస్తుతం స్ట్రీమింగ్ అవుతోంది. 'ఎమ్టీ నెస్ట్', 'హైవే టు హెవెన్', 'ఫ్రెండ్స్', 'మిస్టర్ సన్‌షైన్'... ఇలా 40కి పైగా టెలివి జన్ సిరీస్‌లలో నటించారు ఫెర్రీ. అలాగే 'ది కిడ్', 'బర్డ్స్ ఆఫ్ అమెరికా'.. ఇలా దాదాపు 15 హాలీవుడ్ సినిమాల్లో కూడా నటించారాయన. ఇక ఫెర్రీ మృతి పట్ల ఇండియన్ స్టార్స్ వెంకటేశ్, మహేశ్‌బాబు, అక్షయ్ కుమార్, రణ్‌వీర్ సింగ్, సమంత, కరీనా కపూర్‌లతో పాటు పలువరు హాలీవుడ్ స్టార్స్ సోషల్ మీడియా వేదికగా సంతాపం తెలిపారు.



● మాథ్యూ ఫెర్రీ

యూత్‌ఫుల్ ప్రేమకథ



● కిశోర్ కేఎస్‌డీ

కిశోర్ కేఎస్‌డీ, దియా సితెపల్లి జంటగా నటి స్తున్న చిత్రం 'ప్రేమ కథ'. టాంగా ప్రొడక్షన్స్ ఎల్ఎల్‌పీ, సినీ వ్యాలీ మూవీస్ పతాకాలపై విజయ్ మట్టపల్లి, సుశీల్ వాజపిల్లి, శింగ నమల కల్యాణ్ ఈ సినిమాను నిర్మిస్తున్నారు. ఈ సినిమా ఫస్ట్ లుక్‌ను దర్శకుడు హరీష్ శంకర్ విడుదల చేసి, లుక్ బాగుందని, ఈ సినిమా విజయం సాధించాలని చిత్ర బృందానికి శుభాకాంక్షలు తెలిపారు. ''వైవిధ్యమైన లవ్‌స్టోరీతో నేటితరం యువ ప్రేక్షకులకు నచ్చేలా ఈ చిత్రం ఉంటుంది. ప్రస్తుతం ఈ సినిమా షూటింగ్ చివరి దశలో ఉంది'' అని చిత్ర యూనిట్ పేర్కొంది. ఈ చిత్రానికి సంగీతం: రథన్, సహనిర్మాత: ఉపేంద్ర గౌడ్ ఎర్ర.



1 వన్డే ప్రపంచకప్ టోర్నీ మ్యాచ్‌లో విరాట్ కోహ్లి తొలిసారి 'డకౌట్' అయ్యాడు. వరుసగా నాలుగో ప్రపంచకప్ ఆడుతున్న కోహ్లి ఇప్పటివరకు ఈ టోర్నీ చరిత్రలో 32 మ్యాచ్‌లు ఆడి 1,384 పరుగులు సాధించాడు. ఇందులో 3 సెంచరీలు, 9 అర్ధ సెంచరీలు ఉన్నాయి.

5 ఇంగ్లండ్‌తో మ్యాచ్‌లో 87 పరుగులు చేసిన క్రమంలో రోహిత్ శర్మ అంతర్జాతీయ క్రికెట్‌లో 18 వేల పరుగులు పూర్తి చేసుకున్న ఐదో భారతీయ క్రికెటర్‌గా గుర్తింపు పొందాడు. ఈ జాబితాలో సచిన్ టెండూల్కర్, రాహుల్ ద్రవిడ్, సౌరవ్ గంగూలీ, విరాట్ కోహ్లి ఉన్నారు.

100 అంతర్జాతీయ క్రికెట్‌లో 100 మ్యాచ్‌ల్లో (మూడు ఫార్మాట్‌లు కలిపి) కెప్టెన్‌గా వ్యవహరించిన ఏడో భారతీయ కెప్టెన్‌గా రోహిత్ శర్మ నిలిచాడు. రోహిత్‌కంటే ముందు ధోని, అజహరుద్దీన్, కోహ్లి, గంగూలీ, కపిల్ దేవ్, రాహుల్ ద్రవిడ్ ఈ ఘనత సాధించారు. రోహిత్ సారథ్యంలో 100 మ్యాచ్‌లు ఆడిన భారత్ 74 మ్యాచ్‌ల్లో విజయం అందుకుంది.

ప్రపంచకప్‌లో నేడు

శ్రీలంక X అఫ్గానిస్తాన్
వేదిక: పుణే


మధ్యాహ్నం 2 గంటల నుంచి స్టార్ స్పోర్ట్స్, హాట్‌స్టార్ యాప్‌లో ప్రత్యక్ష ప్రసారం

ప్రపంచకప్ పాయింట్ల పట్టిక

జట్టు	ఆ	గె	ఓ	పా	నె.ర.రే.
భారత్	6	6	0	12	1.405
దక్షిణాఫ్రికా	6	5	1	10	2.032
న్యూజిలాండ్	6	4	2	8	1.232
ఆస్ట్రేలియా	6	4	2	8	0.970
శ్రీలంక	5	2	3	4	-0.025
పాకిస్తాన్	6	2	4	4	-0.387
అఫ్గానిస్తాన్	5	2	3	4	-0.969
నెదర్లాండ్స్	6	2	4	4	-1.277
బంగ్లాదేశ్	6	1	5	2	-1.338
ఇంగ్లండ్	6	1	5	2	-1.652

నోట్: ఆ-ఆడినవి, గె-గెలిచినవి, ఓ-ఓడినవి, పా-పాయింట్లు, నె.ర.రే-నెట్ రన్‌రేట్

ఆరు... భారత్ జోరు...



షమీ



బుమ్రా



సూర్యకుమార్

ఆరో పోరులోనూ భారత్ అదరగొట్టింది. ఎదురులేని ఆటతో దూసుకుపోతున్న జట్టు మళ్లీ తమ స్థాయిని ప్రదర్శించింది. కనీసం పోటీ కూడా ఇవ్వలేని స్థితికి ఇంగ్లండ్‌ను నెడుతూ సంపూర్ణ ఆధిపత్యంతో మరో ఘన విజయాన్ని తమ ఖాతాలో వేసుకుంది. గత ఐదు మ్యాచ్‌లలో ఛేదనలో లక్ష్యం చేరిన టీమిండియా ఈసారి ముందుగా బ్యాటింగ్ చేసి తమ బలాన్ని ప్రదర్శించింది. పరుగులు సాధించేందుకు కాస్త ఇబ్బందిగా కనిపించిన పిచ్‌పై కొంత తడబడినా... 229 స్కోరు కూడా టీమిండియా గెలిచేందుకు సరిపోయింది. పట్టుదలతో కూడిన బ్యాటింగ్‌తో రోహిత్ జట్టు ఇన్నింగ్స్‌ను నిలబెట్టగా... బౌలింగ్‌లో బుమ్రా, షమీ, కుల్దీప్ చెలరేగి ఇంగ్లండ్ పని పట్టడంతో భారత్ సెమీస్ చేరడం దాదాపు ఖాయమైంది.

డిఫెండింగ్ చాంపియన్‌గా భారీ అంచనాలతో బరిలోకి దిగి ఆపై వరుస ఓటములతో దిగాలు పడి ఈ మ్యాచ్ బరిలోకి దిగిన ఇంగ్లండ్ మళ్లీ అదే పేలవ ఆటను కనబర్చింది. ఈ టోర్నీలో దాదాపుగా ఆ జట్టు ఆట ముగిసినట్లే. గత మ్యాచ్‌లకంటే మెరుగైన బౌలింగ్ ప్రదర్శనతో భారత్‌లాంటి పటిష్ట జట్టును తక్కువ స్కోరుకే పరిమితం చేసినప్పుడు ఇంగ్లండ్ విజయంపై ఆశలు రేగాయి. ఆ టీమ్ కోలుకునేందుకు ఇదే సరైన మ్యాచేమో అనిపించింది. కానీ కనీసం ఓనమాలు తెలియని రీతిలో ఇంగ్లండ్ బ్యాటర్లు ఘోరంగా ఆడి మరో 15 ఓవర్లు ఉండగానే మ్యాచ్‌ను అప్పగించేశారు. ఇంగ్లండ్ ఇన్నింగ్స్‌లో 8 వికెట్లు బౌల్డ్ లేదా ఎల్బీడబ్ల్యూలు ఉన్నాయంటే మన బౌలింగ్ పదును, ఇంగ్లండ్ చెత్త బ్యాటింగ్ ఏమి అర్థమవుతుంది.

టీమిండియాకు వరుసగా ఆరో విజయం

- 100 పరుగులతో ఇంగ్లండ్ చిత్తు
- గెలిపించిన షమీ, బుమ్రా
- రోహిత్ కీలక ఇన్నింగ్స్
- సెమీస్ బెర్త్ దాదాపు ఖరారు
- గురువారం శ్రీలంకతో టీమిండియా తర్వాతి పోరు

లక్నో: సొంతగడ్డపై వరల్డ్‌కప్‌లో భారత జట్టు అసాధారణ ప్రదర్శన కొనసాగుతోంది. టైటిల్ వేటలో ఒక్క ఓటమీ లేకుండా వెళుతున్న రోహిత్ సేన ఆరో మ్యాచ్‌లోనూ విజయాన్ని తమ ఖాతాలో వేసుకుంది. ఆదివారం జరిగిన ఈ మ్యాచ్‌లో భారత్ 100 పరుగుల భారీ తేడాతో ఇంగ్లండ్‌ను చిత్తు చేసింది. టాస్ ఓడి ముందుగా బ్యాటింగ్‌కు దిగిన భారత్ 50 ఓవర్లలో 229 పరుగులకు ఆలౌటైంది. 'ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్' రోహిత్ శర్మ (101 బంతుల్లో 87; 10 ఫోర్లు, 3 సిక్స్‌లు) మరో చక్కటి ప్రదర్శనతో జట్టును ఆదుకోగా, సూర్యకుమార్ యాదవ్ (47 బంతుల్లో 49; 4 ఫోర్లు, 1 సిక్స్), కేఎల్ రాహుల్ (58 బంతుల్లో 39; 3 ఫోర్లు) కీలక ఇన్నింగ్స్‌లు ఆడారు. అనంతరం ఇంగ్లండ్ 34.5 ఓవర్లలో 129 పరుగులకే కుప్పకూలింది. లివింగ్‌స్టోన్ (27)దే అత్యధిక స్కోరు కాగా... మొహమ్మద్ షమీ (4/22), బుమ్రా (3/32) తమ బౌలింగ్‌తో ప్రత్యర్థిని చిత్తు చేశారు. భారత్ తమ తర్వాతి మ్యాచ్‌లో గురువారం ముంబైలో శ్రీలంకతో తలపడుతుంది.

కీలక భాగస్వామ్యం...

విల్లీ వేసిన తొలి ఓవర్‌ను 'మెయిడిన్'గా ఆడిన రోహిత్ అతని తర్వాతి ఓవర్లో ఫోర్, 2 సిక్స్‌లతో దూకుడు ప్రదర్శించాడు. అయితే మరో ఎండ్‌లో భారత్ 14 పరుగుల వ్యవధిలో 3 వికెట్లు కోల్పోయింది. గిల్ (9)ను వోక్స్ అవుట్ చేయగా, అతని బౌలింగ్‌లోనే అయ్యర్ (4) చెత్త షాట్ ఆడి నిష్క్రమించాడు. ఈ రెండు వికెట్ల మధ్య విల్లీ బౌలింగ్‌లో కోహ్లి (0) డకౌట్ కావడంతో స్టేడియంలో నిశ్శబ్దం ఆవరించింది. ఎనిమిది బంతుల పాటు పరుగు తీసేందుకు తీవ్రంగా ప్రయత్నించిన అనంతరం సహనం కోల్పోయిన విరాట్ ముందుకొచ్చి ఆడే క్రమంలో సునాయాస క్యాచ్ ఇచ్చాడు. దాంతో స్కోరు 40/3కి చేరింది. ఈ దశలో రోహిత్, రాహుల్ కలిసి ఇన్నింగ్స్‌ను చక్కదిద్దారు. బౌలింగ్‌కు బాగా అనుకూలిస్తున్న కఠినమైన పిచ్‌పై వీరిద్దరు జాగ్రత్తగా ఆడుతూ పరుగులు రాబట్టారు. 33 పరుగుల వద్ద రోహిత్‌ను వుడ్ ఎల్బీగా దొరికిపోయినా...రివ్యూలో అతను బతికిపోయాడు. అనంతరం 66 బంతుల్లో రోహిత్ అర్ధ సెంచరీ పూర్తయింది. నాలుగో వికెట్‌కు 18.3 ఓవర్లలో 91 పరుగులు జోడించిన తర్వాత రాహుల్‌ను అవుట్ చేసిన ఇంగ్లండ్ ఈ జోడీని విడదీసింది. కొద్ది సేపటికి సెంచరీకి చేరువవుతున్న తరుణంలో రోహిత్ కూడా వెనుదిరగ్గా... లోయర్ ఆర్డర్ ప్రభావం చూపలేకపోయింది. అయితే సూర్యకుమార్ కొన్ని చక్కటి షాట్లతో స్కోరును 200 పరుగులు దాటించగలిగాడు.



రోహిత్ శర్మ



కుల్దీప్ బౌలింగ్‌లో ఇంగ్లండ్ కెప్టెన్ బట్లర్ క్లీన్‌బౌల్డ్

టపటపా...

సిరాజ్ ఓవర్లో మలాన్ (16) వరుసగా ఫోర్, సిక్స్ కొట్టడంతో ఇంగ్లండ్ ఛేదన జోరుగా మొదలైంది. 4.4 ఓవర్లలో స్కోరు 30/0కు చేరింది. కానీ ఇక్కడి నుంచే భారత బౌలర్లు చెలరేగడంతో మొదలైన ఇంగ్లండ్ పతనం చివరి వరకు వేగంగా సాగింది. బుమ్రా వరుస బంతుల్లో మలాన్, రూట్ (0)లను వెనక్కి పంపి ప్రత్యర్థి పని పట్టాడు. ఆ తర్వాత షమీ తన వరుస ఓవర్లలో అద్భుత బంతులతో స్టోక్స్ (0), బెయిర్‌స్టో (14)లను బౌల్డ్ చేయగా... కుల్దీప్ వేసిన బంతి అనూహ్యంగా టర్న్ అయి బట్లర్ (10) స్టంప్స్‌ను పడగొట్టింది. ఈ వికెట్‌తో 15.1 ఓవర్లు ముగిసేసరికే ఇంగ్లండ్ పోరాటం దాదాపుగా ముగిసింది. తర్వాతి వరుస బ్యాటర్లకు తమ జట్టును గెలిపించేంత శక్తి లేకపోయింది.



కుల్దీప్

స్కోరు వివరాలు

భారత్ ఇన్నింగ్స్: రోహిత్ (సి) లివింగ్‌స్టోన్ (బి) రషీద్ 87; గిల్ (బి) వోక్స్ 9; కోహ్లి (సి) స్టోక్స్ (బి) విల్లీ 0; అయ్యర్ (సి) వుడ్ (బి) వోక్స్ 4; రాహుల్ (సి) బెయిర్‌స్టో (బి) విల్లీ 39; సూర్యకుమార్ (సి) వోక్స్ (బి) విల్లీ 49; జడేజా (ఎల్బీ) (బి) రషీద్ 8; షమీ (సి) బట్లర్ (బి) వుడ్ 1; బుమ్రా (రనౌట్) 16; కుల్దీప్ (నాటౌట్) 9; ఎక్స్‌ట్రాలు 7; **మొత్తం (50 ఓవర్లలో 9 వికెట్లకు) 229. వికెట్ల పతనం:** 1-26, 2-27, 3-40, 4-131, 5-164, 6-182, 7-183, 8-208, 9-229. **బౌలింగ్:** విల్లీ 10-2-45-3, వోక్స్ 9-1-33-2, రషీద్ 10-0-35-2, వుడ్ 9-1-46-1, లివింగ్‌స్టోన్ 4-1-29-0, అలీ 8-0-37-0.

ఇంగ్లండ్ ఇన్నింగ్స్: బెయిర్‌స్టో (బి) షమీ 14; మలాన్ (బి) బుమ్రా 16; రూట్ (ఎల్బీ) (బి) బుమ్రా 0; స్టోక్స్ (బి) షమీ 0; బట్లర్ (బి) కుల్దీప్ 10; మొయిన్ అలీ (సి) రాహుల్ (బి) షమీ 15; లివింగ్‌స్టోన్ (ఎల్బీ) (బి) కుల్దీప్ 27; వోక్స్ (స్టంప్డ్) రాహుల్ (బి) జడేజా 10; విల్లీ (నాటౌట్) 16; రషీద్ (బి) షమీ 13; వుడ్ (బి) బుమ్రా 0; ఎక్స్‌ట్రాలు 8; **మొత్తం (34.5 ఓవర్లలో ఆలౌట్) 129. వికెట్ల పతనం:** 1-30, 2-30, 3-33, 4-39, 5-52, 6-81, 7-98, 8-98, 9-122, 10-129. **బౌలింగ్:** బుమ్రా 6.5-1-32-3, సిరాజ్ 6-0-33-0, షమీ 7-2-22-4, కుల్దీప్ 8-0-24-2, జడేజా 7-1-16-1.

ప్రపంచకప్‌లో టాప్-7లో నిలిస్తేనే...

- చాంపియన్స్ ట్రోఫీలో అవకాశం
- పాకిస్తాన్ వేదికగా 2025లో టోర్నీ

దుబాయ్: వరల్డ్ కప్‌లో అత్యంత పేలవమైన ఆటతో పాయింట్ల పట్టికలో ప్రస్తుతం చివరి స్థానంలో ఉన్న ఇంగ్లండ్‌ను మరో ప్రమాదం వెంటాడుతోంది. వన్డే క్రికెట్‌లో ఎనిమిది జట్లతో ఆడే మరో ప్రతిష్టాత్మక టోర్నీ చాంపియన్స్ ట్రోఫీకి ఆ జట్టు దూరమయ్యే అవకాశాలు కనిపిస్తున్నాయి. 2021లోనే ఐసీసీ తీసుకున్న నిర్ణయం ప్రకారం ప్రస్తుతం వరల్డ్ కప్‌లో టాప్-7లో నిలిచిన జట్లే చాంపియన్స్ ట్రోఫీకి అర్హత సాధిస్తాయి. ఆతిథ్య దేశమైన పాకిస్తాన్‌కు నేరుగా అవకాశం లభిస్తుంది. టోర్నీలో ఆడుతున్న కొన్ని టీమ్‌లకు ఈ విషయంపై అవగాహన లేదని సమాచారం. అయితే బట్లర్, షకీబ్ మాత్రం ఈ విషయం తమకు తెలుసని, టాప్-7 లక్ష్యంగా ఆడతామని కూడా చెప్పారు. ఆస్ట్రేలియా, నెదర్లాండ్స్, పాకిస్తాన్‌లతో మ్యాచ్‌లు మిగిలి ఉన్న ఇంగ్లండ్ ఏ రకంగా ముందంజ వేస్తుందనేది చూడాలి. టాప్-7 నిబంధన కారణంగా ఈ వరల్డ్ కప్‌లో ఆడని వెస్టిండీస్, ఐర్లాండ్, జింబాబ్వేలకు ఏ రకంగానూ చాంపియన్స్ ట్రోఫీలో ఆడే అవకాశమే లేదు. మరోవైపు 2025లో పాకిస్తాన్ ఆతిథ్యమిస్తున్న ఈ టోర్నీకి భారత్ వెళుతుందా... లేక భారత్ కోసం తటస్థ వేదికను ఏర్పాటు చేస్తారా అనేది ఆసక్తికరం. చివరిసారి 2017లో చాంపియన్స్ ట్రోఫీ జరగ్గా... ఫైనల్లో భారత్‌పై గెలిచి పాకిస్తాన్ తొలిసారి చాంపియన్‌గా నిలిచింది.



డిఫెండింగ్ చాంప్ పాక్ (ఫైల్)

ప్రపంచ మాజీ చాంపియన్‌పై వైశాలి విజయం

చెన్నై: స్విస్ గ్రాండ్ అంతర్జాతీయ చెస్ టోర్నీలో భారత మహిళా గ్రాండ్‌మాస్టర్ (డబ్ల్యూజీఎం) ఆర్. వైశాలి సంచలన ప్రదర్శన చేసింది. ఐల్ ఆఫ్ మ్యాన్‌లో జరుగుతున్న ఈ టోర్నీలో నాలుగో రౌండ్‌లో వైశాలి నల్ల పావులతో ఆడుతూ కేవలం 23 ఎత్తుల్లో ప్రపంచ మాజీ చాంపియన్ మరియా ముజిచుక్ (ఉక్రెయిన్)ను ఓడించింది. భారత యువ గ్రాండ్‌మాస్టర్ ప్రజ్ఞానంద సోదరి అయిన వైశాలి నాలుగో రౌండ్ తర్వాత 3.5 పాయింట్లతో మరో ఇద్దరితో కలిసి సంయుక్తంగా టాప్ ర్యాంక్‌లో ఉంది. ఇటీవల మూడో గ్రాండ్‌మాస్టర్ (జీఎం) నార్మ్ సాధించిన వైశాలి ఎలో రేటింగ్ పాయింట్లు 2500 దాటితే కోనేరు హంపి, ద్రోణవల్లి హారిక తర్వాత భారత్ నుంచి గ్రాండ్‌మాస్టర్ హోదా దక్కించుకున్న మూడో మహిళా క్రీడాకారిణిగా నిలుస్తుంది. ఇదే టోర్నీ ఓపెన్ విభాగంలో తెలంగాణ గ్రాండ్‌మాస్టర్ ఇరిగేశి అర్జున్ నాలుగో రౌండ్ తర్వాత మూడు పాయింట్లతో మరో 17 మందితో కలిసి రెండో స్థానంలో ఉన్నాడు.



విష్ణు జోడీకి టైటిల్

దావణగెరె : అంతర్జాతీయ టెన్నిస్ సమాఖ్య పురుషుల ఎం-15 టోర్నీలో హైదరాబాద్ ప్లేయర్ విష్ణువర్ధన్ డబుల్స్ విభాగంలో టైటిల్ సాధించాడు. భారత్‌కే చెందిన సిద్ధాంత్‌తో జతకట్టి ఈ టోర్నీలో బరిలోకి దిగిన విష్ణు ఫైనల్లో 6-2, 7-5తో గంటా సాయికార్తీక్ రెడ్డి-మనీశ్ (భారత్) జంటపై గెలిచాడు. విష్ణు కెరీర్‌లో ఇది 45వ డబుల్స్ టైటిల్ కావడం విశేషం. 36 ఏళ్ల విష్ణువర్ధన్ 2010 గ్వాంగ్జౌ ఆసియా క్రీడల్లో పురుషుల డబుల్స్‌లో కాంస్యం, మిక్స్‌డ్ డబుల్స్‌లో రజత పతకం సాధించాడు. 2012 లండన్ ఒలింపిక్స్‌లో లియాండర్ పేస్‌తో కలిసి పురుషుల డబుల్స్ విభాగంలో పోటీపడ్డాడు. డేవిస్‌కప్ టోర్నీలో మూడు సార్లు భారత్‌కు ప్రాతినిధ్యం వహించాడు.



తనిష్క్ బృందానికి రజతం

చాంగ్వాన్ (దక్షిణ కొరియా): ఆసియా షూటింగ్ చాంపియన్‌షిప్‌లో ఆదివారం భారత్‌కు రెండు రజత పతకాలు లభించాయి. జూనియర్ పురుషుల 25 మీటర్ల ర్యాపిడ్ ఫైర్ పిస్టల్ టీమ్ ఈవెంట్‌లో తెలంగాణ ప్లేయర్ కొడవలి తనిష్క్ మురళీధర్ నాయుడు, రాజ్‌కన్వర్ సింగ్ సంధూ, సమీర్‌లతో కూడిన భారత జట్టు రెండో స్థానంలో నిలిచింది. తనిష్క్ (569), సమీర్ (573), రాజ్‌కన్వర్ (579) బృందం ఓవరాల్‌గా 1721 పాయింట్లు స్కోరు చేసి రజత పతకం కైవసం చేసుకుంది. పురుషుల 50 మీటర్ల రైఫిల్ ప్రోన్ వ్యక్తిగత విభాగంలో భారత షూటర్ జాహిద్ హుస్సేన్ రజత పతకం సొంతం చేసుకున్నాడు. జాహిద్ 624.5 పాయింట్లు సాధించి రెండో స్థానంలో నిలిచాడు. మరో మూడు రోజులపాటు కొనసాగే ఈ చాంపియన్‌షిప్‌లో ప్రస్తుతం భారత్ 8 స్వర్ణాలు, 12 రజతాలు, 5 కాంస్యాలతో కలిపి మొత్తం 25 పతకాలతో రెండో స్థానంలో ఉంది.




తనిష్క్

వ్రితి అగర్వాల్‌కు కాంస్యం



పనాజీ: జాతీయ క్రీడల్లో తెలంగాణకు ఎనిమిదో పతకం లభించింది. ఆదివారం జరిగిన మహిళల స్విమ్మింగ్ 200 మీటర్ల ఫ్రీస్టయిల్‌లో తెలంగాణ అమ్మాయి వ్రితి అగర్వాల్ కాంస్య పతకం గెలిచింది. వ్రితి 200 మీటర్ల దూరాన్ని 2ని:09.42 సెకన్లలో పూర్తి చేసి మూడో స్థానంలో నిలిచింది. ప్రస్తుతం తెలంగాణ ఎనిమిది పతకాలతో 20వ ర్యాంక్‌లో ఉంది. పురుషుల టేబుల్ టెన్నిస్ టీమ్ ఈవెంట్‌లో తెలంగాణ జట్టు 2-3తో ఢిల్లీ జట్టు చేతిలో ఓడిపోయింది. అథ్లెటిక్స్ 100 మీటర్ల విభాగంలో ఎలాకియాదాసన్ (తమిళనాడు), స్నేహ (కర్ణాటక) చాంపియన్స్‌గా అవతరించారు.

యూకీ ఖాతాలో మూడో డబుల్స్ టైటిల్



న్యూఢిల్లీ: భారత అగ్రశ్రేణి టెన్నిస్ క్రీడాకారుడు యూకీ బాంబ్రీ ఈ ఏడాది మూడో ఏటీపీ చాలెంజర్ డబుల్స్ టైటిల్‌ను సాధించాడు. ఫ్రాన్స్‌లో ఆదివారం ముగిసిన బ్రెస్ట్ ఏటీపీ చాలెంజర్-100 టోర్నీలో యూకీ బాంబ్రీ (భారత్)-జూలియన్ క్యాష్ (బ్రిటన్) ద్వయం విజేతగా నిలిచింది. ఫైనల్లో యూకీ-క్యాష్ జోడీ 6-7 (5/7), 6-3, 10-5తో 'సూపర్ టైబ్రేక్'లో టాప్ సీడ్ రాబర్ట్ గాలోవే (అమెరికా)-అల్బానో ఒలివెట్టి (ఫ్రాన్స్) జంటను ఓడించింది. గంటా 39 నిమిషాలపాటు జరిగిన ఈ మ్యాచ్‌లో యూకీ ద్వయం ఏడు ఏస్‌లు సంధించి, నాలుగు డబుల్ ఫాల్ట్‌లు చేసింది. టైటిల్ నెగ్గిన యూకీ జోడీకి 6,845 యూరోల (రూ. 6 లక్షలు) ప్రైజ్‌మనీతోపాటు 100 ర్యాంకింగ్ పాయింట్లు లభించాయి. ఈ ఏడాది యూకీ గిరోనా చాలెంజర్ టోర్నీ (స్పెయిన్), నొంతబురి (థాయ్‌లాండ్) చాలెంజర్ టోర్నీలో కూడా డబుల్స్ టైటిల్ సాధించాడు.

భారత్ 'పారిస్' ఆశలు ఆవిరి

మహిళల ఫుట్‌బాల్ జట్టుకు రెండో ఓటమి

తాష్కెంట్: వచ్చే ఏడాది జరిగే పారిస్ ఒలింపిక్స్ క్రీడలకు భారత మహిళల ఫుట్‌బాల్ జట్టు అర్హత సాధించే అవకాశాలకు తెరపడింది. ఇక్కడ జరుగుతున్న ఆసియా ఫుట్‌బాల్ కాన్ఫెడరేషన్ (ఏఎఫ్‌సీ) ఒలింపిక్ క్వాలిఫయింగ్ టోర్నీలో భారత జట్టుకు వరుసగా రెండో ఓటమి ఎదురైంది. తొలి మ్యాచ్‌లో భారత్ 0-7తో ప్రపంచ మాజీ చాంపియన్ జపాన్ చేతిలో ఓడిపోగా...ఆదివారం జరిగిన గ్రూప్ 'సి' రెండో లీగ్ మ్యాచ్‌లో టీమిండియాకు 1-3 గోల్స్ తేడాతో వియత్నాం జట్టు చేతిలో పరాజయం ఎదురైంది. లీగ్ దశ తర్వాత మూడు గ్రూప్‌ల్లో అగ్రస్థానంలో నిలిచిన మూడు జట్లతోపాటు రెండో స్థానంలో నిలిచిన ఉత్తమ జట్టు ఫైనల్ రౌండ్‌కు అర్హత సాధిస్తాయి. భారత్ తరఫున సంధ్య రంగనాథన్ (80వ ని.లో) ఏకైక గోల్ చేయగా... వియత్నాం తరఫున హున్ ఎన్‌హు (4వ ని.లో), ట్రాన్ థి హై లిన్ (22వ ని.లో), ఫామ్ హై యెన్ (73వ ని.లో) ఒక్కో గోల్ సాధించారు. తెలంగాణ అమ్మాయి సౌమ్య గుగులోత్ ఈ మ్యాచ్‌లో 59 నిమిషాలు ఆడింది. ఆ తర్వాత ఆమె స్థానంలో సబ్‌స్టిట్యూట్‌గా గ్రేస్‌ను బరిలోకి దించారు. భారత్ తమ చివరి లీగ్ మ్యాచ్‌ను నవంబర్ 1న ఉజ్బెకిస్తాన్‌తో ఆడుతుంది.



సౌమ్య

ప్రపంచకప్ నుంచి లహిరు అవుట్

పుణే: అఫ్గానిస్తాన్‌తో కీలక మ్యాచ్‌కు ముందు శ్రీలంక జట్టుకు ఎదురుదెబ్బ తగిలింది. ఇంగ్లండ్‌తో జరిగిన మ్యాచ్‌లో మూడు కీలక వికెట్లు తీసిన పేసర్ లహిరు కుమార కాలి కండరాల గాయం కారణంగా ప్రపంచ కప్‌లోని మిగతా మ్యాచ్‌లకు దూరమయ్యాడు. లహిరు స్థానంలో దుష్మంత చమీరా శ్రీలంక జట్టులోకి వచ్చాడు. 31 ఏళ్ల చమీరా శ్రీలంక తరఫున 44 వన్డేలు ఆడి 50 వికెట్లు పడగొట్టాడు.

'ఫినిషింగ్ టచ్' ఎవరిదో?

- నేటి నుంచి డబ్ల్యూటీఏ ఫైనల్స్ టోర్నీ
- ఫైనల్ చేరితే సబలెంకాదే 'టాప్' ర్యాంక్

కాన్‌కున్ (మెక్సికో): మహిళల టెన్నిస్ సంఘం (డబ్ల్యూటీఏ) సీజన్ ముగింపు టోర్నమెంట్ డబ్ల్యూటీఏ ఫైనల్స్‌కు రంగం సిద్ధమైంది. ఈ ఏడాది జరిగిన టోర్నీల్లో సాధించిన పాయింట్ల ఆధారంగా టాప్-8లో నిలిచిన క్రీడాకారిణులు ఈ ప్రతిష్టాత్మక టోర్నీకి అర్హత సాధించారు. నవంబర్ ఐదో తేదీ వరకు జరిగే ఈ టోర్నీకి మెక్సికోలోని కాన్‌కున్ నగరం ఆతిథ్యమిస్తోంది. ప్రస్తుత ప్రపంచ నంబర్‌వన్ సబలెంకా (బెలారస్), రెండో ర్యాంకర్ ఇగా స్వియాటెక్ (పోలాండ్), మూడో ర్యాంకర్ కోకో గాఫ్ (అమెరికా), నాలుగో ర్యాంకర్ రిబాకినా (కజకిస్తాన్), ఐదో ర్యాంకర్ జెస్సికా పెగూలా (అమెరికా), ఆరో ర్యాంకర్ మర్కెటా వొండ్రుసోవా (చెక్ రిపబ్లిక్), ఏడో ర్యాంకర్ ఆన్స్ జబర్ (ట్యూనిషియా), తొమ్మిదో ర్యాంకర్ మరియా సాకరి (గ్రీస్) ఈ టోర్నీలో తమ అదృష్టాన్ని పరీక్షించుకుంటారు. ఎనిమిదో ర్యాంకర్ కరోలినా ముకోవా (చెక్ రిపబ్లిక్) గాయం కారణంగా వైదొలగడంతో సాకరికి ఈ టోర్నీలో ఆడే అవకాశం లభించింది. 'బాకలార్ గ్రూప్'లో సబలెంకా, రిబాకినా, పెగూలా, సాకరి... 'చెటుమల్ గ్రూప్'లో స్వియాటెక్, కోకో గాఫ్, జబర్, వొండ్రుసోవా ఉన్నారు. గ్రూప్ దశ మ్యాచ్‌లు ముగిశాక రెండు గ్రూప్‌ల్లో తొలి రెండు స్థానాల్లో నిలిచిన వారు సెమీఫైనల్‌కు అర్హత సాధిస్తారు. గత ఏడాది రన్నరప్ సబలెంకా ఈసారి ఫైనల్ చేరితే ఆమె ఈ ఏడాదిని నంబర్‌వన్ ర్యాంక్‌తో ముగిస్తుంది. ఈ సంవత్సరం సబలెంకా ఆస్ట్రేలియన్ ఓపెన్ గ్రాండ్‌స్లామ్ టైటిల్ గెలిచి, యూఎస్ ఓపెన్‌లో రన్నరప్‌గా నిలిచింది. వింబుల్డన్, ఫ్రెంచ్ ఓపెన్ టోర్నీల్లో సెమీఫైనల్ చేరుకుంది. స్వియాటెక్ ఫ్రెంచ్ ఓపెన్‌లో, వొండ్రుసోవా వింబుల్డన్ టోర్నీలో, కోకో గాఫ్ యూఎస్ ఓపెన్‌లో టైటిల్స్ సాధించారు.

- మొత్తం టోర్నీ ప్రైజ్‌మనీ 90 లక్షల డాలర్లు (రూ. 75 కోట్లు). పార్టిసిపేషన్ ఫీజు రూపంలో ఎనిమిది మందికి 1,98,000 డాలర్ల (రూ. కోటీ 65 లక్షలు) చొప్పున లభిస్తాయి. లీగ్ దశలో ఒక్కో విజయానికి అదనంగా 1,98,000 డాలర్లు (రూ. కోటీ 65 లక్షలు) అందజేస్తారు. ఈ టోర్నీలో అజేయంగా విజేతగా నిలిచిన క్రీడాకారిణి 30,24,000 డాలర్లు (రూ. 25 కోట్ల 21 లక్షలు) ప్రైజ్‌మనీగా అందుకుంటుంది.



విన్నర్స్ ట్రోఫీతో వొండ్రుసోవా, పెగూలా, కోకో గాఫ్, సబలెంకా, స్వియాటెక్, రిబాకినా, ఆన్స్ జబర్, మరియా సాకరి (ఎడమ నుంచి)

సాక్షి **ప్రాఫిట్ ప్లస్**
సోమవారం
30-10-2023

స్టాక్ మార్కెట్లు (శుక్రవారం ముగింపు)

దేశీ సూచీలు		
సెన్సెక్స్ ▲	635	63,783
నిఫ్టీ ▲	190	19,047

మరిన్ని బిజినెస్ వార్తల కోసం 'సాక్షి ప్లస్' చూడండి

విదేశీ సూచీలు			
నాస్‌డాక్	12,643	▲	47
డోజోన్స్	32,418	▽	367
ఎఫ్‌టీఎస్‌ఈ 100	7,291	▽	63
డాక్స్	14,687	▽	44
షాంఘై	3,018	▲	29
నికాయ్	30,992	▲	443

అమెరికా • బ్రిటన్ • జర్మనీ • చైనా • జపాన్

ఫారెక్స్ రేట్లు రూ. లలో

			కొనుగోలు	అమ్మకం
$	యూఎస్ డాలర్	ఒకటి	82.48	84.15
£	బ్రిటన్ పౌండ్	ఒకటి	99.46	102.77
€	యూరో	ఒకటి	86.51	89.56
¥	జపాన్ ఎన్ (100)	ఒకటి	54.63	56.32
AU$	ఆస్ట్రేలియా డాలర్	ఒకటి	51.75	54.04
S$	సింగపూర్ డాలర్	ఒకటి	59.91	61.84
SAR	సౌదీ రియాల్	ఒకటి	21.24	22.87
UAE D	యూఏఈ దిర్హామ్	ఒకటి	21.77	23.56
¥	చైనా యువాన్	ఒకటి	10.25	12.33

ఆపదలో చేయూత.. క్రౌడ్ ఫండింగ్

శాంతి, ఏకాంబరం దంపతులు (పేరు మార్చాం) తొలి కాన్పులో పుత్రుడు అని తెలియగానే పొంగిపోయారు. బాబును చూస్తూ భవిష్యత్తుపై ఎన్నో కలలుగన్నారు. చిన్నారి మూడేళ్ల వయసుకొచ్చేసరికి కదల్లేని స్థితి ఏర్పడింది. హైదరాబాద్‌లోని ఓ కార్పొరేట్ చిన్నారుల ఆస్పత్రిలో చూపించారు. స్పైనల్ మస్క్యులర్ అట్రోఫీ(ఎస్ఎంఏ)తో బాధపడుతున్నట్టు తేలింది. ఈ సమస్య నుంచి బయటపడాలంటే విదేశాల నుంచి 'జోల్‌జెన్‌స్మా' అనే ఇంజెక్షన్‌ను తీసుకొచ్చి ఇవ్వాలి. ఇందుకు సుమారు రూ.16 కోట్లు అవుతుందని వైద్యులు వెల్లడించారు. ఈ సమయంలో బాబు తల్లిదండ్రులకు 'ఇంపాక్ట్ గురూ' ప్లాట్‌ఫామ్ సంజీవనిగా కనిపించింది. చిన్నారి ఎదుర్కొంటున్న పరిస్థితిని వివరిస్తూ విరాళాలకు (ఫండ్ రైజింగ్) పిలుపునిచ్చారు. మూడున్నర నెలల్లో 65,000 మంది దాతల ఉదారంతో ఊహించనిది సాధ్యమైంది. విదేశాల నుంచి సదరు ఇంజెక్షన్‌ను తీసుకొచ్చి ఇవ్వడంతో బాబు కోలుకున్నాడు.

వేణు నెట్ బ్రౌజింగ్ చేస్తున్న సమయంలో ఓ బాలిక లివర్ సమస్యతో బాధపడుతుందన్న 'కెట్టో' ప్రకటన కనిపించింది. అది క్లిక్ చేయగా, ఆ సమస్య నుంచి బయటపడేందుకు రూ.30 లక్షలు అవుతుందని, దాతలు దయతలిస్తేనే తన కుమార్తె బయటపడుతుందంటూ చిన్నారి తల్లి ఆవేదనతో చెబుతున్న మాటలకు వేణు చలించిపోయాడు. కానీ, కాలేయ చికిత్సకు భారీ మొత్తాన్ని పేర్కొనడంపై అతడిలో అనుమానం కలిగింది. సదరు ప్రకటన నిజమేనా..? అంత ఖర్చు అవుతుందా..? ప్రభుత్వాలు ఎందుకు సాయం చేయవు? ఆస్పత్రులు అయినా బాధితుల విషయంలో కొంత లాభాపేక్ష తగ్గించుకుని చికిత్సలకు ముందుకు రావచ్చుగా..? ఇలాంటి ప్రశ్నలు మెదిలాయి. చివరికి తన సందేహాలన్నీ పక్కన పెట్టేసి రూ.500 అప్పటికప్పుడు డొనేట్ చేశాడు.

ఎంత పెద్ద ఆరోగ్య సమస్య వచ్చినా, తమ వల్ల ఏమవుతుంది? అంటూ కుదేలు అయిపోవాల్సిన పని లేదని శాంతి దంపతుల కథనం ధైర్యాన్నిస్తోంది. ఆరోగ్య పరంగా ఎంత కష్టం వచ్చినా, దాతల నుంచి విరాళాలు తెచ్చి పెట్టేందుకు నేడు ఎన్నో వేదికలు పనిచేస్తున్నాయి. వేలాది మంది బాధితుల కుటుంబాల్లో సంతోషానికి దారి చూపిస్తున్నాయి. అదే సమయంలో ఇలాంటి బాధితులకు సాయం చేశామనే సంతృప్తి దాతలకు లభిస్తోంది. కాకపోతే విరాళం ఇచ్చే ముందు కాస్తంత విచారించి, కథనం నిజమైనదేనని నిర్ధారించుకోవడం ద్వారా తమ దానం నిష్ఫలం కాకుండా చూసుకోవచ్చు. మెడికల్ క్రౌడ్ ఫండింగ్ ప్లాట్‌ఫామ్‌లు ఎలా పనిచేస్తాయో తెలుసుకుంటే.. వీటి సాయం పొందడమే కాకుండా, వీటి ద్వారా నలుగురికీ తోచినంత సాయం చేయడానికి అవకాశం లభిస్తుంది.

విరాళాలు కోరేందుకు ఆన్‌లైన్ వేదికలు

- సాయం చేసేందుకు ఎన్నో మంచి మనసులు
- ఎన్నో కుటుంబాలకు దారి చూపుతున్న ప్లాట్‌ఫామ్‌లు
- ఆరోగ్యం కోసం ఆర్థికంగా గుల్ల కావద్దు
- రుణాల కోసం అవస్థలు పడొద్దు



మనోళ్లకు దాన గుణం ఎక్కువే..

2021 వరల్డ్ గివింగ్ ఇండెక్స్ ప్రకారం దానంలో భారత్ 14వ స్థానంలో ఉంది. అపరిచితులకు మన దేశంలో 61 శాతం మంది సాయం చేస్తున్నారు. కాకపోతే విశ్వసనీయత విషయంలో ఉండే సందేహాలు ఈ దాతృత్వాన్ని మరింత విస్తరించకుండా అడ్డుకుంటున్నాయని చెప్పుకోవచ్చు. బాధితులకు, దాతలకు మధ్య వేదికగా నిలిచే విశ్వసనీయ సంస్థలు వస్తున్న కొద్దీ, క్రౌడ్ ఫండింగ్ మరింత పరిడవిల్లుతూనే ఉంటుంది. మరింత మంది బాధితులకు చేయూత లభిస్తుంది.

ప్రచార మార్గం..

ఇంపాక్ట్ గురూ, కెట్టో, మిలాప్ ఇవన్నీ ప్రముఖ మెడికల్ క్రౌడ్ ఫండింగ్ ప్లాట్‌ఫామ్‌లు. ఆన్‌లైన్ ప్రకటనలు, సామాజిక మాధ్యమాల ద్వారా బాధితుల తరఫున విరాళాల సమీకరణకు ఇవి ప్రచారం కల్పిస్తుంటాయి ఇంటర్నెట్ బ్రౌజ్ చేసే సమయంలో వైద్య చికిత్సల కోసం సాయం కోరుతూ ఈ సంస్థలకు సంబంధించి ప్రకటనలు కనిపిస్తుంటాయి. వీటిని క్లిక్ చేసి చూశారంటే, తర్వాత కూడా అలాంటి ప్రకటనలే మళ్లీ మళ్లీ కనిపిస్తుంటాయి. ప్రకటనల్లో బాధితుల కథనానికి ఆధారంగా వైద్యులు జారీ చేసిన లెటర్, టెస్ట్ రిపోర్ట్‌లను ఉంచుతున్నాయి. సామాజిక మాధ్యమాలతోపాటు, బాధితులు సైతం తమకు తెలిసిన వారికి ఈ లింక్‌లు పంపి సాయం కోరవచ్చు. ఒక్కసారి కావాల్సిన నిధులు లభించగానే, ఈ ఫండ్ రైజింగ్ కార్యక్రమం ముగుస్తుంది. ఈ సంస్థలు విరాళం ఇచ్చిన వ్యక్తులను నెలవారీ స్కీమ్‌లతో ఆకర్షించేందుకు ప్రయత్నాలు చేస్తున్నాయి. ప్రతి నెలా తోచినంత దానం ఇచ్చే విధంగా స్కీమ్‌లు తీసుకొచ్చాయి. విరాళాలకు సెక్షన్ 80జీ కింద పన్ను మినహాయింపు కల్పిస్తున్నాయి.

బాధితుల అనుభవాలు..

లాహిరి సోదరికి బ్రెయిన్ టీబీ నిర్ధారణ కావడంతో 2019 డిసెంబర్‌లో నిధుల సమీకరణ కోసం మిలాప్ సంస్థను సంప్రదించారు. మిలాప్ ఆమె అభ్యర్థనకు చక్కగా స్పందించింది. ఫొటోగ్రాఫ్‌లు, డాక్యుమెంట్లు అడిగారు. అవన్నీ ఇవ్వడంతో, వాటి ఆధారంగా ఒక ప్రచార ప్రకటనను మిలాప్ రూపొందించింది. తెలిసిన వారి సాయంతో దీనికి మంచి ప్రచారం కల్పించుకోవాలని మిలాప్ సూచించింది. తాము ఆ ప్రచారాన్ని చేపట్టబోమని, బాధితులే సొంతంగా నిర్వహించడం వల్ల మరింత విశ్వసనీయత ఉంటుందనే సూచన వచ్చింది. దీంతో లాహిరి తనకు తెలిసిన వారికి షేర్ చేశారు. అలా రూ.45,000 విరాళాలు వచ్చాయి. ఇందులో మిలాప్ తన కమీషన్‌గా రూ.5,000 మినహాయించుకుని, రూ.40,000ను లాహిరి చికిత్స పొందుతున్న ఆసుపత్రికి చెల్లించింది. కానీ, మిలాప్ ద్వారా చేసిన ప్రచారం లాహిరి బంధు మిత్రులకు తెలిసిపోవడంతో, వారి నుంచి ఆమెకు మరో రూ.12 లక్షలు విరాళాల రూపంలో నేరుగా వచ్చాయి. మిలాప్ రూపొందించిన ప్రచారమే లేకపోతే ఇది సాధ్యమయ్యేది కాదని లాహిరి అనుభవం చెబుతోంది. దురదృష్టవశాత్తూ లాహిరి సోదరి బ్రెయిన్ టీబీతో 2020 ఫిబ్రవరిలో మరణించారు.

విజయం ఎంత?

మీరా అనే వ్యక్తి సైతం, తన భర్త సర్జరీ కోసం కెట్టో ద్వారా నిధుల సమీకరణ చేయగా, మంచి ఆదరణే లభించింది. కెట్టో రిప్రజెంటేటివ్ ఎప్పటికప్పుడు ఆమెతో సంప్రదింపులు చేస్తూ సహకారం అందించడంతో, సర్జరీకి కావాల్సిన మొత్తం 48 గంటల్లోనే సమకూరింది. దేశ, విదేశాల్లోని స్నేహితులు, కుటుంబ సభ్యులు విరాళం ఇచ్చేందుకు సముఖంగా ఉన్నారని తెలిసినా, అందుకు వీలుగా కెట్టో ప్లాట్‌ఫామ్ సాయాన్ని ఆమె తీసుకున్నారు. ఎక్కడ ఉన్నా కెట్టో ద్వారా విరాళం పంపడం సులభమని భావించి అలా చేసినట్టు చెప్పారు. అయితే, అందరికీ ఇదే తరహా అనుభవం లభిస్తుందా..? ప్రతి ఫండ్ రైజింగ్ విజయవంతం అవుతుందా? అంటే నూరు శాతం అవును అని చెప్పలేం. ఇదంతా తమకున్న పరిచయాలు, ఎంపిక చేసుకున్న ప్లాట్‌ఫామ్, రూపొందించిన ప్రకటన, ప్లాట్‌ఫామ్ నుంచి ప్రచారం తదితర అంశాలపై ఆధారపడి ఉంటుంది. "కొన్నేళ్ల క్రితం మేము సాయం కోసం ఇంపాక్ట్ గురూ ప్లాట్‌ఫామ్‌ను సంప్రదించాం. ఇంపాక్ట్ గురూ దాతల నెట్‌వర్క్ సాయంతో నిధులు సమకూర్చుతారని అనుకున్నాం. కానీ, ఇంపాక్ట్ గురూ అలా చేయలేదు. ప్రచార కార్యక్రమం పేజీని రూపొందించి, ఆ లింక్‌ను తమ పరిచయస్తులతో పంచుకోవాలని సూచించింది"అని ఓ వ్యక్తి అనుభవం చెబుతోంది. తమ ప్లాట్‌ఫామ్‌పై వేలాది ప్రచార కార్యక్రమాలు నమోదవుతున్నందున.. ప్రతీ ఒక్క ప్రచారాన్ని తామే సొంతంగా చేపట్టడం సాధ్యం కాదని ఇంపాక్ట్ గురూ సహ వ్యవస్థాపకుడు, సీఈవో పీయూష్ జైన్ స్పష్టం చేశారు. దాతల కమ్యూనిటీ నుంచి మంచి స్పందన వస్తుందనుకుంటే, తాము తప్పకుండా ప్రమోట్ చేస్తుంటామని చెప్పారు.

కొంచెం కమీషన్..

క్రౌడ్ ఫండింగ్ ప్లాట్‌ఫామ్ లు మొత్తం విరాళం నుంచి నిర్ణీత మొత్తాన్ని కమీషన్/చార్జీ కింద మినహాయించుకుంటున్నాయి. ఇది ఒక్కో సంస్థలో ఒక్కో విధంగా ఉంటుంది. "అంతర్జాతీయంగా చూస్తే ప్రతీ మెడికల్ క్రౌడ్ ఫండింగ్ ప్లాట్‌ఫామ్ ఎంతో కొంత స్వల్ప ఫీజును వసూలు చేస్తున్నాయి. తమ కార్యకలాపాలు నిర్విరామంగా కొనసాగేందుకే ఇలా చేస్తున్నాయి. టెక్నాలజీ సదుపాయాలు, సిబ్బంది, నిధుల సమీకరణ, ముందస్తు విచారణలకు సంబంధించి వ్యయాలు అవుతాయి. మేము నిలదొక్కుకున్నప్పుడే మా లక్ష్యాన్ని (ఫండ్ రైజింగ్) సాధించగలం" అని పీయూష్ జైన్ తెలిపారు. ఈ ప్లాట్‌ఫామ్‌లలో కొన్ని ప్రీమియం సేవలను కూడా ఆఫర్ చేస్తున్నాయి. ఇంపాక్ట్ గురూ అయితే 0 శాతం, 5 శాతం, 8 శాతం ఇలా మూడ్ స్కీమ్‌ల కింద ఈ సేవలను ఆఫర్ చేస్తోంది.

నిధుల సమీకరణ ఇలా..?

- చికిత్సలకు దాతల సాయం అవసరమైన వారు క్రౌండ్ ఫండింగ్ ప్లాట్‌ఫామ్‌లను (ఇంపాక్ట్‌గురూ, మిలాప్, కెట్టో మొదలైనవి) సంప్రదించాలి.
- పాన్, ఆధార్, మెడికల్ డాక్యుమెంట్లు సమర్పించాలి.
- వీటిని క్రౌడ్ ఫండింగ్ ప్లాట్‌ఫామ్ ధ్రువీకరించుకుంటుంది. తగిన విచారణ అనంతరం బాధితుల కథనం నిజమేనని నిర్ధారించుకున్న తర్వాత వారి తరఫున నిధుల సమీకరణ పేజీని అవి సిద్ధం చేస్తాయి.
- ఇక ఇక్కడి నుంచి నిధుల సమీకరణ మొదలవుతుంది. సాయం అవసరమైన వారు ఈ పేజీ లింక్‌ను తమ నెట్‌వర్క్‌లో షేర్ చేసుకోవాలి. తమ వంతు ప్రచారం కల్పించుకోవాలి. అలాగే, ప్లాట్‌ఫామ్‌లు సైతం ప్రచారానికి తమ వంతు సాయం అందిస్తాయి.
- సమీకరించే విరాళంలో ఎక్కువ మొత్తాన్ని కమీషన్ రూపంలో మినహాయించుకునేందుకు సమ్మతి తెలియజేస్తే, వారి తరఫున క్రౌడ్ ఫండింగ్ ప్లాట్‌ఫామ్‌లు సైతం విస్తృత ప్రచారాన్ని చేపడతాయి.
- బాధితులు ఎదుర్కొంటున్న సమస్య, వైద్యులు చెబుతున్న వెర్షన్, చికిత్సకు ఎంత ఖర్చవుతుంది? తదితర వివరాలన్నీ ఈ పేజీలో ఉంటాయి. దాతలు విరాళం చెల్లించేందుకు పేమెంట్ లింక్‌లు కూడా అక్కడ కనిపిస్తాయి.
- కనీసం 300-350 అంతకంటే ఎక్కువ విరాళాలనే అనుమతిస్తున్నాయి.
- దాతలు చేసే చెల్లింపులన్నీ కూడా ప్రత్యేక ఖాతాలో జమ అవుతాయి.
- కావాల్సిన మొత్తం వచ్చినా.. లేదంటే గడువు ముగిసినా లేదంటే అనారోగ్యంతో బాధపడుతున్న వ్యక్తి అకాలంగా మరణించినా నిధుల సమీకరణ ముగిసిపోతుంది.
- అనంతరం ఈ మొత్తం నుంచి కమీషన్ మినహాయించుకుని మిగిలిన మొత్తాన్ని హాస్పిటల్/బాధితులకు క్రౌడ్ ఫండింగ్ ప్లాట్‌ఫామ్‌లు చెల్లిస్తాయి. ఇలా చేసే ముందు హాస్పిటల్ బిల్లులను చెక్ చేస్తాయి.
- విరాళం ఇచ్చిన వారికి ఎప్పటికప్పుడు మెయిల్ ద్వారా బాధితుల తాజా ఆరోగ్య పరిస్థితిపై వివరాలను ఇవి అప్‌డేట్ చేస్తుంటాయి.

విశ్వసించడం ఎలా..?

సాయం అవసరమైన వారికి క్రౌడ్ ఫండింగ్ ప్లాట్‌ఫామ్‌లు మార్గాన్ని చూపిస్తున్నాయి. మరి విరాళం ఇచ్చే వారు ఈ కథనాలను విశ్వసించేది ఎలా..? ఈ సందేహం చాలా మందికి వస్తుంది. మన దేశంలో విరాళాలకు సంబంధించి భౌతిక వేదికలే ఎక్కువ. ఆన్‌లైన్ ప్లాట్‌ఫామ్‌ల సేవలు ఇటీవలి కాలంలోనే వెలుగులోకి వచ్చాయి. ఇంటర్నెట్ విస్తరణ ఇందుకు వీలు కల్పించిందని చెప్పుకోవాలి. ఆన్‌లైన్ ప్రపంచంలో అన్నింటినీ నమ్మలేం. సైబర్ మోసాలు గణనీయంగా పెరిగిపోయిన నేపథ్యంలో, అన్నీ విచారించుకున్న తర్వాతే విరాళం ఇవ్వడం సురక్షితంగా ఉంటుంది. కోటక్ ఆల్టర్నేటివ్ అస్సెట్ మేనేజర్స్ సీఈవో (ఇన్వెస్ట్‌మెంట్ స్ట్రాటజీ) లక్ష్మీ అయ్యర్ దీనిపై తన అనుభవాన్ని పంచుకున్నారు. "నాకు రిఫరల్ ద్వారా వచ్చే వాటికే నేను దానం చేస్తాను. ఈ విషయంలో నా మార్గం చాలా స్పష్టం. సులభంగా డబ్బులు సంపాదించే మోసగాళ్లకు కొదవ లేదు"అన్నది లక్ష్మీ అయ్యర్ అభిప్రాయంగా ఉంది. సస్సేరా ఇంజనీరింగ్ జాయింట్ ఎండీ ఎఫ్ఆర్ సింఘ్వి ఈ విషయంలో సందేహాలు వ్యక్తం చేశారు. "చాలా వరకు విరాళాలు కోరుతున్న ఆన్‌లైన్ కేసులు వైద్య పరమైనవే ఉంటున్నాయి. కొన్ని సందర్భాల్లో అవి పేర్కొనే చికిత్సల వ్యయాలు చాలా ఎక్కువగా ఉంటున్నాయి. నాకు ఒక ఆస్పత్రితో అనుబంధం ఉంది. కనుక చికిత్సల వ్యయాల గురించి తెలుసుకోగలను"అని పేర్కొన్నారు. ఇలాంటిదే ఒక విరాళం కేసులో చికిత్సకు రూ.18-24 లక్షలు ఖర్చవుతుందన్న కొటేషన్ కనిపించగా, దీనిపై విచారించగా, తెలిసిన హాస్పిటల్‌లో రూ.5-6 లక్షలకే చేస్తున్నట్టు విని ఆశ్చర్యపోయినట్టు సింఘ్వి తెలిపారు. నిజానికి కొన్ని కేసుల్లో భారీ అంచనాలు పేర్కొంటున్న ఉదంతాలు లేకపోలేదు. హాస్పిటల్స్‌లో చికిత్స పొందుతున్న బాధితుల తరఫున నిధుల సమీకరణ కార్యక్రమాలు నడిపించే కొందరు మోసగాళ్ల ఉదంతాలు సైతం లోగడ వెలుగు చూశాయి. అలా అని కష్టాల్లో ఉన్న బాధితులకు విరాళాలు ఆగకూడదు కదా..?



ముందస్తు పరిశీలన

క్రౌడ్ ఫండింగ్ ప్లాట్‌ఫామ్‌లు చికిత్సల వ్యయాలను ముందుగానే నిర్ధారించుకుంటామని చెబుతున్నాయి. హాస్పిటల్ వ్యయ అంచనాలను, చారిత్రక గణాంకాలు, బీమా థర్డ్ పార్టీ అగ్రిగేటర్ సంస్థల డేటా ఆధారంగా పోల్చి చూస్తామని ఇంపాక్ట్‌గురూ సీఈవో జైన్ తెలిపారు. తమ ప్యానల్ డాక్టర్లతోనూ దీనిపై నిర్ధారించుకుంటామని చెప్పారు. నిధుల సమీకరణ నిజమైన కారణాలతో చేసినప్పటికీ, తర్వాత ఆ నిధులు దుర్వినియోగం కాకుండా ఉండేందుకు కూడా ఇవి చర్యలు తీసుకుంటున్నాయి. "ఇంపాక్ట్ గురూ వేదికగా సమీకరించే నిధుల్లో 80 శాతానికి పైగా నేరుగా హాస్పిటల్స్‌కు బదిలీ చేస్తున్నాం. ఈ హాస్పిటల్స్ కూడా హెల్త్ ఇన్సూరెన్స్ జాబితాలోనివే"అని జైన్ తెలిపారు. తమ ప్లాట్‌ఫామ్‌పై లిస్ట్ చేసే వైద్య పరమైన కేసుల్లో విరాళాలను హాస్పిటల్ బ్యాంక్ ఖాతా ద్వారానే తీసుకోగలరని కెట్టో అంటోంది.

- బాధితుల కేవైసీ పత్రాలను ముందుగా ఇవి నిర్ధారించుకుంటాయి.
- వైద్య పరమైన అన్ని డాక్యుమెంట్లు తీసుకుని వాటిని తనిఖీ చేస్తాయి.
- తమ ప్యానెల్ వైద్యులతో మాట్లాడి నిర్ధారణకు వస్తాయి.
- అవసరమైతే క్షేత్రస్థాయిలో హాస్పిటల్‌కు తమ ఉద్యోగిని పంపించి వాస్తవమా, కాదా అన్నది నిర్ధారించుకుంటాయి.

మోసాలుంటాయ్.. జాగ్రత్త

అవగాహన, జాగ్రత్తలు లేకపోతే ఆన్‌లైన్ మోసాల బారిన పడే రిస్క్ ఉంటుంది. క్రౌడ్ ఫండింగ్ ప్లాట్‌ఫామ్‌ల ద్వారా విరాళాలు కోరినా లేక విరాళం ఇచ్చినా సరే.. ఆ తర్వాత ఫోన్ కాల్ లేదా వాట్సాప్ మెస్సేజ్ లేదా మెయిల్ రావచ్చు. కష్టంలో ఉన్న బాధితులకు సంబంధించి అందులో సాయం కోరొచ్చు. లేదంటే అప్పటికే విరాళం ఇచ్చిన కేసుకు సంబంధించి అప్‌డేట్ అంటూ మోసగాళ్లు మెయిల్ పంపించొచ్చు. ఒక్కసారి విరాళం ఇస్తే, ఆ తర్వాత నుంచి క్రౌడ్ ఫండింగ్ ప్లాట్‌ఫామ్‌లు ఇతర బాధితులకు సంబంధించిన వివరాలను మెయిల్స్, వాట్సాప్ మెస్సేజ్‌లు, కాల్స్ రూపంలో మార్కెటింగ్ చేస్తుంటాయి. ఇదంతా ఇబ్బందికరంగా అనిపించొచ్చు. చాలా మంది సాయం చేయాలని భావిస్తుంటారని, బాధితుల వివరాలను వారు మెయిల్ లేదా వాట్సాప్ సందేశాలు, కాల్స్ రూపంలో తెలుసుకోవడానికి ఆసక్తి చూపిస్తున్నారని జైన్ తెలిపారు. ఇవి వద్దనుకునే వారు అన్‌సబ్‌స్క్రయిబ్ చేసుకోవాలని సూచించారు. క్రౌడ్ ఫండింగ్ ప్లాట్‌ఫామ్‌లు అన్నీ కూడా సురక్షిత చెల్లింపుల సాధనాలనే వినియోగిస్తున్నాయి. కానీ, వీటి పేరుతో సైబర్ నేరస్థులు ఆకర్షించే కథనాలు, మోసపూరిత పేమెంట్ లింక్‌లు పంపించి, బ్యాంక్ ఖాతాలో బ్యాలన్స్ మొత్తాన్ని ఊడ్చేసే ప్రమాదం లేకపోలేదు. అందుకే విరాళం ఇచ్చే ముందు సంబంధిత సంస్థల యూఆర్ఎల్‌ను జాగ్రత్తగా గమనించుకోవాలని నిపుణులు హెచ్చరిస్తున్నారు.

సాక్షి స్టాక్స్

యథార్థ్ హాస్పిటల్స్ — చాయిస్ బ్రోకింగ్ — కొనొచ్చు

ప్రస్తుత ధర: రూ. 364 టార్గెట్: రూ. 523

ఎందుకంటే: సూపర్ స్పెషాలిటీ విభాగాలుగల యథార్థ్ హాస్పిటల్స్ అండ్ ట్రౌమా కేర్ 2008లో ఏర్పాటైంది. 1,405 పడకల సామర్థ్యంతో నోయిడా, నోయిడా ఎక్స్‌టెన్షన్, గ్రేటర్ నోయిడా ప్రాంతాలతోపాటు ఝాన్సీలో 4 ఆసుపత్రులను నిర్వహిస్తోంది. ఢిల్లీ- జాతీయ రాజధాని ప్రాంతంలోని అతిపెద్ద ప్రయివేట్ రంగ ఆసుపత్రులలో నోయిడా ఎక్స్‌టెన్షన్ ఆసుపత్రి 8వ, గ్రేటర్ నోయిడాలోని ఆసుపత్రి 10వ ర్యాంకులో నిలిచాయి. 2022 ఏప్రిల్ 10న ప్రారంభమైన మల్టీ స్పెషాలిటీ సేవల ఆర్కా ఆసుపత్రిని కొనుగోలు చేసింది. 305 పడకల సామర్థ్యంగల ఈ ఆసుపత్రి ఝాన్సీ- ఆర్కా- గ్వాలియర్ ప్రాంతంలోని అతిపెద్ద ఆసుపత్రుల్లో ఒకటిగా నిలుస్తోంది. కాగా.. యథార్థ్ హాస్పిటల్స్.. సెంటర్ ఆఫ్ మెడిసిన్, కార్డియాలజీ, న్యూరోసైన్సెస్, జనరల్ సర్జరీ, నెఫ్రాలజీ, యూరాలజీ, పీడియాట్రిక్స్, గ్యాస్ట్రోఎంటరాలజీ, పల్మనాలజీ, ఆర్థోపెడిక్స్ అండ్ స్పైన్, రుమటాలజీ తదితర పలు కేంద్రాలతో సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్‌గా సేవలందిస్తోంది. వెరసి ఢిల్లీ-జాతీయ రాజధాని ప్రాంతంలో అత్యున్నత సూపర్ స్పెషాలిటీ హాస్పిటళ్లలో ఒకటిగా పేరొందింది. ప్రస్తుత మార్జిన్లను మించుతూ అధిక లాభదాయకత సాధించగల కొత్త స్పెషాలిటీ విభాగాలలోకి ప్రవేశించింది. ఇతర సంస్థల కొనుగోళ్ల ద్వారా పలు ప్రాంతాలలో కార్యకలాపాలు విస్తరిస్తోంది. తద్వారా వేగవంత వృద్ధివైపు అడుగులేస్తోంది. విభిన్న చికిత్సలు అందిస్తూ అంతర్జాతీయస్థాయిలో వ్యాధిగ్రస్తులను ఆకట్టుకుంటోంది.



గల్ఫ్ ఆయిల్ — ఎమ్‌కే గ్లోబల్ — కొనొచ్చు

ప్రస్తుత ధర: రూ. 609 టార్గెట్: రూ. 730

ఎందుకంటే: వార్షికంగా 5 కోట్ల లీటర్ల లూబ్రికెంట్స్, 1.8 కోట్ల లీటర్ల యాడ్‌బ్లూ అమ్మకాలను హ్యాండిల్ చేయగల గల్ఫ్ ఆయిల్ లూబ్రికెంట్స్ ఇండియా లిమిటెడ్ చెన్నై ప్లాంటును ఇటీవల సందర్శించాం. నిజానికివి రెట్టింపు షిఫ్టుల ఆధారంగా కంపెనీకి కీలకమైన ల్యూబ్స్ సామర్థ్యంలో 35 శాతానికి సమానం. ఫ్రాన్స్ దిగ్గజం ఏబీబీ నుంచి ఆటోమాటిక్ బ్యాచ్ బ్లెండింగ్ సాంకేతికతను సొంతం చేసుకుంది. తద్వారా లూబ్రికెంట్స్ తయారీ కార్యకలాపాల సామర్థ్యాలను మరింత మెరుగుపరచుకుంది. అవసరార్థం చెన్నై ప్లాంటు సామర్థ్యాన్ని మూడు షిఫ్టుల్లో 100 శాతానికి మించి వినియోగించుకునే వీలుంది. అంతేకాకుండా ప్లాంటువద్దగల భూమిని వినియోగించుకోవడం ద్వారా సామర్థ్యాన్ని రెట్టింపు చేసుకునేందుకూ అవకాశముంది. కొత్త బ్లెండ్‌ల తోపాటు ప్రత్యామ్నాయ ఫార్ములేషన్లు.. తదితరాలను రూపొందించగల ఆర్అండ్‌డీ కేంద్రాన్ని సైతం చెన్నై ప్లాంటు కలిగి ఉంది. యూఎస్, ఈయూ ఓఈఎంల ద్వారా కఠినమైన విజయవంత ఆడిట్లకు అవకాశమిస్తోంది. కంపెనీ యాజమాన్యం ప్రస్తుత ఆర్థిక సంవత్సరం(2023-24)లో లూబ్రికెంట్స్ 7-8 శాతం, యాడ్‌బ్లూ 15-20 శాతం స్థాయిలో అమ్మకాలు సాధించగలవని విశ్వసిస్తోంది. 12-14 శాతం స్థాయిలో నిర్వహణ(ఇబిటా) మార్జిన్లు లక్ష్యంగా పెట్టుకుంది. ఇందుకు మద్దతుగా లాంగ్ డ్రెయిన్ ప్రొడక్టులు, ఉత్పత్తులకు వ్యూహాత్మక ధరల నిర్ణయం, బ్రాండింగ్ తదితరాలను చేపట్టనుంది.



గమనిక: ఈ కాలమ్‌లో షేర్లపై ఇచ్చిన సలహాలు, సూచనలు, వివిధ బ్రోకరేజీ సంస్థలు వ్యక్తం చేసిన అభిప్రాయాలు మాత్రమే

వృద్ధులకు స్థిరమైన ఆదాయ మార్గాలు?

నేను ఒకేసారి రూ.12 లక్షలను మూడు, నాలుగేళ్ల కాలానికి ఇన్వెస్ట్ చేయాలని అనుకుంటున్నాను. మెరుగైన రాబడుల కోసం ఎక్కడ ఇన్వెస్ట్ చేయాలి? డెట్ ఫండ్‌లో పెట్టుబడి పెట్టి.. అక్కడి నుంచి సిస్టమ్యాటిక్ విత్‌డ్రాయల్ ప్లాన్ ఎంచుకోవడం ద్వారా మంచి రాబడులు అందుకోవచ్చా?
– మయూర్

సంపద సృష్టి మూడు నాలుగేళ్లలో సాధ్యపడుతుందా? ఇది ఆందోళన కలిగించే అంశం. మూడు నుంచి నాలుగేళ్లలో సంపద సృష్టి సాధ్యపడదు. ఈక్విటీలు గణనీయమైన రాబడులను అందిస్తాయి. కానీ వాటికి కూడా 10-15 ఏళ్ల కాల వ్యవధి కావాలి. అంత కాలవ్యవధి మీకు లేకపోతే అప్పుడు సంప్రదాయ ఇన్వెస్టర్‌గానే ఆలోచించాలి. మూడు నుంచి నాలుగేళ్లలోనే పెట్టుబడిపై చెప్పుకోతగ్గంత రాబడి కావాలని కోరుకునేట్టు అయితే.. ఈక్విటీ సేవింగ్స్ ఫండ్స్ లేదా కన్జర్వేటివ్ హైబ్రిడ్ ఫండ్స్‌ను పరిశీలించొచ్చు. కన్జర్వేటివ్ హైబ్రిడ్ ఫండ్స్ ఎక్కువ మొత్తాన్ని డెట్ సాధనాల్లోనే ఇన్వెస్ట్ చేస్తాయి. మూడు నుంచి నాలుగేళ్ల వ్యవధి కోసం అంటున్నారు కనుక 12-18 నెలల కాలం పాటు సిస్టమ్యాటిక్ విత్‌డ్రాయల్ ప్లాన్ ఎంపిక చేసుకుంటే మొత్తం పెట్టుబడుల్లో సగం కాల వ్యవధి అవుతుంది. దీనికి బదులు మూడు నుంచి నాలుగు నెలల్లోగా సిస్టమ్యాటిక్ విత్‌డ్రాయల్ ద్వారా ఈక్విటీలకు కేటాయించుకోవడం సరైన నిర్ణయం అవుతుంది.

Q & A



ధీరేంద్ర కుమార్
సీఈవో, వ్యాల్యూ రీసెర్చ్



నా వయసు 62 ఏళ్లు. స్థిరమైన ఆదాయం కోసం ఉన్న మార్గాలు ఏవి? **– నారాయణ**

విశ్రాంత జీవనాన్ని ప్రశాంతంగా గడపాలంటే అందుకు తగినంత నిధిని ఉండాలి. అప్పుడే ఆ మొత్తం నుంచి క్రమం తప్పకుండా ఆదాయం పొందడం ద్వారా సౌకర్యవంతమైన జీవితాన్ని గడపొచ్చు. సీనియర్ సిటిజన్లు సహజంగా సంప్రదాయ మార్గాలనే ఎంపిక చేసుకుంటూ ఉంటారు. అత్యవసర సమయాల్లో పెట్టుబడులను వెంటనే వెనక్కి తీసుకునే విధంగా లిక్విడిటీ ఉండాలని కోరుకుంటారు. సీనియర్ సిటిజన్లు ఇన్వెస్ట్ చేయడానికి ముందు ప్రతీ నెలా ఎంత మొత్తం కావాలో నిర్ణయించుకోవాలి. ఇతర మార్గాల ద్వారా ఏదైనా ఆదాయం వస్తుంటే దానిని కూడా పరిగణనలోకి తీసుకోవాలి. అంటే అద్దె రూపంలో ఆదాయం, పెన్షన్ లేదా మరొకటి కావచ్చు. ఏటా ఎంత మొత్తం పెట్టుబడి నుంచి కావాలో స్పష్టతకు రావాలి. ఒకవేళ ఏటా 4-6 శాతానికంటే ఎక్కువ కోరుకుంటుంటే అంచనాలను తగ్గించుకోవాల్సిందే. ఉదాహరణకు మీ పెట్టుబడి నిధి రూ.కోటి ఉందనుకుంటే వార్షికంగా ఉపసంహరించుకునే మొత్తం రూ.6 లక్షలకు మించి ఉండకూడదు. ఒకవేళ 6 శాతానికి మించి వెనక్కి తీసుకుంటే కనుక ఆ తర్వాతి సంవత్సరాల్లో తక్కువ ఆదాయానికి సిద్ధం కావాల్సిందే. ద్రవ్యోల్బణాన్ని విస్మరించడానికి లేదు. నేడు నెలవారీ ఖర్చులకు రూ.50,000 సరిపోతుంటే.. 5, 10, 15 ఏళ్ల తర్వాత ఈ మొత్తం చాలదు. ఆ సమయంలో ఇంకా అధికంగా కావాల్సి ఉంటుంది. అందుకనే రిటైర్మెంట్ తీసుకున్న వారు ద్రవ్యోల్బణాన్ని తట్టుకుని రాబడులను ఇచ్చే మార్గాలను చూసుకోవాలి. అందుకని రిటైర్మెంట్ తర్వాత కూడా ఈక్విటీల్లో పెట్టుబడులు కొనసాగించాలి. అప్పుడే దీర్ఘకాలంలో ద్రవ్యోల్బణం మించి రాబడులకు అవకాశం ఉంటుంది. పెట్టుబడుల మొత్తాన్ని ఈక్విటీల్లో ఇన్వెస్ట్ చేయకూడదు. 30-40% చాలు. మిగతా మొత్తాన్ని ఫిక్స్‌డ్ ఇన్‌కమ్ సాధనాల్లోనే ఉంచాలి. ప్రభుత్వ హామీతో కూడిన పథకాలను పరిశీలించాలి. ఎస్‌సీఎస్ఎస్, పోస్టాఫీసు నెలవారీ ఆదాయ పథకాలకు మొదటి ప్రాధాన్యం ఇవ్వాలి. కొంత మొత్తాన్ని అధిక నాణ్యతతో కూడిన డెట్ ఫండ్స్‌లో ఇన్వెస్ట్ చేసుకోవాలి. మొత్తం పెట్టుబడుల్లో ఈక్విటీల వాటా 30-40% మేర ఉండేలా ఏడాదికోసారి అస్సెట్ (పెట్టుబడులు)రీబ్యాలన్స్ చేసుకోవాలి.

విజయవాడలో ఆలిండియా జూనియర్ బ్యాడ్మింటన్ టోర్నీ



పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న అసోసియేషన్ సభ్యులు

మొగల్రాజపురం (విజయవాడ తూర్పు): నవంబర్ 1–8 వరకు 'ఏపీ సీఎం జగన్ ఆల్ ఇండియా జూనియర్ బ్యాడ్మింటన్ ర్యాంకింగ్ టోర్నమెంట్'ను విజయవాడలో నిర్వహిస్తున్నట్లు ఆంధ్రప్రదేశ్ బ్యాడ్మింటన్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు ఎం.ద్వారకానాథ్ తెలిపారు. అండర్–15, 17 విభాగాల్లో జరిగే ఈ టోర్నీ పోస్టర్‌ను విజయవాడలోని ఓ హోటల్‌లో ఆదివారం ఆవిష్కరించారు. క్రీడా రంగానికి సీఎం జగన్ ఇస్తోన్న ప్రాధాన్యత జాతీయస్థాయిలో తెలపాలనే ఉద్దేశంతో ఆయన పేరుతో ఈ టోర్నమెంట్‌ను నిర్వహిస్తున్నట్లు చెప్పారు. దేశం నలుమూలల నుంచి 2,200 మంది క్రీడాకారులు ఈ టోర్నీలో పాల్గొంటారన్నారు. విజయవాడలోని 3 ఇండోర్ స్టేడియంలలో మ్యాచ్‌లు జరుగుతాయని చెప్పారు. 1న మధ్యాహ్నం 2 గంటలకు టోర్నీని ప్రారంభిస్తారని తెలిపారు. 4వ తేదీ వరకు క్వాలిఫైయింగ్ మ్యాచ్‌లు, తర్వాత మెయిన్ మ్యాచ్‌లు జరుగుతాయన్నారు. 8న బహుమతులను అందజేస్తామన్నారు.

అలరించిన చంద్రగ్రహణం

కృష్ణా జిల్లా నాగాయలంకలో ఆదివారం తెల్లవారుజామున మబ్బు తెరల దోబూచుల మాటున పాక్షికంగా కనిపించిన చంద్రగ్రహణం చూపరులను అలరించింది. శనివారం అర్ధరాత్రి దాటాక 1.25 గంటల నుంచి 2.45 గంటల వరకు గ్రహణం కనిపించింది. తరచూ మబ్బులు కమ్ముకున్న వాతావరణంలో చంద్రగ్రహణం కనిపించదేమోనని ప్రకృతి ప్రేమికులు భావించారు. మబ్బుల మాటున పాక్షిక చంద్ర గ్రహణ దర్శనం కనువిందు చేసింది. ఈ దృశ్యాలను 'సాక్షి' కెమెరాతో ఇలా బంధించింది. - నాగాయలంక (అవనిగడ్డ)



నాగాయలంకలో కనిపించిన చంద్ర గ్రహణ దృశ్యాలు

రౌడీమూకపై ఉక్కుపాదం

ఆర్టీసీ డ్రైవర్‌పై దాడిని తీవ్రంగా పరిగణించిన ప్రభుత్వం

24 గంటల్లోనే ఏడుగురు నిందితుల అరెస్ట్



వివరాలు వెల్లడిస్తున్న ఎస్పీ తిరుమలేశ్వరరెడ్డి

సాక్షి, అమరావతి: అసాంఘిక శక్తులను ఏమాత్రం ఉపేక్షించొద్దని పోలీసు అమరవీరుల సంస్మరణ దినోత్సవం సందర్భంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి విస్పష్టంగా ప్రకటించిన నేపథ్యంలో కావలిలో ఆర్టీసీ డ్రైవర్ రామ్‌సింగ్‌పై దాడిని తీవ్రంగా పరిగణించిన ప్రభుత్వం కఠిన చర్యలకు ఉపక్రమించింది. ఘటనపై తక్షణమే స్పందించిన పోలీసు శాఖ 14 మంది నిందితులను గుర్తించడంతోపాటు ఏడుగురిని 24 గంటల్లోనే అరెస్ట్ చేయడం గమనార్హం. నిందితులకు అధికార వైఎస్సార్‌సీపీతో ఏమాత్రం సంబంధం లేదని, వారిపై గతంలోనే పలు కేసులు నమోదైనట్లు వెలుగులోకి వచ్చింది. ఆర్టీసీ డ్రైవర్‌పై దాడి ఘటనను రాజకీయ లబ్ధి కోసం వినియోగించుకునేందుకు విపక్ష టీడీపీ – జనసేన వేసిన ఎత్తుగడలు పారలేదు.

పరారీలో ప్రధాన నిందితుడు

ఆర్టీసీ డ్రైవర్ రామ్‌సింగ్‌పై రౌడీమూకల దాడిని ప్రభుత్వం అత్యంత తీవ్రంగా పరిగణించింది. దాడికి పాల్పడ్డవారిని ఏమాత్రం ఉపేక్షించకుండా తక్షణం కఠిన చర్యలు చేపట్టాలని సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పోలీసు శాఖను ఆదేశించారు. ఈ క్రమంలో రంగంలోకి దిగిన పోలీసు శాఖ దాడి దృశ్యాల వీడియో ఫుటేజీని పరిశీలించి 14 మంది నిందితులను గుర్తించింది. కావలి – తుమ్మలపెంట మార్గంలో రాష్ట్రం దాటేందుకు ప్రయత్నిస్తున్న ఏడుగురు నిందితులను శనివారం రాత్రి అదుపులోకి తీసుకున్నారు. బండి విల్సన్, పుట్టా శివకుమార్‌రెడ్డి, షేక్ ఖాజావలి, కుప్పాల వంశీ, షేక్ కలీమ్ చోటు, షేక్ ఇలియాజర్, షేక్ బాజీలను అరెస్ట్ చేసినట్టు ఆదివారం ప్రకటించారు. 24 గంటల్లోనే ఏడుగురు నిందితులను అరెస్ట్ చేసిన పోలీసులు మరో ఏడుగురి కోసం తీవ్రంగా గాలిస్తున్నారు. ప్రధాన నిందితుడు దేవరకొండ సుధీర్‌తోపాటు మిగిలినవారిని అదుపులోకి తీసుకునేందుకు ప్రత్యేక బృందాలను నియమించి ఎస్పీఎస్ఆర్ నెల్లూరు జిల్లాతోపాటు అన్ని చోట్లా విస్తృతంగా గాలిస్తున్నారు.

సుధీర్ ముఠా మోసాలపై ఫిర్యాదు చేయాలి

వీడియోల ఆధారంగా నిందితులను గుర్తించాం. కావలికి చెందిన ప్రధాన నిందితుడు దేవరకొండ సుధీర్ కుమారుడి నిశ్చితార్థం గురించి తెలుసుకున్న పోలీసులు అక్కడకు వెళ్లడంతో పరారయ్యాడు. గాలింపు చర్యలు కొనసాగుతున్నాయి. త్వరలోనే మిగిలిన నిందితులను కూడా అరెస్ట్ చేస్తాం. రూ.1.5 కోట్ల విలువైన రెండు వాహనాలను జప్తు చేశాం. ఇలాంటి ఘటనలను ఎట్టి పరిస్థితుల్లోనూ ఉపేక్షించేది లేదు. సుధీర్ ముఠా చేతిలో మోసపోయిన వారు ఆయా పోలీసు స్టేషన్లలో ఫిర్యాదు చేస్తే కఠిన చర్యలు తీసుకుంటాం. బాధితులు ధైర్యంగా ముందుకొచ్చి ఫిర్యాదు చేయాలని కోరుతున్నాం.

– తిరుమలేశ్వరరెడ్డి, ఎస్పీ, నెల్లూరు జిల్లా

గతంలోనే నేర చరిత్ర..

రామ్‌సింగ్‌పై దాడికి పాల్పడిన నిందితులకు గతంలోనే నేర చరిత్ర ఉంది. కావలి ప్రాంతంలో ఈ ముఠా ఎన్నో ఏళ్లుగా రౌడీయిజం, సెటిల్‌మెంట్లు చేస్తూ అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడుతోంది. అమాయకులను మోసగిస్తున్న నిందితులపై గతంలోనే పోలీసులు సస్పెక్ట్ షీట్లు తెరిచారు. బండి విల్సన్‌పై 14 కేసులు, శివకుమార్‌రెడ్డిపై 8 కేసులు ఉండటం గమనార్హం. మిగిలిన ఐదుగురిని వీరి అనుచరులుగా గుర్తించారు. ఆర్టీసీ డ్రైవర్ రామ్‌సింగ్‌పై దాడికి పాల్పడిన నిందితులపై పోలీసులు తీవ్రమైన సెక్షన్ల కింద కేసులు నమోదు చేశారు. 143, 341, 332, 307, 323, 427 రెడ్‌విత్ 34 సీఆర్పీసీ సెక్షన్ల కింద కావలి రూరల్ పోలీస్ స్టేషన్‌లో కేసులు నమోదయ్యాయి.

రాజకీయ రాద్ధాంతం

డ్రైవర్ రామ్‌సింగ్‌పై దాడిని అధికార వైఎస్సార్‌సీపీతోపాటు అంతా ఖండించినా టీడీపీ – జనసేన రాజకీయ లబ్ధి కోసం దుష్ప్రచారం చేయడంపై విమర్శలు వ్యక్తమవుతున్నాయి. దాడికి పాల్పడిన నిందితులతో అధికార పార్టీకి ఎలాంటి సంబంధం లేకున్నా లోకేశ్ సహా టీడీపీ నేతలు దిగజారుడు రాజకీయాలకు పాల్పడ్డారు. 24 గంటల్లోనే వాస్తవాలు బహిర్గతం కావడంతో విపక్ష నేతలు తోక ముడిచారు.

ఆర్టీసీ యూనియన్ల హర్షం

ఘటన అనంతరం రాష్ట్ర ప్రభుత్వం సత్వరమే స్పందించిన విధానం, ఏడుగురు నిందితులను 24 గంటల్లోనే అరెస్ట్ చేయడం పట్ల ఆర్టీసీ యూనియన్లు హర్షం వ్యక్తం చేస్తున్నాయి. ముఖ్యమంత్రి జగన్‌తోపాటు ప్రభుత్వ సలహాదారు సజ్జల రామకృష్ణారెడ్డి, ఆర్టీసీ ఎండీ సీహెచ్.ద్వారకా తిరుమలరావుకు కృతజ్ఞతలు తెలియచేస్తున్నాయి. ఈ ఉదంతం వెలుగులోకి రాగానే నిందితులపై ప్రభుత్వం కఠిన చర్యలు తీసుకుంటుందని ఆర్టీసీ సంఘాలకు ఎండీ భరోసానిచ్చారు.

దాడి చేసింది టీడీపీ రౌడీలే

- నిందితుల్లో టీడీపీ, జనసేన, బీజేపీ నేతలు
- అదే గ్యాంగ్ గతంలో నా కారుపైనా దాడి చేసింది
- ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డి





చంద్రబాబు పోస్టర్‌తో నిందితుడు అరుణ్‌కుమార్

సాక్షి, అమరావతి: ఆర్టీసీ డ్రైవర్‌పై కావలిలో దాడి చేసిన రౌడీలు విపక్ష టీడీపీ, జనసేన, బీజేపీకి చెందినవారేనని వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డి స్పష్టం చేశారు. దాడి చేసిన రౌడీలు 'ఐ సపోర్ట్ బాబు..' బ్యానర్లు పట్టుకున్నట్లు తెలిపారు. నిందితుల్లో ఒకరు జనసేన జెండా కప్పుకోగా మరొకరు బీజేపీ నేత అనుచరుడిగా ఉన్నట్లు చెప్పారు. ఆధారాలతో సహా రౌడీ మూకల ఫోటోలను మీడియాకు ఆయన విడుదల చేశారు. ప్రశాంత ప్రాంతం కావలిలో ఎవరు ఎటువంటి వారో ప్రజలకు బాగా తెలుసన్నారు. ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డి ఆదివారం తాడేపల్లిలోని వైఎస్సార్‌సీపీ కేంద్ర కార్యాలయంలో విలేకరులతో మాట్లాడుతూ వాస్తవాలు తెలుసుకోకుండా లోకేశ్, పవన్ కల్యాణ్ బుర్రలేని మాటలు మాట్లాడారని విమర్శించారు. దొంగలే.. దొంగ దొంగ అంటూ దుష్ప్రచారం చేశారని మండిపడ్డారు. సాయంత్రం 6.30 గంటల సమయంలో మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డితో కలసి తాను ఆర్టీవో కార్యాలయాన్ని ప్రారంభించి వెళ్తుండగా సంఘటన స్థలం వద్ద ఏం జరిగిందో వివరాలు సేకరించాలని పోలీసులకు సూచించినట్లు చెప్పారు. టీడీపీ, దాని తోక పార్టీలు ప్రతి విషయాన్ని వైఎస్సార్ సీపీకి ఆపాదించే యత్నాలు చేస్తున్నాయని మండిపడ్డారు. డ్రైవర్‌పై దాడి చేసిందెవరో కావలి ప్రజలందరికీ తెలుసని చెప్పారు. నిందితుడు సుధీర్‌పై నాలుగు రాష్ట్రాల్లో వందల కేసులున్నాయని, అవన్నీ బయటకు తీస్తామని తెలిపారు. ఈ ఘటనలో తమ పార్టీకి చెందిన వారు ఒక్కరున్నా రాజకీయాల నుంచి తప్పుకుంటానని మరి లోకేశ్ అందుకు సిద్ధమేనా? అని సవాల్ చేశారు. ప్రధాన ముద్దాయి సుధీర్ గతంలో తన కారుపై కూడా దాడి చేసినట్లు పేర్కొన్నారు. టీడీపీ టికెట్ కోసం ప్రయత్నిస్తున్న పసుపులేటి సుధాకర్ అనే వ్యక్తి పక్కన నిందితుడు గుర్రంకొండ అరుణ్ కుమార్ ఉన్నట్లు వెల్లడించారు. గతంలో జనసేన తరఫున తనపై పోటీ చేసిన సుధాకర్ వద్ద ఇలాంటి గ్యాంగులు చాలా ఉన్నాయని, వాటిని హైదరాబాద్‌లో మోహరించి ఏం చేస్తున్నాడో తమకు సమాచారం ఉందన్నారు. అరుణ్ కుమార్ అనే వ్యక్తి 'ఐ సపోర్ట్ బాబు' అనే బ్యానర్ పట్టుకున్నాడని చెప్పారు. శివారెడ్డి జనసేన కార్యకర్తే అనే విషయాన్ని పవన్ తెలుసుకుంటే మంచిదన్నారు. ఎవరు రౌడీ షీటర్లను పక్కన పెట్టుకుని తిరుగుతున్నారో గుర్తు పెట్టుకోవాలన్నారు.

నిందితుల తరఫున వాదించం

కావలి న్యాయవాదుల తీర్మానం

కావలి: ఆర్టీసీ బస్సు డ్రైవర్‌పై దాడి చేసిన నిందితుల తరఫున వాదించకూడదని కావలి న్యాయవాదులు తీర్మానించారు. శ్రీపొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లా కావలిలోని మద్దూరుపాడు వద్ద ఈ నెల 26వ తేదీన విజయవాడ డిపో ఆర్టీసీ బస్సు డ్రైవర్ రామ్‌సింగ్‌పై దాడి జరిగింది. దీనిని తీవ్రంగా పరిగణించిన న్యాయవాదులు నిందితుల తరఫున ఏ న్యాయవాది వాదించకూడదని నిర్ణయించారు. కావలిలోని బార్ అసోసియేషన్ కార్యాలయంలో జనరల్ సెక్రటరీ జయప్రకాష్ ఆధ్వర్యాన ఆదివారం జరిగిన సమావేశంలో ఈ మేరకు తీర్మానం చేశారు.

కరుడుగట్టిన నేరగాడు

పలు పోలీస్ స్టేషన్లలో 30కిపైగా కేసులు

నెల్లూరు(క్రైమ్): ఆర్టీసీ డ్రైవర్‌పై దాడి కేసులో ప్రధాన నిందితుడు దేవరకొండ సుధీర్ అలియాస్ అజయ్‌రెడ్డికి సుదీర్ఘ నేర చరిత్ర ఉంది. రాష్ట్రవ్యాప్తంగా అతడిపై 30కిపైగా కేసులున్నాయి. కావలి రెండో పట్టణ పోలీసుస్టేషన్ పరిధిలోనే 18 కేసులున్నాయి. పెద్దగా చదువులేకున్నా వివిధ భాషల్లో అనర్గళంగా మాట్లాడే సుధీర్ తక్కువ ధరకే బంగారం, నకిలీ కరెన్సీతో పలువుర్ని నిలువునా మోసగించి కోట్లకు పడగలెత్తాడు. 2013లో నెల్లూరు లేక్‌వ్యూ కాలనీకి చెందిన పవన్‌తేజతో పరిచయం ఏర్పరచుకుని తక్కువ ధరకే బంగారు బిస్కెట్లు ఇస్తానంటూ రూ.10 లక్షలు తీసుకుని మోసగించాడు. ఆర్టీసీ డ్రైవర్‌పై దాడి ఘటనలో అరెస్ట్ అయిన బండి విల్సన్, పి.శివకుమార్‌రెడ్డి అలియాస్ మహేంద్రరెడ్డి ఏన్నో ఏళ్లుగా సుధీర్‌తోనే ఉంటున్నారు. మహేంద్రరెడ్డిపై కావలి రెండో పట్టణ పోలీసుస్టేషన్‌లో సస్పెక్టెడ్ షీటు ఉంది. వివిధ పోలీసుస్టేషన్లలో ఎనిమిది కేసులున్నాయి. విల్సన్‌పై నాలుగు కేసులున్నాయి. డ్రైవర్‌పై దాడి ఘటనలో సుధీర్‌తోపాటు తొమ్మిది మందిపై కావలి రూరల్ పోలీసులు హత్యాయత్నం కేసు నమోదు చేశారు.

గురుతరం.. కళాభివందనం!

ఉపాధ్యాయులుగా పిల్లలను ఉన్నతంగా తీర్చిదిద్దుతున్నారు. అంకిత భావంతో పాఠ్యాంశాలు బోధిస్తున్నారు. అదే క్రమంలో తమకు నచ్చిన రంగాల్లోనూ సత్తా చాటుతున్నారు. విభిన్న అంశాల్లో ప్రతిభను కనబరుస్తూ ప్రశంసలందుకుంటున్నారు. హిందీ పండిట్ మల్లీశ్వరి యోగా గురువుగా మన్ననలు పొందుతున్నారు. తెలుగు పండిట్ రవి హరిదాసుగా వంశపారంపర్య వృతిని కొనసాగిస్తున్నారు. టీటీడీ శిల్ప కళాశాల అతిథి అధ్యాపకుడు మునిరత్నంరెడ్డి కలంకారీలో అద్భుతాలు సృష్టిస్తున్నారు. కాంట్రాక్ట్ డాన్స్ టీచర్ గంగాధరం జానపద నృత్యానికి ప్రాణం పోస్తున్నారు. ఇటు బోధన.. అటు సాధనతో రాణిస్తూ అవార్డులు.. రివార్డులు అందుకుంటున్నారు.

- సాక్షి, తిరుపతి డెస్క్

- పాఠ్యాంశాలు బోధిస్తూ.. ఇతర రంగాల్లోనూ రాణిస్తున్న ఉపాధ్యాయులు
- కలంకారీ కళలో ప్రతిభను చాటుతున్న మునిరత్నం
- రచయితగా ముందుకు సాగుతున్న రవి
- ధ్యాన ప్రచారంలో దీటుగా అడుగులు వేస్తున్న మల్లీశ్వరి
- జానపద నృత్యంలో దిట్ట గంగాధరం

ధ్యానమే ధ్యాసగా..



తిరుమలలో శ్రీవారి సేవకులకు ధ్యానం నేర్పుతున్న మల్లీశ్వరి

అన్నమయ్య జిల్లా పెద్దతిప్ప సముద్రం మండలం కందుకూరు గ్రామానికి చెందిన ఆర భాగ్యమ్మ, శంకరప్ప దంపతుల మొదటి సంతానం ఆర్.మల్లీశ్వరి. ప్రస్తుతం పిచ్చాటూరు జెడ్పీ హైస్కూల్‌లో హిందీ పండిట్‌గా పని చేస్తున్నారు. గత 20 ఏళ్లుగా వృతిలో ఉత్తమంగా రాణిస్తున్నారు. 12 ఏళ్ల క్రితం ఆమె హైబీపీ, తలనొప్పితో బాధపడే వారు. ఆ సమయంలో సహోపాధ్యాయిని వసుంధర ధ్యానం గురించి చెప్పి, నేర్పించారు. నిత్యం ధ్యానం చేయడం వల్ల తనకు ఉన్న ఆరోగ్య సమస్యలు తొలగిపోయాయి. అనంతరం పిల్లలకు ధ్యానాన్ని ఎలా బోధించాలి అనే అంశంపై బెంగుళూరులోని స్పిరుచువల్ సైన్స్ అకాడమీలో టీచర్ ట్రైనింగ్ కోర్సు పూర్తి చేశారు. అలా తాను నేర్చుకున్న ధ్యానాన్ని పాఠశాలల్లో, కళాశాలల్లో విద్యార్థులకు నేర్పడంతో పాటు ఆంధ్ర, కర్ణాటక, తమిళనాడులో ధ్యాన తరగతులు నిర్వహిస్తున్నారు. వీటితో పాటు అహింస, శాఖాహార ప్రచారాలు, ర్యాలీల ద్వారా ప్రజలకు అవగాహన కల్పిస్తున్నారు. 2022 జూన్‌లో అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని పురస్కరించుకొని చైనా సరిహద్దులోని రేహ్, లడాక్ లకు తన బృందంతో కలిసి వారం రోజుల పాటు శాంతి, శాఖాహార ర్యాలీలు చేపట్టారు. గత ఏడాది నుంచి ప్రతి మంగళవారం తిరుపతిలో, ప్రతి బుధవారం తిరుమలలో టీటీడీ ఉచిత సేవకులకు ధ్యానం నేర్పిస్తున్నారు. వీటితో పాటు గూగుల్ మీట్ వంటి ఆన్‌లైన్ ద్వారా కూడా ధ్యానం క్లాసులు నిర్వహిస్తున్నారు. మల్లీశ్వరి ధ్యానం ద్వారా చేసే సేవలకు పలు ప్రశంసలు, అవార్డులు ఆమెను వరించడం విశేషం.



తాను చిత్రించిన వైఎస్సార్ వృక్షం కలంకారీ చిత్రాన్ని ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి బహుకరిస్తున్న మునిరత్నంరెడ్డి

కలంకారీలో అద్భుతాలు



పిచ్చాటూరు మండలం కారూరు గ్రామానికి చెందిన పూజారి మునిరత్నంరెడ్డి కలంకారీలో అద్భుతంగా రాణిస్తున్నారు. ఆయన తండ్రి మునస్వామిరెడ్డి వీధి నాటకాలు ప్రదర్శించేవారు. ఆర్థిక పరిస్థితి సహకరించకపోవడంతో మునిరత్నం 5వ తరగతి లోనే చదువు మానేసి వ్యవసాయ కూలీగా మారారు. అయితే రోజూ సాయంత్రం ఇంట్లో పలక, గోడలు, నేలమీద పుస్తకాల్లోని బొమ్మలు గీసేవారు. క్రమేణా అదే వ్యాపకంగా మారిపోయింది. ఓ స్నేహితుడి ప్రోత్సాహంతో 1979లో మద్రాసులోని సంతనీ విద్యాలయం నుంచి డ్రాయింగ్‌లో డిప్లొమా తీసుకున్నారు. తర్వాత సినిమా రంగంవైపు అడుగులు వేశారు. 1986లో మద్రాసుకు వెళ్లి అజయ్ అనే డిజైనర్ వద్ద పనికి చేరారు. సినీ రంగం హైదరాబాదుకు తరలడంతో తిరిగి స్వగ్రామానికి వచ్చేశారు. పూట గడవడం కోసం కొన్ని రోజులు గోడల మీద, శిలాఫలకాల మీద పేర్లు రాసేవారు. ఈ క్రమంలోనే శ్రీకాళహస్తిలోని కలంకారీ కళాశాలకు వెళ్లి రెండేళ్ల కోర్సులో చేరారు. అప్పటికే డ్రాయింగ్‌పై పట్టు ఉండడంతో కేవలం 3 నెలల్లోనే కలంకారీ కళను నేర్చుకున్నారు. గురువు ఐతారు మునికృష్ణయ్య నేతృత్వంలో మరిన్ని మెళకువలను ఔపోసన పట్టారు. ఇక అప్పటి నుంచి వెనుతిరిగే సందర్భమే రాలేదు.

వరించిన అవార్డులు

సత్యహరిశ్చంద్ర కథను అద్భుతంగా బొమ్మల రూపంలో తయారు చేసినందుకు 2017లో జాతీయ మెరిట్ సర్టిఫికెట్ అందుకున్నారు. 2014లో మచిలీపట్నం పట్టాభి కళాపీఠం అవార్డు తీసుకున్నారు. 2013లో శ్రీనివాస కళ్యాణాన్ని చిత్రించినందుకు హ్యాండీక్రాఫ్ట్ అభివృద్ధి కార్పొరేషన్ లిమిటెడ్ నుంచి రాష్ట్ర స్థాయి అవార్డు దక్కింది. మునిరత్నం ప్రతిభను టీటీడీ 2014లో శ్రీవేంకటేశ్వర శిల్ప కళాశాలలో అతిథి అధ్యాపకుడిగా అవకాశం కల్పించింది.

వైఎస్సార్ కుటుంబంపై అభిమానం

దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డితో పాటు ఆయన కుటుంబంపై మునిరత్నంరెడ్డికి ఎనలేని అభిమానం. మహానేత వల్ల ప్రజలకు కలిగిన మేలు, ఆయన కోసం జనం పరితపించే సన్నివేశానికి అద్దం పట్టేలా కలంకారీ చిత్రం తయారు చేశారు. వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రి అయిన తర్వాత ఆయనకు తన కలంకారీ చిత్రాన్ని బహుకరించారు. అలాగే నవరత్నాలను కలంకారీ కళతో ఆవిష్కరించి ముఖ్యమంత్రి మన్ననలు పొందారు. ఇటీవల తిరుమల శ్రీవారి గరుడ సేవ విచ్చేసిన ముఖ్యమంత్రికి వేంకటేశ్వర స్వామి చిత్రపటం, సీఎం దంపతుల చిత్రపటాలు అందించి శభాష్ అనిపించుకున్నారు.

కవి..కథకుడిగా..



కార్వేటి నగరంలో హరికథ ప్రదర్శన ఇస్తున్న తెలుగు పండిట్ రవి

నారాయణవనం మండలంలోని మారుమూల పల్లె తిరువట్యం గ్రామానికి చెందిన ఆనంద రెడ్డి, మునెమ్మ దంపతుల ద్వితీయ సంతానం ఓ.రవి. చిన్ననాటి నుంచి సంగీత, సాహిత్యాలపై మక్కువ పెంచుకున్నారు. ఈక్రమంలో తెలుగ భాషాభిమానిగా రచనలకు శ్రీకారం చుట్టారు. ప్రభుత్వ టీచర్‌గా ఉద్యోగంలో చేరకముందే తన ప్రతిభను చాటి సంగీత కళాశాల, వేద పాఠశాల నుంచి హరికథ ప్రవీణ, వేదశాఖిగా వినుతి నంది 'హావభావ నటనావైదుష్య' బిరుదులు పొందారు. తాను రచించిన పాటలు, గేయాలను దూరదర్శన్, ఆకాశవాణి కేంద్రాల్లో గానం చేసి ప్రశంసా పత్రాలు, అవార్డులు అందుకున్నారు. తెలుగు పండిట్‌గా పిల్లలకు ఉన్నతంగా పాఠ్యాంశాలు బోధిస్తూ జిల్లా, రాష్ట్ర స్థాయి ఉత్తమ పురస్కారాలు కైవసం చేసుకున్నారు.

రచనలు

మాతదేవోభవ పుస్తకంతో పాటు వందల సంఖ్యలో గేయాలు రచించారు. వీటితో పాటు నాగలాపురం శ్రీ వేదనారాయణ శతకం, 'తెలుగు తల్లి నా కల్పవల్లి' హావ నారాయణ చరిత్రను ఆంధ్రీకరణ చేసి సత్తా చాటారు. అన్నమయ్య హరికథతోపాటు పెదవులు తగలకుండా పాడే పద్యాలను రచించారు. తాజాగా కీళపూడి శ్రీ జలకంఠేశ్వర స్వామిపై శతక రచనకు శ్రీకారం చుట్టారు.

భాషను మరవకూడదు



తెలుగు భాషను మరువకూడదు. హరికథ వంటి ప్రాచీన కళ అంతరించిపోకూడదు. అందుకు నా వంతు కృషి చేస్తున్నా. వంశపారంపర్యంగా వచ్చిన కళను అందరికీ పంచిపెట్టాలన్నదే లక్ష్యం. నేను రచించే కథలు, గేయాలకు మా తల్లిదండ్రులు, గురువు, భార్య మల్లీశ్వరి సహకారం ఎంతో ఉంది.

– ఓ.రవి, తెలుగు పండిట్

జానపదానికి ఊపిరి



డిప్యూటీ సీఎం నారాయణస్వామి చేతులమీదుగా ప్రశంసాపత్రం అందుకుంటున్న గంగాధరం

నింద్రకు చెందిన గంగాధరం అంతరించిపోతున్న జానపద కళకు ఊపిరిపోస్తున్నారు. ఆయన 2007–2008 హైదరాబాదులోని ఓ ప్రైవేటు కళాశాలలో జానపదం నత్యంపై పట్టా పొందారు. 2014లో ఎస్ఎస్ఏ ద్వారా పులికుంద్రం జెడ్పీ హైస్కూల్‌లో కాంట్రాక్ట్ డ్యాన్స్ మాస్టర్‌గా చేరారు. 2016 నుంచి ఏటా తమ పాఠశాల విద్యార్థులను జిల్లా స్థాయి జానపద నత్య పోటీల్లో చాంపియన్లుగా నిలుపుతున్నారు. 2019–20 నుంచి రాష్ట్ర స్థాయికి తమ విద్యార్థులు ఎంపికైయ్యేలా శిక్షణ ఇచ్చారు. 2020–21 జాతీయ స్థాయి జానపద నత్య పోటీల్లో తమ పాఠశాల విద్యార్థులు ద్వితీయ స్థానం దక్కించుకున్నారు. ఈ ఏడాది సైతం రాష్ట్ర స్థాయికి ఎంపికై వచ్చే నెలలో విజయవాడలో జరగనున్న రాష్ట్ర స్థాయి జానపద నత్య పోటీలకు విద్యార్థులను తీసుకెళ్లనున్నారు. అలాగే శ్రీకాళహస్తి శివరాత్రి మహోత్సవాల్లో, ముఖ్యమంత్రి పాల్గొనే ప్రభుత్వ కార్యక్రమాల్లో పులికుంద్రం జెడ్పీ హైస్కూల్ విద్యార్థుల ప్రదర్శన ఆకర్షణగా నిలుస్తుండడం విశేషం. ఈ క్రమంలో డ్యాన్స్ మాస్టర్ గంగాధరం పలువురు ప్రముఖుల నుంచి అవార్డులు, ప్రశంసలు అందుకున్నారు.



విజయవాడలో విద్యార్థులతో కలిసి రాష్ట్ర స్థాయి మొదటి బహుమతి అందుకుంటూ..

జానపదమే ఆదుకుంది



జానపద కళకు జీవం పోయడమే లక్ష్యం. కష్టాల్లో ఉన్నప్పుడు జానపద నృత్యమే ఆదుకుంది. మా పాఠశాల విద్యార్థులను ఉన్నతంగా తీర్చిదిద్ది, గొప్ప నృత్య కళాకారులుగా తయారు చేస్తా. ఈ ఏడాది జాతీయ స్థాయిలో చాంపియన్‌గా నిలబెట్టేందుకు పూర్తిస్థాయి శిక్షణ ఇస్తున్నా. అలాగే ద్రవిడ యూనివర్సిటీలో దూర విద్య ద్వారా ఎంఏ డ్యాన్స్ చదువుతున్నా.

– గంగాధరం, డ్యాన్స్ మాస్టర్

Published and printed by V. Murali on behalf of Jagati Publications Limited, Published from Vishnu Motor Plaza, 2nd Floor, 31-A, Jawaharlal Nehru Road, Ekkattuthangal, Chennai -600 032 and Printed Jagati Publications Limited, Survey No.172, Vegata Village, Jadigenalhalli, Hoskote Taluk,Bangaluru Rural Dist, MNS Printers Private Limited, Survey no. 76/1, Noombal Village, Velappanchavadi, Poonamallee High Road, Chennai - 600 077. Impression Printing & Packaging Limited, C-18-19-20, Sector -59, Noida, Uttar Pradesh-201 301, Dangat Media Pvt Ltd.,22 Dighe MIDC, Navi Mumbai, Maharashtra- 400708. Editor: V. Murali, (Responsible for selection of News under the PRB Act) RNI No:TNTEL/2008/25943 Reproduction in whole or in part without written permission of the publisher is prohibited.